
'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50



కుర్చీ దక్కదనే ఫ్రస్ట్రేషన్‌లో చంద్రబాబు హింసా రాజకీయం

బూతులు... దాడులు

రాళ్లతో కొట్టమని, గాజు గ్లాసుతో పొడవాలంటూ టీడీపీ శ్రేణులను రెచ్చగొడుతున్న వైనం

- అధినేత పిలుపుతో దాడులతో రెచ్చిపోతున్న టీడీపీ శ్రేణులు
- అందుకనుగుణంగానే సీఎంపై రాయితో హత్యాయత్నం
- మంగళగిరి, కళ్యాణదుర్గంలో వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు
- మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంకటరెడ్డి మృతి
- తాజా పరిణామాలతో టీడీపీ సీనియర్లలో తీవ్ర కలవరపాటు
- ఒకవైపు సీఎం జగన్ తన పాలన నచ్చితే ఓటేయమంటున్నారు
- విధానాలు చెప్పకుండా బాబు హింసకు పిలుపునిస్తున్నారని ఆగ్రహం
- శృతి మించి వ్యవహరిస్తే ప్రజలు సహించరని వ్యాఖ్యలు
- రాజకీయంగా తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన
- ప్రజలు పూర్తిగా దూరమవుతున్నారని ఆవేదన

తీరని అధికార దాహం..

ఈసారీ కుర్చీ దక్కదనే వేదన.. వెరసి టీడీపీ అధినేత చంద్రబాబులో పెరిగిపోయిన ఫ్రస్ట్రేషన్. దీంతో వేదిక ఎక్కితే మాటల్లో అసహనం.. సీఎంను రాళ్లతో కొట్టండి.. అడ్డొచ్చిన వారిని గాజు గ్లాసుతో పొడవండంటూ పార్టీ శ్రేణులను హింసకు పురిగొల్పే వ్యాఖ్యలు.. ఫలితం.. రాష్ట్రంలో రెచ్చిపోతున్న టీడీపీ శ్రేణులు.. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు.

2లో

తొలిదశ ప్రశాంతం

102 ఎంపీ సీట్లకు మొదటి దశలో 62.37% పోలింగ్

పశ్చిమ బెంగాల్‌లో స్వల్ప ఘర్షణలు

ఛత్తీస్‌గఢ్‌లో గ్రనేడ్ పేలి జవాన్ మృతి

ఓటేసిన దిగ్గజ నేతలు

- వివరాలు 6లో


అస్సాంలోని శివసాగర్‌లో బారులు తీరిన ఓటర్లు

ఇకపై వేడి రాత్రులు కూడా..

రాత్రి ఉష్ణోగ్రతలు సైతం పెరుగుదల | కొన్నాళ్లపాటు రేయింబవళ్లు అవస్థలు | ఇప్పటికే జనాన్ని ఉడికిస్తున్న వడగాడ్పులు



సాక్షి, విశాఖపట్నం: ఇన్నాళ్లూ వేసవిలో వేడి పగళ్లనే చూస్తున్నాం. ఇకపై వేడి రాత్రులను కూడా చూడబోతున్నాం. ఈ ఏడాది ఇప్పటికే గరిష్ట (పగటి) ఉష్ణోగ్రతలు అసాధారణంగా నమోదవుతున్నాయి. ఏప్రిల్ ఆరంభం కాకముందే మే నెల నాటి ఎండలను తలపించాయి. రాష్ట్రంలో పక్షం రోజుల నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. ఈ తరుణంలో కనిష్ట (రాత్రి) ఉష్ణోగ్రతలు తామేం తక్కువ కాదంటూ పోటీపడుతున్నాయి. ఈ వేసవి సీజనులో రాత్రి ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతాయని ఇప్పటికే భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. అది ఇప్పుడు వాస్తవరూపం దాలుస్తోంది. నాలుగైదు రోజుల నుంచి రాత్రి ఉష్ణోగ్రతల పెరుగుదల కనిపిస్తోంది. దీంతో రాత్రిళ్లు కూడా వేడి వాతావరణం కొనసాగుతోంది. వేసవి సీజనులో పగలంతా ఎంతగా ఉష్ణతాపం ప్రభావం చూపించినా రాత్రయ్యేసరికి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి వాతావరణం చల్లబడుతుంది. జనానికి ఉపశమనం కలిగిస్తుంది. కానీ ప్రస్తుత పరిస్థితి అలా ఉండడం లేదు. సాధారణంగా ఏప్రిల్‌లో కనిష్ట ఉష్ణోగ్రతలు 25–27 డిగ్రీలకు మించవు. కానీ ప్రస్తుతం అవి 33 డిగ్రీలకు పైగానే నమోదవుతున్నాయి. అంటే సాధారణంకంటే 3–5 డిగ్రీలు అధికమన్న మాట. ఈ రాత్రి ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. ఈనెల 17న ప్రకాశం జిల్లా పెద్దారవీడులో 33.4 డిగ్రీలు, 18న కడపలో 31 డిగ్రీలు, 19న కర్నూలులో 32 డిగ్రీల చొప్పున రికార్డయ్యాయి. మరికొన్ని జిల్లాల్లోను కనిష్ట ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లోను రాత్రి ఉష్ణోగ్రతల పెరుగుదల కొనసాగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా పగలు ఉష్ణతాపం, వడగాడ్పులతో అవస్థలు పడుతున్న జనానికి రాత్రిపూట కూడా అంతగా చల్లబడకపోవడం వల్ల అసౌకర్య వాతావరణం కొనసాగుతుందని పేర్కొంటున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నమోదవుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు వాతావరణ నిపుణులను సైతం విస్మయానికి గురిచేస్తున్నాయి.

గాలుల మార్పులతో..

రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతల పెరుగుదలకు గాలుల దిశ కూడా ఒక కారణమని వాతావరణ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంపైకి ఎగువస్థాయిలో ఉత్తర, వాయవ్య దిశల నుంచి, దిగువస్థాయిలో నైరుతి, దక్షిణ గాలులు వీస్తున్నాయి. ఇది రాత్రి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవడానికి దోహదపడుతున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం డైరెక్టర్ ఎస్.స్టెల్లా 'సాక్షి'కి చెప్పారు. ప్రస్తుతం ఉత్తర కోస్తాంధ్రకంటే రాయలసీమలోనే వీటి పెరుగుదల అధికంగా ఉంటోందని, కొద్దిరోజుల తర్వాత మళ్లీ హెచ్చుతగ్గులు ఉండవచ్చని తెలిపారు.

మరో మూడురోజులు వడగాడ్పులు

రాష్ట్రంలో వడగాడ్పులు కొనసాగుతున్నాయి. రోజురోజుకు గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సాధారణంకంటే 4–6 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. రానున్న మూడురోజులు వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులు వీయనున్నాయి. శుక్రవారం రాష్ట్రంలో అత్యధికంగా పార్వతీపురం మన్యం జిల్లాలో 45.7 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. సింహాద్రిపురం (వైఎస్సార్ జిల్లా)లో 45.6 డిగ్రీలు, తుర్లుపాడు (ప్రకాశం), డోన్, బనగానపల్లి (నంద్యాల)ల్లో 45.5, రాంభద్రపురం (విజయనగరం)లో 44.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం 61 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 117 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. శనివారం 55 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 197 మండలాల్లో వడగాడ్పులు, ఆదివారం 44 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 185 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

ఈ పరిణామం అరుదు..



వాస్తవానికి మార్చి, ఏప్రిల్ నెలలను ప్రీ–మాన్సూన్ (రుతుపవనాలకు ముందు) సీజనుగా పరిగణిస్తారు. ఈ సమయంలో పగటిపూట ఉష్ణతీవ్రత ఒకింత ఉన్నప్పటికీ సాయంత్రమయ్యేసరికి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు (థండర్ స్టార్మ్ యాక్టివిటీ) కురుస్తాయి. దీంతో రాత్రివేళ చల్లదనం పరుచుకుంటుంది. కానీ మార్చి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో థండర్ స్టార్మ్ యాక్టివిటీనే లేదు. ఏప్రిల్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు 33 డిగ్రీలకుపైగా ఎగబాకడం ఇదే తొలిసారి కావచ్చు. ఇలాంటి పరిస్థితి అత్యంత అరుదు.

– ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, మాజీ అధిపతి, ఏయూ వాతావరణం, సముద్ర అధ్యయన విభాగం.

రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు (డిగ్రీ సెల్సియస్‌లలో)

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
తిరుపతి	45.0	25.0
రెంటచింతల	44.2	27.6
ఏలూరు	44.0	27.0
కడప	43.6	30.8
రాజమహేంద్రవరం	43.0	26.0
కర్నూలు	42.5	31.6
విజయనగరం	42.0	36.0
విజయవాడ	42.0	29.0
మార్కాపురం	42.0	27.0
గుంటూరు	41.0	28.0
నెల్లూరు	40.2	28.0
విశాఖపట్నం	37.0	27.4

కేసుల పుట్ట రఘురామ..

పలు రాష్ట్రాల్లో 19 కేసులు నమోదు

- ఢిల్లీలో సీబీఐ కేసులు
- ఆయన, భార్య పేరిట రూ.215.57 కోట్ల ఆస్తులు
- ఎన్నికల అఫిడవిట్‌లో వివరాలు
- ఉండి టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన రఘురామ భార్య
- పార్టీ అధికారికంగా ప్రకటించకుండానే నామినేషన్

రఘురామపై కేసుల వివరాలివీ..



- సైబరాబాద్‌లో వ్యక్తిని కిడ్నాప్ చేసిన ఘటనలో, నేరపూరిత కుట్ర ఆరోపణలతో పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల పోలీస్‌స్టేషన్‌లో, పెనుమంత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసులు నమోదయ్యాయి.
- ఇండ్ భారత్ పవర్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్‌గా ఉండి ఫోర్జరీ, నకిలీ పత్రాలు సృష్టించడం, రూ.25 కోట్ల చెల్లింపులు చేయకపోవడానికి సంబంధించి మహారాష్ట్రలోని థానేలో ఉన్న ఆర్థిక నేరాల విభాగం 2022 జనవరి 27న ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీనికి సంబంధించి హైదరాబాద్ కోర్టులో రెండు కేసులు, ముంబై కోర్టులో ఒక కేసు కొనసాగుతున్నాయి.
- మత విద్వేషాలు రగిల్చేలా మాట్లాడినందుకు చింతలపూడి, మంగళగిరి, భీమవరం, పోడూరు, ఆచంట, పెనుగొండ, పెనుమంత్ర, నర్సాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేశారు.
- కుట్ర, మోసం, ఫోర్జరీ చేశారని ఎస్‌బీఐ ఇచ్చిన ఫిర్యాదుపై, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను మోసం చేయడంతో ఢిల్లీలో సీబీఐ కేసులు నమోదు చేసింది.
- ఫెమా చట్టం ఉల్లంఘన కింద రూ.40 కోట్లు జరిమానా విధించిన కేసు తెలంగాణ హైకోర్టులో కొనసాగుతోంది.

సాక్షి ప్రతినిధి, ఏలూరు: నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు ఆస్తులు, కేసుల పుట్ట అని వెల్లడైంది. ఆయన, ఆయన భార్య కనుమూరి రమాదేవి పేరిట స్థిర, చరాస్తులు మొత్తం కలిపి రూ.215.57 కోట్ల ఆస్తులు ఉన్నట్టు తేలింది. అలాగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, మహారాష్ట్రల్లో 19 కేసులు నమోదయ్యాయి. ఢిల్లీలో సీబీఐ కేసులు కూడా ఆయనపై ఉన్నాయి. ఈ మేరకు పశ్చిమ గోదావరి జిల్లా ఉండి టీడీపీ అభ్యర్థిగా రఘురామకృష్ణరాజు తరఫున ఆయన భార్య రమాదేవి శుక్రవారం రెండు సెట్ల నామినేషన్‌ను సమర్పించారు. ఉండి అభ్యర్థిగా టీడీపీ ఇంకా ఆయన పేరును అధికారికంగా ప్రకటించకపోవడం గమనార్హం. ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తులు, కేసుల వివరాలను పేర్కొన్నారు. వీటి ప్రకారం.. బ్యాంకుల్లో అప్పులు రూ.12.60 కోట్లు ఉన్నట్టు తెలిపారు.

ఆస్తులు, అప్పులు ఇవి..

రఘురామకృష్ణరాజు పేరుతో రూ.13.89 కోట్లు, ఆయన భార్య రమాదేవి పేరుతో రూ.17.79 కోట్ల చరాస్తులు ఉన్నట్టు అఫిడవిట్‌లో చూపించారు. తమిళనాడు, తెలంగాణ, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, వాణిజ్య భవనాలు అన్నీ కలిపి రూ.8.48 కోట్లు రఘురామకృష్ణరాజు పేరిట, ఆయన భార్య పేరుతో రూ.175.45 కోట్లు ఆస్తులు ఉన్నట్టు తెలిపారు. రఘురామకృష్ణరాజుకు రూ.8.15 కోట్లు, ఆయన భార్యకు రూ.4.45 కోట్లు బకాయిలు ఉన్నట్టు చూపించారు.

సుజనా చౌదరి స్థిరాస్తుల విలువ రూ.34 లక్షలేనట

- మొత్తం చరాస్తుల విలువ రూ.1.18 కోట్లే
- వార్షికాదాయం కూడా కేవలం రూ.20.73 లక్షలేనట
- మనీలాండరింగ్ చట్టం కింద చెన్నైలో ఈడీ కేసు
- విజయవాడ భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు
- నెల్లూరు జిల్లా కావలిలో మరో కేసు నమోదు



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుజనా చౌదరి తన వార్షికాదాయం (2022–2023) రూ.20,73,290 ఉన్నట్లు తన ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారు. దీంతోపాటు బ్యాంకు ఖాతాలో, చేతిలో నగదు, 310 గ్రాముల బంగారం.. ఇలా తన మొత్తం చరాస్తులు రూ.1,18,49,340 ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా తనకు రూ.34,25,500 విలువైన స్థిరాస్తులు మాత్రమే ఉన్నట్టు వెల్లడించారు. ఇక సుజనా చౌదరి తన భార్య యలమంచిలి పద్మజ వార్షికాదాయం రూ.10,19,721 ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆమె బ్యాంకు ఖాతాలో, చేతిలో నగదుతో పాటు 11,477 గ్రాముల బంగారం, 41,250 గ్రాముల వెండి కలిపి మొత్తం ఆమె చరాస్తుల విలువ రూ.14,09,27,677గా పేర్కొన్నారు. తన భార్య పద్మజకు రూ.6,89,16,428 విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు తెలిపారు.


చెన్నైలో ఈడీ కేసు

కాగా మనీలాండరింగ్ చట్టం కింద 2016 ఏప్రిల్ 27న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సుజనా చౌదరిపై కేసు నమోదు చేసింది. చెన్నై కోర్టు పరిధిలో ఈ కేసు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా ఎన్నికల సంఘం నిబంధనలకు వ్యతిరేకంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించడంతో విజయవాడ భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెలలో రెండు కేసులు, నెల్లూరు జిల్లా కావలి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021లో మరో కేసు నమోదైనట్లు తెలిపారు.

బాలల హక్కుల కమిషన్‌పై ఆరోపణలు తగవు

కమిషన్ చైర్మన్ అప్పారావు స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బాలల న్యాయ చట్టం పరిధిలో మాత్రమే రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ పనిచేస్తుందని, కొందరు అవగాహన లేని ఆరోపణలు చేయడం సరికాదని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన కమిషన్ సభ్యులు జంగం రాజేంద్ర ప్రసాద్, గోండు సీతారాం, బత్తుల పద్మావతి, త్రివర్ణ ఆదిలక్ష్మి పేరిట సంయుక్తంగా శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. సీఎం జగన్‌పై కొంత మంది దుండగులు రాళ్లతో దాడి చేసి గాయపర్చిన ఘటన నేపథ్యంలో కొందరు అవగాహన లేకుండా బాలల హక్కుల కమిషన్‌పై అపనిందలు వేయడం సరికాదన్నారు. సీఎంపై రాళ్లతో దాడి చేసిన నిందితులు ఇద్దరు మేజర్లు అని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం రూపొందించిన చట్టాల ప్రకారం వ్యవస్థలు పనిచేస్తాయని, చట్టాలకు ఎవరూ అతీతులు కారన్నారు. ఎక్కడా కూడా పోలీసు, ఇతర ఆదికారులు బాలల హక్కులు ఉల్లంఘన చేసినట్లు కమిషన్‌కు ఫిర్యాదులు రాలేదన్నారు. కమిషన్‌కు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టి వాటిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సులు చేస్తుందని పేర్కొన్నారు. ఎక్కడైనా బాలల హక్కుల ఉల్లంఘనపై తమకు ఫిర్యాదు చేస్తే కమిషన్ విచారిస్తుందని చెప్పారు.


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 28

శనివారం 20-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఇజ్రాయెల్ ప్రతీకారం

ఇరాన్‌లోని ఇస్ఫహాన్ నగరంపై డ్రోన్ దాడులు - 6లో



నేవీ చీఫ్‌గా దినేశ్ త్రిపాఠీ

ఈనెల 30న రిటైర్ కానున్న అడ్మిరల్ ఆర్.హరికుమార్ - 6లో

బొండా జంప్



- పోలీసులను చూసి హడలి పోయిన టీడీపీ నేత బొండా ఉమా
- తనను అరెస్ట్ చేసేస్తున్నారంటూ నాయకులు, కార్యకర్తలకు ఫోన్లు
- చొక్కా మార్చుకొని.. పార్టీ ఆఫీసు పక్క భవనంలోకి దూకి పరార్
- ఎన్నికల బందోబస్తు కోసం వెళ్లిన పోలీసు సిబ్బంది

2లో

ఫ్యాక్ట్‌చెక్

రామోజీ.. మీ రాతల్లోనే

వ్యత్యాసం

- పొదుపు సంఘాల రుణాలన్నీ మాఫీ చేస్తానని చెప్పి మోసం చేసింది బాబు కాదా?
- ఆ రుణాల మొత్తాన్ని చెల్లించింది సీఎం జగన్ కాదా?
- బాబు చేసిన తప్పిదాన్ని సీఎం జగన్ సరిచేశారు
- ఆ తర్వాతే వారికి బ్యాంకర్లు విరివిగా రుణాలిస్తున్నారు
- అన్ని జిల్లాల్లో 7 శాతం వడ్డీకే రుణాలు.. ఈ వడ్డీ భారాన్ని భరిస్తోంది రాష్ట్ర ప్రభుత్వమే

12లో



కాకినాడ జిల్లా అచ్చంపేట జంక్షన్ వద్ద నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



బాబు గురి గులకరాయిపైనే

కాకినాడ జిల్లా అచ్చంపేట జంక్షన్ వద్ద మేమంతా సిద్ధం సభలో సీఎం జగన్ ధ్వజం

- ఫ్యాన్‌కు రెండు ఓట్లు వేస్తేనే పథకాలన్నీ కొనసాగుతాయి.. లేదంటే మళ్లీ కత్తిరింపులు.. అన్నీ ముగింపులే.. చంద్రముఖి నిద్ర లేస్తుంది.. పసుపు పతి వదల బొమ్మాళీ అంటాడు
- ఐదేళ్ల రక్తం తాగేందుకు మీ ఇంటికి వస్తాడు
- గతంలో పలు కారణాలతో నాకు ఓట్లేయని వారూ ఆలోచించండి
- పసుపు, గ్లాసు పార్టీల నాయకులు అబద్ధాలాడినా.. మనం చేసిన పనులే సాక్ష్యం
- మీ అందరికీ ఐదేళ్లలో మంచి చేసిన ప్రభుత్వం మనది కాదా?.. మీ బిడ్డ ఒక్కడు.. నక్కలు, తోడేళ్లు మాత్రం అనేకం..
- చంద్రబాబు తన చంకలో పిల్లిని పిఠాపురంలో వదిలాడు
- ప్యాకేజీ స్టార్ ఎక్కడ నిలబడాలో నిర్ణయిస్తే కుదిరిన పొత్తులవి..
- జగన్‌ను తిట్టు అంటే తిట్టు.. కొట్టు అంటే కొట్టు.. అన్నిటికీ జీ హుజూర్!
- కులాన్ని హోల్‌సేల్‌గా బాబుకు అమ్మేయగల ననే భ్రమతో ప్యాకేజీ రాజకీయాలు
- రాష్ట్రం అంటే ఎంత చులకన అంటే.. జ్వరం వస్తే పిఠాపురం వదిలి హైదరాబాద్ వెళ్తాడు
- గ్లాసుతో గటగటా తాగేది బాబు.. తోమి, తుడిచి మళ్లీ అందించేది మాత్రం ప్యాకేజీ స్టార్
- 30 ఏళ్లుగా ఏ పార్టీలో ఉన్నా బాబు కోవర్టుగానే వదినమ్మ.. బీఫామ్ బీజేపీదైనా, కాంగ్రెస్‌దైనా, టీ గ్లాస్‌దైనా యూనిఫామ్ మాత్రం బాబుదే

10లో

భగభగల్లోనూ బ్రహ్మారథం

కోలాహలంగా 18వ రోజు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర

సీఎం జగన్‌కు అడుగడుగునా జన హారతులు

సూరంపాలెం వద్ద జగన్‌కు స్వాగతం పలికిన విద్యార్థులు.. జగన్‌వల్లే తాము ఉచితంగా చదువుకుంటున్నామని ఆనందం

దద్దరిల్లిన కాకినాడ అచ్చంపేట జంక్షన్

11లో

గంటా.. ఒక భార్య.. 2 పాన్‌లు



- నియోజకవర్గమే కాదు.. పాన్ నంబరూ మారింది
- ఎన్నికల అఫిడవిట్ల సాక్షిగా బయటపడ్డ గంటా బాగోతం
- మొదట్నుంచీ రెండు పాన్‌లు... కానీ ఐటీ రిటర్న్‌లూ వేయని తీరు

3లో

'సెలవుల్లో సరదాగా–2024'



వేసవి సెలవుల్లో విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా 'సెలవుల్లో సరదాగా–2024' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పాఠశాల విద్యా శాఖ తెలిపింది. తరగతుల వారీగా అమలు చేయాల్సిన కార్యక్రమాల మార్గదర్శకాలను విడుదల చేసింది.

14లో

రెండోరోజు భారీగా నామినేషన్లు




నామినేషన్ల ప్రక్రియ మొదలైన రెండోరోజు శుక్రవారం కూడా అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. 25 లోక్‌సభ స్థానాలకు 53 మంది అభ్యర్థులు 68 సెట్ల నామినేషన్లు.. అసెంబ్లీ స్థానాలకు 314 మంది అభ్యర్థులు 413 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

12లో

బూతులు.. దాడులు

రాళ్లతో కొట్టమని, గాజు గ్లాసుతో పొడవమంటూ టీడీపీ శ్రేణులను రెచ్చగొడుతున్న చంద్రబాబు



సాక్షి, అమరావతి : తీవ్రమైన ఫ్రస్టేషన్ కారణంగా చంద్రబాబు తన పార్టీ శ్రేణులను రెచ్చగొడుతున్నారు. సీఎంను రాళ్లతో కొట్టండి.. అడ్డొచ్చిన వారిని గాజు గ్లాసుతో పొడవండి అంటూ.. పిలుపులిస్తున్నారు. ఈ పిలుపును అందుకుని తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. చంద్రబాబు కుమారుడు లోకేశ్ పోటీ చేస్తున్న మంగళగిరి నియోజకవర్గం కుంచనపల్లిలో గురువారం ప్రచారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ గూండాలు మూకుమ్మడి దాడికి దిగారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ మేకా వెంకటరెడ్డి మృతి చెందడం కలకలం రేపింది. ఓటమి భయంతో లోకేశ్ హింసా రాజకీయాలకు పాల్పడుతున్నట్లు, చంద్రబాబు వ్యాఖ్యలు అందుకు తోడైనట్లు ఈ ఘటన రుజువు చేసింది. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలోనూ గురువారం టీడీపీ గూండాలు రోడ్‌షో చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను చంపేందుకు ప్రయత్నించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య రోడ్‌షోను టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్ర అనుచరులు అడ్డుకునేందుకు ప్రయత్నించి వీరంగం సృష్టించారు. ఈ దాడిలో నలుగురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు.

శృతిమించిన చంద్రబాబు వ్యాఖ్యలతో దాడులు

చంద్రబాబు శృతి మించి చేస్తున్న వ్యాఖ్యలే ఈ దాడులకు కారణమని సొంత పార్టీ నేతలే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీఎంను రాళ్లతో కొట్టాలని చంద్రబాబు బహిరంగ సభలో చెప్పిన తర్వాతే విజయవాడలో సీఎం వైఎస్ జగన్‌పై రాయితో హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఒకపక్క సీఎం జగన్ తన పాలనలో ప్రతి ఒక్కరికీ చేసిన మేలును వివరిస్తూ మీ ఇంటికి మంచి జరిగిందనుకుంటేనే తనకు ఓటు వేయాలని హుందాగా కోరుతుండగా.. ప్రతిపక్ష నేత చంద్రబాబు మాత్రం హింసను ప్రేరేపించడాన్ని టీడీపీ నేతలే తప్పుపడుతున్నారు. తమ పార్టీ విధానాలను ప్రస్తావించకుండా వ్యక్తిగత దుర్భాషలకు దిగడం ఎన్నికల వేళ పార్టీకి తీవ్ర నష్టం చేకూరుస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'బాబు గారేమిటి ఇలా మాట్లాడుతున్నారు? ఆయనకేమైనా మతి పోయిందా?' అని అంతర్గతంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఎన్నికలను హింసాత్మకంగా మార్చేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నట్లు కనబడుతోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

దున్నపోతు అంటూ దిగజారుడు మాటలు

ఇటీవల రాజధాని ప్రాంతమైన తాడికొండ సభలో 'ఆ దున్నపోతును మనిషిని ఒక రాయి తీసుకుని ఏది దొరికితే అది తీసుకుని కొట్టండి' అంటూ చంద్రబాబు రెచ్చగొట్టారు. ముఖ్యమంత్రిని దున్నపోతు అంటూ సంభోదించడం ఏమిటని, ఇలాంటి వ్యాఖ్యలతో రాజకీయ మలి సంధ్యలో చంద్రబాబు మరింత దిగజారిపోతున్నారని టీడీపీ నేతలు వాపోతున్నారు. ఇటీవలే మరో సభలో గాజు గ్లాసు తీసుకుని పొడవాలంటూ సైగలు చేయటాన్ని చూసి పక్కనున్న నేతలే విస్తుపోయారు. ఈ సమయంలో ఆయన హావభావాలు కూడా నీచంగా ఉన్నాయని తప్పుబడుతున్నారు. ప్రతి సభలో సీఎం జగన్‌పై అక్కసుతో కక్ష పూరితంగా మాట్లాడటం పార్టీకి చాలా మైనస్‌గా మారిందని అంటున్నారు. ప్రసంగాల్లో సైకో అని సంభోదిస్తూ గల్లీ లీడర్‌కంటే దిగజారిపోవటాన్ని ప్రజలు ఎలా సహిస్తారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాబు తీరుతో నష్టపోతున్నాం

ఒకవైపు సీఎం జగన్ ప్రసంగాలు హుందాగా, పద్ధతిగా, ప్రజల్లో ఆలోచన రేకెత్తించేలా ఉన్నాయి. చంద్రబాబు మాత్రం ఊకదంపుడు ఉపన్యాసాలు, హింసాత్మక వ్యాఖ్యలతో నిండిపోతున్నాయి. వీటన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని, చంద్రబాబు గ్రాఫ్ బాగా పడిపోవడానికి ఆయన దిగజారుడు మాటలే కారణమని టీడీపీ నేతలు అంటున్నారు. సీఎం జగన్ తన పాలనలో చేసిన మంచి పనులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, చంద్రబాబు వైఫల్యాలు, పాత మేనిఫెస్టోను చూపించి ఎండగడుతున్నారని, దీనికి సమాధానం చెప్పకుండా చంద్రబాబు అదే పనిగా నోరు పారేసుకోవడం వల్ల ప్రయోజనం ఉండదని పేర్కొంటున్నారు. సీఎం జగన్ మేనిఫెస్టోలను పోల్చి చూపడం, బాబు మోసాలను వివరిస్తున్న విధానం ప్రజల్లోకి బాగా వెళుతోందనే అభిప్రాయం టీడీపీ నేతల్లో ఉంది. దీనికి కౌంటర్ ఇచ్చే పరిస్థితి తమ పార్టీకి లేకుండా పోయిందని, దానికి తోడు చంద్రబాబు శ్రేణులను రెచ్చగొడుతున్న తీరుతో తాము రాజకీయంగా కోలుకోలేని దెబ్బ తింటున్నామని టీడీపీ సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 40 ఏళ్ల సీనియర్ నాయకుడినని చెప్పుకొనే చంద్రబాబు విజ్ఞత కోల్పోవడం వల్ల ప్రజల్లో బాగా చులకనవుతున్నామని చెబుతున్నారు.

బొండా జంప్!

- పోలీసులను చూసి హడలిపోయిన టీడీపీ నేత ఉమా
- తనను అరెస్ట్ చేసేస్తున్నారంటూ నాయకులు, కార్యకర్తలకు ఫోన్లు

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ సెంట్రల్): సీఎం జగన్‌పై హత్యాయత్నం ఘటన అనంతరం చీమ చిటుక్కుమన్నా టీడీపీ నేత బొండా ఉమా మహేశ్వరరావు హడలిపోతున్నారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి హైడ్రామా చోటుచేసుకుంది. బందోబస్తు విధుల కోసం వచ్చిన పోలీసులను చూసిన బొండా ఉమా ఒక్కసారిగా హడలిపోయి పార్టీ నేతలకు ఫోన్లు చేసి చొక్కా మార్చుకుని అక్కడి నుంచి జారుకున్నారు. తొలుత బొండా ఉమా ఇంటి వద్దకు ఇద్దరు కానిస్టేబుళ్లు బందోబస్తుకు వెళ్లారు. వారిని ఎందుకు వచ్చారంటూ బొండా ప్రశ్నించగా మీకు సెక్యూరిటీగా వెళ్లమన్నారంటూ బదులివ్వడంతో కంగారుపడ్డ ఆయన అక్కడి నుంచి తన కార్యాలయానికి వడివడిగా వెళ్లిపోయారు.



సెంట్రల్ టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు, రాధా వర్గీయులు

వంగవీటి రాధాకు ఫోన్...!

టాస్క్‌ఫోర్స్, షాడో టీమ్‌లు తనని అరెస్ట్ చేసేందుకు వచ్చాయంటూ బొండా ఉమా ఫోన్లు చేయగా టీడీపీ శ్రేణులు స్పందించకపోవడంతో వంగవీటి రాధా, ఆయన మామ చెన్నుపాటి శ్రీనుకు ఫోన్లు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో రాధా తన అనుచరులకు ఫోన్లు చేసి అందుబాటులో ఉన్నవారంతా టీడీపీ కార్యాలయానికి వెళ్లాలని సూచించారు. వారంతా అక్కడకు చేరుకోవడంతో గందరగోళం నెలకొంది.

షర్టు మార్చి... గోడ దూకి..

పోలీసులు తనను అరెస్ట్ చేస్తారని ఆందోళన చెందిన బొండా ఉమా సెంట్రల్ టీడీపీ కార్యాలయం మొదటి అంతస్తులోకి వెళ్లి చొక్కా మార్చుకున్నారు. అనంతరం దాని వెనుకే ఉన్న మరో భవనంలోకి దూకి పరారైనట్లు తెలుస్తోంది. తనకు అత్యంత సన్నిహితుడు, ఇటీవలే టీడీపీ తీర్థం పుచ్చుకున్న సీనియర్ 'మామ' బొండా ఉమాను తన కారులో ఎక్కించుకొని మొగల్రాజపురంలోని రాధా ఇంటికి చేరుకున్నట్లు సమాచారం. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడంతో నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అన్ని ముఖ్య ప్రదేశాలు, పార్టీ కార్యాలయాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగానే బొండా ఉమా వద్దకు వెళ్లినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

35 ఏళ్లుగా అద్దె కుప్పమే

- సొంతిల్లు కడుతున్నానని అఫిడవిట్లో చెప్పిన చంద్రబాబు
- రెండేళ్ల కిందటే స్థలం కొనుగోలు
- ఇప్పటికీ నిర్మాణంలోనే ఇల్లు

సాక్షి, అమరావతి/సాక్షి, తిరుపతి: కుప్పం నియోజకవర్గ ప్రజలు 35 ఏళ్లుగా టీడీపీ అధినేత చంద్రబాబును వారి సొంత మనిషిలా ఆదరిస్తూ, ఆయన్ని గెలిపిస్తున్నప్పటికీ.. చంద్రబాబు మాత్రం ఆ నియోజకవర్గాన్ని కనీసం పట్టించుకోలేదు. ఇప్పటికీ అదేదో అద్దె ఇంటిలానో, తనకు పట్టని ప్రాంతంలాగానో వ్యవహరిస్తున్నారు తప్పితే, ఆ నియోజకవర్గ ప్రజలకు దగ్గరగా ఉండాలని, అక్కడ తనకంటూ ఒక స్థిర నివాసం ఏర్పరచుకోవాలని ఎప్పుడూ భావించలేదు. చంద్రబాబునాయుడు 1983 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. 1989 నుంచి కుప్పం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన ఆ నియోజకవర్గాన్ని ఓ ఓట్ల యంత్రంగానే చూసి, ఏమాత్రం అభివృద్ధి చేయకపోయినప్పటికీ, అక్కడి ప్రజలు మాత్రం చంద్రబాబును ఆదరిస్తూనే వచ్చారు. అయినా చంద్రబాబు ఆ ప్రాంతంపై శీతకన్నే వేశారు. ఆ ప్రాంతం తనను ఆదరిస్తున్నందుకు గుర్తుగా అయినా ఒక ఇల్లు కట్టుకోవాలన్న ఆలోచన కూడా ఎప్పుడూ చేయలేదు. 1984లో టీడీపీలో చేరగానే హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో స్థలం కొని, అక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీలోనూ ఆయన సొంతిల్లు కట్టుకోలేదు. తాను రాజధానిని నిర్మిస్తానని గొప్పలు చెప్పుకొన్న అమరావతిలోనూ కట్టుకోలేదు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు సీఎంగా ఉండగానే హైదరాబాద్‌లోనే మరో అత్యాధునిక భవంతిని నిర్మించుకున్నారు. అటు సొంత నియోజకవర్గం కుప్పంని, ఇటు ఆయన రోజూ చెప్పే అమరావతి పైనా ఆయనకు ఓట్లు యావే తప్ప వాటిపై ప్రేమ లేదన్న విషయాన్ని బయటపెట్టుకున్నారు. ఆయన సొంతింటితోపాటు ఆస్థిపాస్తులు చాలావరకు హైదరాబాద్‌లోనే ఉన్నాయి. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కుప్పం ప్రజలకూ తొలిసారి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాయి. దీంతో కుప్పం ప్రజల్లోనూ ఆలోచన మొదలైంది. దీంతోపాటు సొంత నియోజకవర్గంలో ఇల్లు లేదా అని అందరూ ఎండగట్టడం ప్రారంభించారు. దీంతో 2022లో అక్కడ స్థలాన్ని కొని, ఇల్లు కడుతున్నట్లు చంద్రబాబు హడావుడి చేశారు. అక్కడ తాను ఇల్లు కట్టుకుంటున్నట్లు శుక్రవారం సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లోనూ పేర్కొన్నారు. శాంతిపురం మండలం కడపల్లి పంచాయతీ పరిధిలో వ్యవసాయేతర భూమి 95.23 సెంట్లు ఉందని, దాని విలువ రూ.77.33 లక్షలుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అక్కడే ఇంటి నిర్మాణం చేస్తున్నారు. ఇంటి నిర్మాణం ప్రారంభమై సంవత్సరంన్నర అవుతోంది. సాధారణంగా ఒక సొంతింటి నిర్మాణం కొన్ని నెలల్లో పూర్తవుతుంది. కానీ, చంద్రబాబు ఇంటి నిర్మాణం మాత్రం ఇప్పటికీ పూర్తి కాలేదు. పూర్తి చేస్తారో లేదో కూడా తెలియదు.

భారీగా పెరిగిన ఆస్తులు

అధికారంలో ఉండగా రాష్ట్రంలో ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల్లో భారీగా ముడుపులు దండుకున్నారన్న ఆరోపణలు, కేసులు ఉన్న చంద్రబాబు.. అధికారంలో లేకున్నా ఆదాయానికి లోటు లేదన్న విషయాన్ని ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో సమర్పించిన ఆస్తుల విలువలు చెబుతున్నాయి. తనపై ఉన్న కేసులు, తన ఆస్థిపాస్తుల వివరాలను అఫిడవిట్‌లో చంద్రబాబు పేర్కొన్నారు. అఫిడవిట్‌లో పేర్కొన్న ప్రకారం గత ఐదేళ్లలో చంద్రబాబు ఆయన సతీమణి భువనేశ్వరి ఆస్తుల విలువ 40 శాతం పెరిగింది. 2014లో రూ.176 కోట్లున్న వారి ఆస్తుల విలువ 2019 ఎన్నికల అఫిడవిట్‌లో రూ.700 కోట్లుగా చూపించారు. ప్రస్తుతం వారిద్దరి ఆస్తుల విలువ రూ.936.58 కోట్లుగా అఫిడవిట్‌లో తెలిపారు. రూ.121.41 కోట్ల చరాస్తులు, రూ.815.17 కోట్ల స్థిరాస్తులు చూపించారు. భువనేశ్వరికి హెరిటేజ్ ఫుడ్స్‌లో ఉన్న షేర్ల విలువే రూ.763 కోట్లుగా పేర్కొన్నారు. అలాగే ఆమెకు రూ.1.84 కోట్ల విలువైన బంగారం, 1.09 కోట్ల విలువైన ముత్యాలు, వజ్రాభరణాలు, రూ.30 లక్షల విలువైన వెండి వస్తువులు ఉన్నట్లు తెలిపారు. అప్పులు రూ. 10.31 కోట్లుగా పేర్కొన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో చంద్రబాబుకు తన కొడుకు లోకేశ్‌తో ఉమ్మడిగా ఉన్న ఇంటి ప్రస్తుత విలువ రూ.70.20 కోట్లుగా చూపించారు. కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కడపల్లి వద్ద 96.23 సెంట్ల భూమి విలువ రూ.77.33 లక్షలుగా చూపించారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం దీని విలువ రూ.2 కోట్లకుపైనే ఉంటుంది. నారావారిపల్లె శేషాపురంలో ఉన్న ఇల్లు విలువ రూ.43.66 లక్షలుగా చూపారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఇది కూడా సుమారు రూ.2 కోట్లు ఉంటుందని అంచనా. తన చేతిలో రూ.11,560 నగదు, బ్యాంక్ బ్యాలెన్స్ రూ. 2,45,378, ఒక అంబాసిడర్ కారు ఉన్నట్లు పేర్కొన్నారు.

24 క్రిమినల్ కేసులు.. అందులో 8 అవినీతి కేసులే

తాను 24 క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు అఫిడవిట్‌లో చంద్రబాబు పేర్కొన్నారు. అందులో 8 కేసులు తీవ్రమైన అవినీతి ఆరోపణలతో కూడినవి. ఆయన అరెస్టయి జైల్లో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు అందులో ఒకటి. ఉచిత ఇసుక పథకం పేరుతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టడం, మద్యం డిస్టలరీలు, బ్రాండ్‌లకు అక్రమంగా అనుమతులివ్వడం, రాజధాని ఇన్నర్ రింగురోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణం, ఏపీ ఫైబర్‌నెట్ కాంట్రాక్టు జారీలో అక్రమాలు, రాజధాని అసైన్డ్ భూముల కుంభకోణానికి సంబంధించిన కేసులు తనపై విచారణలో ఉన్నట్లు ఆయన అఫిడవిట్‌లో తెలిపారు.

బాలయ్య కుటుంబ ఆస్తులు రూ.465.35 కోట్లు..


అయ్యన్నపై కేసులు 17

- లిక్కర్ కింగ్ మాగుంట వద్ద ఉన్నది రూ.18 వేలేనట
- వేమిరెడ్డి దంపతులకు 19 కార్లు
- టీడీపీ అభ్యర్థుల్లో అత్యధికులపై భారీగా క్రిమినల్ కేసులు



సాక్షి నెట్‌వర్క్: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా నందమూరి బాలకృష్ణ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. 2022–23లో ఆదాయం రూ.10 కోట్లు, స్థిరాస్తులు రూ.103 కోట్లు, చరాస్తులు రూ.82 కోట్లు కలిపి బాలయ్యకు మొత్తం రూ.185 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్టు అఫిడవిట్‌లో పొందుపరిచారు. క్రిమినల్ కేసులు ఏవీ లేవని పేర్కొన్నారు. నందమూరి హిందూ అవిభాజ్య కుటుంబంలో బాలకృష్ణకు స్థిరాస్తులు రూ.28.91 కోట్లు, చరాస్తులు రూ.2.41 కోట్లుగా చూపారు. బాలయ్య సతీమణి వసుంధర పేరిట రూ.179.28 కోట్ల విలువైన ఆస్తులు ఉండగా.. అందులో స్థిరాస్తులు రూ.38.90 కోట్లు, చరాస్తుల విలువ రూ.140.38 కోట్లుగా చూపారు. కుమారుడు మోక్షజ్ఞ పేరిట స్థిరాస్తులు రూ.11.11 కోట్లు, చరాస్తులు రూ.58.64 కోట్లు కలిపి బాలకృష్ణ కుటుంబానికి మొత్తం ఆస్తుల విలువ రూ.465.35 కోట్లుగా చూపారు.

అయ్యన్నపాత్రుడిపై 17 కేసులు



చింతకాయల అయ్యన్నపాత్రుడి పేరిట రూ.5,04,61,500, అతని భార్య పేరిట రూ.10,84,63,200 విలువైన స్థిర, చరాస్తులు ఉన్నాయని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అయ్యన్నపాత్రుడు దళితులపై దూషణలు చేయడం.. అధికారులపై చిందులు వేయడం పరిపాటిగా మార్చుకున్నారు. ఈ క్రమంలోనే అతనిపై 17 కేసులు సైతం నమోదయ్యాయి. ఉమ్మడి విశాఖలోనే కాకుండా రాష్ట్రంలో పలుచోట్ల ఆయనపై కేసులు ఉన్నాయి.

మాగుంట వద్ద ఉన్నది రూ.18 వేలేనట




దేశవ్యాప్తంగా పేరున్న మద్యం వ్యాపారి. కానీ.. ఆయన చేతిలో ఉన్న నగదు రూ.18,529 మాత్రమేనట. టీడీపీ ఒంగోలు పార్లమెంటరీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మాగుంట శ్రీనివాసులరెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. తన చేతిలో ఉన్న నగదుతో పాటు భార్య వద్ద రూ.6,68,134, ఉమ్మడి కుటుంబ సభ్యుల (హెచ్‌యూఎఫ్) వద్ద రూ.67,854 నగదు ఉందని తెలిపారు. చరాస్తుల కింద తనకు రూ.4,58,30,319 ఉండగా.. భార్య పేరిట రూ.17,98,70,139, ఉమ్మడి కుటుంబం కింద రూ.4,24,94,762 ఉన్నట్టు తెలిపారు. తన పేరిట రూ.1.09 కోట్లు స్థిరాస్తులు ఉండగా.. భార్య పేరిట రూ.30,04,44,600, ఉమ్మడి కుటుంబ సభ్యుల కింద రూ.4,29,44,876 ఉన్నట్టు పేర్కొన్నారు.

కేసుల చిట్టా విప్పిన బొండా ఉమా



విజయవాడ సెంట్రల్ టీడీపీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు (ఉమా) ఎన్నికల అఫిడవిట్‌లో తన కేసుల చిట్టా విప్పారు. 2006 నుంచి 2024 ఏప్రిల్ వరకు వివిధ ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లలో తనపై 23 కేసుల నమోదైనట్టు వెల్లడించారు. 2006 నుంచే తనపై కేసులు ఉన్నప్పటికీ 2014, 2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సమర్పించిన అఫిడవిట్ల వీటి ప్రస్తావన తేలేదు. భార్య, కుమారుడితో పాటు తన పేరిట మొత్తంగా రూ.98.53 కోట్ల విలువైన స్థిర, చరాస్తులు ఉన్నట్టు వివరించారు.

కావలి అభ్యర్థికీ కారు లేదట!



కావలి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి) ఆస్తుల విలువ రూ.153.27 కోట్లు అని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అతని పేరున రూ.115.67 కోట్లు, భార్య శ్రీలత పేరిట రూ.31.92 కోట్లు, కుమార్తె వెన్నెల పేరిట రూ.5.67 కోట్లు చర, స్థిరాస్తులున్నట్టు చూపారు. కృష్ణారెడ్డి కారు లేదని అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

వేమిరెడ్డి దంపతులకు 19 కార్లు



కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఆమె భర్త ప్రభాకర్‌రెడ్డి ఉమ్మడి ఆస్తులు విలువ రూ.715.62 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ప్రశాంతిరెడ్డి పేరుతో రూ.76.35 కోట్లు, ప్రభాకర్‌రెడ్డి పేరుతో రూ.639.26 కోట్లు ఉన్నట్టు వెల్లడించారు. వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ.1.17 కోట్లు ఉండగా.. షేర్లు, బాండ్ల రూపంలో రూ.10.62 కోట్లు ఉన్నాయి. ఆ దంపతులిద్దరికీ రూ.6.96 కోట్ల విలువైన 19 కార్లు ఉన్నట్టు తెలిపారు.

హ్యాపీ బర్త్ డే అమ్మ

మాతృమూర్తి విజయమ్మకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం జగన్

సాక్షి, అమరావతి: తన మాతృమూర్తి వైఎస్ విజయమ్మ పుట్టినరోజు సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. తల్లితో కలిసి ఉన్న ఫొటోతో పాటు 'హ్యాపీ బర్త్ డే అమ్మ' అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.



ప్రచారం ఆపండి! పొత్తు సర్దుబాటులో మీ సీటు వేరేవారికి కేటాయించార్సార్!

సీఎంపై హత్యాయత్నానికి సూత్రధారి 'బొండా'నే

- ప్రధాన నిందితుడు సతీష్ కుటుంబ సభ్యులను బొండా ఉమా ఇంటికి పిలిపించుకుని ఏం మాట్లాడినట్టు?
- వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై, తనపై హత్యాయత్నానికి సూత్రధారి టీడీపీ నాయకుడు బొండా ఉమానే అని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని 28వ డివిజన్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. పథకం ప్రకారమే సీఎం జగన్‌పై టీడీపీ నాయకులు హత్యాయత్నానికి పాల్పడ్డారని, బొండా ఉమా, ఏ2 దుర్గారావులు దగ్గరుండి మాపై హత్యాయత్నం చేయించారని ఆరోపించారు. దీనికి సూత్రధారి బొండా ఉమా కాగా, మూలకారకుడు చంద్రబాబేనని ఆరోపించారు. ఈ కేసుకు సంబంధించిన అంశాలన్నీ బొండా ఉమా చుట్టూనే తిరుగుతున్నాయని, రాజకీయంగా తమను ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక ఇలా టీడీపీ నాయకులు రౌడీయిజం, గూండాయిజాన్ని పోషించి హత్యాయత్నాలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. బొండా ఉమాకు నియోజకవర్గ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, ఉమా ఘోర ఓటమిని చవిచూడడం తథ్యమన్నారు.

నిందితులు ఎందుకు టచ్‌లో ఉన్నట్టు?

ముఖ్యమంత్రిపై హత్యాయత్నం జరిగితే పోలీసు అధికారులు విచారణ జరపడం తప్పా? అధికారులను బెదిరిస్తే నిజం అబద్ధమవదనే విషయాన్ని బొండా ఉమా తెలుసుకోవాలని వెలంపల్లి హితవు పలికారు. చట్టం ముందు అందరూ సమానులేనని, చట్టం తనపని తాను చేసుకువెళుతుంటే బొండా ఉమాకు ఎందుకు వెన్నులో వణుకు పుడుతోందని ప్రశ్నించారు. సీఎం జగనన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఉన్నత స్థానాల్లో కూర్చోబెడుతుంటే.. చంద్రబాబు వారిని రౌడీలుగా తయారు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని మండిపడ్డారు. ఎవరైనా తమ మీద తామే దాడి చేయించుకుంటారా? దాడి ఘటనలో కన్నుకు దెబ్బ తగిలి ఇబ్బంది పడుతుంటే బొండా ఉమాకు కనీసం ఇంకిత జ్ఞానం కూడా లేకుండా దుష్ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. 'సీఎంపై హత్యాయత్నం చేసినవారు బొండా ఉమాతో ఎందుకు టచ్‌లో ఉన్నారు? సతీష్ తల్లిదండ్రులు బొండా ఉమా ఇంటికి ఎందుకు వెళ్లారు?' అని ప్రశ్నించారు. బొండా ఉమా, ఆయన ఇద్దరు కుమారులు చేస్తున్న రౌడీయిజానికి కచ్చితంగా అడ్డుకట్ట వేస్తామని హెచ్చరించారు. ఈ కేసులో ఏ2గా ఉన్న దుర్గారావు, బొండా ఉమా ఇద్దరు పక్కపక్కనే కూర్చొని ఈ దాడి చేయించారని ఆయన ఆరోపించారు. ఈ కోణంలో పోలీసులు దర్యాప్తు చేయాలని కోరారు.

సీఎంపై హత్యాయత్నం కేసు.. కుట్రదారులపై దర్యాప్తు ముమ్మరం

- ఎ 2 ప్రేరణతోనే నిందితుడు దాడి చేసినట్లు నిర్ధారణ
- కుట్రదారులు, వారి వెనుక ఉన్న శక్తులపై పోలీసుల ఆరా
- నిందితుల కదలికలు, సీసీ టీవీ ఫుటేజీల పరిశీలన
- కీలక వ్యక్తికి సంబంధించిన సాంకేతిక ఆధారాలు, కీలక సాక్ష్యాల సేకరణ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నంలో కుట్రదారులు, వారి వెనుక ఉన్న శక్తులెవరన్న కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సీఎం జగన్‌ను హత్య చేయాలనే కుట్రతోనే ఆయనపై పదునైన సిమెంట్ కాంక్రీట్ రాయితో దాడికి పాల్పడినట్లు పోలీసులు ఇప్పటికే నిర్ధారణకు వచ్చారు. ప్రధాన నిందితుడు వేముల సతీష్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో రెండో ప్రధాన నిందితుడు (ఏ2) ప్రోద్బలంతోనే సతీష్ ఈ హత్యాయత్నం చేసినట్టు పోలీసులు రిమాండ్ రిపోర్టులో స్పష్టంగా పేర్కొన్నారు. ఎ 2 కదలికలు, కాల్ డేటా, బ్యాంకు అకౌంట్, నేరస్థలంలో టవర్ డంప్, ప్రత్యక్ష సాక్షుల అభిప్రాయాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ముఖ్యమంత్రి తలపై సున్నిత భాగంలో రాయితో దాడికి పాల్పడినట్లు ప్రధాన నిందితుడు సతీష్ నేరాన్ని అంగీకరిస్తూ వాంగ్మూలమిచ్చాడు. దీంతో దీని వెనుక ఉన్న భారీ కుట్రకోణంపైన పోలీసులు విచారణ చేస్తున్నారు. ఎ 2 పాత్రకు సంబంధించి మరింత సమాచారంతోపాటు అతడి వెనుక ఉన్న కీలక కుట్రదారులు, వారి వెనుక ఉన్న శక్తులెవరో పూర్తి ఆధారాలతో నిగ్గు తేల్చే పనిలో పోలీసులు ఉన్నారు. నిందితుల కదలికలకు సంబంధించిన సీసీ టీడీ ఫుటేజిలను విశ్లేషిస్తున్నారు. దాడి జరిగిన తరువాత వీరు ఎవరిని కలిశారు, వారిలో ఉన్న కీలక వ్యక్తికి సంబంధించిన సాంకేతిక ఆధారాలు, కీలక సాక్ష్యాలను సేకరిస్తున్నారు.

పక్కా ప్రణాళిక ప్రకారమే..

సీఎంపై హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడైన వేముల సతీశ్ కుమార్ మాజీ ఎమ్మెల్యే, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బొండా ఉమాతో సన్నిహితంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్న దృశ్యాలు వెలుగులోకి రావటం కలకలం రేపుతోంది. ఎ 2 కూడ బొండాకు ప్రధాన అనుచరుడు కావటం, అతనితో సన్నిహితంగా ఫొటోలు దిగడం, అతనికి పార్టీలో పదవి ఇవ్వటం పలు అనుమానాలకు తావిస్తోంది. నిందితుడిని కోర్టులో హాజరుపరచినప్పుడు కూడా బొండా ఉమా అనుచరులే హడావుడి చేయడం, మరికొందరు టీడీపీ నేతలు అతనికి సహాయంగా రావడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. మరోవైపు ఈ హత్యాయత్నం అనంతరం బొండా ఉమా వ్యవహరించిన తీరు కూడా సందేహాస్పదంగా మారింది. మరోవైపు టీడీపీ నేతలు అచ్చెన్నాయుడు, విజయవాడ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్న లాంటి వారు మీడియా ముందుకు వచ్చి హడావుడి చేశారు. లోకేశ్ వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. కేసును పక్కదోవ పట్టించేందుకు పక్కా ప్రణాళిక ప్రకారమే వారు ఇదంతా చేశారని స్పష్టమవుతోంది.

డైట్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థలు (డీఐఈటీఎస్), ప్రభుత్వేతర ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణ సంస్థల్లో రెండేళ్ల ప్రాథమిక విద్య డిప్లమో కోర్సులో ప్రవేశం కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పాఠశాలవిద్య కమిషనర్ సురేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి సమాచారం, పరీక్ష తేదీల వివరాలు cse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంటాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

అలాయ్ వీల్ దిగ్గజం శేఖర్ ముమ్వా కన్నుమూత




శేఖర్ ముమ్వా (ఫైల్)

అగనంపూడి (విశాఖ): అలాయ్ వీల్ రంగ దిగ్గజం, దువ్వాడ వీఎస్ ఈజెడ్‌లోని సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ వ్యవస్థాపక చైర్మన్ శేఖర్ ముమ్వా శుక్రవారం గుండెపోటుతో కన్నుమూశారు. లండన్ వెళ్లిన ఆయనకు ఛాతీనొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు నిర్వహిస్తుండగానే మృతిచెందినట్లు ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. ఆయన దువ్వాడ వీఎస్ఈజెడ్‌లో మూడు దశాబ్దాల కిందట అలాయ్ వీల్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. ప్రపంచ ప్రసిద్ధ కార్ల కంపెనీలకు ఎగుమతి చేస్తున్నారు. శేఖర్ మృతితో సంస్థ ఆవరణలో విషాద ఛాయలు నెలకొన్నాయి. సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని ఆదివారం సీబీఎం కాంపౌండ్‌లోని ఆయన స్వగృహం వద్ద ఉంచుతున్నట్లు సంస్థ ప్రతినిధి తెలిపారు.

గంటా.. ఒక భార్య.. రెండు పాన్‌లు

నియోజకవర్గమే కాదు.. పాన్ నెంబరూ మారింది

- ఎన్నికల అఫిడవిట్ల సాక్షిగా బయటపడ్డ గంటా బాగోతం
- అవి రెండూ వరస నెంబర్లు.. కాబట్టి ఇవేమీ కొత్తగా తీసుకున్నవి కావు
- మొదట్నుంచీ రెండు పాన్‌లు... కానీ ఐటీ రిటర్న్‌లూ వేయని తీరు
- గతంలో భారీ నగదు చెల్లించి భూముల కొనుగోలు
- అది బయటకు తెలియకుండా వేరే పాన్‌ను వాడుకున్న గంటా
- ఇది ఎన్నికల కోడ్‌కు విరుద్ధం; కమిషన్‌ను తప్పుదోవ పట్టించడమేనన్న అధికారులు



2019 ఎన్నికల అఫిడవిట్‌లో గంటా సతీమణి పాన్‌కార్డ్ నంబర్



2024 ఎన్నికల అఫిడవిట్‌లో పాన్ నంబరు ఏబీపీపీజీ2216ఏగా పేర్కొన్న గంటా

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: తెలుగుదేశం పార్టీ నాయకుడు గంటా శ్రీనివాసరావుకు చట్టం తెలియదా? లేకపోతే తనసెవరేం చేస్తార్లే అన్న ధీమానా? ఎందుకంటే ఏ వ్యక్తికైనా రెండు పాన్ నెంబర్లుండటం చట్టరీత్యా నేరం. శిక్షార్హులు కూడా. కానీ గంటాది కళ్లు మూసేసుకుని... తనసెవ్వరూ చూడటం లేదనుకునే బాపతు. అందుకే... గత ఎన్నికలకు, ఈ ఎన్నికలకు తన భార్య పాన్ నంబరును మార్చేశారు. భార్య శారద పేరుతో గత ఎన్నికల అఫిడవిట్లో పేర్కొన్న పాన్ నంబర్‌కు, ఈ ఎన్నికల అఫిడవిట్లో పేర్కొన్న పాన్ నంబర్‌కు సంబంధం లేకపోవటంతో దీనివల్ల ఆయన పోటీ నుంచి తప్పుకోవాల్సి వస్తుందేమోనని ఆయన అనుచరులే ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే.. 2019 ఎన్నికల్లో విశాఖ నార్త్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన గంటా శ్రీనివాసరావు.... నాటి అఫిడవిట్‌లో తన సతీమణి శారద పాన్ నంబరు ఏబీపీపీజీ2215ఏగా పేర్కొన్నారు. ప్రతిసారీ నియోజకవర్గాన్ని మార్చే అలవాటున్న గంటా ఈ సారి పట్టుబట్టి, చంద్రబాబు నాయుడిని ఎదిరించి మరీ భీమిలి టికెట్టు సాధించుకున్నారు. శుక్రవారం నామినేషన్ వేస్తూ... అఫిడవిట్ దాఖలు చేశారు. దీన్లో భార్య శారద పాన్ నంబరును మాత్రం ఏబీపీపీజీ2216ఏగా పేర్కొన్నారు. అంటే... 2215ఏ, 2216ఏ నంబర్లతో దాదాపు ఒకేసారి రెండు పాన్ నంబర్లను తీసుకున్నట్లు దీన్నిబట్టి స్పష్టమవుతోంది.

అంతా నగదు రూపంలోనే...!

ఆదాయపన్నుశాఖ చట్టం ప్రకారం నగదు లావాదేవీలు రూ.2 లక్షలకు మించి జరగకూడదు. ఒకవేళ జరిగితే అది నేరం అవుతుంది. అయితే, గంటా శ్రీనివాసరావు తన సతీమణి పేరుతో 2018లో భీమునిపట్నం పరిధిలో భూమిని కొన్నపుడు పెద్దమొత్తంలో నగదు రూపంలోనే చెల్లించడంపై అప్పట్లో విమర్శలొచ్చాయి. రూ.92,98,000ను నగదు రూపంలోనే ఇచ్చినట్టు చూపించారు. అంతే కాకుండా మరో రూ.25 లక్షలను ఆర్‌టీజీఎస్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసినట్టు చూపి సర్వే నంబరు టీఎస్ నంబరు 1,490, బ్లాక్ నంబరు 17, వార్డు నంబరు 24లోని 1,936 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇంత భారీ స్థాయిలో నగదు లావాదేవీలు జరిపితే పాన్ నంబరును పేర్కొనడంతో పాటు ఐటీ రిటర్న్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. కానీ గంటా శారద 2014–15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018–19 ఆర్థిక సంవత్సరం వరకు ఏ ఒక్క సంవత్సరంలోనూ ఐటీ రిటర్న్‌లు దాఖలు చెయ్యలేదు. వాస్తవానికి ఆ పాన్ నెంబర్లను చూసినపుడు రెండూ ఒకే సమయంలో తీసుకున్నట్లుగా స్పష్టమవుతుంది. అయితే ఐటీ రిటర్నుల కోసం ఒకటి, భారీ నగదు లావాదేవీల కోసం మరొకటి వినియోగిస్తూ ఉండవచ్చని, ఆ రెండింటినీ చెక్ చేస్తే ఆదాయపు పన్నును మోసం చేసిన వ్యవహారాలు చాలావరకూ బయటపడతాయని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొట్టే ఉద్దేశంతో ఇలా రెండు పాన్ నెంబర్లను కలిగి ఉండటం నేరమని, మంత్రిగా పనిచేసిన గంటాకు ఇది తెలియనిదేమీ కాదని, కావాలనే ఇలా చేస్తున్నారని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. తాజా అఫిడవిట్ ప్రకారం గంటాపై ఏడు కేసులున్నాయి. భార్యాభర్తలిద్దరి పేరిటా మొత్తం రూ.23.36 కోట్ల స్థిర, చరాస్తులున్నాయని, కాకపోతే సొంత కారు మాత్రం లేదని గంటా పేర్కొన్నారు.

ఆస్తుల కొనుగోలుకు మరో పాన్

అసలు కథేమిటంటే... 2018లో తన సతీమణి పేరుతో కొనుగోలు చేసిన ఆస్తి కోసం పాన్ నంబర్‌ను ఏబీపీపీజీ2216ఏగా గంటా పేర్కొన్నారు. ఇందుకు విరుద్ధంగా 2019 ఎన్నికల అఫిడవిట్‌లో మాత్రం ఏబీపీపీజీ2215ఏగా పేర్కొన్నారు. అంటే... అప్పట్లో కొన్న ఆస్తిని గత ఎన్నికల్లో చూపించలేదు. పైపెచ్చు 2018లో కొనుగోలు చేసిన భూ లావాదేవీలన్నీ నగదు రూపంలోనే సతీమణి పేరుతో కొనసాగించిన గంటా.. 2018–19, 2019–20 ఆర్థిక సంవత్సరాల్లో ఐటీ రిటర్న్‌ను కూడా దాఖలు చెయ్యలేదు. ఈ వ్యవహారాన్ని అప్పట్లోనే 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరోసారి భూ లావాదేవీల కోసం పేర్కొన్న పాన్ నంబర్‌ను అఫిడవిట్‌లో పేర్కొనడం గమనార్హం. నిజానికి ఒకే వ్యక్తికి రెండు పాన్ నంబర్లు ఉండటం చట్టరీత్యా నేరమని, అంతేగాకుండా ఒక్కోసారి ఒక్కో విధంగా ఎన్నికల అఫిడవిట్‌లో వివరాలివ్వటం కూడా ఎన్నికల కోడ్‌కు విరుద్ధమని ఎన్నికల అధికారులే చెబుతున్నారు.



టీడీపీ అభ్యర్థి సింధూరారెడ్డిపై కేసు

పుట్టపర్తి టౌన్: శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరా రెడ్డిపై పుట్టపర్తి అర్బన్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ కొండారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గురువారం పుట్టపర్తి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి నామినేషన్ వేసే ప్రక్రియలో ఆమె భర్త వెంకటకృష్ణ కిషోర్‌రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి నిబంధనలు ఉల్లంఘించారు. ఆర్‌ఓ కార్యాలయంలోకి ముగ్గురు ఒకేసారి వెళ్లడం, కార్యాలయంలో 100 మీటర్లలోపలే మీడియా సమావేశం నిర్వహించడం, నామినేషన్ అనంతరం అనుమతులు లేకుండా రోడ్ షో నిర్వహించడంతో పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ అంజయ్య పుట్టపర్తి అర్బన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పై ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా..కోడ్ ఉల్లంఘించిన వారిలో పల్లె కుటుంబ సభ్యులతో పాటు టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఇతర ముఖ్యనాయకులు ఉన్నారు.

ఒక్క డీఎస్సీ పెట్టని సీఎం జగన్

- నేనొస్తే మద్యం ధరలు తగ్గిస్తా.. బాగా తాగిస్తా
- ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు



కణేకల్లులో వెలవెలబోతున్న 'ప్రజాగళం' సభ

రాయదుర్గం/కణేకల్లు (అనంతపురం జిల్లా)/ఆలూరు రూరల్ (కర్నూలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక్క డీఎస్సీ కూడా పెట్టకుండా సర్వ నాశనం చేశారని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. ఆయన శుక్రవారం కర్నూలు జిల్లా ఆలూరు, అనంతపురం జిల్లా కణేకల్లులో జరిగిన ప్రజాగళం సభల్లో మాట్లాడారు. సీఎం జగన్ 25 వేల పోలీసు ఉద్యోగాలు ఇస్తానని విస్మరించారన్నారు. గ్రూప్ –2 ఎగ్జామ్ పెట్టలేదన్నారు. టీడీపీ అధికారంలో ఉంటే కియా లాంటి పరిశ్రమలు వెతుక్కుంటూ వచ్చేవని, జగన్ వచ్చాక ఇక్కడి నుంచి పారిపోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. వలంటీర్లు ఉద్యోగానికి రాజీనామా చేయొద్దని, ఎవరైనా అడిగితే చంద్రన్న చెప్పాడు రాజీనామా చేయబోమంటూ తిరుగుబాటు చేయాలని సూచించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సవాల్ విసురుతున్నానని, రాయలసీమలో ఎంత మంది బీసీలకు టికెట్లు ఇచ్చారని ప్రశ్నించారు. పోలవరం పూర్తయి ఉంటే రాయలసీమ మొత్తం నీరు పారేదని, ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపలేదని ఆరోపించారు. తాను అధికారంలోకి వస్తే మద్యం ధరలు తగ్గించి మందు బాబులకు బాగా తాగిస్తానని గట్టిగా చెప్పారు.

బాబు పర్యటనతో ప్రజలకు అవస్థలు

ఎంకి పెళ్లి సుబ్బి చావు కొచ్చిందన్న చందంగా చంద్రబాబు పర్యటన రాయదుర్గం, కణేకలు పట్టణాల ప్రజలను అవస్థలపాలు చేసింది. చంద్రబాబు హెలికాప్టర్ ల్యాండింగ్‌కు విద్యుత్ వైర్లు అడ్డొస్తాయంటూ విద్యుత్ శాఖ అధికారులు అక్కడున్న విద్యుత్ స్తంభాలు, వైర్లను తొలగించారు. దీంతో రాయదుర్గం పట్టణానికి తాగు నీరు సరఫరా చేసే సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు కరెంటు సరఫరా నిలిచిపోయి, పట్టణానికి నీటి సరఫరా ఆగిపోయింది. అసలే ఎండకాలం..ఆపై నీరు లేక పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి 8 గంటలకు జరిగే సభ కోసం కణేకల్లు బస్టాండ్ ప్రాంతంలో ఉన్న దుకాణాలను మధ్యాహ్నం నుంచే మూసివేయించారు. దీంతో కిరాణా సరుకుల కోసం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరిగారు.

సభలు అట్టర్‌ఫ్లాప్

చంద్రబాబు సభలు రెండూ జనం రాక అట్టర్‌ఫ్లాపయ్యాయి. ఆలూరు సభ కూడా జనం లేక వెలవెలబోయింది. రోజువారీ కూలీలకు రూ. 200 నగదు, మందు, బిర్యానీ ఇచ్చి కొద్దిమందిని మాత్రం తేగలిగారు. జనం లేకపోవడంతో మధ్యాహ్నం 3 గంటలకు మొదలవ్వాల్సిన సభ సాయంత్రం 5 గంటలకు మొదలైంది. అప్పటికీ ప్రజలు రాకపోవడంతో తప్పనిసరై ప్రారంభించారు. అరకొర జనం మధ్యనే చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసం ఇచ్చారు. దీంతో వచ్చిన వారు కూడా ఆయన ప్రసంగం మధ్యలోనే వెళ్లిపోయారు. రాయదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 20 వేల మందిని సభకు తరలించాలని టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు, ఇతర నేతలు ఎంతగా ప్రయత్నించినా రెండు, మూడు వేలకు మించి ప్రజలు రాలేదు. అది కూడా మందు, బిర్యానీ పొట్లాలు పంచడంతో ఆమాత్రం వచ్చారు. వచ్చిన వారు సైతం చంద్రబాబు ప్రసంగం మధ్యలోనే వెనుదిరిగారు.

ఆ ఉద్యోగ సంఘాల నేతలపై చర్యలు తీసుకోండి

- కొందరు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు
- నిత్యం కొన్ని పత్రికలు ఆ నేతల మాటలను ప్రచురిస్తున్నాయి
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటం ఎన్నికల కోడ్ ఉల్లంఘనే
- ఎన్నికల సంఘానికి ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ వెంకట్రామిరెడ్డి వినతి
- ప్రభుత్వ ఉద్యోగులు ఈనాడు పత్రికను బహిష్కరించాలని పిలుపు



సాక్షి, అమరావతి: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న కొందరు ఉద్యోగ సంఘాల నేతలపై చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ కె.వెంకట్రామిరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొందరు ఉద్యోగ సంఘాల నేతలు చేస్తున్న వ్యాఖ్యలను నిత్యం కొన్ని పత్రికలు ప్రచురిస్తున్నాయని తెలిపారు. ఆయా పత్రికల క్లిప్పింగులను కూడా మీనాకు అందజేశారు. ప్రభుత్వానికి మద్దతుగా మాట్లాడటం ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందని తనను సస్పెండ్ చేశారని.. మరి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న కొన్ని ఉద్యోగ సంఘాల నేతల వ్యాఖ్యలు కూడా ఎన్నికల ప్రవర్తనా నియామవళి ఉల్లంఘన కిందకే వస్తాయని వెంకట్రామిరెడ్డి వినతి పత్రంలో పేర్కొన్నారు.

ఈనాడు తప్పుడు కథనాల వల్లే..

మార్చి 31న ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ హోదాలో తాను వైఎస్సార్ జిల్లాలో ఏపీపీటీడీ ఉద్యోగులను కలిసి వారి సమస్యలపై చర్చించానని వెంకట్రామిరెడ్డి తెలిపారు. అయితే అదే రోజు ఈనాడు పత్రిక ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం వల్లే ఉద్యోగులు మునిగిపోయారంటూ ఒక తప్పుడు కథనం ప్రచురించిందన్నారు. ఈ కథనాన్ని తాను ఖండిస్తూ విలీనం వల్ల ఉద్యోగులకు మేలే జరిగిందని.. ఉద్యోగుల గురించి తప్పుడు కథనాలు రాయొద్దని పత్రికా ప్రకటన విడుదల చేశానని తెలిపారు. దీంతో తనపై కక్ష కట్టిన ఈనాడు ఏప్రిల్ 2న తాను ఉద్యోగులతో మాట్లాడుతున్న ఫొటోను ప్రచురించి.. ఒక పార్టీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నానని తప్పుడు కథనం రాసిందన్నారు. ఈ కథనం ఆధారంగా తమపైన నాలుగు కేసులు పెట్టడంతోపాటు 11 మందిని సస్పెండ్ చేశారని వెంకట్రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ పత్రికలు విష పురుగులు

కొన్ని పత్రికలు రోజూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని సంఘాల నాయకులతో మాట్లాడిస్తున్నాయని, అది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాదా? అని వెంకట్రామిరెడ్డి నిలదీశారు. ప్రభుత్వం ఉద్యోగులకు మంచి చేసింది అంటే తప్పు.. ప్రభుత్వం ఉద్యోగులను ఇబ్బంది పెడుతోంది అంటే అది కరెక్టా? అది కోడ్ ఉల్లంఘన కాదా? అని ప్రశ్నించారు. నిష్పక్షపాతంగా వార్తలు రాయడమంటే ఇదేనా అని ధ్వజమెత్తారు. కొంతకాలంగా ఆ పత్రికలు తమకు నచ్చిన వారికి మేలు చేయడమే లక్ష్యంగా కథనాలు రాస్తున్నాయని మండిపడ్డారు. ఈ పత్రికలు విష పురుగులతో సమానమన్నారు. ఎయిడ్స్, కరోనా లాంటివే ఈ పత్రికలు కూడా అని పేర్కొన్నారు. ఆ వ్యాధులకు మందు కనుక్కున్నారు కానీ ఈ పత్రికలకు మాత్రం మందు కనుక్కోలేకపోతున్నారన్నారు. ఉద్యోగుల సమాఖ్య తరపున ఈనాడును బహిష్కరిస్తున్నామని వెంకట్రామిరెడ్డి వెల్లడించారు.

వివేక హత్య కేసుపై షర్మిల మాట్లాడటం ఎన్నికల ఉల్లంఘనే

కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలకు ఈసీ నోటీసులు

సాక్షి, అమరావతి: కోర్టు పరిధిలో ఉన్న వివేకానంద హత్య కేసుపై ఎన్నికల ప్రచారంలో మాట్లాడటం ఎన్నికల ఉల్లంఘన కిందకు వస్తుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలిగా ఉన్న షర్మిల సీబీఐ కోర్టు పరిధిలో ఉన్న వివేకానందరెడ్డి హత్య కేసు విషయాన్ని ప్రచారంగా ప్రముఖంగా ప్రస్తావించడం కచ్చితంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందంటూ ఎన్నికల సంఘం నోటీసులిచ్చింది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక షర్మిల తన ప్రచారంలో పదే పదే వివేకానంద హత్యను రాజకీయ ప్రచారాస్త్రంగా వినియోగిస్తున్న అంశాన్ని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఎన్నికల సంఘానికి సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఈ అంశం కోర్టు విచారణలో ఉందని, నేరం ఎవరు చేశారన్నది నిర్ధారించకపోయినా.. అతనే నిందితుడంటూ ప్రచారం చేయడాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదును పరిశీలించిన ఎన్నికల సంఘం.. హైదరాబాద్ నాంపల్లి సీబీఐ కోర్టు పరిధిలో ఉన్న ఈ అంశానికి సంబంధించి ప్రత్యర్థిపై నిందలు వేస్తూ ఎన్నికల ప్రచారంలో మాట్లాడటం ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుందని, ఇందుకు ప్రాథమిక సాక్ష్యాధారాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, ఈ అంశంపై 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలంటూ షర్మిలకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా నోటీసులిచ్చారు.

షర్మిల సభలో జై జగన్ నినాదాలు

ఆదోని సెంట్రల్/ఆదోని టౌన్: ఏపీ న్యాయయాత్రలో భాగంగా శుక్రవారం రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కర్నూలు జిల్లా ఆదోనిలో మాట్లాడుతుండగా.. చక్రపాణి అనే యువకుడు హోటల్ బాల్కనీ నుంచి వైఎస్సార్‌సీపీ సిద్ధం జెండాను ఊపుతూ జై జగన్ అంటూ నినాదాలు చేశాడు. అతనితో పాటు మరికొందరు జత కలిశారు. రాష్ట్రంలో వైఎస్సార్ ఆశయాల కనుగుణంగా సంక్షేమ పాలన చేస్తుంటే సీఎం జగన్‌పై విమర్శలు గుప్పించడమేంటని స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు.

టీడీపీ దుష్ప్రచారంపై చర్యలు తీసుకోండి

- సోషల్ మీడియాలో సీఎం జగన్‌పై విషప్రచారం చేస్తోంది
- ఈసీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై సోషల్ మీడియాలో టీడీపీ చేస్తున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఎన్నికల సంఘానికి విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం వెలగపూడి సచివాలయంలో సీఈవో ముఖేష్ కుమార్ మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం విష్ణు మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌పై సోషల్ మీడియాలో టీడీపీ విషం కక్కుతోందన్నారు. ప్రజల్లో అపోహలు కల్పించేలా తప్పుడు ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. సోషల్ మీడియా, వాయిస్ మెసేజులు ద్వారానే కాకుండా బహిరంగ సభల్లోనూ సీఎం జగన్‌ను కించపరిచేలా చంద్రబాబు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తద్వారా పదేపదే ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారన్నారు. సీఎం జగన్ శవరాజకీయాలు చేస్తున్నారంటూ టీడీపీ సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం తీవ్ర ఆక్షేపణీయమన్నారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవలసిందిగా ఈసీని కోరినట్లు తెలిపారు. వ్యక్తిత్వ హననం సరికాదని ఈసీ స్పష్టంగా చెప్పినప్పటికీ చంద్రబాబు, టీడీపీ నేతల బుద్ధి మాత్రం మారడం లేదన్నారు. ఎదుటివారిపై బురదచల్లి రాజకీయ లబ్ధి పొందాలనే నీచమైన స్వభావం కలిగిన వ్యక్తి చంద్రబాబు అని ధ్వజమెత్తారు.

హింసా రాజకీయాలకు టీడీపీ తెరదీసింది

రాష్ట్రంలో హింసా రాజకీయాలకు టీడీపీ తెరదీసిందని మల్లాది విష్ణు విమర్శించారు. ఓటమి భయంతో అమాయకులపై దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. మంగళగిరిలో నారా లోకేశ్ అనుచరుల దాష్టీకానికి ఒక నిండు ప్రాణం బలైందని ఆవేదన వ్యక్తం చేశారు. నారా లోకేశ్ ఎక్స్ పోస్టులు, రెచ్చగొట్టేలా చేస్తున్న ప్రసంగాలే ఇందుకు ప్రధాన కారణమని ఆరోపించారు. వంగవీటి రంగా హత్య నుంచి మంగళగిరి ఘటన వరకు టీడీపీ శవ రాజకీయాలనే నమ్ముకుందని విమర్శించారు. అలాగే వలంటీర్లపై కోపంతో అవ్వాతాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి, 30 మంది అమాయకుల ప్రాణాలు పోవడానికి టీడీపీ నేతలు కారకులయ్యారని ఆరోపించారు. అధికారులను, సమాజంలోని అన్నివర్గాలను భయపెట్టి అధికారంలోకి రావాలని టీడీపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. విజయవాడలో ముఖ్యమంత్రిపై హత్యాయత్నం జరిగితే, ఆ ఘటనను మసిపూసి మారేడుకాయ చేయడానికి టీడీపీ ఎంతగానో ప్రయత్నించిందన్నారు. సింపతీ డ్రామాలని, కోడికత్తి 2 అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడిందని ధ్వజమెత్తారు. ఇప్పుడు దాడి వెనుక టీడీపీ హస్తం ఉందని బయటకు వచ్చాక నోరుమెదపడం లేదన్నారు. టీడీపీ చేస్తున్న విషప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు రావెల కిషోర్ బాబు, ఎ.నారాయణమూర్తి, న్యాయవాది శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వివేకా హత్యపై మాట్లాడొద్దని కడప కోర్టు ఎలా చెబుతుంది?

- కోర్టు ఆర్డర్ కాపీ నాకు అందలేదు
- నర్రెడ్డి సునీత



పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య గురించి మాట్లాడకూడదని కడప కోర్టు ఎలా ఆర్డర్ ఇస్తుందని నర్రెడ్డి సునీత అన్నారు. కోర్టు ఇచ్చిన ఆర్డర్ కాపీ తనకు అధికారికంగా అందలేదని చెప్పారు. కడప కోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను హైకోర్టుకు వెళ్తే కొట్టివేస్తారన్నారు. ఆమె శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్లుగా తాను ఎక్కువగా మాట్లాడలేదని, ఇప్పుడు తాను, షర్మిల మాట్లాడుతున్నామని అన్నారు. వివేకా హత్య గురించి తాము మాట్లాడితే వైఎస్సార్‌సీపీ నాయకుల్లో వణుకు పుడుతోందని, అందుకే కోర్టుకు వెళ్లి గ్యాగ్ ఆర్డర్ తెచ్చుకున్నారని చెప్పారు. చనిపోయిన వ్యక్తిపై నిందలు వేస్తూ వ్యక్తిత్వ హననం చేస్తున్నారన్నారు. కేసు ట్రయల్స్ హైదరాబాదులోని సీబీఐ కోర్టులో జరుగుతుంటే కడప కోర్టు ఎలా ఆదేశాలు జారీ చేస్తుందని అన్నారు. తాము మాట్లాడేది వైఎస్ అవినాశ్‌రెడ్డి గురించి అయితే వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్‌బాబు పరువునష్టం దావా వేశారని, ఆయనకు ఎలా పరువునష్టం జరుగుతుందని అన్నారు. వైఎస్ అవినాశ్‌రెడ్డి కడప ఎంపీగా పోటీచేస్తూ దాఖలు చేసిన నామినేషన్‌లో ఈ కేసుతో పాటు మరో కేసును కూడా ప్రస్తావించారన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం క్రిమినల్ రికార్డు ఉంటే ప్రజలకు తెలియాలని, అప్పుడు ప్రజలు ఎవరికి ఓటు వేయాలో డిసైడ్ అవుతారన్నారు. ఐదేళ్లుగా ప్రజల్లో ఉన్నవాటిపై ఇప్పుడు మాట్లాడకూడదని చెప్పడం ఎలా సమంజసమవుతుందన్నారు.



> ఐదు పాదాలు గలవాడు, పన్నెండు ఆకారాలు గలవాడు, అందరికీ తండ్రియైన వాడు, నీటిని ఉత్పత్తిగావించేవాడు అయిన సూర్యుడు స్వర్గలోకానికి ఇంకా పైన అత్యున్నత స్థానంలో నెలకొని ఉన్నాడని చెబుతారు.
>
> – ప్రశ్నోపనిషత్తు (హిందూ ధర్మం)

ఫోకస్

సాక్షి

శనివారం, 20 ఏప్రిల్ 2024

పసివాళ్ల ఆహారంతో ఆటలా!

తొమ్మిదేళ్లనాటి మ్యాగీ నూడిల్స్ వివాదం నుంచి బయటపడి రెండు వారాలు గడిచాయో లేదో... నెస్లే కంపెనీ మెడకు కొత్తగా సెరిలాక్ తగువు చుట్టుకుంది. ఈసారి దీని మూలం మన దేశంలో కాదు, స్విట్జర్లాండ్‌లో వుంది. భిన్న రకాల ఉత్పత్తుల ద్వారా లాభాల రూపంలో ఏటా వేలాదికోట్ల రూపాయలు తరలించుకుపోతున్న బహుళజాతి సంస్థలకు ఇక్కడి ప్రజల ఆరోగ్యం విషయం లోగానీ... ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలపైగానీ పెద్దగా పట్టింపు వుండదని చాలామంది చేసే ఆరోపణ. అడపా దడపా వెల్లడవుతున్న అంశాలు వాటిని బలపరిచేవిగానే వుంటున్నాయి. భారత్‌లో పసివాళ్ల ఆకలి తీర్చడానికి తల్లులు ఉపయోగించే సెరిలాక్‌లో అధిక శాతం చక్కెర వుంటున్నదని స్విట్జర్లాండ్‌లోని స్వచ్ఛంద సంస్థ 'పబ్లిక్ ఐ' మరో సంస్థ అంతర్జాతీయ బేబీ ఫుడ్ యాక్షన్ నెట్‌వర్క్ (ఐబీ–ఫాన్)తో కలిసి గురువారం బయటపెట్టాక దేశం నివ్వెరపోయింది. నెస్లే సంస్థ ఒక్క భారత్‌లో మాత్రమే కాదు, యూరప్ దేశాలతోపాటు ఆఫ్రికా, లాటిన్ అమెరికా, దక్షిణాసియా దేశాల్లో కూడా సెరిలాక్ విక్రయిస్తోంది. కానీ యూరప్ దేశాల పిల్లల కోసం తయారుచేసే సెరిలాక్‌కూ, వేరే దేశాల్లో విక్రయించే సెరిలాక్‌కూ చాలా వ్యత్యాసం వుంది. యూరప్ దేశాల్లో విక్రయించే సెరిలాక్‌లో అసలు చక్కెర పదార్థాలే వాడని నెస్లే... ఇతరచోట్ల మాత్రం యథేచ్ఛగా వినియోగిస్తున్నట్టు 'పబ్లిక్ ఐ' తెలిపింది.

మూడేళ్లలోపు పిల్లలు తినే ఆహార పదార్థాల్లో కృత్రిమంగా తీపిని పెంచే సుక్రోజ్, ఫ్రక్టోజ్ వంటి పదార్థాలేవీ కలపరాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసింది. పసిపిల్లల ఆహారోత్పత్తుల్లో కృత్రిమ తీపి పదార్థాలు, అదనపు చక్కెర వుండరాదన్నది 2022 సంవత్సర ప్రధాన నినాదం కూడా. కానీ దురదృష్టమేమంటే మన దేశం వాటి వినియోగాన్ని అనుమతిస్తోంది. తమ చిన్నారులకు అవసరమైన ప్రొటీన్‌లు, విటమిన్లు, ఐరన్ తదితర పోషకాలు లభిస్తాయన్న ఆశతో తల్లులు సెరిలాక్ వంటి ఉత్పత్తులను ఆశ్రయిస్తారు. గత అయిదేళ్లుగా సెరిలాక్‌లో కృత్రిమ తీపి పదార్థాల వాడకాన్ని 30 శాతం తగ్గించామని నెస్లే కంపెనీ తాజా వివాదం తర్వాత సంజాయిషీ ఇస్తోంది. మంచిదే. కానీ అసలు వాడరాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతున్నప్పుడు ఈ తగ్గించటమేమిటి? ఇన్ని దశాబ్దాలుగా వాటిని ఎందుకు కొనసాగించినట్టు? ఇది తప్పించుకునే ధోరణి కాదా? నెస్లే సంస్థ సంగతలావుంచి అసలు మన దేశంలో అమ్ముడవుతున్న బహుళజాతి సంస్థల ఉత్పత్తుల్లో తగిన ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో చూసి నియంత్రించాల్సిన ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఐ) ఏమైనట్టు? ఎక్కడో స్విట్జర్లాండ్‌లోని స్వచ్ఛంద సంస్థలు వివిధ దేశాల్లో విక్రయించే సెరిలాక్ ఉత్పత్తుల నమూనాలను సేకరించి నిగ్గుతేల్చే వరకూ ఆ సంస్థ గాఢ నిద్రపోయిందా అనే సందేహం రావటం సహజం. పసివాళ్లకు అందించే ఆహారంలో పరిమితికి మించి చక్కెర లేదా ఉప్పు ఎక్కువైతే వారి ఆరోగ్యానికి ఎంతో హాని కలుగుతుందనీ, చిన్న వయసునుంచే తీపి పదార్థాలకు వారు అలవాటుపడతారనీ నిపుణులంటారు. ఈ పదార్థాలు ఊబకాయాన్ని పెంచుతాయని, పిల్లలు శ్వాసకోశ వ్యాధులు, గుండె సంబంధ వ్యాధులు, కేన్సర్, మధు మేహంవగైరా వ్యాధులకు లోనవు తారని హెచ్చరిస్తారు. మన పిల్లల్లో ఇటీవలకాలంలో ఊబకాయం లక్షణం పెరుగుతున్నదని అనేక సర్వేలు గొంతు చించుకుంటున్నాయి కూడా. అయినా నియంత్రణ వ్యవస్థల చెవులకు సోకలేదు. ఒక అంచనా ప్రకారం కేవలం సెరిలాక్ అమ్మకాల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా నెస్లే సంస్థ ఏటా వంద కోట్ల డాలర్ల (రూ. 8,400 కోట్లు)కుపైగా ఆర్జిస్తోంది. ఇందులో భారత్, బ్రెజిల్ దేశాల వాటాయే 40 శాతం వుంటుందని అంటారు. ఇంతగా లాభాలొచ్చే ఉత్పత్తి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలనీ, అంతర్జాతీయ ప్రమాణాలు పాటించాలనీ నెస్లేకు తెలియదా? పోనీ అన్నిచోట్లా ఇలానే చేస్తే అజ్ఞానమో, నిర్లక్ష్యమో అనుకోవచ్చు. కానీ ధనిక దేశాల్లో ఒకరకంగా, వర్ధమాన దేశాల్లో మరో విధంగా ద్వంద్వ ప్రమాణాలు పాటించటం ఏ వ్యాపార నీతి?

ఆహార ఉత్పత్తులు, శీతల పానీయాలు తదితరాల విషయంలో ఏమరుపాటు పనికిరాదు. వాటిని ఎప్పుడో ఒకసారి పరీక్షించి చూసి వదిలేయకూడదు. నిర్ణీత కాలపరిమితుల్లో నిరంతరం వాటి నమూనాలను పరీక్షిస్తూ వుండాలి. మనం తినే తిండి ఆరోగ్యదాయకమేనా, సురక్షితమేనా అని మాత్రమే కాదు... ఉత్పత్తిదారు చెప్పుకుంటున్నవిధంగా అందులో పోషకాలున్నాయో లేదో గమనించాలి. ప్రమాణాలకు అనుగుణంగా లేనివాటిని నిర్దాక్షిణ్యంగా మార్కెట్ నుంచి తొలగించాలి. ప్రపంచంలో చైనా తర్వాత మన దేశమే అతి పెద్ద మార్కెట్. అందుకే బహుళజాతి సంస్థలు సినీతారలనూ, క్రీడా దిగ్గజాలనూ తమ బ్రాండ్ అంబాసిడర్లుగా రంగంలోకి దించి ప్రకటనలతో ఊదరకొడుతూ అచిరకాలంలోనే లాభాల బాట పడుతుంటాయి. ఆ ఉత్పత్తుల్ని వాడటం ఆధునికతకూ, ఉత్తమాభిరుచికీ నిదర్శనమని బ్రాండ్ అంబాసిడర్లు చెప్పే మోసపోవటానికి మన మధ్యతరగతి ఎప్పుడూ సిద్ధంగా వుంటుంది. 2015లో మ్యాగీ నూడిల్స్‌లో అత్యంత హానికరమైన సీసం, మోనోసోడియం గ్లూటామేట్ వంటి పదార్థాలున్నాయని వెల్లడైనప్పుడు గగ్గోలైంది. తీరా తొమ్మిదేళ్లు గడిచాక జాతీయ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార కమిషన్ మ్యాగీ నూడిల్స్ విషయంలో కేంద్రం నిర్ణయం సరికాదని ఈనెల మొదటివారంలో తోసిపుచ్చింది. నెస్లేకు క్లీన్‌చిట్ ఇచ్చింది. భవిష్యత్తులో సెరిలాక్ విషయంలోనూ ఇదే జరుగుతుందా? ఇతరత్రా అంశాల మాటెలావున్నా హానికారక ఆహార పదార్థాలు మార్కెట్‌లోకి రాకుండా చూడాల్సిన కనీస బాధ్యత తమకున్నదని కేంద్ర ప్రభుత్వం గుర్తించటం అవసరం.

సెక్యులరిజం ఒక పాడియావు?

అభిప్రాయం



టంకశాల అశోక్

ఏదైనా రాజకీయ పార్టీ ఒక సిద్ధాంతాన్ని ప్రకటించినపుడు అందుకు త్రికరణశుద్ధిగా కట్టుబడాలి. ఎటువంటి సమస్యలు ఎదురైనా, అధికారం ఉన్నా పోయినా, ఆ సిద్ధాంతంపై రాజీ పడకూడదు. అందుకు బహిరంగంగా గానీ, పరోక్ష రీతిలో గానీ వెసులుబాట్లు చూపరాదు. అప్పుడే ప్రజలకు ఆ పార్టీ పట్ల, ఆ సిద్ధాంతం పట్ల అచంచలమైన విశ్వాసం ఏర్పడుతుంది. కానీ కాంగ్రెస్ పార్టీ నెహ్రూ తర్వాత కాలం నుంచి నేటి వరకు కూడా సెక్యులరిజం విషయమై అటువంటి రాజీలేనితనాన్ని చూపలేదు. ఇందిరాగాంధీ సాఫ్ట్ హిందూత్వ ఎత్తుగడల నుంచి, ప్రస్తుతం పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై విధానం వరకు సెక్యులరిజంతో కాంగ్రెస్ దోబూచులలో కనిపించేది అంతా అధికారం కోసం సాగించే ద్వంద్వ నీతే.

రాహుల్ గాంధీ ఈనెల 17న కర్ణాటకలోని మాండ్యా సభలో మాట్లాడుతూ, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య పోరాటమని అన్నారు. ఇండియా కూటమి సిద్ధాంతం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటం కాగా, బీజేపీ సిద్ధాంతం ఆ రెండింటినీ కూలదోయట మన్నారు. సరిగా అదే 17వ తేదీన అదే ఇండియా కూటమిలో భాగస్వామి అయిన సీపీఎం పార్టీ కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తమ రాష్ట్రంలోని పాలక్కాడ్‌లో ప్రసంగిస్తూ, పౌరసత్వ చట్టం (సీఏఏ) వివాదంపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ఎందుకు మౌనంగా ఉన్నాయని సూటిగా ప్రశ్నించారు. ఈ ప్రశ్న కాంగ్రెస్‌కు సహజంగానే ఇబ్బందికరంగా మారింది. దానితో విజయన్‌పై ఎదురు దాడి జరిపింది. మరునాడు 18న కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్స్‌లో ఒకరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ నుంచి రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న వయనాడ్ ఎన్నికల సభలో పాల్గొంటూ, విజయన్ పైకి కమ్యూనిస్టు అయినా అంతర్గతంగా మతతత్వవాది అనీ, ఆయనకు ప్రధాని నరేంద్ర మోదీతో రహస్య ఒప్పందం ఉందనీ ఆరోపించారు. అక్కడ అది విన్న వారికీ, కేరళ ప్రజలకూ అదెంత రసవత్తరంగా తోచి ఉంటుందో మనకు తెలియదు.

దానినట్లుంచి రాహుల్, విజయన్‌ల మాటలకు వద్దాము. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటం అవసరమని, బీజేపీ వల్ల అందుకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందనే భావన దేశంలో విస్తృతంగా ఏర్పడటం నిజం. వాటి పరిరక్షణకు కాంగ్రెస్ గానీ, ఇండియా కూటమి గానీ నిజంగానే కట్టుబడి ఉంటే దానిని స్వాగతించవలసిందే. కానీ, ఇండియా కూటమికి నాయకత్వ స్థానంలోగల కాంగ్రెస్ పార్టీయే అట్లా కట్టుబడి లేదనే సందేహం, కూటమిలో ఒక ముఖ్య భాగస్వామ్య పార్టీకి కలుగుతున్నదంటే మామూలు విషయం కాదు. సీఏఏ గానీ, దాని అమలుకు తదుపరి చర్యగా భావిస్తున్న యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ) గానీ సెక్యులరిజంతో ముడిబడిన అంశాలనే భావన విస్తృతంగా ఉంది. వీటిపై తీవ్రమైన చర్చలు కొన్ని సంవత్సరాలుగా సాగుతున్నాయి. మోదీ ప్రభుత్వం సీఏఏను ఇటీవల అమలుకు కూడా తెచ్చిన దరిమిలా, ప్రస్తుత ఎన్నికలలో అది వివాదంగా మారింది. దానిని తాము అమలుపరచబోమని బెంగాల్, కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు ప్రకటించాయి. కనుక దాని ప్రాముఖ్యత ఎంతో వేరుగా చెప్పనక్కర లేదు. అటువంటి స్థితిలో సీఏఏపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ, వారి ఎన్నికల మేనిఫెస్టో విధానమేమిటో ప్రకటించాలని ఎవరైనా కోరుతారు. కానీ అటునుంచి ఇంతవరకు అంతా మౌనమే. మరొక విశేషం గమనించండి. రాహుల్ గాంధీ ఇటీవల భారత్ జోడో యాత్రలు నిర్వహించారు. దేశంలో బీజేపీ, మోదీ విద్వేషాన్ని వ్యాపింప జేస్తుండగా తాము ప్రేమను సృష్టిస్తున్నామని అడుగడుగునా ప్రకటించారు. మోదీ విద్వేషం ప్రధానంగా అల్పసంఖ్యాక వర్గాలపై అన్నది విమర్శ. ఆ వర్గాల భయం. వారి భయ కారణాలలో ఒకటి సీఏఏ. కానీ రాహుల్ గాంధీ తన యాత్రలో ఒక్కచోటనైనా ఆ ప్రస్తావన చేయలేదు. ఎందుకన్న ప్రశ్నలు చాలా వచ్చాయి. అయినా తను ఎటువంటి వివరణా ఇవ్వలేదు.



ఇవన్నీ గమనించినపుడు కలిగే అభిప్రాయం ఏమిటి? రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కలిపి చూపుతూ వాటి పరిరక్షణ తమ సిద్ధాంతమన్నారు. భారత రాజ్యాంగం సెక్యులరిజాన్ని ప్రవచిస్తున్నది. సమాజంలోని అన్ని వర్గాల పరిరక్షణ ప్రజాస్వామ్యపు మౌలిక లక్షణాలలో ఒకటి. అటువంటప్పుడు, రాహుల్ గాంధీ ఈ విధమైన వైఖరిని తీసుకుంటూ తమ సిద్ధాంతం ఫలానాది అని ప్రకటించటంలో రెండింటికి పొసగేది ఏమైనా ఉందా, లేక అందులో పరస్పర వైరుధ్యం కనిపిస్తుందా? ఇది మర్యాదగా అంటున్న మాట. నిర్మొహమాటంగా అడగాలంటే ఇది కపట నీతి కాదా? ఇది నిస్సందేహంగా కపట నీతే అవుతుంది.

ఎందుకీ కపట నీతి అన్నది తర్వాత ఎదురయ్యే ప్రశ్న. ప్రస్తుత పరిస్థితి గురించి ఒక్క మాటలో చెప్పాలంటే, కాంగ్రెస్ పార్టీ కొంత కాలంగా రెండు పరిస్థితుల మధ్య చిక్కుకుని తనతో తానే యుద్ధం చేసుకుంటున్నది. ఆ పార్టీ ఈ దేశాన్ని, ఈ సమాజాన్ని, వివిధ వర్గాల ప్రజలను తానే చెప్తున్న రాజ్యాంగం ప్రకారం, చట్టాల ప్రకారం, మేనిఫెస్టోల ప్రకారం అభివృద్ధి చేయటంలో అనేక దశాబ్దాల నుంచి విఫలమవుతున్నది. ఆ కారణంగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి, ఓట్లు, సీట్లు, అధికారాలను పోగొట్టుకుంటూ అసలు తన ఉనికి ఏమవుతుందోననే భయానికి గురవుతున్నది. ఆ స్థితి నుంచి బయట పడేందుకు పేదలు, మధ్యతరగతి, రైతులు, కూలీలు, వృత్తిపరులు, బడుగు వర్గాలు, మైనారిటీల ఓట్లు ఆధారమన్నది సంప్రదాయికంగా మొదటినుంచి ఉండిన ఆలోచన. కానీ తన అసమర్థ పాలనవల్ల ఒక్కొక్క వర్గమే దూరమవుతూ రాగా, ఒక దశ వచ్చే సరికి, జనరంజక పాలన ద్వారా ఓట్ల సాధన అనే దృష్టి సహజ మరణం చెందుతూ రాగా, కుల–మత ఆధారిత వ్యూహాలు మొదలయ్యాయి. అందులోనూ పలు కులాలు ఆయా కుల పార్టీలపట్ల ఆకర్షితం కావటం ఒక సమస్యగా మారింది. ఇందిరాగాంధీ సాఫ్ట్ హిందూత్వ ప్రధానంగా జమ్మూ–కశ్మీర్‌కు పరిమితం కాగా, రాజీవ్ గాంధీ కాలం నుంచి అది జాతీయమై పోయింది. ఆ ప్రకారం ఆయన ఏమేమి చేశారన్న వివరాలలోకి ఇక్కడ వెళ్లలేము. ఆయన తర్వాత పీవీ నరసింహారావు కూడా అదే పని చేశారు.

ఇందులో కాంగ్రెస్ పార్టీ తనతో తాను చేసుకుంటున్న యుద్ధం ఏమంటే, పరిపాలనా వైఫల్యాలవల్ల ప్రజాసమూహాలు దూరమై ఎన్నికలలో పరాజయాలు ఎదురవుతుండిన స్థితిలో, కొత్త వ్యూహం ప్రకారం తనకు ఇటు ముస్లిముల ఓట్లు, అటు హిందువుల ఓట్లు కావాలి. అద్వానీ రథయాత్ర, బాబ్రీ మసీదు కూల్చివేతతో ఆరంభించి బీజేపీ వేగంగా బలపడుతుండటంతో కాంగ్రెస్ కూడా ఈ చక్రంలో చిక్కుకుపోయింది. ఆ ప్రకారం అటు హిందువుల కోసం, ఇటు ముస్లిముల కోసం రెండు చేతులా కత్తిసాములు చేసినా, రెండు సాములలోనూ ఓడిపోవటం మొదలైంది. అయితే అందులో ఆశ్చర్యం ఎంతమాత్రం లేదు. ఎందుకన్నది జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయం. హిందువుల విషయంలో ఓడటం పొలిటికల్ సోషియాలజీకి సంబంధించినది. సూటిగా చెప్పాలంటే, హిందూవాదాన్ని 1925 నుంచే చేపట్టిన సంస్థలు, వాటికి వారసులైన బీజేపీ, ఇవన్నీ అందుకు అనుగుణంగా చేపడుతున్న కార్యకలాపాలు నిరంతరం తమ ఎదుట ఉన్న స్థితిలో, హిందూ సమాజం అందుకు కాపీరైట్‌ను బీజేపీకి మాత్రమే ఇస్తుంది. కాంగ్రెస్ సాఫ్ట్ హిందూత్వకు గానీ, అంత కు మించిన మరే వైఖరులకుగానీ విలువ ఉండదు. పోతే, ముస్లిములు కూడా కాలం గడిచేకొద్దీ, కాంగ్రెస్ పార్టీ తమను ఓటుబ్యాంకుగా ఉపయోగించుకోవటం తప్ప, తమ అభివృద్ధికి, భద్రతకు నిజంగా చేసింది చాలా తక్కువనే అభిప్రాయానికి వచ్చారు. దానితో కాంగ్రెస్‌ను తిరస్కరించి ఇతర పార్టీల వైపు చూడటం మొదలైంది. ఆ విధంగా కాంగ్రెస్, తనతో తాను యుద్ధం చేసుకుంటూ ఈ రెండు కత్తిసాములలోనూ ఓడి పోతున్నది.

ఈ రోజున కాంగ్రెస్‌ది ఒక దిక్కుతోచని స్థితి. అందుకే, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ, ముహబ్బత్ కీ దుకాన్ ఖోల్ నా అని యాంత్రికంగా వల్లెవేయటమైతే చేయగలరు గానీ, సీఏఏపై మాట్లాడలేరు, ఆ మాట మేనిఫెస్టోలో పెట్టలేరు. ఎందుకని అడిగేవారిపైనే ఎదురుదాడి చేస్తారు. ఎంతటి దయనీయమైన స్థితి. ఒకప్పటి పాడియావు అయిన సెక్యులరిజం క్రమంగా వట్టిపోయిన ఆవుగా మారుతున్నది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొత్త స్నేహం



ఇండియా కేవలం బ్రహ్మోస్ మాత్రమే ఇవ్వలేదు; మనం దాన్ని మిఠాయిలతో ఇచ్చాం. కాకపోతే దీన్ని చూడటానికి కొందరికి చిరచిరగా ఉండొచ్చు. బ్రహ్మోస్ క్షిపణి అప్పగింత సందర్భంగా ఫిలిప్పీన్స్ నౌకాదళ అధికారులకు భారత అధికారులు మిఠాయిలు ఇచ్చారు.

– స్నేహేశ్ అలెక్స్ ఫిలిప్, జర్నలిస్ట్

బోడిగుండుకు...



నూతనంగా నిర్మితమైన హిందూ దేవాలయమే దుబాయ్ వరదలకు కారణమని ఇస్లామిక్ 'వాతావరణ పరిశోధకులు' చెబుతున్నారు; జీన్సు వేసుకునే మహిళలే భూకంపాలకు కారణమని చెప్పినట్టుగానే ఇదీ ఉంది.

– నైలా ఇనాయత్, పాకిస్తాన్ జర్నలిస్ట్

మనస్తత్వం



మనం అందరం రాహుల్ గాంధీలనే పెంచుతున్నాం. ఈ మధ్యతరగతి పిల్లల పెంపకం అనే అంశంలో 'పోలరైజేషన్' లేదు. మధ్యతరగతి అనేది నరేంద్ర మోదీకి ఓటు వేస్తుంది; ఇంట్లో రాహుల్ గాంధీలను పెంచుతుంది.

– మనూ జోసెఫ్, రచయిత

ఆ కాలమూ వస్తుంది!



తమ ప్రజాస్వామిక హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారని ఒక జాతీయ ఛానెల్‌లో ఒక రిపోర్టర్ నివేదిస్తున్నారు. బహుశా భవిష్యత్‌లో ఆయన మాట నిజం అవుతుంది.

– సుమంత్ రామన్, టీవీ హోస్ట్

అసలు ఇల్లు



మనం చాలావరకు మన జీవితాన్ని మన తలలోనే జీవిస్తాం. కాబట్టి దాన్ని తప్పక మంచి ప్రదేశంగా ఉండేలా చూసుకోండి.

– జోయీతా, ఫిజీషియన్

ఇన్ బాక్స్

ఆదివాసీల హక్కులను పరిరక్షించాలి

భారత రాజ్యాంగం ఆదివాసులకు ప్రత్యేక రక్షణలు కల్పించింది. అటవీ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏ పనులు చేపట్టాలన్నా గ్రామ సభ అనుమతి తప్పనిసరి. కానీ ప్రభుత్వాలు ఈ నిబంధనలను పాటించడం లేదు. అడవుల్లోకి ఆదివాసీయేతరుల చొరబాటును నియంత్రించడం లేదు. పైగా కార్పొరేట్ సంస్థలకు అక్కడి సహజ వనరులను అప్పగిస్తున్నాయి. దీని వల్ల ఆదివాసుల రాజ్యాంగబద్ధ హక్కులకు ప్రమాదం ఏర్పడింది. ప్రభుత్వం తన రాజకీయార్థిక విధానంగా కార్పొరేటీకరణను తీసుకరావడంతో దేశవ్యాప్తంగా ఆదివాసీ ప్రాంతాల్లో తీవ్రమైన ప్రతిఘటన నడుస్తోంది. ఈ ఘర్షణ ఆదివాసీ ప్రాంతాల్లో అనేక రూపాల్లో వ్యక్తమవుతోంది. న్యాయమైన ప్రజా పోరాటాలను అర్థం చేసుకోవాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ దోపిడీకి రక్షణ కల్పించడానికి సిద్ధమయ్యాయి. ఇందులో భాగమే ఈ నెల 16న ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతంలో కేంద్ర భద్రతా బలగాలు 29 మంది మావోయిస్టులను చంపేయడం!

గత ఏడాది మొదటి వారంలో ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఒక పరంపరగా అక్కడ 80 మంది దాకా చంపేశారు. అంతకు ముందు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ అణచివేత వైమానిక దాడుల రూపం తీసుకున్నది. అణచివేతను మరింత ఉధృతం చేయడానికి జనవరి 1 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఆపరేషన్ కగార్' అనే కొత్త యుద్ధ వ్యూహాన్ని అమలు చేస్తున్నవి.

దేశంలోని సహజ వనరులనూ, ప్రజల శ్రమశక్తినీ కొల్లగొట్టే కార్పొరేట్ తరహా అభివృద్ధి విధానం అమానవీయమైనది. దోపిడీ, అసమానతలు, హింస వంటి వాటి మీద కార్పొరేటీకరణ ఆధారపడి ఉంటుంది. ఇది సమాజాన్నేగాక, ప్రకృతినీ సంక్షోభంలో పడేస్తోంది. తీవ్రమైన పర్యావరణ సంక్షోభాన్ని కార్పొరేటీకరణ తీసుకొస్తోంది.

దీనికి వ్యతిరేకంగా దండకారణ్య ప్రాంతంలో మావోయిస్టుల నాయకత్వంలో ఆదివాసులు అనేక పోరాటాలు చేస్తున్నారు. వాళ్లను అణచివేయడం కోసం అక్కడికి లక్షలాది సైనిక బలగాలను తరలించారు. 'మావోయిస్ట్ ముక్త భారత్'గా దేశాన్ని మార్చేసి కార్పొరేట్ల అభివృద్ధిని తీసుకురావాలనే కేంద్ర హోం మంత్రి అమిత్ షా విధానం వల్ల దేశంలో అత్యంత ప్రమాదకరమైన మార్పులు జరగడానికి అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో 'ఆపరేషన్ కగార్'కు వ్యతిరేకంగా, హిందుత్వ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా 'ప్రజా సంఘాల ఐక్య వేదిక' ఏప్రిల్ 20, శనివారం ఒంగోలులోని ప్రెస్ క్లబ్‌లో సదస్సు నిర్వహిస్తోంది. ఇందులో వివిధ ప్రజాసంఘాల, పార్టీల నాయకులూ, రచయితలూ, ప్రజాస్వామిక వాదులూ ప్రసంగిస్తారు.

– ప్రజా సంఘాల ఐక్యవేదిక, ఒంగోలు

కాపీ కొట్టిన మేనిఫెస్టోనే అంతా చెబుతోంది!

అభిప్రాయం



అడుసుమిల్లి జయప్రకాష్

తెలుగు దేశం పార్టీ కోసం పనిచేస్తున్న 'కన్సల్టెన్సీ' హెడ్ రాబిన్ శర్మ ''ఎన్నికల్లో టీడీపీ గెలుపు దుర్లభమనీ, తాము చేసిన ప్రయత్నాలు ఫలించడం లేదనీ, చంద్రబాబుకు ఏమాత్రం విశ్వసనీయత లేక పోవడమే అసలు సమస్య'' అనడం రేపు 'పోలింగ్ బూత్'లో తటస్థ ఓటరుపై గట్టి ప్రభావం చూపిస్తుంది. ఎందుకంటే, ఇది మరొక ప్రత్యర్థి రాజకీయ పార్టీ అంటున్న మాట కాదు. మన కోసం మనం 'ఫీజు' కట్టి పెట్టుకున్న 'సర్వీస్ ప్రొవైడర్' వ్యక్తం చేసిన నిస్సహాయత. ఇది ఎటువంటిది అంటే, మన 'ఫ్యామిలీ డాక్టర్'– ''మీ జబ్బును నేను తగ్గించలేకపోతున్నాను'' అని పెదవి విరవడం వంటిది. వాళ్ళు అటువంటి ముగింపుకు రావడానికి కారణం, ఆరు నెలల క్రితం 'మేనిఫెస్టో'లో నుంచి 'బాబు షూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ' పేరుతో 'సూపర్ సిక్స్' పథకాలు 'ట్రయిల్' కోసం విడుదల చేశారు. ఆ తర్వాత దానికి విస్తృతంగా ప్రచారం చేసినా ప్రజల నుండి స్పందన లేదు.

ఈ 'టీం' ఇటువంటి అభిప్రాయానికి రావడానికి ఇదే ప్రధాన కారణం అయింది. ఈ దశలో 'రిస్క్ మేనేజ్మెంట్' కోసం ప్రశాంత్ కిషోర్ తెరపైకి వచ్చి, తన ప్రకటనకు ముందూ వెనుకా ఎటువంటి వివరణ లేకుండా, 'ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలవదు' అని ఏకవాక్య ప్రకటన చేసి మళ్ళీ ఎక్కడా కనిపించకుండా నిష్క్రమించారు. ఈ ప్రకటన మనం నమ్మడం కోసం ముందుగా – 'ఈ ఎన్నికల్లో నేను టీడీపీ కోసం పనిచేయడం లేదు' అని ప్రకటించాక, 'వైఎస్సార్‌సీపీ గెలవదు' అన్నారు. ఇది జరిగాక కావొచ్చు, చివరి ప్రయత్నంగా ప్రశాంత్ కిషోర్– 'వదలొద్దు మరో ప్రయత్నం చేయండి' అని రాబిన్ శర్మ బృందానికి సూచించారు.

ఇప్పుడు టీడీపీ పూర్తి స్థాయిలో 'మేనిఫెస్టో' వెల్లడించిన తర్వాత కూడా అన్ని 'సర్వే' నివేదికలు జగన్‌కు అనుకూలంగా ఉన్నాయి. సరిగ్గా ఈ కాలంలోనే, చంద్రబాబు తన ప్రసంగాల్లో 'బ్యాలెన్స్' కోల్పోవడం మొదలయింది. సభకు వచ్చినవాళ్లను 'మీ ఊళ్లో గంజాయి దొరుకుతోందా' అని గుచ్చి గుచ్చి అడుగుతూ తనకు అనుకూలమైన సమాధానం పొందేందుకు ఇబ్బంది పెడుతున్నారు. ఎన్నికల్లో రాజకీయ ప్రత్యర్థిని సాధారణంగా శత్రువుగా చూడరు. జగన్ విషయంలో బాబు ఆ హద్దు ఎప్పుడో దాటారు.

ఎప్పుడైనా ఎన్నికల 'నోటిఫికేషన్' అంటే చంద్రబాబుకు ఆయన పార్టీ అభ్యర్థులకు అది 'టెండర్



నోటీస్' వంటిది. అందుకే ఎన్నికల సమయానికి ఆర్థిక నేరస్థులూ, 'ఎన్నారై'లూ అ పార్టీలో అభ్యర్థులుగా ఉంటారు. వీరి వద్ద నుంచి నిధులను సమీకరించి ముందుగా వాటిని తన నేలమాళిగలో దాచి, అప్పుడు తన పార్టీ 'మేనిఫెస్టో' అంటూ బాబు ప్రజల ముందు 'టెండర్' దాఖలు చేస్తారు. గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తే, ఐదేళ్ళ సంపాదన ముందుగా దాచిన దానికి అదనం. ప్రతి ఎన్నికలో బాబుది ఇదే 'ఫార్ములా'. అందుకే, ప్రతిపక్ష నాయకుడిగా బాబు ఎలాగోలా నెట్టుకుంటూ తన పార్టీ ఉనికిని ఎన్నికల వరకు దొర్లించి, చివరిలో ఎవరో కొందరి మద్దతు తీసుకుని; మళ్ళీ తన టోపీని ఎన్నికల 'ఎరీనా'లోకి విసురుతారు. గెలిస్తే, 'డబల్ బెనిఫిట్'; ఓడిపోతే, 'సింగిల్ బెనిఫిట్'. బాబుకు ఎన్నికలు అంటే, ఇంత 'సింపుల్'.

అందుకే గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను తప్పు పట్టిన బాబు, ఎన్నికల ముందు 'సూపర్ సిక్స్' అంటూ అరువు తెచ్చుకున్న అంశాలతో 'కిచిడీ' మేనిఫెస్టో' ప్రకటించారు. అందులోని అంశాలు: టీడీపీ అధికారంలోకి వస్తే 'మహా శక్తి' పథకం ద్వారా ప్రతి కుటుంబంలో 18 ఏళ్లు నిండిన మహిళలకు 'స్త్రీనిధి' కింద నెలకు 1500 రూపాయలు, 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే.. వారందరికీ ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున, 'దీపం' పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్ల సరఫరా చేయడం, స్థానిక బస్సుల్లో మహిళలందరికీ టికెట్టులేని ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు.

జగన్ సంక్షేమ పథకాలను తప్పు పట్టి, మళ్ళీ వాటినే పేర్లు మార్చి అమలుచేస్తాననే ఈ 'యూటర్న్' ఏమిటి? అనే ప్రశ్నకు జవాబు మనం మూడు చోట్ల వెతకాలి. మొదటిది అమరావతి. బాబును నమ్మి అక్కడ భూములు కొన్న 'ఎన్నారై'లకు ఈ ఎన్నికల్లో బాబు గెలుపు అవసరం. అది వారికి జీవన్మరణ సమస్య. అందుకే వాళ్ళు స్వయంగా నెల ముందుగా ఇండియా వచ్చి టీడీపీ కోసం ఇక్కడ ప్రచారం చేసే పనిలో ఉన్నారు. రెండవది – 'మార్గదర్శి' రామోజీరావు భవిష్యత్తు. మూడవది – పై రెండింటి కంటే సంక్లిష్టమైన కొడుకు లోకేష్ చుట్టూ అల్లుకుని ఉన్న కుటుంబ చట్రంలో నుంచి బాబు క్షేమంగా బయటపడటం. బయట నుంచి దీన్ని చూస్తున్న మనకే వీటికి పరిష్కారం ఉందని అనిపించడం లేదు. ఇంకా మనకు తెలియనివి ఎన్ని ఉన్నాయో వాటి సంగతి ఏమిటో... మరో నెల రోజులు కాలం తర్వాత తెలుస్తుంది.

వ్యాసకర్త మాజీ శాసన సభ్యులు
మొబైల్: 98481 28844

నమ్మకమే ప్రాణం

ఆత్మవిశ్వాసం, దేవుడి మీద నమ్మకం అనే రెండూ మానవ జీవితానికి ముఖ్యమైనవి. ఆత్మవిశ్వాసం దేహం లాంటిది. దేవుడి మీది నమ్మకం ప్రాణం వంటిది. చుట్టూ చీకటి అలుముకున్నా ఎదలో మాత్రం నమ్మకమనే వెలుగు ఉండాలి. అది మసక బారకుండా చూసుకోవాలి. ఆత్మవిశ్వాసం లేకుండా పురోగమించడం అసాధ్యం. అయితే ఇక్కడో చిక్కు ఉంది. ఆత్మవిశ్వాసం అహంకారంగా మారకుండా జాగ్రత్త పడాలి. అది గానీ తొంగి చూసిందో అంతే సంగతులు. భగవంతుడిని తెలుసుకోలేని విధంగా ఆత్మను అహంకారం అడ్డుకుంటుందనేది పెద్దల మాట.



ఆత్మవిశ్వాసం కూడా ఒక విధమైన దేవుడి మీది నమ్మకం లాంటిదే. అది అర్థం చేసుకుంటే ప్రపంచాన్ని జయించవచ్చు. 'నాలో ఉన్న జీవశక్తి నన్ను నడిపిస్తోంది. నా మనోశక్తి విజయాన్ని ఇస్తోంది' అనే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. పరాశక్తి ప్రతిరూపాలే జీవశక్తి, మనోశక్తులు. అందుకే ఆత్మవిశ్వాసం కూడా దేవుడిమీది నమ్మకం వంటిదే అనేది. అసలు మనకెదురయ్యే కష్టాలకు కారణం మన కల్పనలూ, కలలూ. నిజానికి మనకూ వాటికీ సంబంధమే ఉండదు. అనవసరమైన చోట అనవసరంగా మనల్ని సమస్యలోకి ప్రవేశింపచేసి మనకు మనమే కష్టాలను కొనితెచ్చుకునేలా అవి భ్రమింపచేస్తాయి. కాస్తంత అప్రమత్తంగా ఉంటే చైతన్యవంతులై ప్రశాంతంగా ఉండొచ్చు.

ఈనాడు తమంతట తాము ధ్యానం చేయలేకుంటే అది అలవరచు కోవడానికి అనేక ధ్యాన కేంద్రాలు ఉండనే ఉన్నాయి. అయితే ఇక్కడ కూడా ఓ చిక్కు లేకపోలేదు. ఏ స్థాయి వరకూ అవి మనకు ఉపయోగపడతాయి అనే విషయంలో స్పష్టత ఉండాలి. మనకు పుండు లేని పక్షంలో మన మీద ఒకరు ఎంత ఉప్పు కుమ్మరించినా మనకేమీ మండదు అనేది నిజం. హృదయాన్ని విశాల పరచుకోవాలి. ప్రాణాయామం చేయాలి. నవ్వుల పువ్వులను పెదవులపై పూయనివ్వాలి. ఒత్తిడిని అధిగమించాలి. ఆత్మవిశ్వాసంతో, దైవంపై నమ్మకంతో జీవిత పయనాన్ని విజయవంతం చేసుకోవాలి.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.ద్వాదశి రా.10.45 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** పుబ్బ ప.2.25 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** రా.10.24 నుండి 12.11 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.44 నుండి 7.23 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.22 నుండి 9.07 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.45, **సూర్యాస్తమయం:** 6.12.

సింహ వాహనంపై సీతాపతి

- నేడు నవనీతకృష్ణాలంకారం, హనుమంత వాహనంపై ఊరేగింపు



ఒంటిమిట్ట/తిరుమల: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా టీటీడీ వారు నిర్వహిస్తున్నారు. మూడో రోజు శుక్రవారం వటపత్రశాయి అలంకారంలో కోదండ రాముడు భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, కోలాటాల నడుమ రాముల వారి గ్రామోత్సవం సాగింది. రాత్రి సింహ వాహనంపై రాములోరు భక్త జనానికి అభయమిచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఒంటిమిట్టకు 1.20 లక్షల తిరుమల లడ్డూలు

వైఎస్సార్ జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసే భక్తులకు అందించేందుకు 1.20 లక్షల తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలు సిద్ధమయ్యాయి. తిరుమలలోని శ్రీవారి సేవా సదన్-1లో లడ్డూల ప్యాకింగ్‌ను శుక్రవారం నిర్వహించారు. శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 22వ తేదీ జరిగే శ్రీసీతారాముల కల్యాణంలో పాల్గొనే భక్తులకు ఈ లడ్డూలను ప్రసాదంగా అందజేయనున్నారు.

వైభవంగా అప్పన్న వార్షిక కల్యాణోత్సవం

- దర్శించుకున్న శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



సింహాచలం: విశాఖ జిల్లా సింహాచలంలో వెలసిన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం సింహగిరిపై నృసింహ మండపంలో ఏర్పాటు చేసిన భారీ వేదికపై శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేప చేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులకు స్వామివారి ముత్యాల తలంబ్రాలు, ప్రసాదం అందజేశారు. అంతకుముందు సింహగిరి మాడ వీధుల్లో స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామిని విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, విశాఖనగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

టీడీపీ దాడిలో గాయపడిన వెంకటరెడ్డి కన్నుమూత

తొలుత బ్రెయిన్ డెడ్.. తరువాత మృతి | శోకసముద్రంలో వెంకటరెడ్డి కుటుంబసభ్యులు | బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ అయోధ్యరామిరెడ్డి



వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



వెంకటరెడ్డి (ఫైల్)

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, జేసీఎస్ కన్వీనర్ మేకా వెంకటరెడ్డి కన్నుమూశారు. తొలుత ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, బ్రెయిన్ డెడ్ అయిందని మణిపాల్ వైద్యులు శుక్రవారం తెలిపారు. ఆయన వెంటిలేటర్‌పై ఉన్నారని పేర్కొన్నారు. వెంకటరెడ్డి కన్నుమూసినట్లు శుక్రవారం రాత్రి 10.30 గంటలకు ప్రకటించారు. ఈ వార్త తెలియడంతో వెంకటరెడ్డి భార్య సునీత, కుమార్తె, కుమారుడు, కుటుంబసభ్యులు ఆస్పత్రి వద్దే కుప్పకూలారు. తమకు దిక్కెవరంటూ సునీత కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తాడేపల్లి రూరల్ మండలం కుంచనపల్లిలో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వర్గీయులను టీడీపీకి చెందినవారు దుర్భాషలాడటమేగాక ద్విచక్ర వాహనాలతో ఢీకొట్టిన విషయం తెలిసిందే. కిందపడిపోయి తలకు తీవ్రగాయమైన మేకా వెంకటరెడ్డి తొలుత బ్రెయిన్ డెడ్ అయ్యారు. చికిత్స చేసినా ఫలితం లేకపోయింది.

పార్టీ అండగా ఉంటుందన్న ఎంపీ ఆళ్ల

అంతకుముందు చికిత్స పొందుతున్న మేకా వెంకటరెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి శుక్రవారం మణిపాల్ ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వెంకటరెడ్డికి బ్రెయిన్ డెడ్ అయిందని వైద్యులు తెలపడంతో ఎంత ఖర్చయినా ఆయనకు వైద్యం చేయాలని ఎంపీ సూచించారు. వెంకటరెడ్డి భార్య సునీత, కుమారుడు హేమంత్, కుమార్తెలను పరామర్శించారు. ఆ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా జేసీఎస్ కో-ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, పార్టీ నాయకులు రాజారెడ్డి, భూపతి కిషోర్ నాయుడు తదితరులు ఆస్పత్రికి వెళ్లారు.

పోలీసుల అదుపులో నిందితులు

కుంచనపల్లిలో గురువారం రాత్రి ఈ దాడులకు తెగబడిన నిందితులు టీడీపీ తాడేపల్లి పట్టణ కార్యాలయంలో తలదాచుకున్నట్లు తెలిసింది. వెంకటరెడ్డి చికిత్స పొందుతున్న ఆస్పత్రి వద్ద పరిస్థితిని గమనించేందుకు శుక్రవారం తెల్లవారుజామున మహానాడుకు చెందిన ఓ మాజీ రౌడీషీటర్ తన కొడుకైన రౌడీషీటర్‌ను, కొందరు యువకులను తీసుకుని వచ్చారు. ఇదే క్రమంలో వెంకటరెడ్డిని ఢీకొట్టిన ద్విచక్ర వాహనంపై అక్కడికి వచ్చారు. ఆ వాహనంపైన వెనుక కూర్చున్న ప్రకాశం జిల్లా పొదిలి మండలం బచ్చలకుర్రపాడుకు చెందిన యువకుడు, ప్రస్తుతం మహానాడులో నివాసముంటున్న మాదల గురువర్ధన్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గుర్తుపట్టారు. ఆ వాహనాన్ని, గురువర్ధన్‌ను పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. గురువర్ధన్‌ను, ద్విచక్ర వాహనాన్ని పట్టుకున్నారని తెలియడంతో దాడిలో పాల్గొన్న యువకుల తల్లిదండ్రులతో టీడీపీ నాయకులు పార్టీ కార్యాలయంలో మంతనాలు జరిపారు. పోలీసుల నుంచి ఒత్తిడి రావడంతో వెంకటరెడ్డిని ద్విచక్ర వాహనంతో ఢీకొట్టిన బొమ్మలబోయిన ఈశ్వర్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. తరువాత తమ అనుకూల మీడియాలో వైఎస్సార్‌సీపీకి, వెంకటరెడ్డికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టారు. వారు తమ కార్యకర్తలే కాదంటూనే.. ద్విచక్ర వాహనంపై వేగంగా వెళుతున్న వారిని వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారని, బైక్ బ్రేక్ ఫెయిలవడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రచారం చేయసాగారు. వెంకటరెడ్డిని వెనుక నుంచి బైక్‌తో ఢీ కొట్టడంతో ఈ ఘటన జరిగిందని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు.

15న భీమవరంలో అతిరాత్ర మహోత్కృష్ట సోమయాగం

- డీఎన్ఆర్ కళాశాల గ్రౌండ్స్‌లో 25వ తేదీ వరకు నిర్వహణ
- సేవ్ టెంపుల్స్ భారత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్

సాక్షి, అమరావతి: భీమవరంలో మే 15 నుంచి 25వ తేదీ వరకు అతిరాత్ర మహోత్కృష్ట సోమయాగం, రాజ శ్యామల, పుత్ర కామేష్ఠి, దశమహా విద్యా సహిత అతిరాత్ర మహాయగం నిర్వహిస్తున్నట్లు సేవ్ టెంపుల్స్ భారత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నెలమూరు ఉమారామలింగేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ జంధ్యాల శ్రీనివాస్ సుబ్రహ్మణ్య శర్మ పర్యవేక్షణలో భీమవరం పట్టణంలోని డి.ఎన్.ఆర్. కళాశాల గ్రౌండ్స్‌లో నిర్వహించే ఈ కార్యక్రమాలకు పీఠాధిపతులు, మహా సాధువులు, ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ దారుణ హత్య

అల్లూరి జిల్లా కన్నాయిగూడెంలో ఘటన • పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు



రక్తపుమడుగులో వర్సా బాలకృష్ణ మృతదేహం (ఇన్‌సెట్)లో బాలకృష్ణ (ఫైల్)

ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలోని వైఎస్సార్‌సీపీకి చెందిన కన్నాయిగూడెం ఎంపీటీసీ సభ్యుడు వర్సా బాలకృష్ణ(40) దారుణ హత్యకు గురయ్యారు. మట్టి, ఇసుక అక్రమ వ్యాపారాలకు అడ్డుగా ఉన్నాడనే బాలకృష్ణను ప్రత్యర్థులు గురువారం రాత్రి హత్య చేసినట్లు తెలుస్తోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కన్నాయిగూడెంలోనే ఓ వివాహానికి వెళ్లిన బాలకృష్ణకు అదే గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు దారపునేని రమేష్ ఫోన్ చేసి, తాను గ్రామ శివారులో ఉన్నానని.. అక్కడికి వస్తే మాట్లాడుకుందామని పిలిచాడు. బాలకృష్ణ తన తోపాటు మరో ఇద్దరు యువకులను తీసుకుని ఆటోలో రమేష్ ఉన్న ప్రదేశానికి వెళ్లాడు. అక్కడకి వెళ్లిన వెంటనే రమేష్, అతని స్నేహితుడు సాయిరామ్ కలిసి బాలకృష్ణపై దాడి చేశారు. కిందపడిపోయిన బాలకృష్ణ తలపై పెద్ద బండరాయిపడేశారు. దీంతో తల నుజ్జునుజ్జయి అతను అక్కడికక్కడే మృతిచెందాడు. బాలకృష్ణ వెంట వెళ్లిన ఇద్దరు యువకులు భయంతో పారిపోయారు. గ్రామంలో మట్టి, ఇసుక వ్యాపారాలకు బాలకృష్ణ అడ్డు వస్తున్నాడనే కారణంతో రెండేళ్లుగా రమేష్ అతనితో గొడవపడుతున్నాడు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత కక్షతోనే బాలకృష్ణను రమేష్ హత్య చేసి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలకృష్ణ మృతదేహం వద్ద ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి నివాళులర్పించారు. ఈ హత్య వెనుక కూటమి నేతల కుట్ర ఉందని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి వారిపై కూడా కేసులు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామంలోని ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. కాగా, గిరిజనేతరుడైన రమేష్‌పై ఎటపాక, తెలంగాణలోని భద్రాచలం పోలీస్‌స్టేషన్లలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు కూడా ఉన్నాయి.

పోలీసులపై టీడీపీ మూకల రాళ్లదాడి

- ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్‌కు గాయం
- టీడీపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు సందర్భంగా రెచ్చిపోయిన కార్యకర్తలు



ట్రైనీ డీఎస్పీ నుదుటిపై అయిన గాయం



టీడీపీ కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు

బి.కొత్తకోట/తంబళ్లపల్లె: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో టీడీపీ వర్గీయులు పోలీసులపై రాళ్లదాడి చేశారు. ఈ దాడిలో ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్ గాయపడ్డారు. తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి నామినేషన్ దాఖలు చేసేందుకు తంబళ్లపల్లె తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. పోలీసులు శాంతిభద్రతల దృష్ట్యా కార్యాలయం గేటు నుంచి వందమీటర్ల దూరంలో ములకల చెరువు రోడ్డుపై బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. నిబంధనల మేరకు నామినేషన్ దాఖలు చేసే వ్యక్తిని, మరో నలుగురిని మాత్రమే లోపలికి అనుమతించారు. అభ్యర్థి సతీమణి కల్పన తాను కూడా నామినేషన్ దాఖలు చేస్తున్నానని చెప్పడంతో ఆమెతోపాటు మరో నలుగురిని కూడా లోపలికి పంపారు. వీరితోపాటు లోపలికి వెళ్లేందుకు టీడీపీ వర్గీయులు ఒక్కసారిగా దూసుకొచ్చారు. పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో కొందరు టీడీపీ కార్యకర్తలు పోలీసులకు, వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఒక్కసారిగా పోలీసులపై రాళ్లదాడి చేశారు. ఈ దాడిలో శిక్షణలో ఉన్న డీఎస్పీ ప్రశాంత్ ఎడమకంటి పైభాగంలో రక్తగాయం అయింది. అయినా పోలీసులు సంయమనం పాటించి కఠినచర్యలకు వెళ్లకుండా టీడీపీ కార్యకర్తలను చెదరగొట్టారు. దీంతో కొంతసేపు తంబళ్లపల్లెలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ప్రణాళిక ప్రకారమే దాడి

ప్రణాళిక ప్రకారమే టీడీపీ కార్యకర్తలు తంబళ్లపల్లెలో పోలీసులపై రాళ్లదాడి చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జయచంద్రారెడ్డి అభ్యర్థిత్వాన్ని మారుస్తున్నట్టు అధిష్టానం సంకేతాలు ఇచ్చిందని, ఈ నేపథ్యంలో ఎలాగైనా గొడవకు దిగి ఆ గండం నుంచి గట్టెక్కాలని వారు ఈ దాడికి దిగినట్లు తెలిసింది. పోలీసులపై రాళ్లదాడిని సీరియస్‌గా పరిగణిస్తున్నట్టు మదనపల్లి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి చెప్పారు. రాళ్లదాడి చేస్తున్న సమయంలో వీడియోలు, ఫొటోలు పరిశీలిస్తున్నామని, నిందితులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టీడీపీ నామినేషన్లలో ప్రవహించిన మద్యం

మద్యం తాగి మృతి చెందిన భూషయ్య

యర్రగొండపాలెం: ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో శుక్రవారం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా మద్యం ఏరులై పారింది. ఈ మద్యంతాగి పుల్లలచెరువు మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన కందుల చిన్న భూషయ్య (35) మృతిచెందాడు. చిన్న భూషయ్య పలువురితో కలిసి టాటా మ్యాజిక్ వాహనంలోనే మద్యం తాగి యర్రగొండపాలెం వచ్చాడు. అందరూ ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్తున్నా భూషయ్య వాహనంలోనే పడిపోయాడు. అందరూ మద్యం మత్తులోనే ఉండటంతో అతడి పరిస్థితి గమనించలేకపోయారు. మద్యం ఎక్కువగా తాగడం, గొంతు తడారిపోయినా నీళ్లు ఇచ్చేవారు లేకపోవడంతో భూషయ్య వాహనంలోనే ప్రాణాలు కోల్పోయాడు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన తరువాత తిరుగు ప్రయాణంలో మిగిలినవారు అతడి పరిస్థితి గమనించి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. అప్పటికే భూషయ్య మృతిచెందాడని వైద్యులు తెలిపారు. భూషయ్యకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అభ్యర్థి ఎరిక్షన్‌బాబు ఆస్పత్రికి వెళ్లి భూషయ్య కుటుంబసభ్యుల్ని పరామర్శించారు.

బెదిరించి, కవ్వించి.. వైఎస్సార్‌సీపీ కుటుంబంపై టీడీపీ దాడి

- ఐదుగురికి గాయాలు
- మురుగుకాలువలో పడేసి కొట్టిన వైనం
- మహిళ వేలు కొరికిన టీడీపీ వర్గీయుడు







ఆస్పత్రిలో గడ్డం కిషోర్, అతని భార్య హెమీమా (ఇన్‌సెట్) వేలుకు అయిన గాయం



టీడీపీ వర్గీయుల దాడిలో ఎస్తేరమ్మ నుదుటిపై అయిన గాయం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: టీడీపీలో చేరతారా లేక కుల, గ్రామ బహిష్కరణ చేయమంటారా అని బెదిరించినా, భయపెట్టినా లొంగలేదని ఒక కుటుంబంపై టీడీపీ వర్గీయులు దాడిచేసి ఐదుగురిని గాయపరిచారు. ప్రకాశం జిల్లా కొండపి మండలం మిట్టపాలెం ఎస్సీ కాలనీలో గురువారం రాత్రి టీడీపీ వర్గీయులు ఈ దారుణానికి దిగారు. బాధితుల కథనం ప్రకారం వైజాగ్‌లో ఉద్యోగం చేసుకునే ఈ కాలనీ వాసి గడ్డం కిషోర్ ఇటీవల ఇంటికి వచ్చాడు. వీరి కుటుంబాన్ని టీడీపీలో చేరాలని అదే కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు ఐనంపూడి రమేష్ 2019 నుంచి డిమాండ్ చేస్తున్నాడు. ఆయన భయపెట్టినా, బెదిరించినా కిషోర్ కుటుంబం వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో కిషోర్ తన ఇంటి గేటు వద్ద ఉండగా ఆ కాలనీకి చెందిన గడ్డం మధు అనే యువకుడు సిమెంటు రాయి తెచ్చి కిషోర్ ఇంటి తడికపైకి విసిరాడు. రాయి ఎందుకు విసిరావంటూ కిషోర్ కేకలు వేశాడు. తరువాత 11.40 గంటలకు టీడీపీ నాయకుడు ఐనంపూడి రమేష్ సుమారు 15 మందిని తీసుకొచ్చి కేకలు వేశాడు. బయటకు వచ్చిన కిషోర్ కుటుంబసభ్యులపై దాడిచేశారు. కిషోర్ భార్య హెమీమాను జుట్టు పట్టుకుని లాగటంతోపాటు ఆమె చేతివేలిని గడ్డం వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కొరికి గాయపరిచాడు. కిషోర్ అక్క దాసరి ఎస్తేరమ్మ, తల్లి గడ్డం కొండమ్మ, బావ నాగరాజుపైన దాడిచేసి గాయపరిచారు. కిషోర్‌ను మురుగు కాలువలో పడేసి పొడవాటి వస్తువుతో కొట్టి గాయపరిచారు. ఆ ప్రాంతంలో వీధిలైట్లను కూడా ఆపేసి ఈ దాడికి దిగారు. ఈ దాడిని చిత్రీకరించేందుకు ప్రయత్నించిన కిషోర్ మేనకోడలు దాసరి ప్రవల్లిక సెల్‌ఫోన్ లాక్కుని ధ్వంసం చేశారు. బాధితులకు కొండపి ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. ఐనంపూడి రమేష్, గడ్డం వెంకటేశ్వర్లు, లక్కిపోగు సుధాకర్, ఐనంపూడి భాస్కర్, గడ్డం మధు, గడ్డం మరియమ్మ, గడ్డం నిర్మల, గడ్డం ఆకాష్, మరికొందరు తమపై దాడిచేసినట్లు కిషోర్ చెప్పారు. ఇరువర్గాలకు గాయాలయ్యాయని, రెండువర్గాలపై కేసులు నమోదు చేస్తామని ఎస్.ఐ. కృష్ణబాజిబాబు చెప్పారు. దాడికి గురైనవారి మీద కూడా కేసు పెడతామని ఎస్.ఐ. పోలీసులు చెప్పడంతో వైఎస్సార్‌సీపీ వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



దేవినేని గౌతం ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారితో మంత్రి జోగి రమేశ్



ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



టీడీపీ, జనసేన నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పీవీఎల్

పెనమలూరు/నరసాపురం/మండవల్లి/కాళ్ల: కృష్ణా జిల్లా పెనమలూరు మండలానికి చెందిన నేతలు దేవినేని గౌతం, దేవినేని స్మిత ఆధ్వర్యంలో తాడిగడప మునిసిపాలిటీ యనమలకుదురుకు చెందిన పలువురు నేతలు టీడీపీని వీడి మంత్రి జోగి రమేశ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం 28వ వార్డుకు చెందిన 50 మంది యువకులు టీడీపీ, జనసేనలను వీడి పార్టీ జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు చదలవాడ మెర్లిన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో పార్టీలో చేరారు. అలాగే పుట్లచెరువు గ్రామానికి చెందిన 200 మంది టీడీపీ నాయకులు ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, బలగం జగన్నాథం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు సమక్షంలో మందపాడు గ్రామానికి చెందిన 50 మంది టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు.

ఏటీఎల్ వినియోగంలో ఏపీ ముందంజ

యునిసెఫ్, టీసీఎస్ బృందాల ప్రశంస



పెనమలూరు జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించిన యునిసెఫ్, టీసీఎస్ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా 'అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ఏటీఎల్)' సద్వినియోగం చేసుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని యునిసెఫ్, టీసీఎస్ ప్రతినిధులు ప్రశంసించారు. శుక్రవారం న్యూఢిల్లీ, హైదరాబాద్ నుంచి వచ్చిన యునిసెఫ్, టీసీఎస్ ప్రతినిధులు ఎన్టీఆర్ జిల్లాలో మొవ్వ, పెనమలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. దీన్లోభాగంగా అటల్ టింకరింగ్ ల్యాబ్స్, హబ్, స్పోక్స్ మోడల్‌తో పాటు ప్రభుత్వం అమలు చేసిన స్టెమ్ ఆధారిత కార్యక్రమాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విజయవాడలో పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేష్ కుమార్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 713 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను హబ్, స్పోక్ మోడల్‌గా రూపొందించామన్నారు. విద్యార్థులను సాంకేతికత విజ్ఞానం వైపు ప్రోత్సహించడానికి 'సంకల్పం' ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నామన్నారు. అటల్ టింకరింగ్ మారథాన్, సీడ్ ది ఫ్యూచర్, సైన్స్ ఫెయిర్, ఇన్‌స్పైర్ తదితర పోటీల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపుతున్నారన్నారు. ఇలాంటి సమయంలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ పనితీరుపై యునిసెఫ్ డాక్యుమెంటరీ రూపొందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ నుంచి వచ్చిన యునిసెఫ్ ప్రతినిధులు అరేలియా ఆర్డిటో (చీఫ్ ఆఫ్ ఎడ్యుకేషన్), ప్రమీల (విద్యా నిపుణురాలు), హైదరాబాదు నుంచి శేషగిరి మధుసూదన్ (విద్యా నిపుణులు), శిఖా రాణా (విద్యాధికారి), టీసీఎస్ నుంచి విమల్, విపుల్, శ్రీనివాస్ విశ్వనాథ, ఏపీ యునిసెఫ్ కన్సల్టెంట్ టి.సుదర్శన్, రాష్ట్ర నోడల్ అధికారి డా.జీఆర్ భాగ్యశ్రీ, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్ రెడ్డి తదితరులున్నారు.

సుజనా.. ముందు బ్యాంక్‌కు కట్టాల్సిన డబ్బు కట్టి రా..

విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని నాని



భవానీపురం (విజయవాడపశ్చిమ): బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టిన సుజనాచౌదరి పశ్చిమ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా ప్రజలకు ఏదో చేస్తానంటే ప్రజలు ఎలా నమ్ముతారని విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) ప్రశ్నించారు. ముందు బ్యాంకులకు ఎగ్గొట్టిన డబ్బు కట్టి రా.. ఆ తరువాత పశ్చిమ అభివృద్ధి సంగతి చూడవచ్చని సుజనా చౌదరికి హితవు పలికారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ భవానీపురంలోని తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేశారు. ఆయన వెంట ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఉన్నారు. అనంతరం కేశినేని నాని మీడియాతో మాట్లాడుతూ ఆసిఫ్ నిత్యం ప్రజల మధ్య ఉండే మనిషి కాబట్టి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతూ ర్యాలీలో పాల్గొన్నారని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గం అంటే వైఎస్సార్ సీపీ అడ్డా అని, ఇప్పటి వరకు పశ్చిమ ముఖం చూడని సుజనా చౌదరి ఇప్పుడు వచ్చి పిట్టల దొరలా ఏదేదో చెబుతున్నాడని పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఎద్దేవా చేశారు. సీఎం జగనన్న ప్రభుత్వంలో సుమారు రూ.450 కోట్లతో అభివృద్ధి, రూ.850 కోట్ల మేర సంక్షేమ పథకాలు అందించామని ఆసిఫ్ స్పష్టం చేశారు. విభిన్న మతాలు, కులాలు ఉన్న పశ్చిమంలో మతోన్మాదులను తరిమి కొట్టడానికి పశ్చిమ ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.


దుమ్మురేపుతున్న సోషల్ మీడియా


ఎన్నికల్లో నెట్టింట పార్టీల హోరాహోరీ

- ఎక్స్, యూట్యూబ్, ఇన్‌స్టాల్లో బీజేపీ, మోదీ హవా
- నయా యూజర్లను పెంచుకుంటున్న రాహుల్, కేజ్రీవాల్
- ఇన్‌స్టా, యూట్యూబ్‌లో ఆప్, కాంగ్రెస్‌కు భారీగా లైకులు

కుక్కపిల్ల.. అగ్గిపుల్ల.. సబ్బుబిళ్ల.. కాదేదీ సోషల్ మీడియా ప్రచారానికనర్హం! జనాలంతా ఆ స్థాయిలో 'సోషల్' జీవులుగా మారిపోయారు. అందుకే ఎన్నికల పోరులో పార్టీలు కూడా సోషల్ మీడియానే ఎక్కువగా నమ్ముకుంటున్నాయి. ప్రజల మూడ్‌తో పాటు క్షేత్రస్థాయిలో ఓటర్ల నాడిని పసిగట్టేందుకు 'లైక్ చేయండి.. షేర్ చేయండి.. సబ్‌స్క్రయిబ్ చేసుకోండి' అంటూ నెట్టింట్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఎడాపెడా యాడ్‌లు కుమ్మరిస్తూ డిజిటల్ ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. పలు పార్టీలు లోక్‌సభ ఎన్నికల సీజన్‌లో సామాజిక మాధ్యమాలను షేక్ చేస్తున్నాయి..!

- సాక్షి, నేషనల్ డెస్క్





పదేళ్లుగా దేశాన్నేలుతున్న బీజేపీయే సోషల్ మీడియాలోనూ రాజ్యమేలుతోంది. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లో కొత్త యూజర్లను ఆకట్టుకోవడంలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ముందున్నాయి. ప్రస్తుత లోక్‌సభలో మూడో అతి పెద్ద పార్టీ అయిన తృణమూల్ కాంగ్రెస్‌కు పెద్దగా సోషల్ ప్రాతినిధ్యం లేకపోవడం విశేషం. నేతల విషయానికొస్తే ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయ ప్రత్యర్థులెవరికీ అందనంత ఎత్తులో మూడు లైక్‌లు.. ఆరు షేర్‌లు అన్నట్టుగా 'సోషల్' జర్నీలో దూసుకుపోతున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు పార్టీలు, నేతల సోషల్ మీడియా పేజీలు/ఖాతాల్లో యూజర్ల సంఖ్య పెరుగుదల, డిజిటల్ యాడ్ వ్యయాలు తదితరాలను 'సోషల్ బ్లేడ్' అనే ఎనలిటిక్స్ సంస్థ విశ్లేషించింది. అందులో పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి.

'ఎక్స్' ఫ్యాక్టర్!

సోషల్ సైట్ 'ఎక్స్' (గతంలో ట్విటర్)లో ప్రతి పార్టీ నిలకడగా యూజర్లను పెంచుకుంటూ వస్తోంది. బీజేపీ ఎక్స్ ఖాతాకు గత మూడు నెల్లలో 4 లక్షల పైచిలుకు యూజర్లు జై కొట్టారు. కాంగ్రెస్ 2.37 లక్షల కొత్త ఫాలోవర్లను సాధించింది. ఆప్‌కు 12,000 మంది నయా యూజర్లు దక్కారు. టీఎంసీని కొత్తగా ఫాలో అయిన వారి సంఖ్య 9,800. మైక్రో బ్లాగింగ్‌కు కీలక వేదికగా నిలుస్తున్న ఈ సోషల్ వేదికలో బీజేపీకి ఏకంగా 2.18 కోట్ల ఫాలోవర్లున్నారు! కాంగ్రెస్‌ను 1.04 కోట్లు, ఆప్‌ను 65 లక్షల ఎక్స్ యూజర్లు ఫాలో అవుతున్నారు. టీఎంసీ మాత్రం 6.9 లక్షలతో వెనకబడి ఉంది.

యూట్యూబ్‌లో 'ఆప్' షో

పార్టీల ప్రసంగాలు, ప్రచార వీడియోలు, మీడియా సమావేశాలకు కీలక వేదికగా నిలుస్తున్న యూట్యూబ్‌లో ఆప్ 'చీపురు' తిరగేస్తోంది. కొత్త సబ్‌స్క్రయిబర్లను పెంచుకోవడంలో ఆప్‌తో పాటు కాంగ్రెస్ కూడా ముందుండగా బీజేపీకి మాత్రం క్రమంగా తగ్గుముఖం పట్టారు. గత మూడు నెలల్లో కేజ్రీవాల్ పార్టీ ఏకంగా 5.9 లక్షల కొత్త యూజర్లను దక్కించుకుంది. లిక్కర్ స్కాం ఆరోపణలతో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేయడం తెలిసిందే. ఒక్క మార్చిలోనే ఆప్ యూట్యూబ్ చానల్‌ను ఏకంగా 3.6 లక్షల మంది సబ్‌స్క్రయిబ్ చేసుకున్నారు! బీజేపీ మాత్రం జనవరిలో 3 లక్షలకు పైగా కొత్త యూజర్లు జతయినా ఫిబ్రవరి, మార్చిల్లో భారీగా తగ్గారు. మొత్తమ్మీద 3 నెలల్లో బీజేపీ చానల్‌కు 5.3 లక్షలు, కాంగ్రెస్‌క 5 లక్షల మంది కొత్త యూజర్లు చేరారు. టీఎంసీ 28,000 మంది యూజర్లను సంపాదించింది. అయితే బీజేపీ వీడియోలను చూస్తున్న వారి సంఖ్య మాత్రం భారీగా పెరిగింది. జనవరి–మార్చి మధ్య ఏకంగా 43.2 కోట్ల వీక్షణలు దక్కాయి. తర్వాతి స్థానంలో ఆప్ (30.78 కోట్లు), కాంగ్రెస్ (16.69 కోట్లు), టీఎంసీ (93 లక్షలు) ఉన్నాయి. 59.9 లక్షల సబ్‌స్క్రయిబర్లు, 10 వేలకు పైగా వీడియోలతో యూట్యూబ్‌ను ఆప్ ఊడ్చేస్తోంది. బీజేపీ యూట్యూబ్ చానల్ 58.2 లక్షల సబ్‌స్క్రయిబర్లు, 41 వేల వీడియోలతో 'టాప్' లేపుతోంది. కాంగ్రెస్‌కు 44.8 లక్షలు, తృణమూల్‌ను 5.91 లక్షల మంది సబ్‌స్క్రయిబ్ చేసుకున్నారు.

ఎదురులేని మోదీ...

సోషల్ మీడియా వేదికేదైనా దేశంలోనే గాక ప్రపంచంలోనే తిరుగులేని నాయకునిగా మోదీ దుమ్మురేపుతున్నారు. భారత్‌లో ఏ నాయకుడూ ఆయన దరిదాపుల్లో కూడా లేరు! గత మూడు నెలల్లో మోదీ 'ఎక్స్' యూజర్ల సంఖ్య 26 లక్షలు పెరిగి 9.73 కోట్లకు చేరింది. కేజ్రీవాల్‌ను ఫాలో అవుతున్న వారి సంఖ్య లక్ష పెరిగి 2.74 కోట్లుగా ఉంది. రాహుల్‌గాంధీకి కొత్తగా 5 లక్షల మంది జతయ్యారు. ఆయన యూజర్ల సంఖ్య 2.54 కోట్లకు పెరిగింది. తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీకి స్వల్పంగా 52,000 మంది యూజర్లు దక్కారు. ఎక్స్‌లో ఆమెను 74 లక్షల మంది ఫాలో అవుతున్నారు. ఇక ఎక్స్‌లో అత్యంత యాక్టివ్‌గా ఉండే రాజకీయవేత్తగా కూడా మోదీ నిలుస్తున్నారు. గత మూడు నెలల్లో మోదీ 1,367 పోస్టులు పబ్లిష్ చేశారు. కేజ్రీవాల్ 270, రాహుల్ 187 పోస్టులతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఇన్‌స్టాలోనూ మోదీకి ఏకంగా 8.85 కోట్ల మంది ఫాలోవర్లున్నారు. అందులో గత మూణ్నెల్లలోనే 52 లక్షల మంది మోదీని కొత్తగా ఫాలో కావడం జెన్ జెడ్‌లోనూ ఆయన క్రేజ్‌కు అద్దం పడుతోంది. ఇన్‌స్టాలో రాహుల్‌కు 68 లక్షలు, కేజ్రీవాల్‌కు 22 లక్షలు, మమతాకు కేవలం 3.84 లక్షల ఫాలోవర్లు మాత్రమే ఉన్నారు! ఇక యూట్యూబ్‌లోనూ మోదీదే హవా! 2.29 కోట్ల మంది సబ్‌స్క్రయిబర్లు ఆయన సొంతం. రాహుల్ (44.7 లక్షలు), కేజ్రీవాల్ (7.58 లక్షలు) మోదీకి ఆమడ దూరంలో ఉన్నారు. గత మూడు నెలల్లో మోదీ చానల్లో పబ్లిషైన వీడియోలకు అత్యధికంగా 47.7 కోట్ల వ్యూస్ దక్కాయి! ఇది రాహుల్, కేజ్రీవాల్ వీడియోల కంటే రెట్టింపు కావడం విశేషం.

ఇన్‌స్టా.. జెన్-జెడ్ ఓటర్ల 'డెన్'

ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్.. స్టోరీస్.. పోస్టులు.. లైవ్ వీడియోలతో చెలరేగిపోతున్న నవతరం యువత (జెనరేషన్ జెడ్)కు చేరువయ్యేందుకు పార్టీలూ పోటీ పడుతున్నాయి. ముఖ్యంగా తొలిసారి ఓటేయనున్న యూత్‌కు అడ్డగా మారిన ఈ సోషల్ వేదికపై మరింతగా ఫోకస్ చేస్తున్నాయి. తాజా డేటా ప్రకారం మెటా ప్లాట్‌ఫాంలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్‌ల్లో బీజేపీ, కాంగ్రెస్ గత నాలుగు నెలల్లో చేసిన యాడ్ వ్యయాల్లో సింహభాగం ఇన్‌స్టాపైనే వెచ్చించడం దీని ప్రాధాన్యానికి నిదర్శనం. గత మూడు నెలల్లో ఈ ప్లాట్‌ఫాంలో కాంగ్రెస్ 13.2 లక్షల మంది ఫాలోవర్లను పెంచుకోగా బీజేపీ (8.5 లక్షలు), ఆప్ (2.3 లక్షల)తో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. టీఎంసీకి 6,000 మంది కొత్త యూజర్లు దక్కారు. మొత్తం ఫాలోవర్ల విషయానికొస్తే, బీజేపీకి 76 లక్షలు, కాంగ్రెస్‌కు 43 లక్షలు, ఆప్‌కు 12 లక్షలు, తృణమూల్‌కు కేవలం 1.1 లక్షల మంది ఉన్నారు.



ఇజ్రాయెల్ ప్రతీకార దాడి

దుబాయ్: ప్రతీకార దాడితో పశ్చిమాసియా మళ్లీ భగ్గున మండింది. తమ భూభాగంపై ఇరాన్ దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇప్పటికే ప్రకటించిన ఇజ్రాయెల్ అనుకున్నంత పని చేసి చూపించింది. తమ డ్రోన్‌లను రంగంలోకి దింపింది. అమెరికా తయారీ ఎఫ్–14 టామ్‌క్యాట్స్ యుద్ధవిమానాలు ఉన్న ఇరాన్‌లోని ఇస్ఫహాన్ సిటీ వైమానిక స్థావరం, అణు కార్యక్రమాల ప్రాంతం వద్ద శుక్రవారం ఉదయం భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. అయితే ఇస్ఫహాన్ నగర గగనతలంలో చక్కర్లు కొడుతున్న డ్రోన్లను కూల్చేశామని, దాడిని విజయవంతంగా అడ్డుకున్నామని ఇరాన్ ప్రకటించింది. ఇరాన్‌పై దాడి పని ఇజ్రాయెల్‌దేనని అమెరికా సైన్యాధికారులు ప్రకటించారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయాతొల్లా అలీ ఖమేనీ 85వ పుట్టినరోజు జరుపుకుంటున్న శుక్రవారం రోజే ఇజ్రాయెల్ ఈ దాడులు చేయడం గమనార్హం. అణుకార్యక్రమాలు జరిగే ఆగ్నేయ జెర్దెంజన్ ప్రాంతంలో శత్రు విమానాలు, డ్రోన్లను నేలమట్టం చేసే అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఇరాన్ క్రియాశీలం చేసింది. ఈ అణుకేంద్రంలో చైనా సరఫరాచేసిన స్వల్పస్థాయి అణు పరిశోధనా రియాక్టర్లు ఉన్నాయి. పౌర అణు అవసరాల కోసం అణు ఇంధనాన్ని ఇక్కడ ఉత్పత్తిచేస్తారు. ఇదే నగరంలో భూగర్భ అణు శుద్ధి కర్మాగారం ఉంది. దీనిని లక్ష్యంగా చేసుకునే ఇజ్రాయెల్ ఈ దాడి చేసి ఉంటుందని భావిస్తున్నారు.

ఎన్‌ఎస్‌జీ చీఫ్‌గా నళిన్ ప్రభాత్



న్యూఢిల్లీ: దేశ ఉగ్రవాద వ్యతిరేక దళం నేషనల్ సెక్యూరిటీ గార్డ్(ఎన్‌ఎస్‌జీ) అధిపతిగా సీనియర్ ఐపీఎస్ అధికారి నళిన్ ప్రభాత్ నియమితులయ్యారు. ఆయన నియామకానికి కేబినెట్‌లోని నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. 1992 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ కేడర్ ఐపీఎస్ అయిన ప్రభాత్ సీఆర్‌పీఎఫ్ అదనపు డైరెక్టర్ జనరల్‌గా ఉన్నారు. 2028 ఆగస్టు 31వ తేదీ వరకు ఎన్‌ఎస్‌జీ చీఫ్‌గా ఆయన కొనసాగుతారని సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

నావికా దళాధిపతిగా దినేశ్ త్రిపాఠీ



న్యూఢిల్లీ: భారత నావికా దళం నూతన అధిపతిగా వైస్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠీ నియమితులయ్యారు. ప్రస్తుతం నేవీ స్టాఫ్ వైస్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వైస్ అడ్మిరల్ త్రిపాఠీ ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం నేవీ చీఫ్‌గా బాధ్యతలు చేపడతారని రక్షణ శాఖ తెలిపింది. 1964 మే 15వ తేదీన జన్మించిన వైస్ అడ్మిరల్ త్రిపాఠీ 1985 జులై ఒకటో తేదీన భారత నేవీ ఎగ్జిక్యూటివ్ విభాగంలో చేరారు. కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ నిపుణుడిగా గత 30 ఏళ్లుగా బాధ్యతల్లో ఉన్నారు.

మూడు మామిడి పండ్లే తిన్నా..

ఢిల్లీ కోర్టులో కేజ్రీవాల్ వాదన

న్యూఢిల్లీ: జైలులో తాను తీసుకుంటున్న ఆహారాన్ని ఈడీ రాజకీయం చేస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విమర్శించారు. డయాబెటిస్ బాధితుడినైన తనకు జైలులో ఇన్సులిన్ ఇవ్వాలని కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ రౌస్‌అవెన్యూ కోర్టులో శుక్రవారం వాదనలు కొనసాగాయి. మెడికల్ బెయిల్ పొందడానికి లేదా చికిత్స పేరిట ఆసుపత్రిలో చేరడానికి వీలుగా రక్తంలో చక్కెర స్థాయిలు పెంచుకోవడానికి కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగా మామిడి పండ్లు, స్వీట్లు తింటున్నారని ఈడీ గురువారం కోర్టు దృష్టికి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈడీ వాదనపై కేజ్రీవాల్ శుక్రవారం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జైలులో ఉన్న తనకు ఇప్పటిదాకా 48 సార్లు ఇంటి నుంచి భోజనం పంపగా, కేవలం మూడుసార్లు మాత్రమే మామిడిపండ్లు తిన్నానని కేజ్రీవాల్ తెలిపారు. కేవలం ఒకే ఒక్కసారి ఆలూ పూరీ తీసుకున్నానని, అది కూడా నవరాత్రి ప్రసాదంగా స్వీకరించానని కోర్టుకు తెలియజేశారు. వైట్ రైస్, బ్రౌన్ రైస్ కంటే మామిడి పండ్లలో చక్కెర స్థాయి తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. షుగర్ లేని స్వీట్లు ఆరుసార్లు తిన్నానని, షుగర్ లేకుండా టీ తాగుతున్నానని వెల్లడించారు. తనకు చికిత్స అందించే రెగ్యులర్ వైద్యుడు సూచించిన డైట్ చార్ట్ ప్రకారమే ఆహారం తీసుకుంటున్నానని వివరించారు. ప్రతిరోజూ 15 నిమిషాల పాటు డాక్టర్‌ను సంప్రదించడానికి అనుమతి ఇవ్వాలంటూ శుక్రవారం మరో పిటిషన్ దాఖలు చేశారు. ఇన్సులిన్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌తోపాటు ఈ పిటిషన్‌పై తీర్పును న్యాయస్థానం రిజర్వ్ చేసింది.

తొలి దశ పోలింగ్ ప్రశాంతం

- ఓటింగ్ 62.37 శాతం
- ఓటేసిన దిగ్గజ నేతలు
- ఛత్తీస్‌గఢ్‌లో గ్రనేడ్ పేలి సీఆర్‌పీఎఫ్ జవాను మృతి
- పశ్చిమబెంగాల్‌లో స్వల్ప ఘర్షణలు

న్యూఢిల్లీ: పలు చోట్ల స్వల్ప హింసాత్మక ఘటనలు మినహా లోక్‌సభ ఎన్నికల తొలి దశ పోలింగ్ శుక్రవారం 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రశాంతంగా ముగిసింది. ఇప్పటిదాకా అందిన గణాంకాల ప్రకారం ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 102 స్థానాల్లో మొత్తంగా శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలకు అందిన సమాచారం మేరకు 62.37 శాతం మేర పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల కమిషన్ అధికార ప్రతినిధి చెప్పారు. పోలింగ్ శాతం ఇంకా పెరగవచ్చని తెలిపారు. మొత్తం లోక్‌సభ స్థానాలకు ఏడు దశల్లో పోలింగ్ నిర్వహిస్తుండగా తొలి దశలోనే అత్యధిక స్థానాలకు పోలింగ్ జరిగింది. 2019లో ఇవే లోక్‌సభ స్థానాల్లో 69.43 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల దాకా పోలింగ్‌ను అనుమతించారు.

యువ ఓటర్లు.. నవ దంపతులు

ఓటు హక్కు వచ్చాక తొలిసారి ఓటేసేందుకు భారీ సంఖ్యలో యువత ఆసక్తి చూపారు. కొత్త దంపతులు, వృద్ధులు, దివ్యాంగులు సైతం పోలింగ్ స్టేషన్లకు వచ్చి ఓటు వేశారు. తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్, అండమాన్, నికోబార్ దీవులు, అస్సాంలోని కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు అందిన సమాచారం ప్రకారం త్రిపురలో 80.17 శాతం, పశ్చిమబెంగాల్‌లో 77.57 శాతం, తమిళనాడులో 72.09 శాతం, అస్సాంలో 70.77 శాతం, మేఘాలయలో 74.21 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 58 శాతం, మహారాష్ట్రలో 61.06 శాతం పోలింగ్ నమోదైంది. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో గిరిజన సంఘాల కూటమి ఇచ్చిన పిలుపు మేరకు నాగాలాండ్‌లోని ఆరు జిల్లాల ప్రజలు అసలు పోలింగ్ కేంద్రాల వైపే రాలేదు.

మణిపూర్‌లో 69 శాతానికి పైగా

జాతుల మధ్య వైరంతో రావణకాష్టంలా రగిలిపోయిన మణిపూర్‌లో ఆశాజనకంగా 69.13 శాతం పోలింగ్ నమోదైంది. ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్‌లోని నాలుగు పోలింగ్‌బూత్‌లలో ఆగంతకులు ఈవీఎంలను ధ్వంసంచేశారు. ఒక బూత్‌ను నాశనం చేశారు. తరచూ మావోలు, బలగాల ఎదురుకాల్పుల మోతతో దద్దరిల్లే బస్తర్ ప్రాంతం ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో 63.41 శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా గాల్గమ్ గ్రామంలో పోలింగ్ కేంద్రం సమీపంలో అండర్ బ్యారెల్ గ్రనేడ్ లాంచర్ పొరపాటున పేలడంతో సీఆర్‌పీఎఫ్ జవాను దేవేంద్ర తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ కన్నుమూశారు.


రజనీకాంత్


స్టాలిన్


అగాథ సంగ్మా


నితిన్ గడ్కరీ

తమిళనాడులో 72.09% ఓటింగ్

రాష్ట్రంలోని మొత్తం 39 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 72.09 శాతం పోలింగ్ నమోదైంది. తాంబరంసహా కొన్ని పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలలో సాంకేతిక కారణాలతో పోలింగ్ గంట ఆలస్యంగా ఆరంభమైంది. సేలంలో ఇద్దరు వృద్ధులు ఓటేసేందుకు పోలింగ్‌కేంద్రానికొచ్చి మరణించారు. తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్, మాజీ సీఎంలు పన్నీర్‌సెల్వం, కె.పళనిస్వామి, తమిళసూపర్‌స్టార్ రజనీకాంత్, కమల్‌హాసన్, విజయ్, అజిత్ కుమార్ తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. తమిళనాడులో 2019 ఎన్నికల్లో 72.44 శాతం పోలింగ్‌నమోదైంది. తమిళనాడుసహా, ఉత్తరాఖండ్, అరుణాచల్, మేఘాలయ, అండమాన్ నికోబార్ దీవులు, మిజోరం, నాగాలాండ్, పుదుచ్చేరి, సిక్కిం, లక్షద్వీప్‌లలో ఒకే దఫాగా అన్ని స్థానాల్లో శుక్రవారం పోలింగ్ జరిగింది. రాజస్తాన్, యూపీ, మధ్యప్రదేశ్, అస్సాం, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమబెంగాల్, మణిపూర్, త్రిపుర, జమ్మూకశ్మీర్, ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని స్థానాలకు పోలింగ్ జరిగింది.

అరుణాచల్ అసెంబ్లీకి 65.79%

అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. శుక్రవారం మధ్యాహ్నం అందిన సమాచారం ప్రకారం అరుణాచల్ ప్రదేశ్‌లో 65.79 శాతం పోలింగ్ నమోదైంది. 60 అసెంబ్లీ స్థానాలకుగాను 50 నియోజకవర్గాలకు పోలింగ్ జరిగింది. మిగతా పది చోట్ల బీజేపీ ఇప్పటికే ఏకగ్రీవంగా విజయం సాధించింది. సిక్కింలోని మొత్తం 32 శాసన సభ స్థానాలకు శుక్రవారం జరిగిన ఎన్నికల్లో 67.95 శాతం పోలింగ్ నమోదైంది.

హైలైట్స్

- జమ్మూకశ్మీర్ దోడా జిల్లాలో పెళ్లింట అప్పగింతల కార్యక్రమం ఆలస్యంకావడంతో వధువు మోనికా శర్మ ఆలోపు పోలింగ్‌స్టేషన్‌కు వెళ్లి ఓటేసి వచ్చింది
- జైపూర్‌లో 95 ఏళ్ల నేవీ మాజీ అధికారి ఆర్‌ఎన్ సింగ్, ఔరంగాబాద్‌లో 92 ఏళ్ల రిటైర్డ్ ప్రొఫెసర్ ఉదయ్ సింగ్ వీల్‌చైర్‌లో వచ్చి ఓటేశారు
- అండమాన్ నికోబార్ దీవుల్లో అత్యంత అణగారిన షోంపెన్ గిరిజన తెగకుచెందిన ఏడుగురు తొలిసారిగా ఓటేశారు.
- బస్తర్ పరిధిలో తొలిసారిగా 56 గ్రామాలకు చెందిన ఓటర్లు తమ సొంత ఊళ్లలోనే బూత్‌లు ఏర్పాటుచేయడంతో ఓటేశారు.
- బిహార్, యూపీ, తమిళనాడులోని కొన్ని గ్రామల ప్రజలు తమకు కనీస సదుపాయాలు లేవంటూ పోలింగ్‌ను బహిష్కరించారు
- అస్సాంలోని లఖీంపూర్ స్థానంలో ఈవీఎంలున్న కారును తరలిస్తున్న పడవ నీటిలో మునిగింది
- కశ్మీర్‌లో సైలెంట్ విలేజ్ నుంచి తొలిసారిగా ముగ్గురు మూగ, చెవిటి అక్కాచెల్లెళ్లు ఓటేశారు
- ప్రపంచంలోనే అత్యంత పొట్టి మహిళగా పేరొందిన జ్యోతి ఆమ్గే నాగ్‌పూర్ పట్టణంలో ఓటేశారు
- నాగ్‌పూర్‌లో 27 మంది ఉమ్మడి కుటుంబసభ్యులంతా ఒకేసారి ఓటు హక్కును వినియోగించుకున్నారు
- బ్యాలెట్ పేపర్ అయితేనే ఓటేస్తానంటూ హరిద్వార్‌లో ఓ వృద్ధుడు ఈవీఎంను నేలకేసి కొట్టాడు
- ఛత్తీస్‌గఢ్‌లోని 102 నియోజకవర్గాల్లో మహిళా సిబ్బంది 'పింక్' దుస్తుల్లో హాజరయ్యారు
- అరుణాచల్‌ప్రదేశ్‌లోని అంజా జిల్లాలో పోలింగ్ సిబ్బంది 40 కిలోమీటర్లు కాలినడకన కొండకోనలు ఎక్కిమరీ మారుమూల ప్రాంతంలో ఏర్పాటుచేసిన మాలోగామ్ పోలింగ్ స్టేషన్‌లో ఏకైక ఓటరైన 44 ఏళ్ల మహిళ సోకేలా తయాంగ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటెత్తారు

కొత్త ఓటర్లు


జమ్మూకశ్మీర్‌లోని కథువాలో..

గిరిజనులు


మధ్యప్రదేశ్‌లోని డిండోరీలో..

బౌద్ధులు


సిక్కింలోని గాంగ్‌టాక్‌లో...

సాధువులు


ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో..

ముస్లింలు


ఉత్తర ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో..

నవ దంపతులు


మహారాష్ట్రలోని గోండియాలో...

మరుగుజ్జు మహిళ


మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో..

ట్రాన్స్‌జెండర్


మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో..

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 20 । ఏప్రిల్ । 2024



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మను రాష్ట్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు సౌరభ్‌శర్మ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు.



న్యాయమూర్తి సేవలు మరువలేనివి

న్యాయమూర్తిగా కేసుల పరిష్కారంలో నరసింహమూర్తి చేసిన సేవలు మరువలేనివని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. -8లో▸

నేడు, రేపు ఉచిత పుస్తకాల పంపిణీ



పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ సర్వోత్తమ గ్రంథాలయంలో శని, ఆదివారాల్లో ఉదయం 9 గంటల నుంచి ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఒక్కొక్కరు తమకు నచ్చిన రెండు పుస్తకాలు ఎంచుకుని తీసుకెళ్లవచ్చు.

న్యూస్‌రీల్

డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా శివకుమార్‌రెడ్డి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఫ్యాక్టరీస్ బాయిలర్ అండ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.వి.శివకుమార్ రెడ్డి బాధ్యతలు నిర్వహించనున్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ గుంటూరు పరిధిలో వస్తుంది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని బాధ్యతలను నిర్వహించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు



జగ్గయ్యపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేపడతామని విజయవాడ ఎస్‌ఈబీ డెప్యూటీ కమిషనర్ శంకర్ పేర్కొన్నారు. గరికపాడు సరిహద్దు చెక్‌పోస్టును ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి నేటి వరకు చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని తెలిపారు. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని బోర్డర్ చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మద్యం అక్రమ రవాణా నివారణకు ఎస్‌ఈబీ సిబ్బందిని ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం తెలంగాణ నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు.

దుర్గమ్మకు కానుకగా బంగారు గాజులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గుడివాడకు చెందిన భక్తులు శుక్రవారం బంగారు గాజులు కానుకగా సమర్పించారు. గుడివాడలోని రాజేంద్రనగర్‌కు చెందిన కె.సింధూర కుటుంబం సుమారు రూ.3 లక్షలు వెచ్చించి 55 గ్రాముల బంగారంతో తయారు చేయించిన నాలుగు బంగారు గాజులను ఆలయ ఈఓ కె.ఎస్.రామరావుకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను దాతలకు అందజేశారు.

ప్లస్ టూగా 18 హైస్కూళ్లు అప్‌గ్రేడ్



పెనమలూరు: కృష్ణా జిల్లాలో 2024–2025 విద్యా సంవత్సరానికి 18 హైస్కూళ్లను (ప్లస్‌టూ) బాలబాలికల జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి తాహేరా సుల్తానా అన్నారు. కానూరులో శుక్రవారం అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022–2023 సంవత్సరం నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు 23 హైస్కూల్స్‌లో ప్లస్ టూ ప్రారంభించామన్నారు. గత ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల కంటే ఈ ఏడాది ఫలితాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. అనుకున్న లక్ష్యం సాధించాలంటే లోపాలు గుర్తించి సమష్టిగా పని చేయాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలన్నారు. మే 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని, ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు ఇప్పటి నుంచే ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. సప్లిమెంటరీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. కాగా మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో సంవత్సరం ఇంటర్‌లో 933/1000 మార్కులు సాధించిన రాజోలు జ్ఞానసాగప్రసన్నకు దాత ఇచ్చిన రూ. 5 వేల చెక్కు డీఈఓ అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి అశోక్‌చక్రవర్తి, జిల్లా కామన్ ఎగ్జామ్‌బోర్డు కార్యదర్శి షేక్ జాన్‌సాహెబ్, అధికారులు ఎం.శ్రీనివాసరావు, పెనమలూరు ఎంఈఓలు శేషగిరిరావు, కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల జోరు



షేక్ ఆసిఫ్‌కు అభినందనలు తెలుపుతున్న వెలంపల్లి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి కేశినేని నాని



విజయవాడ పశ్చిమంలో నామినేషన్ దాఖలు చేసేందుకు భారీ ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

విజయవాడ పార్లమెంటుకు మూడు నామినేషన్లు

- అసెంబ్లీ నియోజకవర్గాలకు 15 నామినేషన్లు దాఖలు
- విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తూర్పులో ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం శుక్రవారం కొనసాగింది. రెండో రోజు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు పలువురు తమ నామినేషన్లను ఆయా రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 18 నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో పార్లమెంట్ స్థానానికి మూడు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 15 నామినేషన్లు ఉన్నాయి. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ పశ్చిమ తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. తొలుత ఆయన భారీ ర్యాలీగా నామినేషన్ కార్యక్రమానికి తరలి వచ్చారు. వెస్ట్‌లో సీపీఐ, సెంట్రల్‌లో సీపీఎం అభ్యర్థులు నామినేషన్ల సమర్పణ కార్యక్రమం ఆర్భాటంగా జరిగింది.

- విజయవాడ పార్లమెంటరీ స్థానానికి రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున పేరం శివనాగేశ్వరరావు, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీకి చెందిన బి.శ్రీనివాసరావు, టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) నామినేషన్లు దాఖలు చేశారు. వారు తమ నామినేషన్లను కలెక్టరేట్‌లోని ఆర్వో కార్యాలయంలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుకు సమర్పించారు.
- విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ నామినేషన్ దాఖలు చేశారు. సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు, ఎంసీపీఐ (యూ) అభ్యర్థి ఖదీర్‌బాషా షేక్, స్వతంత్ర అభ్యర్థిగా రత్నావత్ కిశోర్ కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు.
- విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సీపీఐ(ఎం) అభ్యర్థిగా చిగురుపాటి బాబూరావు, టీడీపీ అభ్యర్థిగా బొండా ఉమామహేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థిగా బొప్పన గాంధీ, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా కె.శివశంకర్ నామినేషన్లు సమర్పించారు.
- విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థులుగా గద్దె రామ్మోహన్, గద్దె అనూరాధ, గద్దె క్రాంతికుమార్ నామినేషన్లు దాఖలు చేశారు.
- మైలవరం అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక్కడ స్వతంత్ర అభ్యర్థులు వేములపల్లి పృథ్వీ, వేల్పూరి కనకదుర్గాదేవి నామినేషన్లు వేశారు.



వీఎంసీలోని ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి బాబూరావు

- జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా కర్నాటి అప్పారావు, టీడీపీ అభ్యర్థిగా రాజగోపాల శ్రీరామ్ (తాతయ్య) నామినేషన్లు దాఖలు చేశారు.
- నందిగామ, తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండో రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.
- కృష్ణా జిల్లా పరిధిలోని పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బోడె ప్రసాద్‌తోపాటు ఆయన భార్య బోడె హేమచౌదరి నామినేషన్లు వేశారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి దాసి రాజుకు అందజేశారు.

నిబంధనలు కఠినతరం

మొదటి రోజు రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయాల వద్దకు మీడియాను అనుమతించిన అధికారులు రెండో రోజు కఠినంగా వ్యవహరించారు. ఆర్వో కార్యాలయానికి 100 మీటర్ల వరకు మాత్రమే మీడియాను అనుమతించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు నిర్దేశిత సంఖ్యలో ప్రతిపాదకులను అనుమతించారు.



నామినేషన్ సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ విజయవాడ పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్

ఆసిఫ్ వార్షికాదాయం రూ. 4.88 లక్షలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ వేసిన షేక్ ఆసిఫ్ తన వార్షికాదాయం రూ.4,88,500లుగా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 2023–2024వ సంవత్సరంలో ఆయన భార్య షేక్ ఆషా వార్షికాదాయం రూ.4,87,180. ఆసిఫ్ బ్యాంక్ ఖాతాల్లో రూ.7,85,637, చేతిలో రూ.5 లక్షల నగదు ఉంది. ఆయన భార్య పేరు మీద ఉన్న బ్యాంక్ ఖాతాల్లో రూ.36,82,003 నగదు, చేతిలో రూ.5 లక్షల నగదు ఉంది. రూ.29.85 లక్షల విలువ చేసే రెండు కార్లు, ఒక ద్విచక్ర వాహనం ఉన్నాయి. షేక్ ఆషా పేరు మీద రూ.10 లక్షల విలువైన బంగారం ఉంది. రూ.66.98 లక్షల విలువైన రెండు భవనాలు ఉన్నాయి. మొత్తం రూ.22.06 లక్షల అప్పులు ఉన్నాయని అఫిడవిట్‌లో పేర్కొన్నారు.



ర్యాలీలో వైఎస్సార్ సీపీ జెండాల రెపరెపలు

తాతయ్యకు నిరసన సెగ

- శ్రీరామ్ తాతయ్యపై నాయకుల ఆగ్రహం
- తాళ్లూరులో ప్రచారాన్ని అడ్డుకున్న టీడీపీ కార్యకర్తలు
- ప్రచారం విరమించి వెళ్లిన వైనం

పెనుగంచిప్రోలు: జగ్గయ్యపేట టీడీపీలో లుకలుకలు ప్రారంభమయ్యాయి. పార్టీ అభ్యర్థి తీరుతో వర్గ విభేదాలు ముదురుపాకాన పడుతున్నాయి. ఎన్నికలు సమీపించే కొద్దీ పార్టీలో అసమ్మతి భగ్గుమంటోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన శ్రీరాం తాతయ్యను వత్సవాయి మండలం తాళ్లూరులో టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు.

తాతయ్య తీరే కారణం!

శ్రీరాం తాతయ్య తీరుపై సొంత పార్టీ వారే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఉంటున్న తమను పార్టీకి దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాతయ్య ఒంటెత్తు పోకడలను తట్టుకోలేకపోతున్నారు. పార్టీలో కీలక సామాజికవర్గానికి చెందిన వారిలో ఓ వర్గం సహకరించేది లేదని కరాఖండిగా తేల్చిచెబుతోంది. వరుసగా నాలుగోసారి టికెట్ సాధించిన తాతయ్యపై ముఖ్యంగా పార్టీలోని కీలక సామాజికవర్గం వారు గుర్రుగా ఉన్నారు. తమను నిర్లక్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నియోజకవర్గంలో తమ పాత్ర లేకుండా ఎలా గెలుస్తారని ప్రశ్నిస్తున్నారు. ఆ సామాజిక వర్గం నేతలు గత ఎన్నికల్లో సరిగా సహకరించకపోవటం వల్లే తాను ఓడానని తాతయ్య, అతని వర్గీయులు ప్రచారం చేయటం కూడా టీడీపీలో అసంతృప్తికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. అసంతృప్తి, విభేదాలు కొనసాగితే ఈ ఎన్నికల్లోనూ పుట్టి మునగడం ఖాయమని టీడీపీ నాయకులు బహిరంగంగా పేర్కొంటున్నారు.

బొల్లాకు సమాధానం చెప్పాలి...

తాజాగా తాతయ్య ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉదయం వత్సవాయి మండలం తాళ్లూరు గ్రామానికి వచ్చారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లా రామకృష్ణ (బీఆర్‌కే) మాతృమూర్తి తులశమ్మ, ఉప సర్పంచ్ ప్రసాదపు గోపాలరావు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు తాతయ్యను అడ్డుకున్నారు. బొల్లా రామకృష్ణకు సమాధానం చెప్పాలని ప్లకార్డులతో నిరసన తెలిపారు. పోలీసులు స్పందించి రోడ్డు మీద వద్దు, ఇంటి గేటు లోపలికి వెళ్లాలని వారిని పంపించారు. అక్కడ నుంచి కూడా ప్లకార్డులతో నిరసన కొనసాగించారు. తాతయ్య లోపలకు వెళ్లి తులశమ్మతో మాట్లాడటానికి ప్రయత్నించారు. అయితే ఆమె ముందుగా రామకృష్ణతో మాట్లాడాలని చెప్పటంతో తాతయ్య ప్రచారం చేయకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు.



టీడీపీ అభ్యర్థి తాతయ్యతో మాట్లాడుతున్న, టీడీపీ కార్యకర్తలు, బీఆర్‌కే తల్లి తులశమ్మ

అందరి మద్దతూ ఉదయభానుకే..

ఒకవైపు టీడీపీ అభ్యర్థి సొంత పార్టీలోనే సమస్యలతో సతమత మవుతుండగా మరో వైపు వైఎస్సార్ సీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను అందరి మద్దతు పొందుతూ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అన్ని గ్రామాల్లో అన్ని వర్గాల మద్దతు కూడగడుతున్నారు. గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉదయభాను గెలుపు నల్లేరుపై నడకలా మారింది. రాబోవు రోజుల్లో నియోజకవర్గంలోని పలువురు నాయకులు వైఎస్సార్ సీపీ అభ్యర్థికి మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉన్నారు.

విలేకరుల సమావేశంలోనే చెప్పాలి

అనంతరం విలేకరుల సమావేశంలో బీఆర్‌కే తల్లి తులశమ్మ మాట్లాడుతూ.. తన కుమారుడు బొల్లా రామకృష్ణ టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి వెళ్లినా ఏమీ కాదని ఇటీవల తాతయ్య మీడియా సమావేశంలో మాట్లాడటం దారుణమన్నారు. వ్యాపారాలు చేసుకుంటున్న తనని పిలిచి తాళ్లూరులో సర్పంచ్, ఎంపీటీసీ గెలిపించుకోవటంతో పాటు జగ్గయ్యపేట మునిసిపాలిటీలో 14 వార్డులకు రూ.లక్షలు ఖర్చు చేయించారన్నారు. నియోజకవర్గంలో ఎందరికో ఆర్థిక సాయం చేశామని, ఆస్పత్రి ఖర్చులు భరించామని వివరించారు. తాతయ్య మళ్లీ మీడియా సమావేశం నిర్వహించి తప్పు జరిగిందని, బొల్లా రామకృష్ణను అన్న మాటలు సరికాదని చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు తమ గ్రామానికి రావద్దని తాతయ్యకు తేల్చి చెప్పారు.

రిటర్నింగ్ అధికారి కార్యాలయం పరిశీలన



పెనమలూరు: పెనమలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి కేంద్ర ఎన్నికల పరిశీలకులు శుక్రవారం విచ్చేశారు. అసెంబ్లీ ఎన్నికల నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ పెనమలూరులోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కొనసాగుతుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకుడు రిషబ్‌గుప్తా, పెనమలూరు అసెంబ్లీ పరిశీలకుడు ప్రవీణ్‌చౌహాన్ స్థానిక రిటర్నింగ్ అధికారిని కలిసి నామినేషన్‌ల ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. పోటీ చేసే అభ్యర్థులు చేసే ఖర్చుపై నిఘా ఉండాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చిన పరిశీలకులకు తొలుత తహసీల్దార్ ప్రసాద్ బొకేలు ఇచ్చి ఆహ్వానం పలికారు. డీఎస్పీ ఆర్‌జే జయసూర్య, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ పరీక్షలను పక్కాగా నిర్వహించాలి

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 21వ తేదీన జరిగే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) పరీక్షలను ఎటువంటి లోటుపాట్లూ లేకుండా పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో యూపీఎస్సీ పరీక్షల నిర్వహణపై వెన్యూ సూపర్‌వైజర్లు, లైజన్ కం ఇన్‌స్పెక్టింగ్ అధికారులతో కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21న డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ), నేవల్ అకాడమీ (ఎన్ఏ), సీడీఎస్ (కంబైండ్ డిఫెన్స్ సర్వీస్) పరీక్షలను యూపీఎస్సీ నిర్వహించనుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1,872 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఇందుకు కోసం ఐదు పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు వివరించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావెల్ అకాడమీ పరీక్షలు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. సీడీఎస్ పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు ఐదుగురు రూట్ అధికారులతో పాటు, ఐదుగురు లైజన్ అధికారులను నియమించామని వివరించారు. ఇప్పటికే పరీక్ష పత్రాలను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచామని తెలిపారు. సకాలంలో పరీక్ష పత్రాలు కేంద్రాలకు చేరుకునేలా రూట్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్, తపాలా, వైద్య–ఆరోగ్యం, ఏపీసీపీడీసీఎల్, జీవీఎంసీ తదితర శాఖల అధికారులు తమకు అప్పగించిన విధులను సమర్థంగా పాటించాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీరు, విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, లైజన్ అధికారులు, పోలీస్, తపాలా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు

22 నుంచి యోగా ఉచిత శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆవరణలోని తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి సందర్భంగా ఈ నెల 22వ తేదీ నుంచి నెల రోజుల పాటు యోగాలో ఉచిత శిక్షణ తరగతులు జరుగుతాయని అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టేడియం ఆవరణలోనే రోజూ ఉదయం 5.45 నుంచి 6.45 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. యోగ సాధన వల్ల శరీరాన్ని ఆరోగ్యంగా, మనసును ప్రశాంతంగా ఉంచుకోవచ్చని సూచించారు. ఆసక్తిగలవారు ఈ 22వ తేదీలోగా శ్రీనివాస్ (80082 34545), రాజు (90147 46719), సుబ్రహ్మణ్యం (96668 66986)ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

చైత్రమాస బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వెండి పల్లకీపై ఆదిదంపతుల నగరోత్సవంలో ఈఓ రామరావు తదితరులు



ఆది దంపతులకు మంగళస్నానాలు చేయిస్తున్న ఆలయ అర్చకులు

- దుర్గామల్లేశ్వరులకు మంగళ స్నానాలు
- వధూవరులుగా ఆదిదంపతులు
- వెండి పల్లకీపై స్వామివార్ల నగరోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం చైత్రమాస బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు మంగళస్నానాలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు మల్లేశ్వర శాస్త్రి, వైదిక కమిటీ సభ్యులు కోట ప్రసాద్, రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో గంగ, పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆది దంపతులను నూతన వధూవరులుగా అలంకరించారు. సాయంత్రం మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవనం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన వంటి వైదిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పెళ్లి కుమార్తెగా దుర్గమ్మ

చైత్రమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని పెళ్లికుమార్తెగా అలంకరించారు. ఆది దంపతులకు మంగళస్నానాలు, నూతన వధూవరులుగా అలంకరణ అనంతరం మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించిన పిమ్మట పెళ్లికుమార్తెగా నుదిటన బాసికం, కల్యాణ తిలకం, బుగ్గన చుక్కను ఆలయ అర్చకులు అలంకరించారు.

వెండి పల్లకీపై ఆదిదంపతులు

చైత్రమాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తొలి రోజు దుర్గామల్లేశ్వర స్వామి వార్లను వెండి పల్లకీపై ప్రతిష్ఠించి నగరోత్సవాన్ని నిర్వహించారు. మహా మండపం దిగువన వెండి పల్లకీపై ఆసీనులైన దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు ఆలయ ఈఓ రామరావు పూజలు నిర్వహించిన నగరోత్సవాన్ని ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తజనుల కోలాట నృత్యాలతో నగరోత్సవం ముందుకు సాగింది. మహా మండపం నుంచి ప్రారంభమైన నగరోత్సవం కనకదుర్గనగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, కోమల విలాస్, సామారంగం చౌక్ వరకు వెళ్లి అక్కడి నుంచి తిరిగి ఇంద్రకీలాద్రికి చేరింది. వెండి పల్లకీపై నగర వీధుల్లో విహరించిన ఆది దంపతులకు భక్తులు పూజలు నిర్వహించారు.

సకల దేవతలకు ఆహ్వానం

చైత్రమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సకల దేవతలకు ఈ బ్రహ్మోత్సవాల ఆహ్వానం పలుకుతూ గరుడ పతాకాన్ని ఆవిష్కరించారు. పూజల్లో ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీహెచ్‌సీ తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



తిరువూరు: మండల పరిధిలోని రాజుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎన్టీఆర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఎం. సుహాసిని శుక్రవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. సాధారణ కాన్పు బాలింతలను పరామర్శించి వారికి ప్రభుత్వపరంగా అందే సదుపాయాల గురించి వివరించారు. రోగ నిరోధక టీకాల సరఫరా, వినియోగాన్ని పరిశీలించి చిన్నారులు, బాలింతలకు ప్రభుత్వం అందించే వ్యాక్సిన్ల వినియోగంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. వేసవిలో వడదెబ్బ బాధితులు అధికంగా ఆస్పత్రికి వచ్చే అవకాశం ఉన్నందున సత్వర చికిత్స అందించాలని ఆదేశించారు. వైద్యాధికారులు చలపతిరావు, శ్రావ్య పూర్ణిమ పాల్గొన్నారు.

హోంగార్డు మహమ్మద్ బాషాకు నివాళి



కోనేరుసెంటర్: హోంగార్డ్ మహమ్మద్ బాషా మృతికి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి శుక్రవారం సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రమణ, హోంగార్డ్స్ విభాగ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె. రవికుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది హోంగార్డ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పోలీసు శాఖ తరపున రావాల్సిన ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కారుణ్య నియామకం కింద కుటుంబంలో అర్హులైన ఒకరికి వెంటనే ఉద్యోగం వచ్చేలా చూస్తామని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ మోసంతో రూ.35 లక్షలు స్వాహా

పెనమలూరు: పోరంకిలో ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు మోసం చేసి రూ.35 లక్షల సొమ్ము స్వాహా చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... పోరంకికి చెందిన ఎం.శ్రీకాంత్ అపార్టుమెంట్‌లు నిర్మిస్తాడు. ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లో సభ్యుడిగా చేరాడు. సైబర్ నేరగాళ్లు చెప్పిన మాటలు నమ్మి ఈ ఏడాది మార్చి 11వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ మధ్య కాలంలో రూ.35 లక్షలు పలు దఫాలుగా సొమ్ము బదిలీ చేశాడు. ఏప్రిల్ 2వ తేదీన తాను పెట్టుబడి పెట్టిన సొమ్ము విత్‌డ్రా చేయటానికి శ్రీకాంత్ కోరాడు. దీంతో సైబర్ నేరగాళ్లు శ్రీకాంత్ ఫోన్ నెంబర్ బ్లాక్‌లిస్టులో పెట్టి గ్రూపు సభ్యత్వం నుంచి తొలగించారు. దీంతో తాను మోసపోయానని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వివక్ష రహితంగా వ్యయ పర్యవేక్షణ

- క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్, సౌరభ్ శర్మ, మదన్ కుమార్



కమాండ్ కంట్రోల్ రూంలో వివిధ విభాగాల గురించి వివరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో వివక్ష లేకుండా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ జరిగేలా అధికారులు కృషి చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్, సౌరభ్ శర్మ, మదన్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆధ్వర్యంలో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ (ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్) సమీక్ష సమావేశం నిర్వహించారు. 16 విభాగాల నోడల్ అధికారులు హాజరయ్యారు. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి అధికారులతో పటిష్ట సమన్వయంతో పనిచేసి వ్యయ పర్యవేక్షణను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సహాయ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లు, అకౌంటింగ్ బృందాలు ఎలాంటి వివక్షకు తావులేని వాతావరణంలో పనిచేయాలని ఆదేశించారు. ప్రలోభాలకు తావు లేకుండా జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు బృంద స్ఫూర్తితో, నిబద్ధతతో పనిచేయాలని వి.జస్టిన్ కోరారు. అంతకు ముందు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు జిల్లాకు సంబంధించిన వివిధ అంశాలను పీపీటీ ద్వారా వివరించారు.

కమాండ్ కంట్రోల్ కేంద్రం సందర్శన...

జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్, సౌరభ్ శర్మ, మదన్ కుమార్.. కలెక్టర్ ఢిల్లీరావుతో కలిసి కలెక్టరేట్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించారు. కంట్రోల్ రూమ్‌లోని సీ-విజిల్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఐటీ, బ్యాంకింగ్, కమర్షియల్ ట్యాక్స్, ఈఎస్ఎంఎస్ తదితర విభాగాల కార్యకలాపాలను పరిశీలించారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, సోషల్ మీడియా సెల్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి.. మార్గనిర్దేశనం చేశారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, డీసీపీలు అధిరాజ్ సింగ్ రాణా, కె.శ్రీనివాసరావు తదితరులతో పాటు రిటర్నింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఓటు వేసే వ్యక్తి.. ప్రజాస్వామిక శక్తి



వాల్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్, ఎన్నికల వ్యయ పరిశీలకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటు వేసే ప్రతి వ్యక్తీ ఒక ప్రజాస్వామిక శక్తి అని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, తిరువూరు, మైలవరం నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల వ్యయ పరిశీలకులు సౌరభ్ శర్మ, విజయవాడ తూర్పు, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు మదన్ కుమార్ తదితరులతో కలిసి ఓటర్లను జాగృతం చేసే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల ఓటర్లు ప్రజాస్వామ్య పరిపుష్టికి తమ బాధ్యతగా భావించి మే 13న ఓటు వేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, డీసీపీలు అధిరాజ్ సింగ్ రాణా, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



● అవినాష్‌కు బ్రహ్మరథం

వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ 16వ డివిజన్‌లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన వచ్చింది. ప్రజలు అవినాష్‌కు బ్రహ్మరథం పట్టారు. మహిళలు ఆయనకు హారతులిచ్చి స్వాగతం పలికారు. – ఆటోనగర్

కోడ్ ఉల్లంఘనపై టీడీపీ నేతలకు నోటీసులు జారీ



బొమ్ములూరు గ్రామంలో సమైక్య భవనానికి తెలుపు రంగు వేసిన ఎన్నికల అధికారులు

గుడివాడరూరల్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన టీడీపీ నాయకులకు నోటీసులు జారీ చేశామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో పద్మావతి తెలిపారు. మండలంలోని బొమ్ములూరు గ్రామంలో ఉన్న మహిళా సమైక్య భవనానికి రాత్రికి రాత్రే పసుపు రంగు వేయడంపై శుక్రవారం సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎన్నికల అధికారులు గ్రామంలో ఉన్న సమైక్య భవనానికి తెలుపు రంగు వేసి చర్యలు చేపట్టారు. ఆర్డీవో పద్మావతి మాట్లాడుతూ భవనానికి పసుపు రంగు వేయడంపై టీడీపీ నేతలకు నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. 48 గంటల్లో సమాధానం చెప్పాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



కురుమద్దాలి(పామర్రు): కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మండల పరిధిలోని కురుమద్దాలి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తాడిగడప గ్రామానికి చెందిన పరిశే రఘురామయ్య (59) మచిలీపట్నంలో పని చూసుకుని తన మోపెడ్‌పై విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై తిరుగు పయనమయ్యాడు. కురుమద్దాలి గ్రామ పరిధిలోని ఫ్లై ఓవర్ వద్దకు రాగానే వెనుకగా వచ్చిన కారు మోపెడ్‌ను ఢీ కొట్టింది. దీంతో రఘురామయ్య రోడ్డు పై పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితులకు జైలు శిక్ష

విజయవాడస్పోర్ట్స్: నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద కరెంటు వైర్లను చోరీ చేస్తున్న నిందితుడికి నాలుగు నెలలు జైలు శిక్ష విధిస్తూ విజయవాడ ఒకటవ అడిషనల్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎం.ఎస్.కరీముల్లా శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రసాదంపాడులోని రెండు భవనాల వద్ద 2023 డిసెంబర్ 26వ తేదీన కరెంటు వైర్లు దొంగిలించి పారిపోతున్న ముగ్గురు వ్యక్తులపై గుణదల పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు ముక్కొల్లు గోపీచంద్‌పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారు. మిగిలిన ఇద్దరి వ్యక్తులను నిర్దోషులుగా విడుదల చేశారు.

బైక్ చోరీ కేసులో....

కనకదుర్గమ్మ దేవాలయం వద్ద బైక్‌ను దొంగిలించిన వ్యక్తికి నాలుగు నెలలు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎస్.రాజశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పారు. 2023 జూలై 29వ తేదీన జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు.. ప్రకాశం జిల్లా యద్దనపూడి గ్రామానికి చెందిన నిందితుడు పాలపర్తి నాగరాజును గత ఏడాది డిసెంబర్ 12వ తేదీన అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. నిందితుడుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

న్యాయమూర్తి నరసింహమూర్తి సేవలు మరువలేనివి

మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు



న్యాయమూర్తి నరసింహమూర్తిని సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

చిలకలపూడి(మచిలీపట్నం): న్యాయమూర్తిగా కేసుల పరిష్కారంలో నరసింహమూర్తి చేసిన సేవలు మరువలేనివని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్లో పదవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా పనిచేస్తూ ఇటీవల తిరుపతి ఎర్రచందనం స్మగ్లింగ్ నియంత్రణ కోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయిన నేపథ్యంలో వీడ్కోలు కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు మాట్లాడుతూ నరసింహమూర్తి కేసుల పరిష్కరించటం ద్వారా పదవికే వన్నె తెచ్చారన్నారు. న్యాయమూర్తులకు ఎంతో ఒత్తిడి ఉంటుందని కానీ చట్టానికి లోబడే మాత్రమే తీర్పులు ఉంటాయని చెప్పారు. న్యాయమూర్తులకు పదోన్నతులు పెరిగే కొద్దీ పని ఒత్తిడి ఉంటుందని పేర్కొన్నారు. కరోనా సమయంలో కూడా పలు కేసులు పరిష్కరించి హైకోర్టు మన్ననలు పొందారన్నారు. సన్మాన గ్రహీత నరసింహమూర్తి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా మచిలీపట్నంలో న్యాయమూర్తిగా పనిచేయటం ఎంతో తృప్తి ఇచ్చిందని తెలిపారు. గతంలో విజయవాడ, గన్నవరం న్యాయస్థానాల్లోనూ న్యాయమూర్తిగా పనిచేయటం వల్ల కృష్ణా జిల్లా పట్ల ఎంతో అభిమానం ఉందన్నారు. ఎంతో పురాతనమైన మచిలీపట్నం బార్ అసోసియేషన్ సభ్యుల ద్వారా తాను ఎంతో నేర్చుకున్నానన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తి నరసింహమూర్తిని గజమాలతో ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ఎస్ సాయిబాబు, కె. చంద్రశేఖర్, ఎస్.నగధరనాథ్, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే అనిల్‌కుమార్



మర్రివాడలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని మర్రివాడ గ్రామం నుంచి శుక్రవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. యువకులు భారీ బైక్ ర్యాలీతో ప్రచారంలో సందడి చేశారు. అనంతరం గోపువానిపాలెం, తాడంకి, గురజాడ, మంటాడ గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రచారాన్ని కొనసాగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పథకాలు, సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని ఆదరించాలన్నారు. గడప గడపకు నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, హెల్త్‌సెంటర్లు నిర్మించామన్నారు. నియోజకవర్గంలో 13 వేలమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. ఎంపీ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖరరావును, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కాసాని వేద సుప్రజ, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటరమణకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, గౌడ, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్లు శొంఠి వెంకటేశ్వరరావు, కంభపు రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు ఊబ మల్లేశ్వరి, కూచిపూడి శ్రీలక్ష్మి, మేరుగ లక్ష్మి, సర్పంచ్‌లు జంపాన ధనలక్ష్మి, జంపాన వెంకటేశ్వరరావు(చంటి), ఎన్ఆర్ఐ దేవరపల్లి అగ్గిరామయ్య పాల్గొన్నారు.

మచిలీపట్నంలో రోల్డ్ గోల్డ్ వర్కర్ ఆత్మహత్య

- వడ్డీ వ్యాపారి వేధింపులే తన చావుకు కారణమంటూ సెల్ఫీ వీడియోలో ఆవేదన
- కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన ఘటన

కోనేరుసెంటర్: వడ్డీ వ్యాపారి వేధింపులు తట్టుకోలేక ఓ రోల్డ్ గోల్డ్ వర్కర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన చావుకు వడ్డీ వ్యాపారి వేధింపులే కారణం అంటూ సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడు చనిపోయిన మూడు రోజుల తర్వాత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం... మచిలీపట్నం సర్కిల్ పేటకు చెందిన ఖాదర్ ఖాన్ రోల్డ్ గోల్డ్ పనులు చేస్తుంటాడు. కుటుంబ అవసరాల నిమిత్తం కొన్ని నెలల క్రితం పోలిమెట్ల శివకుమార్ అనే వ్యక్తి వద్ద రూ.70 వేలు అప్పుగా తీసుకున్నాడు. కొంతకాలం వడ్డీ కట్టాడు. పనులు సరిగా లేక పోవడంతో కొన్ని నెలలుగా వడ్డీ కట్టడం లేదు. అప్పు ఇచ్చిన శివకుమార్ అనేకమార్లు డబ్బులు కోసం ఖాదర్‌ఖాన్‌ను మానసికంగా వేధించాడు. చివరికి బాధితుడి ఇంటిపై కోర్టులో దావా వేశాడు. కోర్టు శివకుమార్‌కు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఖాదర్‌ఖాన్ ఇంటి ముందర కోర్టులో తాను గెలిచినట్లు టముకు వేయించాడు. జరిగిన అవమానాన్ని తట్టుకోలేని ఖాదర్ ఖాన్ గత నెలలో ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సకాలంలో ఆసుపత్రికి తీసుకువెళ్లి బతికించారు. అయితే వడ్డీ వ్యాపారి వేధింపులతో పాటు జరిగిన అవమానాన్ని తట్టుకోలేని ఖాదర్ ఖాన్ మళ్లీ ఈ నెల 16వ తేదీన ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పరువు కోసం కుటుంబ సభ్యులు విషయం బయటకి పొక్కకుండా అంత్యక్రియలు జరిపించారు. అయితే 19వ తేదీన ఖాదర్ ఖాన్ కుమారుడు అంజాత్ ఖాన్ తన తండ్రి సెల్ ఫోన్ ను ల్యాప్‌ట్యాప్‌కు కనెక్ట్ చేసి ఫోన్లో డేటా పరిశీలిస్తుండగా ఖాదర్ ఖాన్ తన చావుకు వడ్డీ వ్యాపారి పోలిమెట్ల శివకుమార్ కారణమంటూ సెల్ఫీ వీడియో తీసుకోవడం గమనించాడు. దీంతో తన తండ్రి చావుకు పోలిమెట్ల శివకుమారే కారణమని తన కుటుంబానికి న్యాయం చేయాలంటూ మీడియాను ఆశ్రయించడంతో పాటు న్యాయం కోసం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పాడు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు నుంచి జారిపడి తీవ్ర గాయాలతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై విజయవాడ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ వద్ద పూల మార్కెట్ సమీపంలో గుర్తు తెలియని రైలు నుంచి మగ వ్యక్తి జారిపడి తీవ్రగాయాలపాలయ్యాడు. విధుల్లో ఉన్న సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు విజయవాడ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ పార్థసారథి ఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ వ్యక్తి అదే రోజు సాయంత్రం మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 45-50 మధ్య ఉంటుందని వంటిపై నలుపు రంగు ప్యాంటు మాత్రమే ధరించి ఉన్నాడని, కుడి చేతికి పోలియో ఉందని, ఇతర ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు విజయవాడ జీఆర్పీ పోలీస్ స్టేషన్ లేదా 8897156153 ఫోన్ నెంబర్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



టీడీపీ, జనసేన నాయకులను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీ



వంగల పద్మకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు గ్రామంలో టీడీపీ, జనసేన నుంచి సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ సమక్షంలో పార్టీలో చేరారు. గ్రామంలో శుక్రవారం వంశీమోహన్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వీరు మర్యాద పూర్వకంగా కలిశారు. వంశీమోహన్ పార్టీ కండువా కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు.

టీడీపీలో మహిళలకు విలువ లేదు

మైలవరం: టీడీపీలో మహిళలకు విలువ లేదని మహిళా నాయకురాలు వంగల పద్మ తెలిపారు. టీడీపీకి చెందిన పద్మ వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గం కార్యాలయంలో పరిశీలకులు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి, అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. హర్షవర్ధన్‌రెడ్డి పద్మకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీలో మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించడం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని), మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు విజయానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అవినాష్ కుటుంబసభ్యుల ఎన్నికల ప్రచారం



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ తరఫున ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. పటమట 13వ డివిజన్ తోటవారి వీధిలో దేవినేని క్రాంతి, 4వ డివిజన్ భారతీనగర్‌లో దేవినేని సుధీర గడపగడపకు తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారం చేపడితేనే రాష్ట్రం మరింత అభివృద్ధి జరుగుతుందని, తూర్పు నియోజకవర్గంలో దేవినేని అవినాష్‌ను, విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని)ను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

తూర్పులో మూడు నామినేషన్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి శుక్రవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రెండో రోజు టీడీపీ నుంచి గద్దె రామ్మోహన్, గద్దె అనురాధ, గద్దె క్రాంతికుమార్‌ల తరఫున ఒక్కో సెట్ నామినేషన్లను వారి అనుయాయులు దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థి గద్దే రామ్మోహన్ అధికారికంగా ఈనెల 22న నామినేషన్ వేయనున్నట్టు తెలిసింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్ ఈ నెల 24వ తేదీన నామినేషన్ సమర్పించనున్నారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో నలంద విద్యార్థుల ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ స్థాయి కాంపిటీటివ్ ఒలంపియాడ్ పరీక్షల్లో బెంజిసర్కిల్ సమీపంలోని నలంద విద్యానికేతన్ ప్రీ ప్రైమరీ విద్యార్థులు పతకాలు సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. ఆ పరీక్షల్లో ఇంగ్లీషు, మేథ్స్, ఇఎస్ సబ్జెక్టులలో పలువురు సర్టిఫికెట్లు, పతకాలు, బహుమతులు పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాదల పద్మజ మాట్లాడుతూ కేజీ లెవల్ నుంచి చిన్నారులను ఇలాంటి పోటీ పరీక్షలకు ప్రోత్సహించడం ద్వారా వారిలో ప్రతిభను గుర్తించి నైపుణ్యాలను పెంపొందించవచ్చునన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన చిన్నారులను అభినందిస్తూ విజేతలకు బహుమతులు అందజేశారు.

రోజామణికి డాక్టరేట్



లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఆంధ్రా లయోలా కళాశాలలో లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ పీజీ అధ్యాపకురాలు తాడితూరి రోజామణికి డాక్టరేట్ లభించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీఏపీ కిషోర్ తెలిపారు. ప్రొటోటైపింగ్ అండ్ అనలైజింగ్ ద ఇంపాక్ట్ ఆఫ్ ఐసీటీ ఆన్ ఇన్ఫర్మేషన్ సీకింగ్ బిహేవియర్ ఆఫ్ లైబ్రరీ యూజర్స్ ఇన్ అటానమస్ ఇంజినీరింగ్ కాలేజెస్ అండ్ జేఎన్‌టీయూ కాకినాడ అనే అంశంపై రోజామణి పరిశోధన చేసినట్లు తెలిపారు. పలు అంతర్జాతీయ జర్నల్స్‌లో నాలుగు పరిశోధన పత్రాలను ప్రచురించారన్నారు. ఆమె కృషి ఫలితంగా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రిన్సిపాల్‌తో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఘనంగా అన్నసమారాధన



ఆటోనగర్(విజయవాడతూర్పు): శ్రీరామనవమి సందర్భంగా స్థానిక 15వ డివిజన్ లోని వీఎంఆర్ రోడ్డులో శుక్రవారం అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామికి పలువురు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వీఎంఆర్ రోడ్డు శ్రీరామ భక్త బృందం ఆధ్వర్యంలో మరో మూడు రోజుల పాటు శ్రీరామ నవమి వేడుకలను నిర్వహిస్తామని కమిటీ పెద్దలు చెప్పారు.

ఆంధ్రనాట్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై చైత్రమాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆంధ్రనాట్య ప్రదర్శన జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన రాయన శ్రీనివాసరావు శిష్య బృందం ఆంధ్ర నాట్యాన్ని ప్రదర్శించింది. భక్తులు వారి నాట్యాన్ని వీక్షించి ముగ్ధులయ్యారు.

మా ఓటు నీకేనయ్యా..

- ఎన్నికల ప్రచారంలో విశేష స్పందన
- అడుగడుగునా హారతులు పట్టిన మహిళలు
- 16వ డివిజన్‌లో రూ.8 కోట్లతో అభివృద్ధి
- ఎన్నికల ప్రచారంలో తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్



2వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలోని 16వ డివిజన్ పోలీస్ కాలనీలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన వచ్చింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్‌కు అండగా నిలిచారు. ''మా ఓటు నీకే'' అంటూ ముక్తకంఠంతో నినదించారు. ఎన్నికల ప్రచారంలో 16 వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధికతో పాటు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఏ ఇంటికి వెళ్లినా మా ఓటు నీకే వేస్తాం.. మా డివిజన్‌లో అభివృద్ధి చేసింది మీరే అంటూ ప్రతి ఇంట్లోని వారు అవినాష్‌కు బ్రహ్మరథం పడుతుండటం గమనార్హం. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ పోలీస్ కాలనీలో గత 50 ఏళ్ల నుంచి ఉన్న ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించినట్టు చెప్పారు. కేవలం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. అంతే కాకుండా ఈ డివిజన్‌లో రూ.80 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. సుమారు రూ.75 కోట్ల సంక్షేమ పథకాలు ప్రతి గడపకు ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లకు రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేయాలని స్థానికులను అవినాష్ అభ్యర్థించారు.

అభివృద్ధి చేయని గద్దె రామ్మోహన్

గత 10 ఏళ్లుగా ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న గద్దె రామ్మోహన్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేశారని విమర్శించారు. పోలీస్ కాలనీ ఇళ్ల పట్టాల విషయంలో గద్దె తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. ఏళ్ల తరబడి తన చుట్టూ ప్రజలను తిప్పుకోవడమే తప్ప చేసిందేమీ లేదన్నారు. గత 14, ప్రస్తుత 15వ డివిజన్‌ను గద్దె దత్తత తీసుకుని ప్రజలకు ఒక్క పైసా కూడా అభివృద్ధికి ఖర్చు చేయకుండా షో రాజకీయాలు చేశారన్నారు. ప్రస్తుతం ఎన్నికల సమయం రావడంతో ప్రజల వద్దకు వచ్చి మోసపూరితమైన వాగ్దానాలు, షో రాజకీయాలకు తెరలేపుతున్నారన్నారు. నోరు తెరిస్తే అబద్ధాలతో ప్రజలను నట్టేట ముంచేందుకు మరలా పూనుకుంటున్నారన్నారు. ప్రజలు ఈయన మాటలు వినే పరిస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో 16వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధిక, మాజీ కార్పొరేటర్ బహదూర్, మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు, పోలీస్ కాలనీ పెద్దలు ప్రసాద్, యుగంధర్, రామ్మోహనరావు, బద్రి ప్రకాష్, విజయ్‌మోహన్, వెంకటేశ్వరరావు, అర్జునరావు, రోశయ్య, రవి, శివశంకర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో రూ.650 కోట్ల అభివృద్ధి

గుణదల (విజయవాడతూర్పు) : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తూర్పు నియోజకవర్గంలో సుమారు రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు దిగ్విజయంగా నిర్వహించామని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ తెలిపారు. తూర్పు నియోజకవర్గం 2వ డివిజన్, గుణదల సెంటర్, కుమ్మరి బజార్, బెత్లెహేం నగర్, యారం వారి వీధి ప్రాంతాల్లో శుక్రవారం దేవినేని అవినాష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవినాష్ గడపగడపకూ పర్యటించి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ 2వ డివిజన్‌లో సుమారు రూ.7 కోట్లతో పలు అభివృద్ధి పనులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ డివిజన్‌లో ముఖ్యంగా బెత్లెహేం నగర్‌లో వాటర్‌పైప్‌లైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ విస్తరణ, బెత్లెహేం నగర్‌లో స్టెప్స్, ల్యాండింగ్ పనులు వంటి ప్రజల అవసరాలు గుర్తించి అభివృద్ధి చేసి చూపించామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి గద్దె రామ్మోహనరావు చేసింది ఏమిటని ప్రశ్నించారు. గద్దె దొంగ మాటలను నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. పచ్చ కామెర్లు వచ్చినోళ్లకి లోకమంతా పచ్చగా కనిపిస్తుందన్న చందంగా ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. కుట్ర రాజకీయాలతో జగన్‌పై రాళ్ల దాడి చేయించడంతో చంద్రబాబును ప్రజలు ఛీ కొడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అఖండ విజయం చేకూర్చి జగన్‌ను రెండవసారి ముఖ్యమంత్రిని చేయడం తథ్యమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలాకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



16వ డివిజన్ లోని పోలీసు కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని అవినాష్

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి



17వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న దేవినేని సుధీర

కృష్ణలంక(విజయవాడతూర్పు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర అన్నారు. రాణిగారితోట, 17వ డివిజన్‌లో జెండా చెట్టు ప్రాంతంలో శుక్రవారం ఆమె పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక మహిళలు ఆమెకు హారతులతో ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరుగుతూ ఆమె ప్రజలకు వివరించి, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం మాట్లాడుతూ గత పదేళ్లుగా నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న గద్దె రామ్మోహన్‌రావు నియోజకవర్గంలో చేయలేని అభివృద్ధిని గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జిగా ఉన్న తన భర్త అవినాష్ రూ.650 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించారన్నారు. మరింత అభివృద్ధి జరగాలంటే రానున్న ఎన్నికల్లో అవినాష్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే రెండోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా దేవినేని అవినాష్‌ను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల స్వేదానికి ఖరీదు కట్టే షరాబెవ్వరు?

గనిలో...వనిలో...కార్ఖానాలో...విరామమెరుగక పరిశ్రమించే...బలం ధరిత్రికి బలిగావించే కార్మిక వీరుల ఘర్మజలానికి ఖరీదు కట్టే షరాబు లేడోయ్... అన్నాడు మహాకవి శ్రీశ్రీ. రెక్కాడితే కాని డొక్కాడని శ్రామికులు ఎంత ఎండైనా, వడగాడ్పులైనా..ఉక్కపోతయినా...వారికి లెక్కాజమా కాదు...ఎంత పని ఉంటే వారికి అంత ఆనందం. పనే దైవం.. రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి పనిచేసి నాలుగు రూకలు ఇంటికి తీసుకువెళ్లి ఇంటిల్లిపాది కడుపు నిండా తినగలిగితే చాలు వారికి అంతకంటే ఇంకా ఏమీ అవసరం లేదు. మండు వేసవిలో మిట్టమధ్యాహ్నం ఆటోనగర్‌లో కార్మికులపై 'సాక్షి' ఫోకస్.

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఒక పక్క విపరీతమైన ఎండ... మరో పక్క ఉక్కపోత... తల నుంచి అరికాలు వరకు కారిపోతున్న చెమటను సైతం లెక్క చేయకుండా జవహర్ ఆటోనగర్‌లో పనిచేసే కార్మికులు పనులు చేస్తున్నారు. గత రెండు రోజుల నుంచి గరిష్ట ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 వరకు ఉన్నప్పటికీ కార్మికులు యథాతథంగా తమ పనులు తాము చేసుకుపోతూనే ఉన్నారు. చేతినిండా పని ఉండటంతో ఎంత ఎండైనా, ఉక్కపోత ఉన్నా హుషారుగా శ్రమిస్తున్నారు. ఆటోనగర్‌లో గత కొన్ని రోజుల నుంచి పనులు బాగా ఉండటంతో విజయవాడ చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వారు నిత్యం ఇక్కడకు పదుల సంఖ్యలో వస్తున్నారు. మెకానిక్, వెల్డింగ్, లారీ బాడీబిల్డింగ్‌తో పాటు అల్యూమినియం షెడ్లన్నీ కార్మికులతో కిక్కిరిసిపోతున్నాయి. అంతే కాకుండా ఆటోమొబైల్ షాపులతో పాటు పలు కంపెనీలకు చెందిన రామెటీరియల్ షాపులు కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. ఇనుము పనిచేసేవారు ఆరుబయట ఎండలోనే శ్రమిస్తున్నారు. పెద్ద పెద్ద గొడుగుల కింద పనిచేస్తున్నారు. పలువురు కార్మికులను సాక్షి పలకరించగా... ఎంత ఎండయినా లెక్క చేయకుండా పనిచేయడం తమకు అలవాటేనన్నారు. ఎండాకాలంలోనే తమకు అధికంగా పనులు దొరుకుతాయని ఆనందంగా చెప్పారు.



గొడుగు కింద పనిచేస్తున్న వెల్డింగ్ కార్మికులు



టైర్ల షెడ్డులో పనిచేస్తున్న కార్మికులు



వెల్డింగ్ పనిలో నిమగ్నమైన కార్మికులు



సామానులను అన్‌లోడ్ చేస్తున్న కార్మికులు

గద్దే... నీవు చేసిన అభివృద్ధి ఎక్కడ?

మైనార్టీ నాయకుడు, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం సవాల్

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గానికి పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండీ ఏమీ చేయని అసమర్థుడు గద్దే రామ్మోహన్ అని మైనార్టీ నాయకుడు, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం అన్నారు. లబ్బీపేటలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లో మంచినీటి సమస్యను గద్దే పరిష్కరించారని ఆయన భార్య అనురాధ చెప్పడం హాస్యాస్పదం అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే కొండ ప్రాంతాల్లో రూ.5.50 కోట్లతో మంచినీటి పైప్‌లైన్లు వేశారన్నారు. గద్దే రామ్మోహన్, ఆయన భార్య అనురాధ, కొడుకులు నియోజకవర్గంలో పర్యటిస్తూ అభివృద్ధిని చూసి ఓటేయాలంటున్నారని, వారు చేసిన అభివృద్ధి ఏమిటో విడమర్చి చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంత అభివృద్ధి జరిగిందీ, టీడీపీ ప్రభుత్వంలో ఏమి చేశారో తేల్చుకుందాం చర్చకు రమ్మంటూ సవాల్ విసిరారు. తమ అసమర్థతను కప్పిపుచ్చుకుంటూ వాళ్లు చేసిందేమీ లేకపోయినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తాము చేసినట్లు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. వాళ్ల నోరు తెరిస్తే చెప్పేవన్నీ అబద్ధాలేనన్నారు. తూర్పు ప్రజలు మరోసారి మోసపోయేందుకు సిద్ధంగా లేరని, దమ్మున్న నేత దేవినేని అవినాష్‌ను గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని సయ్యద్ అలీ అన్నారు.

సేవ చేయడాన్ని అదృష్టంగా భావించాలి

ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవికిషోర్, చిత్రంలో అసోసియేషన్ సభ్యులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తోటివారికి సేవ, సహాయం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావించాలని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) విజయవాడ బ్రాంచ్ చైర్మన్ నిట్టా రవికిషోర్ అన్నారు. ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో గవర్నరుపేటలోని ఐసీఏఐ భవన్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నిట్టా రవికిషోర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అసోసియేషన్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రయాణికుల దాహార్తిని తీర్చడం కోసం ప్రతి ఏటా వేసవి కాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంటామని చెప్పారు. మంచినీటితో పాటుగా మజ్జిగను కూడా పంపిణీ చేస్తుంటామన్నారు. ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ కార్యదర్శి జయంత్ ఉప్పులూరితో పాటుగా విజయవాడ బ్రాంచ్ మాజీ చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

కిక్ బాక్సర్ పవన్‌కుమార్‌కు సత్కారం



పవన్‌కుమార్‌ను సత్కరిస్తున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ బంగార్రాజు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు క్రీడలను ప్రోత్సహించటంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందు వరుసలో ఉంటుందని జోనల్ మేనేజర్ ఎంవీవీ బంగార్రాజు తెలిపారు. చుట్టుగుంట బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయంలో శుక్రవారం ప్రముఖ కిక్ బాక్సర్ ప్రత్తి పవన్‌కుమార్ అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ కిక్ బాక్సర్ పవన్‌కుమార్ 3వ ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో బంగారు, కాంస్య పతకాలు సాధించటం అభినందనీయమన్నారు. యువ క్రీడాకారులు పవన్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడాకారుడు పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ టోర్నీలో తనకు రెండు మెడల్స్ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించిన ఆర్థిక సహకారం మరువలేనిదని కొనియాడారు. క్రీడలకు బ్యాంకు ప్రాముఖ్యత ఇవ్వటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. డెప్యూటీ జోనల్ మేనేజర్ జి.వి.సూర్యకిరణ్, బ్యాంక్ సిబ్బంది పవన్‌కుమార్‌ను అభినందించారు. అనంతరం పవన్‌కుమార్‌ను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు.

ముగిసిన భారతీ తీర్థ జన్మదిన వేడుకలు



వేద సభను నిర్వహిస్తున్న పండితులు

విజయవాడకల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకల సందర్భంగా దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం జరిగిన కార్యక్రమంలో మహాన్యాసపూర్వక ఏకాద రుద్రాభిషేకం, బిల్వార్చన, శ్రీ చక్రనవావరణార్చన, శాంతిహోమం, మృత్యుంజయ హోమం నిర్వహించారు. సాయంత్రం ఆది దంపతుల త్రిశతి నిర్వహించారు. క్షేత్ర ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ వేదపండితులను ఘనంగా సత్కరించారు. హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతి ఆదేశాలతో కార్యక్రమం నిర్వహించామన్నారు. వేద సంరక్షణకు, ధర్మరక్షణకు శృంగేరీ పీఠం నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: స్వరాంజలి సంగీత, సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వరహేల కార్యక్రమం ఆద్యంతం మధురంగా సాగింది. వ్యవస్థాపక సభ్యురాలు వడ్డాది కామేశ్వరి ఆధ్వర్యంలో గాయనీమణులు గోళ్ల విజయశ్రీ గుప్తా, ఆకుల నూకరత్నం, మండవ లక్ష్మీదాస్, సీతంరాజు మాధవి, మల్లాది శిరీష, గొర్తి లలిత, కొత్త రమణి భక్తిగీతాలు, లలిత గీతాలతో పాటు పలు తెలుగు హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. కామేశ్వరి మాట్లాడుతూ.. నగరంలో మహిళలే నిర్వాహకులుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రంగాల్లోని మహిళలు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ముస్లింలంతా కూటమి అభ్యర్థులను ఓడించాలి



నియమాక పత్రాలు అందజేస్తున్న ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా

పాయకాపురం(విజయవాడరూరల్): ముస్లిం మైనార్టీలందరూ ఏకమై కూటమి అభ్యర్థులను ఓడించాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా పిలుపునిచ్చారు. శుక్రవారం కండ్రికలో మస్జిద్ ఏ హబీబుర్రహ్మాన్ దగ్గర ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ ఆధ్వర్యంలో ముస్లిం యువకుల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్‌మీరా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి ఏఎంసీ కృషి చేస్తోందన్నారు. కమిటీలో యువత భాగస్వామ్యం అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. అందరూ ఏకమై సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఓడించాలన్నారు. ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ మద్దతుగా ఉండాలని కోరారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని శ్రీనివాస్, వెలంపల్లి శ్రీనివాసరావులను గెలిపించాలని కోరారు. కమిటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన వివరించారు. 64వ డివిజన యూత్ అధ్యక్షుడిగా అబ్దుల్ నజీర్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ చాన్ బాషలను నియమించి వారికి నియామక పత్రాలు అందజేశారు. సమావేశంలో కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కనులవిందుగా కూచిపూడి నృత్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ శ్రీ కోదండ రామాలయం శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం శ్రీ నృత్య కళా నిలయం నాట్యాచారిణి గోనిగుంట శ్రీశైలశ్రీ శిష్య బృందం చేసిన కూచిపూడి నృత్యాలు ఆహుతులను అలరించాయి.చిన్నారులు తరంగం, అన్నమాచార్య కీర్తనలకు అనుగుణంగా చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు కూచిపూడి నృత్యాలను భక్తిశ్రద్ధలతో వీక్షించారు.

టీడీపీ అభ్యర్థి గద్దెపై తొమ్మిది క్రిమినల్ కేసులు

అఫిడవిట్‌లో పేర్కొన్న రామ్మోహన్

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గద్దే రామ్మోహన్‌పై తొమ్మిది క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో మూడు, పటమట పోలీస్‌స్టేషన్లో మూడు, సూర్యారావుపేట స్టేషన్‌లో ఒకటి, తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ నిబంధనలకు విరుద్ధంగా, ప్రజలకు అసౌకర్యం కలిగించేలా చట్ట ఉల్లంఘనకు పాల్పడినందుకు గాను ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో ఆయా కేసులు నమోదయ్యాయి. అందులో మూకుమ్మడిగా దాడి చేసిన కేసులతో పాటు, అసెంబ్లీలో చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించడం, ఆస్తుల ధ్వంసం, అక్రమ ప్రవేశం, అనుమతి లేకుండా ధర్నా చేయడం, ప్రజలు ఇబ్బంది పడేలా వ్యవహరించడం వంటి అంశాల్లో కేసులు నమోదయ్యాయి. తన పేరిట రూ.3,97,48,000, తన భార్య పేరిట రూ.9,57,65,500 ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

ఘనంగా పీబీ సిద్ధార్థ కాలేజీ స్పోర్ట్స్ డే వేడుకలు



పారితోషకాలు అందుకున్న విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

విజయవాడస్పోర్ట్స్: పీబీ సిద్ధార్థ కాలేజీ 49వ స్పోర్ట్స్ డే వేడుకలు కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. 2023–24 విద్యా సంవత్సరంలో వివిధ క్రీడల్లో రాణించిన క్రీడాకారులను ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించి కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చిన 15 మంది క్రీడాకారులకు పూర్తి ఫీజు రియింబర్స్‌మెంట్(రూ.5.51 లక్షలు) అందించారు. యూనివర్సిటీ స్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహించిన 51 మందికి, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించిన 44 మంది క్రీడాకారులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ విద్యా సంవత్సరంలో కళాశాల ఉత్తమ అథ్లెట్‌గా ఎన్.విజయమోహన్, మహిళా ఉత్తమ అథ్లెట్‌గా లక్ష్మీసాయి దుర్గను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకటేశ్వర్లు, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ ఆచార్య రాజేష్ సి.జంపాల, వ్యాయామ అధ్యాపకులు ఎ.చినబాబు, పి. మార్కండేయులు పాల్గొన్నారు.

బాబుకు మిగిలింది గులక రాళ్లే...

చంద్రబాబు మేనిఫెస్టో ఎన్నికలు ముగిసేదాకా రంగురంగుల స్వప్నాలను చూపిస్తుంది. ఆ తరువాత చెత్తబుట్టలో మినహా ఎక్కడా కనిపించదు. ఎన్నికల తరువాత మోసాలు చేయడం చంద్రబాబు నైజం! ఆయన పాలనలో చరిత్రలో నిలిచిపోయే మైలు రాళ్లు ఏవీ లేవు. మంచి వ్యవస్థలు గానీ, పథకాలుగానీ, ప్రజలకు చేసిన మంచిగానీ ఒక్కటీ లేవు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు అధికారంలో ఉన్నా ఆయన పేరు చెబితే గుర్తుకొచ్చే మంచి పనిగానీ, పథకాలుగానీ ఒక్కటీ లేవు. కాబట్టే నాపై వేయించటానికి చంద్రబాబుకు, ఆయన కూటమికి చివరకు గులక రాళ్లే మిగిలాయి.


సభకు హాజరైన అశేష జనసందోహానికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మన మైలు రాళ్లు..

గత 58 నెలల పాలనలో మనం వేసిన పునాది రాళ్లు, మైలు రాళ్లు చరిత్రలో ఎప్పటికీ విప్లవాలుగా నిలిచిపోతాయి. కాబట్టే మనం జెండా తలెత్తుకుని ఎగురుతోంది. వారి జెండా మరో నాలుగు జెండాలతో జత కట్టినా కూడా ఎగరలేక కింద పడుతోంది. ఈ ఇంటింటి అభివృద్ధి కొనసాగాలా? వద్దా? ఆలోచన చేయమని కోరుతున్నా. ఫ్యాన్‌కు రెండు ఓట్లు వేస్తేనే ఈ అభివృద్ధి కొనసాగుతుందని ప్రతి ఇంట్లో స్టార్ క్యాంపైనర్లుగా ముందుకు వచ్చి వివరించాలి. బాబు గత చరిత్రను, 2014లో ఇదే కూటమి పేరుతో చేసిన మోసాలను ప్రతి ఇంటికీ గుర్తు చేయాలి.

బాబు గురి గులకరాయిపైనే!

కాకినాడ జిల్లా అచ్చంపేట జంక్షన్ సిద్ధం సభలో సీఎం జగన్ ధ్వజం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ''ఎన్నికలకు ఇక 25 రోజులే ఉన్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ న గారా కూడా మోగింది. ఇంటింటి ఆత్మగౌరవాన్ని, పేదలు, అక్కచెల్లెమ్మల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్న మనందరి ప్రభుత్వానికి మద్దతు పలికేందుకు మీరంతా సిద్ధమేనా? జన్మభూమి కమిటీల నుంచి చంద్రబాబు దాకా పెత్తందార్ల దోపిడీకి, మనందరి పేదల పక్షపాత ప్రభుత్వానికి మధ్య ఈరోజు క్లాస్‌వార్ జరుగుతోంది. చంద్రబాబు సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నా ఆయన పేరు చెబితే గుర్తుకొచ్చే మంచి పనిగానీ, పథకాలుగానీ ఒక్కటీ లేవు కాబట్టే నాపై వేయించటానికి బాబుకు, ఆయన కూటమికి చివరకు గులక రాళ్లే మిగిలాయి. ఈ యుద్ధంలో ఆ పేదల వ్యతిరేక కూటమిని చిత్తుగా ఓడించేందుకు మీరంతా సిద్ధమేనా? మరోసారి జైత్రయాత్రకు సింహగర్జనతో సిద్ధం కావాలి. ఫ్యాన్‌కు 2 ఓట్లు వేసి రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకుందాం''అని సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాకినాడ జిల్లా అచ్చంపేట జంక్షన్‌లో జరిగిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభలో భారీ జనసందోహాన్ని ఉద్దేశిస్తూ ఆయన ప్రసంగించారు.

పసుపు పతి నిద్ర లేస్తాడు.. జాగ్రత్త!

అభిమాన సముద్రంగా మారిన వరద గోదావరి ఇవాళ ఇక్కడ కనిపిస్తోంది. ఐదేళ్లుగా మనందరి ప్రభుత్వం మంచి చేసిందన్న నమ్మకం ఇక్కడ కనిపిస్తోంది. ఆ మంచిని కాపాడుకోవాలన్న సంకల్పం ఈ రోజు మీ అందరిలో కనిపిస్తోంది. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి కాదు. రాబోయే ఐదేళ్లు.. అంటే 1,825 రోజులు.. రాబోయే 60 నెలల పాటు మన బతుకులు ఎలా ఉంటాయి? అనేది నిర్ణయించే మన ఓటు ద్వారా ప్రభుత్వాన్ని ఎన్నుకుంటాం. మీకు ఈరోజు జగన్ ద్వారా అందుతున్న పథకాలు ఇక మీదట కూడా అందాలా? లేక అవి రద్దు కావడం అన్నది మీ ఓటుపైనే ఆధారపడి ఉంటుందని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. జగన్‌కు ఓటు వేస్తే.. ఫ్యాన్‌పై రెండు ఓట్లు వేస్తే పథకాలన్నీ కూడా కొనసాగుతాయి. లేదంటే బాబు మార్కు మోసాలతో పథకాలన్నీ ముగిసిపోతాయి. ఇది చరిత్ర చెబుతున్న నిజం. బాబు మోసాల మేనిఫెస్టో చెబుతున్న వాస్తవం. ఫ్యాన్‌కు ఓటు వేస్తే గ్రామగ్రామాన, పట్టణాల్లో సేవలందిస్తున్న జగన్ మార్కు సచివాలయాలన్నీ కొనసాగుతాయి. లేదంటే సచివాలయాల సేవలకు బాబు మార్కు కత్తిరింపులు, ముగింపు తథ్యం. ఫ్యాన్‌కు ఓటు వేస్తే అవ్వాతాతలకు ఇంటివద్దే రూ.3,000 పెన్షన్ అందుతుంది. ఇంటికే వచ్చి సేవలందిస్తున్న వలంటీర్ల ద్వారా జగన్ మార్కు పౌర సేవల వ్యవస్థ కొనసాగుతుంది. ఏకంగా రూ.2.70 లక్షల కోట్లను వివిధ పథకాల ద్వారా గత 58 నెలల్లో డీబీటీ ద్వారా మీ బిడ్డ నేరుగా బటన్ నొక్కి అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి జమ చేశాడు. ఎక్కడా లంచాలు, వివక్ష లేదు. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే మళ్లీ చంద్రముఖి నిద్ర లేస్తుంది. మళ్లీ పసుపు పతి నిద్ర లేస్తాడు! వదల బొమ్మాళీ.. వదల.. అంటూ మళ్లీ ఐదేళ్లు మీ రక్తం తాగేందుకు ప్రతి ఇంటికీ వస్తాడు. జాగ్రత్త సుమా..!



కాకినాడ అభ్యర్థులను దీవించండి

ఎంపీ అభ్యర్థి సునీల్, కాకినాడ రూరల్ అభ్యర్థి కన్నబాబు, కాకినాడ నుంచి చంద్రన్న, జగ్గంపేట నుంచి తోట నర్సింహులు అన్న, పెద్దాపురం నుంచి దొరబాబు, ప్రత్తిపాడు నుంచి సుబ్బారావు అన్న, తుని నుంచి రాజా, పిఠాపురం నుంచి నాకు అమ్మలాంటి గీతమ్మను దీవించి గొప్ప మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నా.

ఒక్క ఫ్యాన్‌కు రెండు ఓట్లు వేస్తేనే..

ఫ్యాన్‌కు ఓటు వేస్తేనే విత్తనం నుంచి పంట విక్రయం వరకూ ఇప్పుడు సేవలందిస్తున్న ఆర్బీకేలు కొనసాగుతాయి. లేదంటే ఆర్బీకేలకు బాబు మార్కు కత్తిరింపులు, ముగింపు ఖాయం. ఫ్యాన్‌కు ఓటు వేస్తేనే రైతన్నలకు వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం ఏటా క్రమం తప్పకుండా అందుతుంది. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేస్తేనే ఉచిత పంటల బీమా, సున్నావడ్డీకే పంట రుణాలు, సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ, పగటిపూటే వ్యవసాయానికి 9 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్తు, దళారీలు లేని ఆర్బీకే వ్యవస్థతో ధాన్యం కొనుగోళ్లు నిరాటంకంగా జరుగుతాయి. లేదంటే మళ్లీ చంద్రబాబు మార్కు పాలన, మళ్లీ కత్తిరింపులు, పథకాలన్నీ ముగింపు జరుగుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఆలోచన చేయండి.

పెద్దవారి పిల్లలు అసూయపడేలా..

ఫ్యాన్‌కు ఓటు వేస్తేనే.. గవర్నమెంట్ బడుల్లో ఇంగ్లిష్ మీడియం, రూపురేఖలు మారిన స్కూళ్లు, 3వ తరగతి నుంచే టోఫెల్ శిక్షణ, సబ్జెక్టు టీచర్ కాన్సెప్ట్, బైజూస్ కంటెంట్, 6వ తరగతి నుంచి డిజిటల్ బోధన, ఐఎఫ్‌పీ ప్యానళ్లు, 8వ తరగతి నుంచి పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు, ఉన్నత చదువులకు 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, డిగ్రీ విద్యార్థులకు సర్టిఫైడ్ ఆన్‌లైన్ వర్టికల్స్ ద్వారా విదేశీ వర్సిటీలతో మన కాలేజీల అనుసంధానం, తొలిసారిగా డిగ్రీలో తప్పనిసరి ఇంటర్న్‌షిప్.. ఇవన్నీ కొనసాగుతాయి. మీ జగన్ ఇదే స్థానంలో ఉంటే మరో పదేళ్లలో పేద పిల్లలు ఏ స్థాయిలో ఇంగ్లిష్ మాట్లాడతారంటే.. వారు అనర్గళంగా మాట్లాడే మాటలకు పెద్దవారి పిల్లలు అసూయ పడే పరిస్థితి వస్తుంది.

బాబుకు ఓటేస్తే కత్తిరింపులు.. ముగింపు

ఫ్యాన్‌పై రెండు ఓట్లు పడితే జగన్ మార్కు విప్లవాలన్నీ కొనసాగుతాయి. లేదంటే గవర్నమెంట్ బడుల్లో ఇంగ్లిష్ మీడియం రద్దు, స్కూళ్ల రూపురేఖలు మార్చే నాడు–నేడు రద్దు, బడి పిల్లలకు రోజుకో మెనూతో ఇచ్చే గోరుముద్ద రద్దు, బడులు తెరిచే సమయానికి పిల్లలకు ఇస్తున్న విద్యాకానుక రద్దు, 6వ తరగతి నుంచి డిజిటల్ బోధన రద్దు.. 8వ తరగతి నుంచి పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు రద్దు.. వీటన్నిటికీ కత్తిరింపులు ముగింపే! 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు.. విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు రద్దు అవుతాయి. అందుకే ఆలోచన చేయండి. పొరపాటు జరిగిందంటే..మళ్లీ చంద్రముఖి నిద్ర లేస్తుంది. నిద్ర లేచి మీ పిల్లల చదువులు, బడులు అన్నిటికీ లకలక.. లకలక అంటూ ముగింపు పలుకుతుంది.

విప్లవాత్మక పాలన కొనసాగేందుకు..

ఫ్యాన్‌కు ఓటు వేస్తేనే గ్రామాల్లోనే విలేజీ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, ఇంటికే ఆరోగ్య సురక్ష, ఇంటి వద్దే పరీక్షలు – మందులు, నాడు– నేడుతో రూపురేఖలు మారిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉత్తమ సేవలు, రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీతో ఉచిత వైద్యం, ఆపరేషన్ తరువాత జీవన భృతి కోసం ఇబ్బంది పడకుండా ఆరోగ్య ఆసరా, 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం లాంటి ప్రతి పేదవాడిని బతికించే జగన్ మార్కు విప్లవాత్మక పాలన కొనసాగుతుంది. లేదంటే మళ్లీ చంద్రముఖి నిద్ర లేస్తుంది. వదల బొమ్మాళీ అంటుంది. పేదవాడు అప్పుల పాలై వైద్యం అందని పరిస్థితుల్లోకి తీసుకెళ్తుంది ఆ చంద్రముఖి. ఫ్యాన్‌కు ఓటు వేస్తేనే అక్కచెల్లెమ్మల రాజ్యం, పిల్లలను బడులకు పంపే అమ్మలకు అమ్మ ఒడి, చదువులకు ఇబ్బంది లేకుండా విద్యా దీవెన, వసతి దీవెన, ఆసరా, సున్నా వడ్డీ, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ జగనన్న కాలనీలు, 31 లక్షల ఇళ్ల పట్టాలు, 22 లక్షల గృహాల నిర్మాణం.. అన్నీ కొనసాగి వేగంగా అడుగులు ముందుకు పడతాయి.

గతంలో నాకు ఓట్లేయని వారూ ఆలోచించండి..

పొదుపు సంఘాల మహిళలకు బాబు చేసిన మోసాలు గుర్తున్నాయా? ఓటు వేసే ముందు మీ కుటుంబమంతా కూర్చుని బాగా ఆలోచన చేయండి. ఒకటికి పదిసార్లు ఆలోచన చేయండి. ఎవరివల్ల మంచి జరిగింది? ఎవరు ఉంటే మీ ఇంటికి మంచి జరుగుతుందనే ఆలోచనతో ఓటు వేయాలని కోరుతున్నా. మీ తలరాతలను మార్చే ఎన్నికలివి. మీకు మంచి చేసిన మీ బిడ్డ పాలన కొనసాగాలా? లేక రాష్ట్రాన్ని పెత్తందార్లు అందరూ కలసి దోచుకుని, పంచుకునే కూటమి పాలన కావాలా? 58 నెలలుగా మనం చేసిన మంచి ప్రతి ఇంట్లో కనిపిస్తోంది. గత ఎన్నికల్లో పలు కారణాల వల్ల ఇతర పార్టీలకు ఓటు వేసిన వారిని కూడా ఆలోచన చేయమని కోరుతున్నా. కులం కారణం కావచ్చు.. ఎప్పటి నుంచో ఆ పార్టీలో ఉన్నామనే కారణం కావచ్చు.. లేదా ఇతర కారణాలు కావచ్చు.. ఆ అన్నదమ్ములను, అక్కచెల్లెమ్మలను, అవ్వాతాతలను కూడా అడుగుతున్నా. గత ఎన్నికల్లో మీరు నాకు ఓటు వేయకపోయినా ఈ ఐదేళ్లలో మంచి చేసిన ప్రభుత్వం మనది కాదా? అని ఒక్కసారి ఆలోచన చేయమని కోరుతున్నా. మీ ఇంటికి వచ్చిన పసుపు నాయకులు, గ్లాస్ నాయకులు అబద్ధాలు చెప్పవచ్చుగానీ మీ కుటుంబానికి, మీ బ్యాంక్ ఖాతాల్లోకి 58 నెలల పాలనలో జమ అయిన, చేతికి అందిన పథకాల డబ్బులు మీకు నిజాలే చెబుతాయి. ఇంటికే వలంటీర్ల సేవలు, ఇంటి వద్దకే పెన్షన్, రేషన్, వైద్యం, సర్టిఫికెట్లు, ఇళ్ల పట్టాలు.. ఇవన్నీ మీకు నిజాలే చెబుతాయి. మారిపోయిన మన గవర్నమెంట్ స్కూళ్లు, పిల్లల చదువులు, గ్రామంలోనే వైద్య సేవలు, వ్యవసాయం.. ఇవన్నీ మీకు వాస్తవాలు చెబుతాయి. ఎవరి పాలనలో మీకు మంచి జరిగిందో ఆలోచన చేయండి.

2014లో బాబు మోసాలివీ..

రైతులకు రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ అయ్యాయా?

పొదుపు సంఘాల రుణాలు రూ.14,205 కోట్లు మాఫీ చేస్తామని చెప్పి కనీసం ఒక్క రూపాయైనా మాఫీ చేశాడా?

ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద బ్యాంకులో రూ.25 వేలు డిపాజిట్ చేస్తామన్నాడు. ఎవరికైనా ఒక్క రూపాయి డిపాజిట్ చేశారా?

ఇంటికో ఉద్యోగం లేదంటే రూ.2 వేల చొప్పన నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు.

ఐదేళ్లలో అంటే 60 నెలల పాటు నెలకు రూ.రెండు వేలు చొప్పన ప్రతి ఇంటికి రూ.1.20 లక్షలు ఇచ్చాడా?

అర్హులైన వారందరికి మూడు సెంట్ల స్థలం, కట్టుకునేందుకు పక్కా ఇల్లు ఇస్తామన్నారు. ఏ పేదవాడికైనా ఒక్కటంటే ఒక్క సెంటు స్థలం ఇచ్చాడా?



రూ.10 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అన్నాడు. చేనేత, పవర్‌లూమ్స్ రుణాలు మాఫీ అన్నాడు. మరి అయ్యాయా?

మహిళా ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మరి చేశాడా?

సింగపూర్‌కు మించి అభివృద్ధి చేస్తామన్నాడు.. చేశాడా?

ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. నిర్మించాడా? కాకినాడలో కనిపిస్తోందా? పోనీ పిఠాపురంలో కట్టారా?

పోనీ ప్రత్యేక హోదా తెచ్చాడా? అదీ లేదు.

ఇప్పుడు సూపర్ సిక్స్, సెవెన్, ఇంటికి కేజీ బంగారం అంటూ మళ్లీ మోసాలకు తయారయ్యారు.

ఇన్ని మోసాలతో పోరాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కాపాడుకునే ఈ యుద్ధానికి మీరంతా సిద్ధమేనా? సిద్ధమైతే వారి చీకటి యుద్ధాన్ని, ఆ ఎల్లో మీడియా, సోషల్ మీడియా అసత్యాల యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు మీ జేబు నుంచి సెల్‌ఫోన్లు బయటకు తీసి టార్చిలైట్లు వెలిగించండి. వలంటీర్లు మళ్లీ మన ఇంటికే రావాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు లేని వ్యవస్థలు, మన చదువులు, పిల్లలు, రైతన్నలు బాగుండాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కి 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లో భారీ మెజార్టీతో గెలిపించాలి.


సభకు హాజరైన భారీ జనసందోహానికి ర్యాంప్ చివరి వరకు వచ్చి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

బాబు సిట్ అంటే సిట్.. స్టాండ్ అంటే స్టాండ్!

ఇంటింటికీ మంచి చేశాడు కాబట్టి ఈ ఎన్నికల యుద్ధానికి మీ బిడ్డ ఒంటరిగా బయల్దేరాడు. అందరినీ మోసం చేశారు కాబట్టి, చెప్పుకునేందుకే ఏ మంచిపనీ లేదు కాబట్టి వారంతా కూటమిగా ఏకమయ్యారు. మిగతా పార్టీల్లోకి చంద్రబాబు తన మనుషులను పంపితే ఏర్పడిన కూటమి అది. అది దత్తపుత్రుడు టికెట్లు ఇస్తే ఏర్పాటైన కూటమి కాదు. ఎన్ని టికెట్లు ఇవ్వాలి? ఎవరు పోటీ చేయాలి? చివరికి ఆ ప్యాకేజీ స్టార్ ఎక్కడ నిలబడాలో కూడా బాబు నిర్ణయిస్తేనే కుదిరిన పొత్తులవి. ఆ ప్యాకేజీ స్టార్‌ను భీమవరం.. గాజువాక.. పిఠాపురం.. ఇలా ఎక్కడ నిలబెడితే బాబుకు ప్రయోజనం కలుగుతుందనుకుంటే అక్కడ నిలబెట్టిన పరిస్థితి!

ఇక బాబు సిట్ అంటే సిట్.. స్టాండ్ అంటే స్టాండ్! జగన్‌ను తిట్టు అంటే తిట్టు..! కొట్టు అంటే కొట్టు..! దత్తపుత్రా నీకిచ్చేది 80 కాదు.. 20 అంటే అందుకు కూడా జీ హుజూర్! ఇదీ ప్యాకేజీ స్టార్ పరిస్థితి!

కులాన్ని హోల్‌సేల్‌గా అమ్మేయగలననే భ్రమతో..

ఏపీని హోల్‌సేల్‌గా దోచుకునేందుకు, దోచుకున్నది పంచుకునేందుకు చంద్రబాబు రాజకీయాలు చేస్తుంటే.. కులాన్ని హోల్‌సేల్‌గా బాబుకు అమ్మేయగలననే భ్రమతో ప్యాకేజీ స్టార్ రాజకీయం చేస్తున్నాడు. ఈయనకు ఏపీ అంటే ఎంత చులకన అంటే.. జ్వరం వస్తే పిఠాపురం వదిలి హైదరాబాద్ వెళ్తాడు. ఏ ప్రాంతమన్నా ప్రేమ ఉండదు ఈ మ్యారేజీ స్టార్‌కు. ఏ భార్య అయినా ప్రేమ ఉండదు! పెళ్లిళ్లే కాదు..నియోజకవర్గాలు కూడా మార్చేశాడు. వెనుకటికి ఒకడు పెళ్లికి పిఠాపురం వెళ్తూ పిల్లిని చంకన బెట్టుకెళ్లాడట! ఆ పిల్లిని చంకన బెట్టుకెళ్లింది ఎవరో ఇంతకాలం ఎవరికీ అర్థం కాలేదు. బాబు తన చంకలో ఉన్న పిల్లిని పిఠాపురంలో వదిలినట్లు ఇప్పుడు అర్థమైంది. ఇదీ గాజు గ్లాస్ పార్టీ పరిస్థితి. ఈ గ్లాస్‌తో గటగట తాగేది బాబు.. దాన్ని తోమి, తుడిచి మళ్లీ బాబుకు అందించేది మాత్రం.. ఈ ప్యాకేజీ స్టార్!

బాబు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్‌తో.. బీజేపీలోకి వదినమ్మ

ఈ కూటమిలో వదినమ్మ బాబు చేరమంటే కాంగ్రెస్‌లో చేరింది. ఇదే బాబు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ ఇచ్చిన వెంటనే బీజేపీలో చేరారు. బాబు పొడవమంటే సొంత తండ్రికే వెన్నుపోటు పొడిచేసింది! 30 ఏళ్లుగా ఏ పార్టీలో ఉన్నా.. బాబు కోవర్టుగా అదే పనిలో ఉంది. బీజేపీలో ఉన్నా బాబు ఎవరికి సీటు ఇవ్వమంటే వారికే ఇస్తారు. వద్దంటే వారిని ఆపేస్తారు, మారుస్తారు. చంద్రబాబు ప్యాకేజీలు, ప్రలోభాలు ఏ స్థాయిలో ఉంటాయంటే.. బీఫామ్ బీజేపీదైనా, కాంగ్రెస్‌దైనా, టీ గ్లాస్‌దైనా యూనిఫామ్ మాత్రం అంతా చంద్రబాబుదే!

మత్స్యకారులకు మాటిస్తున్నా..

కాసేపటి క్రితం కన్నబాబు అన్న మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యల గురించి ప్రస్తావించారు. నాకు మంచి మనసు ఉంది కాబట్టే.. ముమ్మిడివరంలో జరిగిన నష్టాన్ని, ఎప్పటి నుంచో పరిష్కారం కాని సమస్యను పరిష్కరించాం. ఓఎన్‌జీసీ కమిటీని ఏర్పాటు చేయటానికి మీ బిడ్డ ప్రభుత్వ చొరవే కారణమనే విషయాన్ని గుర్తు పెట్టుకోండి. కమిటీ సిఫారసులు ఆధారంగా ప్రతి మత్స్యకార కుటుంబానికి మంచి జరిగేలా మీ బిడ్డ తోడుగా ఉంటాడని మాట ఇస్తున్నా.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

- సీఎం జగన్ సమక్షంలో చేరిన టీడీపీ, జనసేన, కాంగ్రెస్ ముఖ్య నేతలు
- సినీ నటుడు గౌతంరాజు కూడా..

రాజానగరం/పట్నంబజారు(గుంటూరు): టీడీపీ, జనసేన, కాంగ్రెస్‌కు చెందిన పలువురు ముఖ్య నేతలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా ఎస్టీ రాజాపురం వద్ద బస చేసిన సీఎం జగన్ సమక్షంలో కాకినాడ మాజీ మేయర్, జనసేన నేత సరోజ, టీడీపీకి చెందిన ఏలేశ్వరం నగర పంచాయతీ మాజీ చైర్మన్ పైలా సత్యనారాయణ, ఆయన తనయుడు పైలా బోసు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సతివాడ రాజేశ్వరరావు, కౌన్సిలర్ జి.వీర్రాజు, చింతల పాండవులు, 2014లో పిఠాపురం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పంతం ఇందిర, పంతం నెహ్రూ, టీడీపీ నేతలు తోట సుబ్బారావు నాయుడు, ముత్యాల శ్రీనివాస్, జనసేన నేత విజయ్‌గోపాల్‌తో పాటు సినీ నటుడు గౌతంరాజు తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు.


సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన మాజీ కార్పొరేటర్ సైదా

అలాగే గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన టీడీపీ మాజీ కార్పొరేటర్ షేక్ సైదా, మొండిబండ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణ, టీడీపీ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు మేకల మాధవ్ యాదవ్ వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సీఎం జగన్ సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. కాకినాడ మాజీ మేయర్ సరోజ మాట్లాడుతూ.. జనసేన పార్టీలో బీసీలకు సరైన గుర్తింపు, గౌరవం లేవన్నారు. పవన్‌కళ్యాణ్ ఒక్క బీసీకి కూడా టికెట్ ఇవ్వలేదని మండిపడ్డారు. బీసీలకు సముచిత స్థానం ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విధానాలు నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు.


సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నేత మనుక్రాంత్ రెడ్డి


సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన కాకినాడ మాజీ మేయర్ సరోజ

నేడు మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఇలా..

- ఉదయం 9 గంటలకు గోడిచర్ల నుంచి సీఎం యాత్ర ప్రారంభం
- మధ్యాహ్నం అచ్యుతాపురం వద్ద భోజన విరామం
- సాయంత్రం చింతపాలెం వద్ద బహిరంగ సభ
- చిన్నయపాలెం వద్ద రాత్రి బస



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర 19వ రోజైన శనివారం(ఏప్రిల్ 20) షెడ్యూల్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం శుక్రవారం విడుదల చేశారు. ఈ యాత్రలో భాగంగా సీఎం జగన్ శుక్రవారం రాత్రి బస చేసిన గోడిచర్ల ప్రాంతం నుంచి శనివారం ఉదయం 9 గంటలకు బయలుదేరుతారు. నక్కపల్లి, పులపర్తి, యలమంచిలి బైపాస్ మీదుగా అచ్యుతాపురం చేరుకుని భోజన విరామం తీసుకుంటారు. అనంతరం నరసింగపల్లి మీదుగా సాయంత్రం 3.30 గంటలకు చింతపాలెం వద్దకు సీఎం జగన్ చేరుకొని బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. బయ్యవరం, కశింకోట, అనకాపల్లి బైపాస్, అసకపల్లి మీదుగా చిన్నయపాలెం వద్ద ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి సీఎం జగన్ చేరుకుంటారు.

కాకినాడ జిల్లా సిద్ధమా?

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర శుక్రవారం కాకినాడ జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా 'కాకినాడ జిల్లా సిద్ధమా?' అంటూ సీఎం జగన్ ట్వీట్ చేశారు. ప్రజలు కూడా భారీ సంఖ్యలో బస్సు యాత్రలో పాల్గొని సీఎం జగన్‌కు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు.
-సాక్షి, అమరావతి

18 వ రోజు

స్టార్ క్యాంపెయినర్‌లతో

సీఎం వైఎస్ జగన్

'మేమంతా సిద్ధం బస్సు యాత్రలో 18వ రోజున నా స్టార్ క్యాంపెయినర్లతో' అంటూ సీఎం జగన్ శుక్రవారం కొన్ని ఫొటోలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్టు చేశారు.





పిఠాపురం: సీఎం జగన్ రోడ్‌షో సందర్భంగా రహదారికి ఇరువైపులా బారులుతీరిన జనసందోహం



రంగంపేట: రోడ్ షోకు హాజరైన భారీ జనసందోహానికి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

భగభగల్లోనూ బ్రహ్మరథం

కోలాహలంగా 18వ రోజు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర

సీఎం జగన్ తెచ్చిన వ్యవసాయ సంస్కరణలు రైతును తిరిగి బతికించాయి. గతంలో వ్యవసాయం చేసి పండించిన పంటను దళారులకు అమ్ముకోవాల్సి వచ్చేది. వారు చెప్పిందే ధర. ఆరుగాలం కష్టపడితే లాభం రాకపోగా, నష్టమే కనిపించేది. ఎవరికీ చెప్పుకోవడానికి లేదు. ఇప్పుడు మా గ్రామంలోనే రైతుభరోసా కేంద్రం వచ్చింది. రైతుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు ఇక్కడే ఇస్తున్నారు. పంట నష్టపోతే బీమా అందిస్తున్నారు. నేను 18 ఎకరాలు సాగుచేస్తున్నాను. వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రూ.4 లక్షల వరకు లబ్ధిపొందాను. ఇన్నేళ్ల నా జీవితంలో రైతు ఆనందంగా ఉన్నది ఇప్పుడే చూస్తున్నాను. ఇలాంటి నాయకుడే మళ్లీ సీఎం కావాలి.

– సత్యనారాయణ, రైతు, రంగంపేట గ్రామం, అనపర్తి నియోజకవర్గం

('మేమంతా సిద్ధం' బస్సుయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, అభిమానుల కోలాహలం మధ్య సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర 18వ రోజు శుక్రవారం కాకినాడ జిల్లాలో కోలాహలంగా సాగింది. అనపర్తి మండలం రంగంపేటకు సమీపంలోని ఎస్‌టీ రాజపురం వద్ద ఏర్పాటుచేసిన నైట్ స్టే పాయింట్ నుంచి ఉదయం రంగంపేట, పెద్దాపురం బైపాస్, సామర్లకోట బైపాస్, ఉండూరు మీదుగా కాకినాడకు చేరుకుంది. మార్గమధ్యంలో మహిళలు హారతులు పట్టి సీఎం జగన్‌కు జేజేలు పలికారు. తమ అభిమాన నేతను చూసేందుకు వృద్ధులు.. రైతులు.. అక్కచెల్లెమ్మలు పల్లెల నుంచి పరుగుపరుగున రంగంపేటకు చేరుకున్నారు. సూరంపాలెం వరకు 8 కి.మీ. మేర తమ అభిమాన నేత వెంట నడిచారు. సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ వద్ద విద్యార్థులు 'థ్యాంక్యూ సీఎం సర్' అంటూ భారీ బ్యానర్‌తో స్వాగతం పలికారు. మీవల్లే మేం ఉన్నత చదువులు చదువుకోగలుగుతున్నాం. 'అన్నా.. నువ్వు జాగ్రత్త, క్షేమంగా వెళ్లి.. సీఎంగా తిరిగి రా' అంటూ ఒకరు.. 'మొనగాడిలా ఒక్కడే వస్తాడు.. చరిత్ర సృష్టిస్తాడు' అని ఇంకొకరు.. 'పేదవాడి ఇంట్లో కష్టం లేకుండా ఉండాలంటే మళ్లీమళ్లీ నువ్వే సీఎంగా రావాలన్నా' అంటూ మరో విద్యార్థి, 'అన్నా నువ్వు జాగ్రత్త.. నీ ఆరోగ్యం జాగ్రత్త..' 'వైనాట్ 175.. వన్స్‌మోర్ సీఎం జగనన్న..' వంటి ప్లకార్డులతో విద్యార్థులు తమ ఆనందాన్ని, అభిమానాన్ని చాటారు.

జగన్నినాదాలతో హోరెత్తిన రంగంపేట..

ఉదయం ఎస్‌టీ రాజపురం వద్ద ప్రారంభమైన యాత్రకు గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన ప్రజలతో రంగంపేట కిక్కిరిసిపోయింది. దారిపొడవునా జనం జగన్ నినాదాలతో హోరెత్తించారు. సామర్లకోట సెంటర్ వద్ద మహిళలు జగన్ కాన్వాయ్‌కి హారతులిచ్చారు. జానపద నృత్యాలు, తీన్‌మార్ నృత్యాలతో జననేతకు స్వాగతం పలికారు. అచ్చంపేట ఫ్లైఓవర్ వద్ద ఓ పాత ఫొటోతో ఎదురువస్తున్న వృద్ధురాలిని చూసిన జగన్ తన వాహనాన్ని ఆపి ఆమెను పలకరించగా.. తన పేరు మోర్త కుమారి అని, గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ మార్గంలో వచ్చినప్పుడు తాను జున్ను పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పుడు ఆయన వచ్చారు, ఇన్నేళ్లకు మీరు వచ్చారంటూ ఆమె తెగ సంబరపడింది. అలాగే, కాకినాడ జిల్లా నాయకంపల్లి వద్ద సీఎం కాన్వాయ్ వెళ్తున్న సమయంలో కృష్ణవేణి అనే రోగిని తీసుకుని ఆమె బంధువులు జగన్ కోసం ఎదురుచూస్తూ రోడ్డుపై వేచివున్నారు. వీరిని చూసి జగన్ తన వాహనాన్ని ఆపి వారి వద్దకు నడుచుకుంటూ వెళ్లారు. వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. చికిత్స నిమిత్తం ఖర్చుచేసిన బిల్లులను జాగ్రత్తచేయాలని పేషెంట్ బంధువులకు సూచించారు. కృష్ణవేణికి అవసరమైన వైద్య సహాయాన్ని అందించే చర్యలను తక్షణమే చేపట్టాలని ఆరోగ్యశ్రీ అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. మనసున్న మారాజు అని, ప్రజా సమస్యలపట్ల జగన్ స్పందిస్తున్న తీరును చూసి మళ్లీ సీఎంగా ఆయనే రావాలని అక్కడున్న వారంతా బలంగా కోరుకున్నారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం ఉండూరు క్రాస్ నుంచి బయల్దేరి కాకినాడ రూరల్ అచ్చంపేట జంక్షన్ వద్ద బహిరంగసభకు చేరుకున్నారు.



సామర్లకోట: రోడ్ షోకు హాజరైన పార్టీ శ్రేణులు, అభిమానులకు సీఎం జగన్ అభివాదం



రంగంపేట: అంబులెన్స్ వద్దకు వచ్చి యువతి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సీఎం జగన్

అభిమానం ముందు ఎండ ఎంత?

ఓ పక్క భానుడు భగభగలతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు బయటకు రావడానికి భయపడుతుంటే.. కాకినాడలో మాత్రం జనం ఎండను సైతం లెక్కచేయకుండా అచ్చంపేట జంక్షన్‌కు తండోపతండాలుగా తరలివచ్చారు. తమకు మేలు చేసిన ప్రజా నాయకుడు సీఎం జగన్ తమ ప్రాంతానికి వచ్చాడని చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. మా అభిమానం ముందు ఈ ఎండ తీవ్రత ఎంత.. అంటూ జగన్‌పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇక సభా ప్రాంగణమైతే జనంతో కిక్కిరిసిపోయింది. సభ అనంతరం యాత్ర పిఠాపురం, గొల్లప్రోలు, చేబ్రోలు, కత్తిపూడి, బెండపూడి, అన్నవరం, తుని మీదుగా యాత్ర సాగింది. కత్తిపూడి కూడలి నుంచి ప్రజలు ప్లకార్డులు పట్టుకుని మానవహారం నిర్వహించారు. లోవ సెంటర్‌లో అమ్మవారి ఆశీర్వాదం పొందారు.



తుని: లేజర్ షో వెలుగుల మధ్య సాగుతున్న రోడ్‌షోలో అభివాదం చేస్తున్న సీఎం జగన్

తునిలో రోడ్ షో హైలెట్

తునిలో నిర్వహించిన రోడ్డు షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లేజర్ లైటింగ్, యువత డ్యాన్సులతో సీఎం జగన్‌కు ఘనంగా స్వాగతం పలికారు. జాతీయ రహదారికి ఇరువైపులా అభిమానులు నిలబడి తమ అభిమాన నేతకు స్వాగతం పలికారు. జగన్ సాయంత్రం తుని వస్తారని తెలిసి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మధ్యాహ్నం నుంచే జాతీయ రహదారి పైకి భారీగా తరలివచ్చారు. కానీ ఆయన రాత్రి 8.25కు తుని చేరుకున్నారు. మహిళలు గుమ్మడికాయలతో హారతి ఇచ్చి దిష్టితీశారు. జగన్ బస్సుపై నుంచి వారికి అభివాదం చేస్తూ రాత్రి పాయకరావుపేటకు చేరుకున్నారు. జాతీయ రహదారిపై ఉన్న అభిమానులకు అభివాదం చేస్తూ రాత్రి 9.15 గంటలకు వడిచర్ల వద్ద నైట్ స్టే క్యాంపునకు జగన్ చేరుకున్నారు.

సామాన్యులకు 'కార్పొరేట్' చదువులు



జగన్ సర్ వచ్చాకే సామాన్యుల పిల్లలకు నాణ్యమైన చదువులు అందుతున్నాయి. మాది అనంతపురం జిల్లా గంగవరం గ్రామం. ఇంజినీరింగ్‌లో ర్యాంక్ రావడంతో కాకినాడ జిల్లాలో సీటు వచ్చింది. సీఎస్‌ఈ (డేటా సైన్స్)లో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ స్కూల్లోనే చదువుకున్నాను. జగన్ రాకముందు.. వచ్చాక రాష్ట్రంలో చదువులెలా ఉన్నాయో చాలా దగ్గర నుంచి గమనించాను. మా స్కూల్లోనే జగన్ సీఎం కాకముందు పరిస్థితి దారుణంగా ఉండేది. ఇప్పుడు కార్పొరేట్ స్థాయిలో సదుపాయాలు వచ్చాయి. స్కూల్లో ఉన్నప్పుడు అమ్మఒడి వచ్చింది. ఇప్పుడు జగనన్న విద్యాదీవెన పథకంతో ఇంజినీరింగ్ చేస్తున్నాను. మా అన్నయ్యకు కూడా విద్యాదీవెన అందుతోంది. మా నాన్నకు రైతుభరోసా వచ్చింది. ఇలాంటి సీఎంను నేను చూడలేదు.

– చైతన్యరెడ్డి, విద్యార్థిని, అనంతపురం జిల్లా

జగన్ సర్ రుణం తీర్చుకోలేనిది..



గతంలో ప్రభుత్వ స్కూళ్లలో చదువు అంటే భయమేసేది. టీచర్లు ఉండేవారు కాదు. టాయిలెట్లు ఉండేవి కావు. వర్షం వస్తే క్లాసరూంలు కారిపోయే పరిస్థితి ఉండేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రభుత్వ స్కూళ్లు కార్పొరేట్ స్థాయిలో ఉన్నాయి. చదువులు బాగున్నాయి. గతంలో ఇంజినీరింగ్ చేసినా ఉద్యోగం వస్తుందన్న గ్యారంటీలేదు. నా పాలిటెక్నిక్ చదువు పూర్తిగా ప్రభుత్వ సాయంతోనే పూర్తయింది. మా చెల్లి, తమ్ముడు (కజిన్స్)కి అమ్మఒడి వస్తోంది. నా డిప్లొమా అవుతుండగానే జాబ్ వచ్చింది, కానీ, జగనన్న విద్యాదీవెన ఇస్తుండడంతో ఇంజినీరింగ్ చదవగలుగుతున్నాను. జగన్ సర్ గ్రేట్. హత్యాయత్నం జరిగినా లెక్కచేయలేదు, నవ్వుతూనే ప్రజల్లో ఉన్నారు. ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది.

– తనూజ, బీటెక్ (ఈసీఈ సెకండియర్), కాకినాడ

జగనన్న వచ్చాకే మేలు జరిగింది..



నాకు ఇద్దరు పిల్లలు, నా భర్త పాల వ్యాపారం చేస్తాడు. గతంలో రేషన్ కార్డు కోసం జన్మభూమి కమిటీలో ఎన్నో సార్లు అప్లై చేసినా ఇవ్వలేదు. కారణం కూడా చెప్పలేదు. జగనన్న సీఎం అయ్యాక ఇంటికి వలంటీర్ వచ్చి మరీ కార్డు ఇచ్చారు. మా పాపకి రెండుసార్లు అమ్మఒడి ఇచ్చారు. ఇంటి స్థలం కూడా ఇచ్చారు. ఇంత మేలు చేసిన అన్న మా ఊరికి వస్తే చూడకుండా ఉండలేం కదా.. అందుకే నా బిడ్డను తీసుకుని వచ్చాను.

– ఈ. శ్రీలత, గాంధీనగర్, కాకినాడ

చేబ్రోలు పట్టు రైతులకు సీఎం హామీ

ముఖ్యమంత్రి తీరుతో పట్టు రైతుల హర్షాతిరేకాలు



కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సీఎం జగన్ కోసం ఎదురుచూస్తున్న పట్టు రైతులు

పిఠాపురం: చేబ్రోలు పట్టు రైతుల సమస్యలు పరిష్కరిస్తానని సీఎం వైఎస్ జగన్ వారికి హామీ ఇచ్చారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర సందర్భంగా కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాల వద్ద చేబ్రోలు పట్టు పరిశ్రమకు చెందిన పట్టు రైతులు తమ సమస్యలు సీఎంకు వినతిపత్రం ద్వారా తెలియజేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. అయితే, బస్సుయాత్ర చేబ్రోలులో ఎక్కడా ఆగకుండా వెళ్లిపోయింది. తమ సమస్యలు చెప్పుకుందామని వస్తే.. బస్సుయాత్ర ఆగకుండా వెళ్లిపోయిందని రైతులు నిరాశకు గురయ్యారు. ఇంతలో బస్సులో నుంచి రైతులు ప్రదర్శించిన ప్లకార్డులను చూసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనతో ఉన్న వారి ద్వారా వివరాలు తెలుసుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన.. రైతుల వద్దకు వెళ్లి, వారి వినతిపత్రం తీసుకుని, వారి సమస్యను క్షుణ్ణంగా విని, తగిన పరిష్కారం చూపిస్తామని తన మాటగా చెప్పి రావాల్సిందిగా సీఎంఓ కార్యాలయ గ్రీవెన్స్ అధికారి ప్రదీప్‌ను ఆదేశించారు. దీంతో ఆ అధికారి రైతుల వద్దకు చేరుకుని, ముఖ్యమంత్రి తనను పంపించారని చెప్పారు. రైతులతో మాట్లాడి వారి సమస్యను ఆలకించి, వారి వినతిపత్రాన్ని స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఎం చెప్పారని రైతులకు వివరించారు. దీంతో.. సమయాభావంవల్ల సీఎం ఆగకుండా వెళ్లిపోయినా, రైతులను గుర్తించి.. వెంటనే స్పందించి అధికారిని పంపించడంపై పట్టు రైతులు ఆనందం వ్యక్తంచేశారు.



పిఠాపురం: సీఎం జగన్‌కు దిష్టితీస్తున్న మహిళలు



పిఠాపురం: సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో స్థానికుల ఉత్సాహం



కత్తిపూడి: తన కోసం వేచి ఉన్న అభిమానులకు సీఎం అభివాదం



రాజపురం: జగన్ మామా... మేం సిద్ధం



కాకినాడ: ప్రేమతో ఓ తమ్ముడు



పాయకరావుపేట: జనసందోహానికి అభివాదం చేస్తున్న సీఎం

నాకేమీ వద్దన్నా.. మళ్లీ మీరే గెలవాలి

సీఎం జగన్‌తో ఓ మహిళ



తన అభిమాన నేత కళ్ల ముందు కనిపించడమే కాకుండా.. పలకరించడంతో ఓ మహిళ ఆనందంతో ఉద్వేగానికి లోనయ్యింది. 'నాకేమీ వద్దన్నా.. మళ్లీ మీరే గెలవాలి. గెలిపించేందుకు సిద్ధం' అంటూ సంతోషం వ్యక్తం చేసింది. సీఎం జగన్ శుక్రవారం కాకినాడ జిల్లా అచ్చంపేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి కూడలి వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో దివంగత సీఎం వైఎస్సార్‌కు జున్ను తినిపిస్తున్నట్లు ఉన్న ఫొటో పట్టుకుని ఓ మహిళ బస్సు వెనుక పరిగెత్తడాన్ని సీఎం జగన్ గమనించారు. వెంటనే బస్సు ఆపి ఆమెను పలకరించారు. ఈ సందర్భంగా వీకే రాయపురానికి చెందిన మోర్త కుమారిని 'మీకేం కావాలమ్మా' అని సీఎం జగన్ అడగగా.. మోర్త కుమారి 'నాకేమీ వద్దన్నా. మళ్లీ మీరు గెలవడమే మాకు కావాలి. మీరు అమలు చేస్తున్న పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయి. మీ గెలుపు కోసం మేం సిద్ధంగా ఉన్నాం' అంటూ భావోద్వేగంతో చెప్పింది.

పాపకు ఎలా ఉంది.. చికిత్స జరుగుతోందా?

తూర్పుగోదావరి జిల్లా ఎస్‌టీ రాజాపురం సమీపంలో చిన్నారిని ఎత్తుకొని నిల్చున్న వ్యక్తిని గమనించిన సీఎం జగన్ బస్సు ఆపి.. కిందకు దిగి వారిని పలకరించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఉద్యోగిగా పనిచేస్తున్న సురేష్ కుమార్తె కీర్తనకు గుండెలో చిన్న రంధ్రం ఉంది. గతేడాది జనవరిలో రాజమహేంద్రవరం వచ్చిన సీఎం జగన్‌కు ఈ విషయం తెలియజేశాడు. సీఎం జగన్ ఆదేశాల మేరకు కీర్తనకు తిరుపతిలో అవసరమైన వైద్యం ప్రారంభించారు. ఆ చికిత్స కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో ఉన్న తనను నగరపాలక సంస్థ కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు జీతం సరిగ్గా రానివ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని సురేశ్ తెలిపాడు. సానుకూలంగా స్పందించిన సీఎం జగన్.. పాపను జాగ్రత్తగా చూసుకోవాలని సురేశ్‌కు సూచించారు.

బిడ్డలా ఆదుకున్న జగన్‌ను చూడాలని వచ్చా..



కాకినాడలోని జగన్నాథపురానికి చెందిన 80 ఏళ్ల వృద్ధుడు కర్రి రఘురామయ్య అచ్చంపేట జంక్షన్‌లో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభకు వైఎస్సార్‌సీపీ జెండా, పింఛన్ కార్డు చేతపట్టుకుని వచ్చాడు. 'గత ఐదేళ్లు పింఛన్ ఇచ్చి కన్నబిడ్డలా జగన్ ఆదుకున్నాడు. జగన్‌ను ఎప్పటికైనా స్వయంగా చూడాలనుకున్నాను. ఇప్పుడు మా ఊరి దగ్గరకు వచ్చాడని తెలియడంతో ఎంత కష్టమైనా భరించి ఇక్కడకు వచ్చా. ఆయనను చూస్తే చాలు.. ఇక ఏ ఆశలూ లేవు' అని రఘురామయ్య చెప్పాడు. అనంతరం సీఎం జగన్‌ను చూసి రఘురామయ్య ఆనందం వ్యక్తం చేశాడు.

- సామర్లకోట/పిఠాపురం/రాజానగరం/గండేపల్లి



రంగంపేట: సీఎం జగన్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చిన విద్యార్థులు



వడిశలేరు: సీఎం జగన్‌తో కరచాలనం కోసం...

హైకోర్టు న్యాయవాదుల సంఘానికి 30న ఎన్నికలు

అధ్యక్ష స్థానానికి ముగ్గురు సీనియర్ న్యాయవాదుల పోటీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టు న్యాయవాదుల సంఘానికి ఈనెల 30న ఎన్నికలు జరగనున్నాయి. శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. అధ్యక్ష స్థానానికి సీనియర్ న్యాయవాదులు చిత్తరవు రఘు, ఉప్పుటూరి వేణుగోపాలరావు, కలిగినీడి చిదంబరం పోటీ చేస్తున్నారు. ఉపాధ్యక్ష స్థానానికి ఎస్.రంగారెడ్డి, కేఎం కృష్ణారెడ్డి, పీటా రామన్ పోటీ పడుతున్నారు. ప్రధాన కార్యదర్శి పోస్టుకు ఐదుగురు పోటీకి దిగగా, చివరకు చేజర్ల సుబోధ్ పోటీ నుంచి తప్పుకున్నారు. డాక్టర్ జేవీఎస్‌హెచ్ శాస్త్రి, నాగ ప్రవీణ్ వంకాయలపాటి, తాతా సింగయ్య గౌడ్, నన్నపనేని శ్రీహరి బరిలో నిలిచారు. సంయుక్త కార్యదర్శి పోస్టుకు నన్నేపోగు నిర్మల కుమార్, ఉదయ్ కుమార్ ఓరుగంటి, చేజర్ల వెంకటేశ్వరరావు, కోశాధికారి పోస్టుకు నయిదాన శ్రవణ్ కుమార్, జంపన శ్రీదేవి, ఎంఎస్‌వీఎస్ సుధారాణి పోటీ పడుతున్నారు. లైబ్రరీ కార్యదర్శి పోస్టుకు తెన్నేటి బాబూజీ, యద్దల దుర్గారావు, కొడాటి రమ్యకృష్ణ పోటీ చేస్తున్నారు.

30 వరకు 'విఐటీఈఈఈ'



పరీక్షను పర్యవేక్షిస్తున్న వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్

విజయవాడ: ది వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (విఐటీఈఈఈ)ను ఈ నెల 30 వరకు దేశవ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు వర్సిటీ వీసీ ఎస్‌వీ.కోటా రెడ్డి తెలిపారు. ఫలితాలను మే 3న www.vit. ac.in లో పొందుపరుస్తామని చెప్పారు. పరీక్ష ప్రతిరోజు 3 సెషన్స్‌లో నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ జగదీశ్ చంద్ర పేర్కొన్నారు. వర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ జాన్ ప్రదీప్ మాట్లాడుతూ..మే 3 నుంచి జూన్ 10 వరకు కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామని తెలిపారు. 1–20,000 ర్యాంకులకు మే 7–8 వరకు, 20,001–45,000 ర్యాంకులకు మే 18–19 వరకు, 45,001–70,000 ర్యాంకులకు మే 29–30 వరకు, 70,001–1,00,00 ర్యాంకులకు జూన్ 9–10 వరకు కౌన్సెలింగ్ చేపడతామని వివరించారు. పూర్తి వివరాలను www.vitap.ac.inలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

రామోజీ.. మీ రాతల్లోనే వ్యత్యాసం

పొదుపు సంఘాల రుణాలన్నీ మాఫీ చేస్తానని చెప్పి మోసం చేసింది బాబు కాదా?

సాక్షి, అమరావతి : రామోజీ మెదడు మోకాల్లోకి వచ్చిందేమోనన్న సందేహాలను ఈనాడు ప్రచురించే కథనాలు బలపరుస్తున్నాయి. పొదుపు సంఘాల రుణాలకు కొన్ని జిల్లాల్లో ఒక విధంగా.. మరికొన్ని జిల్లాల్లో మరో విధంగా వ్యత్యాసపు వడ్డీ రేటును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని అజ్ఞానపు రాతలతో సున్నా వడ్డీ రుణాలపై శుక్రవారం 'అన్నా...సున్నా అంటే అంత భారమా?' శీర్షికన ఒక తెలివితక్కువ కథనాన్ని ఈనాడు ప్రచురించింది. ఈనాడు అజ్ఞానాన్ని చూసి బ్యాంకులు, పొదుపు సంఘాల మహిళలు నవ్విపోతారన్న స్పృహ అయినా రామోజీకి లేకుండా పోయింది. బాబు 2014 ఎన్నికల ముందు తాను అధికారంలోకి వస్తే బేషరతుగా పొదుపు సంఘాల రుణాలన్నీ మాఫీ చేస్తానని ఘోరమైన అబద్ధమాడి, అధికారంలోకి వచ్చిన తర్వాత రూపాయి కూడా మాఫీ చేయలేదు. మాఫీ చేయకపోగా తన హయాంలో సున్నా వడ్డీ పథకాన్ని ఆపేస్తే.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత బాబు పెట్టిన బకాయిలన్నిటినీ బ్యాంకులకు చెల్లించి, ఆ పథకాన్ని పునరుద్ధరించారు. బాబు చేసిన మోసానికి పొదుపు సంఘాలు నీరుకారిపోయాయి. సున్నా వడ్డీ రుణాలు అందక అల్లాడిపోయాయి. బాబు చేసిన ఈ ఘోరమైన తప్పును జగన్ సరిదిద్దడంతో బ్యాంకులు ఇప్పుడు పొదుపు సంఘాలకు రుణాలు ఇవ్వడానికి పోటీ పడుతున్నాయి. ఈ నిజాలు రామోజీ మట్టిబుర్రకు తెలియక అజ్ఞానాన్ని రంగరించి, పొదుపు సంఘాలకు ఇచ్చే రుణాల్లో నాలుగు శాతమే రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని, మిగిలింది కేంద్రం ఇస్తోందని తన తెలివితక్కువ పాత్రికేయ అసమర్థతను బయటపెట్టుకుంది.

తెలివి తక్కువ తనాన్ని బయటపెట్టుకున్న ఈనాడు...

'ఆరు జిల్లాలకు ఏడు శాతం కేంద్రం రాయితీ' అంటూ తమ కథనంలో ఓ ఉపశీర్షికను పెట్టి.. జాతీయ జీవనోపాధుల కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 250 జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తోందని , అందులో ఏపీ పరిధిలో ఆరు ఉమ్మడి జిల్లాలు ఉన్నట్టు 'ఈనాడు' రాసుకుపోయింది. ఆ ఆరు జిల్లాల్లో మాత్రమే సంఘాలు రూ. 3 లక్షల వరకు తీసుకున్న రుణానికి అక్కడ బ్యాంకులు 11 శాతం వడ్డీకి



రుణాలు ఇస్తూ, కేంద్రం ఏడు శాతం రాయితీ ఇస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం నాలుగు శాతమే భరిస్తోందంటూ ఈనాడు రాసింది. వాస్తవం ఏమిటంటే..2022 జూలై 20న ఆర్‌బీఐ జారీ చేసిన ఆదేశాల మేరకు ఇప్పుడు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఏడు శాతం వడ్డీకే పొదుపు సంఘాలకు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. ఈ రుణాలపై కేంద్రం ఏడు శాతం వడ్డీ రాయితీ ఇస్తుందన్నదే శుద్ధ తప్పు. ఆ ఏడు శాతం వడ్డీ మొత్తాన్ని ఇప్పటి ప్రభుత్వమే భరిస్తోంది. ఈనాడు మరో పెద్ద శుద్ధ తప్పు రాసింది. రాష్ట్రంలో ఇప్పుడు ఆరు ఉమ్మడి జిల్లాల్లో ఒకలా, మరో ఏడు ఉమ్మడి జిల్లాల్లో ఇంకోలా వడ్డీ రేటుకు పొదుపు సంఘాలకు రుణాలిస్తోందని రాసింది. అలాంటి వ్యత్యాసం లేనేలేదు.

ఇప్పుడు.. బ్యాంకులే మహిళలను బతిమిలాడి రుణాలిచ్చే స్థితి..

అప్పట్లో చంద్రబాబు డ్వాక్రా రుణామాఫీ హామీ ఇచ్చి 2014లో అధికారంలోకి వచ్చాక ఆ హామీని అమలు చేయని కారణంగా రాష్ట్రంలో మొత్తం పొదుపు సంఘాల్లో 18.6 శాతం సంఘాలు అంటే ప్రతి ఐదులో ఒక సంఘం బాబు మాట నమ్మి తమ రుణాలు చెల్లించకపోవడంతో వాళ్లందరూ బ్యాంకుల ఎగవేతదారులుగా ముద్ర వేయించుకున్నారు. ఇప్పుడు పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 2019 ఎన్నికల నాటికి ఉన్న అప్పు మొత్తం ప్రభుత్వమే తిరిగి చెల్లించడం వంటి కారణాలతో ఇప్పుడు మహిళలు 99.83 శాతం మంది అంటే దాదాపు అందరూ ఎప్పటికప్పుడు తమ కిస్తీలను చెల్లిస్తున్నారు. ఈ చెల్లింపులతో బ్యాంకులు పొదుపు సంఘాల మహిళలపై నమ్మకాన్ని పెంచుకున్నాయి. ఇప్పుడు ఎంత కావాలంటే అంత రుణాలు బ్యాంకులు ఇచ్చే పరిస్థితి ఏర్పడింది. 2019 ఏప్రిల్ నుంచి 2024 ఫిబ్రవరి వరకు ఐదేళ్ల కాలంలో ఏకంగా 1.73 లక్షల కోట్ల మొత్తాన్ని బ్యాంకులు పొదుపు సంఘాలకు రుణాలుగా ఇచ్చాయంటే రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల వద్ద ఎంత పరపతి పెరిగిందో అర్థమవుతుంది. బాబు ప్రభుత్వంలో కేవలం ఒక్కో సంఘానికి గరిష్ఠంగా రూ. 10 లక్షల చొప్పున మాత్రమే బ్యాంకు రుణాలు ఇవ్వగా, ఇటీవల ఆర్‌బీఐ పొదుపు సంఘాలకు గరిష్ఠంగా రూ. 20 లక్షల వరకు పరిమితిని పెంచడంతో చాలా సంఘాలు ఇప్పుడు రూ. 20 లక్షల చొప్పున రుణాలు పొందుతున్నాయి.

చంద్రబాబు చేసిన మోసం ఈ ప్రభుత్వానికి అంటగట్టే యత్నం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పొదుపు సంఘాల రుణాలపై మొదట పావలా వడ్డీ పథకం అమలు చేయగా, తర్వాత ఉమ్మడి రాష్ట్రంలోనే సున్నా వడ్డీ అమలులోకి వచ్చింది. విభజన అనంతరం.. 2014 ఎన్నికల ముందు డ్వాక్రా రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చి ఐదేళ్ల కాలంలో ఒక రూపాయినైనా మాఫీ చేయకుండా రాష్ట్రంలో పొదుపుసంఘాల మహిళలందరినీ మోసం చేసిన చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రంలో సున్నా వడ్డీ పథకానికీ మంగళం పాడేశారు. 2016 జూలై తర్వాత రాష్ట్రంలో పొదుపు సంఘాల రుణాలపై వడ్డీలో ఒక్క రూపాయి అయినా అప్పటి చంద్రబాబు ప్రభుత్వం తిరిగి మహిళలకు చెల్లించలేదు. 2019లో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తిరిగి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని పునరుద్ధరించడంతో పాటు గత ఐదేళ్లుగా ఏటా ఠంచన్‌గా ఆర్థిక సంవత్సరం ముగియగానే ఆ ఏడాది వడ్డీ డబ్బును ప్రభుత్వం తిరిగి మహిళలకు చెల్లిస్తూ వస్తోంది. గత నాలుగేళ్లల్లో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా వారి రుణాలపై వడ్డీ రూ. 4969.05 కోట్లను ఇప్పటికే ఆయా మహిళలకు చెల్లించింది. 2023–24 సంవత్సర వడ్డీని ఇటీవల ముగిసిన మార్చి నెలాఖరు తర్వాత ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లోగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. వాస్తవం ఇది...దీనికి భిన్నంగా చంద్రబాబును వెనకేసుకొచ్చే రాతలు రాసింది. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం 2016 నుంచి ఆపేసిన సున్నా వడ్డీని గొప్పగా చిత్రీకరిస్తూ.. అవన్నీ బకాయిలుగా పేర్కొంది. అప్పటి ప్రభుత్వం పెట్టిన బకాయిలు ఈ ప్రభుత్వం చెల్లించలేదని , ఇదంతా 'జగన్ మోహన్‌రెడ్డి నయవంచన' అంటూ ఈనాడు వక్రీకరించింది. వరుసగా రెండున్నరేళ్ల పాటు పథకానికి నిధులు ఇవ్వకుండా అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఆపేస్తే వాటిని బకాయిలు ఎలా అంటారని అధికారులు ప్రశ్నిస్తున్నారు.

సున్నా వడ్డీ పథకానికి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన నిధులు

ఏడాది	పథకం అమలు చేసిన తేదీ	లబ్ధిపొందిన సంఘాలు	మహిళల సంఖ్య	మొత్తం
2019-20	24-04-2020	7,81,615	81,52,481	రూ.1257.99 కోట్లు
2020-21	23-04-2021	9,41,088	98,00,626	రూ.1096.23 కోట్లు
2021-22	22-04-2022	9,76,119	1,02,16,410	రూ.1261.07 కోట్లు
2022-23	11-08-2023	9,48,122	1,05,13,365	రూ.1353.76 కోట్లు
మొత్తం	-	-	-	రూ.4969.05 కోట్లు

రెండోరోజు భారీగా నామినేషన్ల దాఖలు

- లోక్‌సభకు 53 మంది అభ్యర్థులు 68 సెట్లు..
- అసెంబ్లీకి 314 మంది.. 413 నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: నామినేషన్ల ప్రక్రియ మొదలైన రెండోరోజు శుక్రవారం కూడా అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. 25 లోక్‌సభ స్థానాలకు 53 మంది అభ్యర్థులు 68 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. పార్లమెంటుకు నామినేషన్లు వేసిన ప్రముఖుల్లో వైఎస్సార్‌సీపీ తరఫున గుమ్మ తనూజారాణి (అరకు), పేరాడ తిలక్ (శ్రీకాకుళం), గూడూరి ఉమాబాల (నరసాపురం), కిలారి రోశయ్య (గుంటూరు), పి.అనిల్‌కుమార్ (నరసరావుపేట), నందిగం సురేష్ (బాపట్ల), వైఎస్ అవినాశ్‌రెడ్డి (కడప), ఎం.గురుమూర్తి (తిరుపతి), పి.మిథున్‌రెడ్డి (రాజంపేట), ఎన్.రెడ్డప్ప (చిత్తూరు), టీడీపీ తరఫున కె.అప్పలనాయుడు, కేశినేని చిన్ని, టి.కృష్ణప్రసాద్ ఉన్నారు. రెండురోజుల్లో కలిపి లోక్‌సభకు 111 నామినేషన్లు దాఖలయ్యాయి. అసెంబ్లీ స్థానాల కోసం శుక్రవారం 314 మంది అభ్యర్థులు 413 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో రెండు రోజుల్లో అసెంబ్లీకి మొత్తం 649 నామినేషన్లు దాఖలయ్యాయి.

మంత్రి పెద్దిరెడ్డి నామినేషన్ దాఖలు

పుంగనూరు: పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ వేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లారు.

వైఎస్ అవినాష్‌రెడ్డి నామినేషన్

- వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు



నామినేషన్ వేసే ముందు వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అవినాష్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్/వేంపల్లె : కడప లోక్‌సభ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చిన ఆయన మధ్యాహ్నం 1.10 గంటలకు నామినేషన్, అఫిడవిట్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్దకు చేరుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో అవినాష్‌రెడ్డిని సత్కరించారు. కాగా, నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు కడపకు బయలుదేరే ముందు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఇడుపులపాయకు వెళ్లి అక్కడి వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రార్థనలు నిర్వహించారు. అక్కడి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పులివెందుల అసెంబ్లీ అభ్యర్థిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, కడప పార్లమెంట్ అభ్యర్థిగా తనను మరోమారు అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కడపలోని పార్టీ కార్యాలయంలో సర్వమత ప్రార్థనల్లో వైఎస్ అవినాష్‌రెడ్డి పాల్గొన్నారు.

కుప్పంలో చంద్రబాబు నామినేషన్ దాఖలు

- ఎన్నికల అధికారికి బాబు తరఫున నామినేషన్ ఫారంను అందజేసిన ఆయన సతీమణి



చంద్రబాబు తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న భువనేశ్వరి

కుప్పం(చిత్తూరు జిల్లా): కుప్పం అసెంబ్లీ స్థానానికి టీడీపీ అధినేత చంద్రబాబు తరఫున ఆయన భార్య భువనేశ్వరి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. కుప్పం లక్ష్మీపురంలోని వరదరాజులు దేవాలయంలో ఆమె పూజలు జరిపారు. అక్కడ పలువురు నేతలు, కార్యకర్తలు టీడీపీ జెండాలు, టోపీలు, ప్రచార కండువాలతో హల్‌చల్ చేశారు. దేవాలయం నుంచి ర్యాలీ ప్రారంభించి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారు. అనంతరం ఎన్నికల అధికారి శ్రీనివాసులుకు నామినేషన్ ఫారంను అందజేశారు. కుప్పం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్ పేదల కోసం కుప్పంలో రాజన్న క్యాంటిన్ ఏర్పాటు చేశారు. బాబు నామినేషన్ కార్యక్రమానికి పొరుగు రాష్ట్రాలు, పక్క నియోజకవర్గాల నుంచి టీడీపీ జనాన్ని తరలించింది. వీరందరికి భోజనాలు ఏర్పాటు చేయడంలో టీడీపీ విఫలమైంది. అదే సమయంలో రాజన్న క్యాంటిన్ తెరవడంతో టీడీపీ కార్యకర్తలు రాజన్న క్యాంటిన్‌లో భోజనాలు తిన్నారు.

ప్రైవేట్ వాహనాల్లో జనం తరలింపు

కుప్పంలో బలప్రదర్శన కోసం టీడీపీ నానాతంటాలు పడింది. జనాలు తరలించేందుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయడంతో పాటు భారీ నగదును ఖర్చు చేసింది. 250 వాహనాల్లో నియోజకవర్గంలోని 4 మండలాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక చెందిన ప్రజలనూ తరలించింది. ర్యాలీకి వచ్చిన ప్రతి ఒక్కరికి రూ.500 నగదు, బిర్యాని ప్యాకెట్ పంపిణీ చేసింది. సోమేశ్వర స్వామి దేవాలయం వద్ద శెట్టిపల్లి గ్రామస్తులు నగదు పంపకాలపై ఘర్షణ పడ్డారు.

సీఎం జగన్ చేసిన అభివృద్ధి ఇంటింటా కనిపిస్తోంది

- కేంద్ర నివేదికల్లో అభివృద్ధి సూచికలే ఇందుకు నిదర్శనం
- ఎల్లో మీడియా రాతల్లోనే చంద్రబాబు అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన అభివృద్ధి ఇంటింటా కనిపిస్తోందని, ప్రజల్లో వినబడుతోందని, చంద్రబాబు అభివృద్ధి అంతా ఎల్లో మీడియా రాతల్లో, గ్రాఫిక్స్‌లోనే కనిపిస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ చెప్పారు. అభివృద్ధి విషయంలో సీఎం జగన్‌ది విజన్ అయితే.. చంద్రబాబుది పాయిజన్ అని చెప్పారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ సీఎం జగన్ అయితే. అవినీతికి, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని అన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంస్కరణలు తెచ్చారని చెప్పారు. ప్రతి గ్రామం మారిందని, కొత్తగా వ్యవస్థలు ఏర్పడ్డాయని తెలిపారు. చంద్రబాబు దిగిపోయేటప్పుడు 5.4 శాతం వృద్ధి రేటు ఉన్న రాష్ట్రాన్ని సీఎం జగన్ అభివృద్ధిలో పరుగులు పెట్టించడంతో వృద్ధి రేటు 18.4 శాతానికి పెరిగిందని తెలిపారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రం ఎంతగా దిగజారిందో అభివృద్ధి సూచికలే చెబుతాయని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2015లో జీఎస్‌డీపీ వృద్ధి రేటు 9.2 శాతంతో ఏపీ 7వ స్థానంలో ఉండేదని, ఆయన పదవి నుంచి దిగిపోయే సమయానికి అంటే 2019లో 5.4 శాతంతో రాష్ట్రాన్ని 22వ స్థానానికి దిగజార్చారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిందనడానికి కేంద్ర నివేదికల్లోని అభివృద్ధి సూచికలే నిదర్శనమని చెప్పారు. సీఎం జగన్ హయాంలో నిరుద్యోగ రేటు తగ్గిందని, పెట్టుబడులు పెరిగాయని వివరించారు. రాష్ట్రంలో అప్పులు తగ్గాయన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని చెప్పారు. 4 పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, 127 పరిశ్రమలు, 3 ఇండస్ట్రియల్ కారిడార్లు, 10 వేలకు పైగా రైతుభరోసా కేంద్రాలు, 15 వేలకు పైగా సచివాలయాలు, 17 కొత్త మెడికల్ కాలేజీలు, భారీ ప్రాజెక్టులు, పెట్టుబడులు ఇవన్నీ కేవలం గడచిన 5 ఏళ్లల్లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా తెచ్చినవి కావా అని ప్రశ్నించారు. మారుతున్న బడులు, బాగుపడుతున్న ఆస్పత్రులు, ప్రజల ఇంటి వద్దనే అందుతున్న పౌరసేవలు, దేశానికి తలమానికంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, గ్రామ స్వరాజ్యాన్ని తలపించే వలంటరీ వ్యవస్థ వంటి వాటితో అన్ని వర్గాలకు సీఎం జగన్ మేలు చేస్తున్నారని వివరించారు. తలసరి ఆదాయంలో 18 నుంచి 9వ స్థానానికి పెరిగామని చెప్పారు. 16 లక్షల ఈపీఎఫ్ అకౌంట్లు పెరగడం అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయని కొండా రాజీవ్ గాంధీ మండిపడ్డారు.

కందుకూరు టీడీపీలో అసమ్మతి

- వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నాగేశ్వరరావుకి మద్దతిచ్చేది లేదు..
- స్వతంత్ర అభ్యర్థి రాజేష్‌కే మా కుటుంబం మద్దతు
- స్పష్టం చేసిన మాజీ ఎమ్మెల్యే దివి శివరాం



కందుకూరు : నెల్లూరు జిల్లా కందుకూరు టీడీపీలో విభేదాలు ఒక్కసారిగా రచ్చకెక్కాయి. ఆ పార్టీ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు వ్యతిరేకంగా నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు ఏకమవుతున్నారు. ఇప్పటికే నాగేశ్వరరావు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ ఆయన సోదరుడు ఇంటూరి రాజేష్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతున్నట్లు ప్రకటించగా.. తాజాగా సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం నాగేశ్వరరావుకు వ్యతిరేకంగా తన గళం విప్పారు. శుక్రవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ నాగేశ్వరరావు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. శివరాం మాట్లాడుతూ నాగేశ్వరరావుకి ఎన్నికల్లో దివి కుటుంబం మద్దతివ్వడం లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో దాదాపు 70 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిన దివి కుటుంబాన్ని అవమానపర్చేలా, పార్టీ కార్యకర్తల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా నాగేశ్వరరావు ప్రవర్తన ఉందన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇంటూరి రాజేష్‌కు తమ కుటుంబం అండగా ఉంటుందని తెలిపారు. ఇప్పటికే నాగేశ్వరరావును అభ్యర్థిగా ఖరారు చేసినా అతని అభ్యర్థిత్వాన్ని మార్చాలని పలుమార్లు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్టు దివి శివరాం చెప్పారు. రాష్ట్రంలో నాలుగైదు చోట్ల అధిష్టానం అభ్యర్థులను మార్చే ప్రయత్నం చేస్తోందని, వాటిలో కందుకూరు కూడా ఉంటుందన్న నమ్మకం తమకు ఉందన్నారు. తమ మాటపై నమ్మకంతో నాగేశ్వరరావును మార్చితే పార్టీ కోసం పనిచేస్తామన్నారు. టీడీపీని మాత్రం వీడే ప్రసక్తే లేదన్నారు.

టీడీపీ అభ్యర్థికి రెబల్‌గా బీజేపీ నేత నామినేషన్



నామినేషన్ వేస్తున్న బీజేపీ నేత మురహరిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు అసెంబ్లీ ఎమ్మెల్యే స్థానానికి బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ కేఆర్ మురహరిరెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేయడం తీవ్ర చర్చనీయాంశమయ్యింది. పొత్తులో భాగంగా ఈ సీటును టీడీపీకి కేటాయించడంతో ఇక్కడి నుంచి బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అయితే తనకే బీఫాం వస్తుందన్న ధీమాతో కేఆర్ మురహరిరెడ్డి బీజేపీ, జనసేన పార్టీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీగా వచ్చి స్థానిక రిటర్నింగ్ అధికారి చిరంజీవికి ఆయన తన నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థికి బీజేపీ, జనసేన పార్టీ నాయకుల మధ్య భేదాభిప్రాయాలున్నందునే బీజేపీ అభ్యర్థిగా ఆయన నామినేషన్ వేసినట్లు తెలుస్తోంది.

యానాంలో పోలింగ్ ప్రశాంతం



యానాంలో ఓటుహక్కు వినియోగించుకోవడానికి బారులు తీరిన ఓటర్లు

యానాం: పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజకవర్గ స్థాన పరిధిలో ఉన్న, భౌగోళికంగా ఉమ్మడి తూర్పుగోదావరిలోని కేంద్రపాలిత ప్రాంతం యానాంలో శుక్రవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. యానాం నియోజకవర్గ పరిధిలో మొత్తం 39,408 మంది ఓటర్లు ఉండగా 30,064 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 76.29 శాతం పోలింగ్ నమోదైందని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటువేసేందుకు ఎన్నికల శాఖ సమయ వేళలను ప్రకటించినప్పటికి రాత్రి 8 గంటల వరకు సుమారు 10 పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాగా, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో యానాంలో 86.45 శాతం పోలింగ్ నమోదైంది.

జనసేనకు అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజీనామా



అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జనసేన పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్ జనసేన పార్టీకి శుక్రవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన రాజమహేంద్రవరంలోని తన కార్యాలయం నుంచి రాజీనామా పత్రాన్ని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు ఫ్యాక్స్‌లో పంపించారు. ఓఎన్‌జీసీ అధికారి అయిన శేఖర్ కొన్ని నెలల సర్వీసు ఉండగానే వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని జనసేనలో చేరారు. ఆయన 2019 ఎన్నికల్లో అమలాపురం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఐదేళ్లుగా అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో అమలాపురం అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడ్డారు. ఇటీవల పవన్‌కళ్యాణ్ వైఖరి పట్ల అసంతృప్తిగా ఉన్న శేఖర్ చివరికి పార్టీకి రాజీనామా చేశారు. తన భవిష్యత్ నిర్ణయాన్ని కొద్ది రోజుల్లోనే చెబుతానని ఆయన తెలిపారు. కాగా, చాలాకాలం నుంచి ఈ ఎన్నికల్లో అమలాపురం అసెంబ్లీ సీటు జనసేనకేనని ఆ పార్టీ ముఖ్య నేతలు చెబుతూ వచ్చారు. చివరికి ఈ సీటును టీడీపీకి వదిలేయడంతో జనసేన నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరాశకుగురయ్యారు. ఈ క్రమంలోనే అమలాపురం జనసేన టికెట్ ఆశించిన శెట్టిబత్తుల రాజబాబు కూడా పవన్ కళ్యాణ్ వైఖరితో విసిగి వేసారి ఆ పార్టీకి రాజీనామా చేసి ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సంగతి తెలిసిందే. వరుసగా ఇద్దరు ముఖ్య నాయకులు రాజీనామా చేయడంతో నియోజకవర్గంలో జనసేన నిస్తేజంగా మారింది.

రెండు దొంగ ఓట్లు వేసైనా అస్మిత్‌ను గెలిపించండి

- టీడీపీ నేత జేసీ పవన్ వివాదాస్పద వ్యాఖ్యలు



వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న జేసీ పవన్

తాడిపత్రి రూరల్: అనంతపురం జిల్లా తాడిపత్రి అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా జేసీ అస్మిత్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా చేపట్టిన ర్యాలీలో ఆయన సోదరుడు జేసీ పవన్‌రెడ్డి వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. ప్రచార వాహనంపై ఆయన మాట్లాడుతూ పోలింగ్ సందర్భంగా యువకులందరూ రెండు దొంగ ఓట్లు వేసైనా సరే టీడీపీని గెలిపించాలని అన్నారు. దీంతో అక్కడ ఉన్న వారందరూ నివ్వెరపోయారు. ఈ వ్యాఖ్యలు విన్న వారు నివ్వెరపోయారు. యువతను దొంగ ఓట్లు వేసేవారీగా చిత్రీకరించే ప్రయత్నం చేసిన జేసీ పవన్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఆయన మాట్లాడిన వీడియోను వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

మొదటి బీఫామ్ జగన్ నాకే ఇవ్వడం అదృష్టం

అందుకు గర్వపడుతున్నా : మంత్రి కారుమూరి



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తనకు మొదటి బీఫామ్ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పట్ల తనకున్న ప్రేమను చాటుకున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు.. రాబోయే ఎన్నికల్లో ఒక బీసీగా తనను గుర్తించి మొదటి బీఫామ్ తనకు ఇచ్చినందుకు చాలా గర్వపడుతున్నానని, ఆనందంగా ఉందని చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అండ్ కో కూటమి గ్రాఫ్ రోజురోజుకీ పడిపోతున్న నేపథ్యంలో పచ్చమీడియా జాకీలేసి లేపాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ జాకీలు లేవట్లేదని మంత్రి ఎద్దేవా చేశారు. మూడు కండువాలేసుకుని మూడు పార్టీలు వస్తున్న పైనం పందులు గుంపులుగా వస్తాయని, సింహం సింగిల్‌గానే వస్తుందనే సినిమా డైలాగ్‌ని గుర్తుచేస్తున్నదన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, పార్టీ నేతలు మంగెన సూర్య, బోడపాటి వీర్రాజు, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, జక్కంశెట్టి సత్యరాజేంద్రప్రసాద్, మల్లిరెడ్డి నాగార్జున, కర్రి గంగాధర అప్పారావు పాల్గొన్నారు.

'లావు'కు సహకారం శూన్యం

- లావు శ్రీకృష్ణదేవరాయలును ఉక్కిరిబిక్కిరి చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు
- తమకు సీటు దక్కకుండా అడ్డుకునే యత్నం చేశారంటూ ఆగ్రహం
- తమకు సీట్లు రాకపోవడానికి ఆయనే కారణమంటూ రగిలిపోతున్న మరో వర్గం

సాక్షి, నరసరావుపేట : పల్నాడు జిల్లా నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా టీడీపీ తరఫున పోటీ చేస్తున్న లావు శ్రీకృష్ణదేవరాయలుకు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి సహకారం అందడం లేదు. టీడీపీ అభ్యర్థిగా ఖరారయ్యాక తన లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికలో ఆయన వేసిన అడుగులు ఇప్పుడు తలనొప్పులు తెస్తున్నాయి. వైఎస్సార్‌సీపీలో ఉండగా ప్రోత్సహించిన జంగా కృష్ణమూర్తికి గురజాల అసెంబ్లీ టికెట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. అయితే తనకు టికెట్ దక్కకుండా లావు శ్రీకృష్ణ ప్రయత్నించాడన్న కోపంతో యరపతినేని శ్రీనివాసరావు గుర్రుగా ఉన్నారని సమాచారం. మరోవైపు నరసరావుపేటలో సైతం ఇదే సమస్య. ఇక్కడ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న చదలవాడ అరవింద్ బాబు అభ్యర్థిత్వంపై లావు అభ్యంతరం చెప్పారని, ఆయన వర్గం అనుచరులు కోపంతో రగిలిపోతున్నారు. గత నెలలో కూటమి తరఫున ప్రధాని మోదీ హాజరైన చిలకలూరిపేట ప్రజాగళం సభకు ఆర్థికంగా లావు సహకారం ఇవ్వకపోవడం వల్లే సభలో సరైన ఏర్పాట్లు చేయలేక నవ్వులపాలయ్యామని ప్రత్తిపాటి వర్గం అసహనంతో ఉందట. ఇలా ప్రతి నియోజకవర్గంలో లావు శ్రీకృష్ణ దేవరాయలుకు స్థానిక టీడీపీ నేతల మధ్య అగాథం ఉంది. ఇదిలా ఉండగా, వైఎస్సార్‌సీపీలో తన వర్గంగా ముద్రపడి, స్థానిక ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా పనిచేసిన జంగా కృష్ణమూర్తి, మక్కెన మల్లికార్జున లాంటి నేతలను టీడీపీలోకి తెచ్చిన తర్వాత ఎంపీ లావు వారికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారట. ఆయా నియోజకవర్గాల్లో ముందు నుంచి పార్టీ కోసం పనిచేసిన టీడీపీ నేతలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం పట్ల అసహనంగా ఉన్నారు. మరోవైపు పెదకూరపాడులో మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కు టికెట్ దక్కపోవడంలో కూడా లావు పాత్ర ఉందని శ్రీధర్ వర్గం అభిప్రాయపడుతోంది. ఇలా అన్ని నియోజకవర్గాల్లో లావు శ్రీకృష్ణ దేవరాయలుకు సొంత పార్టీ నుంచి వ్యతిరేకత వస్తుండటంతో గెలుపుపై గుబులు పట్టుకుందట.

గుడివాడలో టీడీపీ నేతల ఎన్నికల కోడ్ ఉల్లంఘన

ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

గుడివాడ రూరల్: కృష్ణా జిల్లా గుడివాడలో టీడీపీ నాయకులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. ఓటర్ వెరిఫికేషన్ పేరిట ఇంటింటికీ వెళ్లి టీడీపీ నేతలు ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. 17వ వార్డుకు చెందిన 5 ముస్లిం కుటుంబాలు తమకు రంజాన్ తోఫా అందలేదని అడగ్గా ఆ వార్డుకు చెందిన టీడీపీ నేతలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెనిగండ్ల రాముఫొటోతో కూడిన తోఫా కానుకలను గురువారం రాత్రి పంపిణీ చేశారు.దీనిపై పలువురు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.

సాక్షి బిజినెస్
శనివారం
20-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
559	151
73,088	22,147

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ		మార్పు
నాస్‌డాక్	15,370	▽ 231
డోజోన్స్	37,994	▲ 219
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,896	▲ 19
డాక్స్	17,737	▽ 100
షాంఘై	3,065	▽ 9
నికాయ్	37,068	▽ 1,011

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	73,404	▽ 73
బంగారం (99.5 స్వచ్ఛత)	73,110	▽ 73
వెండి (కిలో)	71,576	▽ 474

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.17	84.19
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.67	105.22
€	యూరో	ఎస్‌బీఐ	87.86	90.22
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.62	54.82
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.57	54.49
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.20	63.40
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.84	23.61
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.39

ఎన్నికల వేళలోనూ ఆర్థిక క్రమశిక్షణ ..


భారత ఎకానమీకి ఐఎంఎఫ్ కితాబు



వాషింగ్టన్: ఎన్నికల సంవత్సరంలోనూ కూడా భారత్ ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తోందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) కితాబిచ్చింది. భారత ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా రాణిస్తోందని, ప్రపంచానికి కాంతి పుంజంలా కొనసాగుతోందని పేర్కొంది. 'ప్రస్తుతం భారత ఎకానమీ మెరుగ్గానే ఉంది. 6.8 శాతం వృద్ధి అనేది చాలా మంచి రేటే. ద్రవ్యోల్బణం దిగి వస్తోంది. ఫండమెంటల్స్ పటిష్టంగానే కనిపిస్తున్నాయి. ఎన్నికల సంవత్సరంలో కూడా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తుండటం చెప్పుకోగిన విషయం. ఎందుకంటే చాలా దేశాలు ఇలాంటప్పుడు ఆర్థికంగా చాలా సాహసాలు చేస్తుంటాయి. కానీ ఈ ప్రభుత్వం క్రమశిక్షణ పాటిస్తోంది' అని ఐఎంఎఫ్ డైరెక్టర్ (ఆసియా, పసిఫిక్ విభాగం) కృష్ణ శ్రీనివాసన్ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. గత అనేక సంవత్సరాలుగా భారత్ అనేక షాక్‌లను సమర్థంగా ఎదుర్కొని, బైటపడిందన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న పెద్ద ఎకానమీల్లో ఒకటిగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రైవేట్ వినియోగం, ప్రభుత్వ పెట్టుబడుల తోడ్పాటుతో 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 6.8 శాతంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు శ్రీనివాసన్ తెలిపారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, యువ జనాభా మొదలైన అంశాలన్నీ కూడా ఇందుకు ఊతమివ్వగలవని చెప్పారు. జనాభాపరమైన ప్రయోజనాలను పొందాలంటే భారత్ విద్య, ఆరోగ్యంపై భారీగా ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుందని శ్రీనివాసన్ చెప్పారు.

మెరుగుపడిన ఉపాధి కల్పన!

ఈపీఎఫ్‌ఓ గణాంకాల వెల్లడి



న్యూఢిల్లీ: రిటైర్‌మెంట్ ఫండ్ సంస్థ– ఈపీఎఫ్ఓలో మార్చితో ముగిసిన గత 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1.65 కోట్ల మంది కొత్త సభ్యత్వం పొందారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేరిన సభ్యులతో పోల్చితే ఈ సంఖ్య 19 శాతం అధికం. దేశంలో ఉపాధి పరిస్థితి మెరుగుపడినట్లు తాజా పేరోల్ డేటా వివరించింది. గడచిన ఆరు సంవత్సరాల్లో 6.1 కోట్లకుపైగా ఈపీఎఫ్ఓలో చేరినట్లు కార్మిక మంత్రిత్వశాఖ అధికారి ఒకరు తెలిపారు. 2017–18లో నిరుద్యోగితా రేటు 6 శాతం ఉంటే, 2022–23లో ఈ రేటు 3.2 శాతానికి తగ్గినట్లు కూడా వెల్లడించారు.

● ఇన్ఫోసిస్ డివిడెండ్ ధమాకా..

బుల్లి బిలియనీర్‌కు రూ. 4 కోట్లు



న్యూఢిల్లీ: బుల్లి బిలియనీర్ ఐదు నెలల ఏకగ్రాహ రోహన్ మూర్తి తాజాగా రూ. 4.2 కోట్లు అందుకోనున్నాడు. ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి మనుమడు ఏకగ్రాహకు ఇటీవల 15 లక్షల షేర్లను బహుమతిగా ఇవ్వడంతో ఇది సాధ్యపడింది. క్యూ4తోపాటు, గత ఆర్థిక సంవత్సరానికి ఫలితాలు ప్రకటించిన ఇన్ఫోసిస్ వాటాదారులకు షేరుకి రూ. 28 డివిడెండ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఇన్ఫోసిస్ వాటాదారుడిగా ఏకగ్రాహకు డివిడెండ్ రూపేణా రూ. 4.2 కోట్లు లభించనున్నాయి. ఏకగ్రాహకు నారాయణ మూర్తి కానుకగా ఇచ్చిన ఇన్ఫోసిస్ షేర్ల విలువ రూ. 240 కోట్లుకాగా.. బుల్లి బిలియనీర్ తాజాగా 4 కోట్ల నగదును అందుకోనున్నాడు. ప్రత్యేక డివిడెండ్ రూ. 8తో కలిపి మొత్తం రూ. 28 డివిడెండ్‌ను ఇన్ఫోసిస్ జూలై1 కల్లా చెల్లించనుంది. ఇందుకు మే 31 రికార్డ్ డేట్‌గా ప్రకటించింది.

ఐటీ కంపెనీల్లో కోతలు..

టాప్ 3 సంస్థల్లో 64వేల మంది తగ్గుదల



బెంగళూరు: అంతర్జాతీయంగా డిమాండ్ బలహీనంగా ఉండటం, టెక్నాలజీపై క్లయింట్లు ఖర్చులను తగ్గించుకోవడం తదితర అంశాలు దేశీ ఐటీ రంగంపై ప్రభావం చూపుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం మూడు దిగ్గజ సంస్థలు .. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రోలో 64,000 మందికి పైగా సిబ్బంది తగ్గారు. ఆయా కంపెనీల ఆర్థిక ఫలితాల ప్రకారం అగ్రగామి టీసీఎస్‌లో ఉద్యోగుల సంఖ్య 13,249 మేర తగ్గి 6,01,546కి పరిమితమైంది. అలాగే రెండో అతి పెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్‌లోనూ 25,994 మంది నిష్క్రమించగా ఉద్యోగుల సంఖ్య 3,17,240కి తగ్గింది. ఇన్ఫీలో అట్రిషన్ రేటు (ఉద్యోగుల వలసలు) 12.6 శాతంగా ఉంది. ఇక శుక్రవారం ఫలితాలు వెల్లడించిన విప్రోలో ఉద్యోగుల సంఖ్య 24,516 మేర తగ్గి 2,34,054కి పరిమితమైంది.

కనిష్టాల వద్ద కొనుగోళ్లు

నాలుగు రోజుల నష్టాలకు చెక్ ● రాణించిన బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు

ముంబై: కనిష్ట స్థాయిల వద్ద బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో షేర్ల భారీ కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీల నాలుగురోజుల వరుస నష్టాలకు శుక్రవారం చెక్ పడింది. సెన్సెక్స్ 559 పాయింట్లు లాభపడి 73,088 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 151 పాయింట్లు పెరిగి 22,147 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ప్రథమార్ధమంతా నష్టాలతో ట్రేడయ్యాయి. అయితే ఇటీవల మార్కెట్ వరుస పతనంలో భాగంగా దిగివచ్చిన లార్జ్ క్యాప్ షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ఫలితంగా సూచీలు మిడ్ సెషన్ నుంచి లాభాల దిశగా కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 673 పాయింట్లు పెరిగి 73,210 వద్ద, నిఫ్టీ 184 పాయింట్లు బలపడి 22,180 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. రికవరీ ర్యాలీలోనూ ఐటీ, టెలికం, యుటిలిటీ, రియల్టీ, టెక్ రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.39%, 0.04% చొప్పున నష్టపోయాయి.



విప్రో.. వీక్!



బెంగళూరు: ఐటీ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం వార్షికంగా దాదాపు 8 శాతం క్షీణించి రూ. 2,835 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 3,075 కోట్లు ఆర్జించింది.

- క్యూ4 నికర లాభం డౌన్
- రూ. 2,835 కోట్లకు చేరిక
- ఆకట్టుకోని క్యూ1 అంచనాలు

మొత్తం ఆదాయం సైతం 4.2 శాతం వెనకడుగుతో రూ. 22,208 కోట్లకు చేరింది.

అటూఇటుగా వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికానికి(క్యూ1) ఆదాయంలో ప్రతికూల లేదా స్వల్ప వృద్ధిని విప్రో అంచనా వేసింది. వెరసి –1.5 నుంచి +0.5 శాతం గైడెన్స్ ప్రకటించింది. ఇది కంపెనీ కొత్త సీఈవోగా శ్రీనివాస్ పల్లియా బాధ్యతలు స్వీకరించాక వెలువరించిన తొలి గైడెన్స్‌కాగా.. వృద్ధికి ఊతమివ్వడమే ప్రథమ ప్రాధమ్యమని శ్రీనివాస్ పేర్కొన్నారు.

సవాళ్ల ఫలితం



గతేడాది ఐటీ పరిశ్రమకు పలు సవాళ్లు ఎదురయ్యాయ్. దీంతో కంపెనీ పనితీరు ప్రభావితమైంది. స్వల్పకాలంలో మరిన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశముంది. అయితే అవకాశాలకు అంతులేదు. మేమంతా కలసికట్టుగా కృషి చేయడం ద్వారా తదుపరి వృద్ధి దశను అందుకోనున్నాం.

– శ్రీనివాస్ పలియా, సీఈవో, విప్రో లిమిటెడ్.

ఇతర విశేషాలు

- గతేడాదికి మొత్తం ఆదాయం 1 శాతం నీరసించి రూ. 89,760 కోట్లకు పరిమితమైంది.
- నికర లాభం 2.6 శాతం తక్కువగా రూ. 11,045 కోట్లను తాకింది.
- ఈ ఏడాది క్యూ1లో ఐటీ సర్వీసుల బిజినెస్ ఆదాయం 261.7–267 కోట్ల డాలర్ల శ్రేణిలో నమోదుకాగలదని అంచనా వేసింది.
- పూర్తి ఏడాదిలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 9.1 శాతం క్షీణించి 2,34,054కు పరిమితమైంది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు బీఎస్ఈలో 2 శాతం లాభంతో రూ. 453 వద్ద ముగిసింది.

పేఇన్‌స్టాకార్డ్ నిధుల సమీకరణ

హైదరాబాద్: బిల్లుల చెల్లింపులను సులభతరం చేసే హైదరాబాదీ ఫిన్‌టెక్ స్టార్టప్ సంస్థ పేఇన్‌స్టాకార్డ్ తాజాగా ఏంజెల్ ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడులు సమీకరించింది. బ్రాండిక్స్ ఇండియా పార్ట్‌నర్ పీసీ దొరస్వామి, పారిశ్రామికవేత్త సంధ్యా రాణి మద్దిపాటి తదితరులు వీరిలో ఉన్నట్లు సంస్థ వ్యవస్థాపకులు సాయి కృష్ణ ముసునూరు, శ్రీ నగేశ్ కోటిపల్లి తెలిపారు. కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ నిధులను ఉపయోగిస్తామన్నారు.

ఏపీ అంతటా ఎయిర్‌టెల్ 5జీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారతీ ఎయిర్‌టెల్ ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలు, గ్రామాలకు 5జీ నెట్‌వర్క్‌ను విస్తరించినట్టు ప్రకటించింది. ఏపీలో 79 లక్షల మంది కస్టమర్లు 5జీ సేవలను వినియోగిస్తున్నారని సంస్థ వెల్లడించింది. గడిచిన ఆరు నెలల్లో 5జీ వినియోగదార్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఎయిర్‌టెల్ తెలిపింది.

జియో ఫైనాన్షియల్ లాభం రూ. 311 కోట్లు



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లాభం రూ. 311 కోట్లుగా, ఆదాయం రూ. 418 కోట్లుగా నమోదైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి విభజించిన జియో ఫైనాన్షియల్ .. డిసెంబర్ క్వార్టర్‌లో రూ. 294 కోట్ల నికర లాభం, రూ. 414 కోట్ల ఆదాయం ప్రకటించింది. మరోవైపు, పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ నికర లాభం రూ. 1,605 కోట్లకు చేరింది. జియో ఫైనాన్షియల్ సంస్థ.. ఇన్వెస్టింగ్, ఫైనాన్సింగ్, ఇన్సూరెన్స్ బ్రోకింగ్, పేమెంట్ బ్యాంక్, పేమెంట్ అగ్రిగేటర్ తదితర కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

శుక్రవారం కంపెనీ షేరు బీఎస్ఈలో 2 శాతం తగ్గి రూ. 370 వద్ద క్లోజయ్యింది.

హిందుస్తాన్ జింక్ లాభం డౌన్

క్యూ4లో రూ. 2,038 కోట్లు

న్యూఢిల్లీ: వేదాంతా గ్రూప్ మైనింగ్ దిగ్గజం హిందుస్తాన్ జింక్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 21 శాతం క్షీణించి రూ. 2,038 కోట్లకు పరిమితమైంది. జింక్ ధరలు నీరసించడం ప్రభావం చూపింది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,583 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 8,863 కోట్ల నుంచి రూ. 7,822 కోట్లకు తగ్గింది. ఈ కాలంలో రూ. 2,099 కోట్ల క్యాష్‌ఫ్లోను సాధించింది. పెట్టుబడి వ్యయాల తదుపరి గతేడాదిలో కార్యకలాపాల నిర్వహణ ద్వారా రూ. 9,004 కోట్ల నగదు(ఫ్రీ క్యాష్ ఫ్లో)ను సాధించినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ. 398 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-4-2024 ఫామ్ ధర...

విశాఖ	430–00
చిత్తూరు	493–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415–00
విజయవాడ	415–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	410–00
వరంగల్	412–00
రిటైల్ ధర	4.70

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో అనిరుధ్, రిత్విక్ జోడీలు

అకాపుల్కో (మెక్సికో): జీఎన్‌పీ సెగురోస్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్–125 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్లు అనిరుధ్ చంద్రశేఖర్, బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ సంచలనం సృష్టించారు. అనిరుధ్ (భారత్)–హాన్స్ హచ్ వెర్డొగో (మెక్సికో)... రిత్విక్–నిక్కీ పునాచా (భారత్) జోడీలు సీడెడ్ జంటలను బోల్తా కొట్టించి సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో రిత్విక్–నిక్కీ జంట 6–4, 6–1తో రెండో సీడ్ పీటర్ మటుస్‌జెవ్‌స్కీ (పోలాండ్)–మాథ్యూ క్రిస్టోఫర్ రొమియోస్ (ఆస్ట్రేలియా) జోడీని ఓడించగా... అనిరుధ్–వెర్డొగో ద్వయం 3–6, 6–4, 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో మూడో సీడ్ రింకీ హిజికాటా (ఆస్ట్రేలియా)–మ్యాక్ కిగెర్ (అమెరికా) జంటకు షాక్ ఇచ్చింది.



టైటిల్ పోరుకు యూకీ-అల్బానో జోడీ



మ్యూనిక్: భారత టెన్నిస్ అగ్రశ్రేణి క్రీడాకారుడు యూకీ బాంబ్రీ తన కెరీర్‌లో మూడోసారి ఏటీపీ-250 టోర్నీలో డబుల్స్ టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. బీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో యూకీ–ఒలివెట్టి జంట 6–1, 6–7 (5/7), 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో ఎర్‌లెర్–మెడ్లెర్ (ఆస్ట్రియా) ద్వయంపై గెలిచింది. 92 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఈ ఇండో-ఫ్రెంచ్ జోడీ ఏడు ఏస్‌లు సంధించి నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

హార్దిక్ పాండ్యాపై రూ. 12 లక్షలు జరిమానా



ముల్లాన్‌పూర్: ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ రూ. 12 లక్షలు జరిమానా విధించింది. ముల్లాన్‌పూర్‌లో గురువారం పంజాబ్ కింగ్స్ జట్టుతో ఐపీఎల్ మ్యాచ్‌లో ముంబై జట్టు నిర్ణీత సమయంలో పూర్తి 20 ఓవర్ల కోటా పూర్తి చేయలేకపోయింది. దాంతో స్లో ఓవర్‌రేట్ నమోదు చేసినందుకు హార్దిక్‌పై పెనాల్టీని విధించారు. తాజా సీజన్‌లో ఇప్పటి వరకు స్లో ఓవర్‌రేట్ కారణంగా రిషభ్ పంత్ (ఢిల్లీ క్యాపిటల్స్–2 సార్లు), శుబ్‌మన్ గిల్ (గుజరాత్ టైటాన్స్), సంజూ సామ్సన్ (రాజస్తాన్ రాయల్స్), శ్రేయస్ అయ్యర్ (కోల్‌కతా నైట్‌రైడర్స్)లపై జరిమానా విధించారు.

నాలుగో స్థానంలో దీపా కర్మాకర్

దోహా: ప్రపంచకప్ జిమ్నాస్టిక్స్ టోర్నీలో భారత మహిళా జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ వాల్ట్ ఈవెంట్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. ఫైనల్లో దీపా 13.333 పాయింట్లు స్కోరు చేసింది. నవాస్ కార్లా (పనామా; 13.850 పాయింట్లు) స్వర్ణం, ఆన్ చాంగ్ (కొరియా; 13.833 పాయింట్లు) రజతం సాధించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. వచ్చే నెలలో తాష్కెంట్‌లో జరిగే ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో దీపా రాణిస్తే పారిస్ బెర్త్ సాధించే అవకాశముంది.

'సూపర్' పోరులో జెయింట్స్ పైచేయి

ఐపీఎల్ సీజన్‌లో వరుసగా రెండు ఓటముల తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ కోలుకుంది. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో చెన్నై సూపర్ కింగ్స్‌ను నిలువరించిన లక్నో ఆ తర్వాత ఎలాంటి తడబాటు లేకుండా లక్ష్యం చేరింది. ఛేదనలో కేఎల్ రాహుల్, డికాక్ కీలక పాత్ర పోషించగా... రెండు వరుస విజయాల తర్వాత చెన్నై తలవంచింది.

- సొంతగడ్డపై లక్నో విజయం
- 8 వికెట్లతో ఓడిన చెన్నై
- రాణించిన రాహుల్, డికాక్



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రాహుల్

లక్నో: సొంతగడ్డపై సమష్టి ప్రదర్శనతో లక్నో కీలక విజయాన్ని అందుకుంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో లక్నో 8 వికెట్ల తేడాతో ఐదుసార్లు చాంపియన్ చెన్నైపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. రవీంద్ర జడేజా (40 బంతుల్లో 57 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా... రహానే (24 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్), మొయిన్ అలీ (20 బంతుల్లో 30; 3 సిక్స్‌లు), ధోని (9 బంతుల్లో 28 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం లక్నో 19 ఓవర్లలో 2 వికెట్లకు 180 పరుగులు సాధించి గెలిచింది. కెప్టెన్ కేఎల్ రాహుల్ (53 బంతుల్లో 82; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), క్వింటన్ డికాక్ (43 బంతుల్లో 54; 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 90 బంతుల్లోనే 134 పరుగులు జోడించి విజయాన్ని సులువు చేశారు.

ధోని మెరుపులు...

ఓపెనర్ రచిన్ రవీంద్ర (0) టోర్నీలో తన వరుస వైఫల్యాలను కొనసాగించగా... మరో ఎండ్‌లో రహానే కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. పవర్‌ప్లే ముగిసేసరికి చెన్నై 51 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (17) ప్రభావం చూపలేకపోగా, నాలుగో స్థానంలో వచ్చిన జడేజా పరిస్థితిని చక్కదిద్దాడు. అయితే రహానేతో పాటు ఫామ్‌లో ఉన్న శివమ్ దూబే (3), సమీర్ రిజ్వీ (1)లను తక్కువ వ్యవధిలో అవుట్ చేసి లక్నో ఆధిక్యం ప్రదర్శించింది. ఈ సమయంలో కట్టుదిట్టమైన బౌలింగ్ కారణంగా చెన్నై బ్యాటర్లు పరుగులు చేయడంలో ఇబ్బంది పడ్డారు. ఒకదశలో వరుసగా 34 బంతుల పాటు బౌండరీనే రాలేదు! 16 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 113/5. అయితే చివరి 4 ఓవర్లలో సూపర్ కింగ్స్ చెలరేగి 63 పరుగులు రాబట్టింది. మొహసిన్ ఓవర్లో సిక్సర్‌తో 34 బంతుల్లో జడేజా అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా... బిష్ణోయ్ వేసిన తర్వాతి ఓవర్లో అలీ వరుసగా 6, 6, 6 బాదడం విశేషం. అనంతరం 19వ ఓవర్లో 4, 6 కొట్టిన ధోని... ఆఖరి ఓవర్లో మరో 2 ఫోర్లు, సిక్స్‌తో చెలరేగాడు. ఏడో వికెట్‌కు ధోని, జడేజా 13 బంతుల్లో 35 పరుగులు జోడించారు.

శతక భాగస్వామ్యం...

ఛేదనను రాహుల్, డికాక్ ఘనంగా ఆరంభించారు. వీరిద్దరిని ఇబ్బంది పెట్టడంలో చెన్నై బౌలర్లంతా విఫలమయ్యారు. ఇద్దరూ ధాటిగా ఆడటంతో పవర్‌ప్లేలో 54 పరుగులు రాగా... 10.5 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 100 పరుగులు దాటింది. 31 పరుగుల స్కోరు వద్ద డికాక్ ఇచ్చిన క్యాచ్‌ను పతిరణ వదిలేయగా, 31 బంతుల్లో రాహుల్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత 41 బంతుల్లో డికాక్ కూడా హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. విజయానికి చేరువైన దశలో తక్కువ వ్యవధిలో వీరిద్దరు అవుటైనా... లక్ష్యం చేరేందుకు లక్నోకు ఇబ్బంది ఎదురు కాలేదు.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రహానే (బి) కృనాల్ 36; రచిన్ (బి) మొహసిన్ 0; రుతురాజ్ (సి) రాహుల్ (బి) యశ్ 17; జడేజా (నాటౌట్) 57; దూబే (సి) రాహుల్ (బి) స్టొయినిస్ 3; రిజ్వీ (స్టంప్) రాహుల్ (బి) కృనాల్ 1; అలీ (సి) బదోని (బి) బిష్ణోయ్ 30; ధోని (నాటౌట్) 28; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు 176. వికెట్ల పతనం:** 1–4, 2–33, 3–68, 4–87, 5–90, 6–141. **బౌలింగ్:** హెన్రీ 3–0–26–0, మొహసిన్ 4–0–37–1, యశ్ ఠాకూర్ 4–0–45–1, కృనాల్ పాండ్యా 3–0–16–2, రవి బిష్ణోయ్ 4–0–44–1, స్టొయినిస్ 2–0–7–1.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) ధోని (బి) ముస్తఫిజుర్ 54; రాహుల్ (సి) జడేజా (బి) పతిరణ 82; పూరన్ (నాటౌట్) 23; స్టొయినిస్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (19 ఓవర్లలో 2 వికెట్లకు) 180. వికెట్ల పతనం:** 1–134, 2–161. **బౌలింగ్:** దీపక్ చహర్ 3–0–26–0, తుషార్ 4–0–42–0, ముస్తఫిజుర్ 4–0–43–1, జడేజా 3–0–32–0, పతిరణ 4–0–29–1, అలీ 1–0–5–0.

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ × హైదరాబాద్
వేదిక: న్యూఢిల్లీ
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	7	6	1	12	0.677
కోల్‌కతా	6	4	2	8	1.399
చెన్నై	7	4	3	8	0.529
హైదరాబాద్	6	4	2	8	0.502
లక్నో	7	4	3	8	0.123
ఢిల్లీ	7	3	4	6	-0.074
ముంబై	7	3	4	6	-0.133
గుజరాత్	7	3	4	6	-1.303
పంజాబ్	7	2	5	4	-0.251
బెంగళూరు	7	1	6	2	-1.185

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్


సంయుక్తంగా అగ్రస్థానంలో గుకేశ్



టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల గుకేశ్ 12వ రౌండ్ తర్వాత 7.5 పాయింట్లతో నకమురా (అమెరికా), నిపోమ్‌నిషి (రష్యా)లతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. 12వ రౌండ్‌లో గుకేశ్ 57 ఎత్తుల్లో నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)ను ఓడించాడు. ఈ టోర్నీలో గుకేశ్‌కిది నాలుగో విజయం. భారత్‌కే చెందిన ప్రజ్ఞానంద, విదిత్‌లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. నిపోమ్‌నిషితో జరిగిన గేమ్‌ను తమిళనాడు కుర్రాడు ప్రజ్ఞానంద 55 ఎత్తుల్లో 'డ్రా' చేసుకోగా... మహారాష్ట్ర ప్లేయర్ విదిత్ 52 ఎత్తుల్లో కరువానా (అమెరికా) చేతిలో ఓడిపోయాడు. నిర్ణీత 14 రౌండ్‌లు ముగిశాక అత్యధిక పాయింట్లు సాధించిన ప్లేయర్ ప్రస్తుత ప్రపంచ చాంపియన్‌తో ప్రపంచ టైటిల్ కోసం పోటీపడతాడు. మరోవైపు మహిళల విభాగంలో భారత స్టార్ కోనేరు హంపి ఖాతాలో ఎనిమిదో 'డ్రా' చేరింది. గొర్యాచ్‌కినా (రష్యా)తో జరిగిన 12వ రౌండ్ గేమ్‌ను హంపి 25 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. ఉక్రెయిన్ గ్రాండ్‌మాస్టర్ అనా ముజిచుక్‌తో జరిగిన గేమ్‌ను భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ వైశాలి 57 ఎత్తుల్లో నెగ్గింది. హంపి 6 పాయింట్లతో నాలుగో స్థానంలో, వైశాలి 5.5 పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నారు.

భారత ఫ్రీస్టయిల్ రెజ్లర్లకు నిరాశ

ఒక్క విభాగంలోనూ లభించని ఒలింపిక్ బెర్త్



అమన్

బిష్కెక్ (కిర్గిస్తాన్): ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ రెజ్లింగ్ టోర్నీలో తొలి రోజు భారత పురుషుల ఫ్రీస్టయిల్ రెజ్లర్లకు నిరాశ ఎదురైంది. అందుబాటులో ఉన్న ఆరు వెయిట్ కేటగిరీల (57, 65, 74, 86, 97, 125 కేజీలు) నుంచి ఒక్క విభాగంలోనూ భారత రెజ్లర్‌కు ఒలింపిక్ బెర్త్ ఖరారు కాలేదు. ప్రతి వెయిట్ కేటగిరీలో ఫైనల్ చేరిన ఇద్దరికి ఒలింపిక్ బెర్త్‌లు లభిస్తాయి. 57 కేజీల విభాగంలో అమన్ సెహ్రావత్‌కు త్రుటిలో ఒలింపిక్ బెర్త్ చేజారింది. సెమీఫైనల్లో అమన్ 0–10తో గులోమ్‌జన్ అబ్దుల్లాయెవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. అంతకుముందు అమన్ తొలి రౌండ్‌లో 10–0తో యెరాసిల్ ముఖాతరూలీ (కజకిస్తాన్)పై, క్వార్టర్ ఫైనల్లో 11–1తో కిమ్ సంగ్‌వన్ (దక్షిణ కొరియా)పై గెలుపొందాడు. భారత ఇతర రెజ్లర్లు జైదీప్ (74 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో... దీపక్ (97 కేజీలు) తొలి రౌండ్‌లో... సుమిత్ మలిక్ (125 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో ఓటమి పాలయ్యారు.

దీపక్, సుజీత్ ఆలస్యంగా...



టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం బౌట్‌లో ఓడిపోయిన దీపక్ పూనియా (86 కేజీలు), సుజీత్ కలాకల్ (65 కేజీలు) ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీకి ఎంట్రీలు పంపించినా దురదృష్టం వారిని వెంటాడింది. రష్యాలో ఈనెల 2 నుంచి 15 వరకు శిక్షణ పొందిన దీపక్, సుజీత్ 16న దుబాయ్ మీదుగా కిర్గిస్తాన్ రాజధాని బిష్కెక్ చేరుకోవాలనుకున్నారు. అయితే దుబాయ్‌లో అనూహ్య వరదల కారణంగా వీరిద్దరు దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకుపోయారు. పలు విమానాలు రద్దు కావడం... మరికొన్ని ఆలస్యంగా నడవడంతో దీపక్, సుజీత్ శుక్రవారం తప్పనిసరిగా హాజరుకావాల్సిన వెయింగ్ కార్యక్రమానికి సమయానికి చేరుకోలేకపోయారు. దాంతో దీపక్, సుజీత్ ఈ టోర్నీలో బరిలోకి దిగలేకపోయారు. మే నెలలో టర్కీలో వరల్డ్ క్వాలిఫయింగ్ టోర్నీ రూపంలో భారత రెజ్లర్లకు పారిస్ బెర్త్‌లు సంపాదించే అవకాశం మిగిలి ఉంది. శనివారం మహిళల విభాగంలో పోటీలు జరుగుతాయి. వినేశ్ ఫొగాట్ (50 కేజీలు), అన్షు (57 కేజీలు), మాన్సి (62 కేజీలు), నిషా (68 కేజీలు), రీతిక (76 కేజీలు) బరిలో ఉన్నారు.

సీఎస్ అనుమతిలేకుండా హెడ్‌క్వార్టర్స్ వీడి వెళ్లొద్దు

- అన్ని శాఖల ప్రత్యేక సీఎస్‌లు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులకు ప్రభుత్వం ఆదేశం

సాక్షి, అమరావతి: సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముందస్తు అనుమతిలేకుండా అన్ని శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు హెడ్ క్వార్టర్స్ వీడి వెళ్లవద్దని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. శాఖాధిపతులు కూడా హెడ్ క్వార్టర్స్ వీడి వెళ్ల వద్దని తెలిపింది. శాఖాధిపతులు హెడ్ క్వార్టర్స్ వీడి వెళ్లాల్సి వస్తే సంబంధిత ప్రత్యేక సీఎస్, ముఖ్య కార్యదర్శి, కార్యదర్శుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. సాధారణ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఈ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్య కార్యదర్శి ఎస్.యువరాజ్ శుక్రవారం సర్క్యులర్ మెమో జారీ చేశారు.

'సెలవుల్లో సరదాగా-2024' అమలు చేయాలి

- వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవాలి
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్



సాక్షి, అమరావతి: వేసవి సెలవుల్లో విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా 'సెలవుల్లో సరదాగా-2024' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆర్జేడీలు, డీఈవోలు, సమగ్ర శిక్షా ఏపీసీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తరగతుల వారీగా అమలు చేయాల్సిన కార్యక్రమాల మార్గదర్శకాలను విడుదల చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో కొత్త నైపుణ్యాలు, విజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు క్రీడలు, వృత్తి నైపుణ్యం, సృజనాత్మక కళలపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల కోసం వేసవి కోచింగ్ క్యాంపులు నిర్వహించాలని పీఈటీలను కోరారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడానికి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, డైట్ ప్రిన్సిపాళ్లతో 'వుయ్ లవ్ రీడింగ్' పోటీలను నిర్వహించాలన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు, స్థానిక కమ్యూనిటీ సంస్థల సహకారంతో ఈ వేసవి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.

ఏపీ ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

- మే 15వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 8న రాష్ట్ర వ్యాప్తంగా 36 సెంటర్లలో ప్రవేశ పరీక్ష

ఏయూ క్యాంపస్: రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఎడ్‌సెట్-2024కు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కన్వీనర్ ఆచార్య టి.వి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మే 15వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామని, రూ.1000 అపరాధ రుసుముతో మే 19 వరకు, రూ.2 వేల అపరాధ రుసుముతో మే 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. అభ్యర్థుల దరఖాస్తు రుసుముగా రూ.600 నిర్ణయించామని, బీసీలు రూ.500, ఎస్సీ, ఎస్టీలు రూ.450 చొప్పున చెల్లించాలని తెలిపారు. మే 30 నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జూన్ 8న రాష్ట్ర వ్యాప్తంగా 36 సెంటర్లలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులు www.cetr.aprche.ap.gov.in నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్కాట్లాండ్‌లో ఇద్దరు ఏపీ విద్యార్థులు మృతి

లండన్: స్కాట్లాండ్‌లోని జలపాతంలో మునిగి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ డుండీకి చెందిన విద్యార్థులు కొందరు విహారయాత్రలో భాగంగా ఈ నెల 17వ తేదీన పెర్త్‌షైర్‌లోని లిన్ ఆఫ్ టమ్మెల్ జలపాతం వద్దకు వెళ్లారు. వీరిలో జితేంద్రనాథ్ కరుటూరి(26), చాణక్య బొలిశెట్టి(22)అనే ఇద్దరు ప్రమాదవశాత్తు జలపాతంలో పడి ప్రాణాలు కోల్పోయారు. స్థానిక యంత్రాంగం మృతదేహాలను వెలికితీసింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీరిద్దరూ 2023 జనవరిలో డుండీ యూనివర్సిటీలో డేటా సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో చేరారు. మృతుల కుటుంబీకులతో మాట్లాడుతున్నామని, 19న పోస్టుమార్టం ముగిశాక మృతదేహాలను భారత్‌కు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తామని దౌత్య కార్యాలయం వివరించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి 2024
శనివారం
ఏప్రిల్, 20




జైత్రయాత్ర

గుసగుస

ఇది యాపారం!



'ఒకరు రూ.లక్షకు పడతారు. ఇంకొకరు రూ.కోటికి పడతారు. ఎవరైనా ఏదో ఒక ఫిగర్‌కు కచ్చితంగా పడతారు' అనే ఫార్ములాను అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సి.ఎం.రమేష్ బాగానే వంటబట్టించుకున్నారు. పార్టీ కోసం పని చేస్తున్న ద్వితీయ శ్రేణి నాయకులకు పైసా కూడా విదల్చని ఈయన, అలక నేతలకు భారీగా ముట్టజెప్తున్నారు. పెందుర్తి సీటు ఆశించి భంగపడ్డ బండారు సత్యనారాయణమూర్తికి మాడుగుల సీటు ఇప్పించడంలో సాయపడ్డారు. దీంతోపాటు టీడీపీ అసంతృప్త నేతలు గవిరెడ్డి రామానాయుడుకు రూ.4 కోట్లు, బండారు కోసం సీటును త్యాగం చేసిన పైలా ప్రసాద్‌కు, స్థానిక నేత పీవీజీ కుమార్‌కు చెరో రూ.2 కోట్లు చెల్లించి, బుజ్జగించే పనిలో ఉన్నారట.

మలి విఘ్నం



గంటా శ్రీనివాసరావు పోటీ చేసిన నియోజకవర్గంలో మళ్లీ పోటీ చేయని వ్యక్తి. ఆ ఆనవాయితీని బ్రేక్ చేస్తూ ఈసారి భీమిలిలో మళ్లీ పోటీకి దిగారు. టీడీపీ నుంచి 1999లో అనకాపల్లి ఎంపీగా, 2004లో చోడవరం ఎమ్మెల్యేగా, 2009లో పీఆర్పీ తరఫున అనకాపల్లి, మళ్లీ టీడీపీలో చేరి భీమిలి(2014), విశాఖ ఉత్తర (2019)లో గెలిచారు. ఆయన గెలిచిన ఏ నియోజకవర్గంలోనూ రెండోసారి పోటీ చేయకపోవడానికి కారణం, ఆ నియోజకవర్గంలో పదవిలో ఉన్న ఐదేళ్లూ ఏమీ చేయకపోవడమే. పైపెచ్చు భీమిలి నియోజకవర్గంలో గంటా హయాంలోనే భూ కబ్జాలు భారీగా జరిగాయి. ఇప్పుడు గంటాను అదే భయం వెంటాడుతోందట.

'చింత'తప్పదు



కూటమి పొత్తులు దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌కు షాకిచ్చేలా ఉన్నాయి. బీజేపీ నేత సీతారామాంజనేయ(తపన)చౌదరి ఏలూరు ఎంపీ ఆశించారు. దక్కలేదు. దీంతో ఆయన వర్గం ఆందోళన వ్యక్తం చేసింది. అనపర్తి రాజకీయాల నేపథ్యంలో ఆ సీటు టీడీపీకి ఇస్తే, దెందులూరు కావాలంటూ బీజేపీ పట్టుబడుతోంది. అదే జరిగితే తపన చౌదరికి ఎమ్మెల్యే సీటు గ్యారంటీ. చింతమనేని మాత్రం ఈ మార్పునకు ససేమిరా అంటున్నారు. ఏలూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేశ్ యాదవ్ కూడా చింతమనేనికి వంతపాడుతున్నారు. అయితే చంద్రబాబుకు మరో దారి లేదట. తనపై ఉన్న కేసుల నేపథ్యంలో భవిష్యత్తులో బీజేపీ అండ గట్టిగా ఉండాలనుకుంటున్న చంద్రబాబు తలొగ్గేలా కనిపిస్తున్నారట.

బిల్డప్ బాబాయ్..

విజయనగరం జిల్లా రాజాం టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌ను స్థానికులు బిల్డప్ బాబాయ్‌గా పిలుస్తారు. ఈయన 2012–14 మధ్య కాలంలో కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా ఉన్నారు. విశాఖలో నివాసం ఉండే ఈయన వారానికో, పక్షానికో రాజాం వచ్చేవారు. ఆ సమయంలో సుభద్రాపురం హైవే కూడలి వద్దకు నియోజకవర్గంలోని ప్రతి మండలం నుంచి ఒకటి రెండు కార్లను తెప్పించుకుని, కార్ల ర్యాలీతో నియోజకవర్గ పర్యటనకు వెళ్లేవారు. వీటికి తోడు మంత్రి కావడంతో ప్రొటోకాల్ వాహనం అదనం. ఇప్పుడు అధికారం, పదవులు పోగొట్టుకున్నా.. ఈ కార్ల ర్యాలీ మోజు వదల్లేదట. ఇప్పటికీ ఆయన రాజాం రావాలంటే స్థానిక నేతలు నాలుగైదు కార్లలో పొలిమేరలోనే కాపు కాయాలి.

రామోజీ.. కళ్లకు పచ్చగంతలు తీసి చూడు...
మొత్తంగా వ్యవ'సాయం' రూ. 1,86,548 కోట్లు

బాబు దండగ అంటే.. జగన్ పండగ చేశారు..

రాష్ట్రంలో కొత్త పుంతలు తొక్కుతున్న వ్యవసాయ రంగం

- గణనీయమైన పురోగతి.. రైతుల ఆదాయం పెరుగుదల.. జీవన ప్రమాణ స్థాయి మెరుగు
- దింపుడు కల్లం ఆశతో ఉన్న టీడీపీ కోసం ఈనాడు రోత రాతలు
- కళ్లెదుటే మార్పు కనిపిస్తున్నా ఉన్మాదిలా పేట్రేగిపోతున్న రామోజీ
- వినూత్న ఆర్బీకే వ్యవస్థపై అంతర్జాతీయ స్థాయిలో వేనోళ్లా ప్రశంసలు
- గ్రామ స్థాయిలో విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, యంత్ర, బ్యాంకింగ్ సేవలు

- ఈ క్రాప్ ద్వారా పక్కాగా పంటల నమోదు
- పైసా భారం పడకుండా పంటల బీమా
- సీజన్ ముగియకుండానే పంట నష్టపరిహారం
- గత ప్రభుత్వం ఎగ్గొట్టిన బకాయిలు సైతం చెల్లింపు
- ఎన్నికల్లో ఇచ్చిన హామీకి మించి పెట్టుబడి సాయం
- ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు రూ.7 లక్షల సాయం

- రికార్డు స్థాయిలో సాగు విస్తీర్ణం.. దిగుబడులు..
- పంటల మార్పిడితో పెరిగిన ఉద్యాన పంటల సాగు
- పండ్ల సాగు, దిగుబడులు, ఎగుమతులు ఘనం
- ఆక్వా రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం
- మత్స్యకారులకు వెన్నుదన్నుగా సంక్షేమ ఫలాలు
- జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు భరోసా
- అనుబంధ రంగాలకూ ఊతం..



'ఇక వ్యవసాయం దండగ.. దాని పని అయిపోయింది.. రైతులు వేరే పనులు చూసుకోండి.. వ్యవసాయానికి ఉచిత కరెంట్ అట! సాధ్యమయ్యే పనేనా? కరంటు తీగలు బట్టలు ఆరేసుకోవడానికి పనికొస్తాయి'. ఈ మాటలు అన్నది ఎవరని తెలుగు ప్రజలు ఎవరిని అడిగినా 'చంద్రబాబునాయుడు' అని టక్కున సమాధానమిస్తారు. రైతులంటే ఆయనకు చులకన. వ్యవసాయం అంటే దరిద్రం అని భావన. విద్యుత్ చార్జీలు తగ్గించమని అడిగినందుకు రైతులపై కాల్పులు జరిపించిన చరిత్ర ఆయనది.

'ఈ దేశంలో, రాష్ట్రంలో అత్యధిక శాతం మంది ప్రజలు ఆధారపడిన వృత్తి వ్యవసాయం. ఆరుగాలం శ్రమిస్తూ మనందరికీ అన్నం పెడుతున్న అన్నదాతలకు అండగా నిలవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. రైతుల కష్టాలు కళ్లారా చూశాను కాబట్టే వారి కోసం ఎందాకైనా.. అంటూ ఎన్నో పథకాలు, కార్యక్రమాలు చేపట్టాం. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. రైతులకు ప్రభుత్వాల పరంగా ఎంత చేసినా తక్కువే' అని సీఎం వైఎస్ జగన్ తరచూ చెబుతుంటారు.

వైఎస్ జగన్‌కు, చంద్రబాబుకు మధ్య ఎంత తేడా ఉందో పై రెండు ఉదాహరణలే నిదర్శనం. ఇలాంటి చంద్రబాబుకు ఈనాడు రామోజీ నిత్యం బాకా ఊదుతున్నారు. వ్యవసాయ రంగ పితామహుడు చంద్రబాబే అన్నట్లు కలరింగ్ ఇస్తున్నారు. దింపుడు కల్లం ఆశలతో ఉన్న టీడీపీని ఎలాగైనా సరే బతికించాలని బరితెగింపు రాతలు రాస్తున్నారు. నిస్సిగ్గుగా అబద్ధాలు వల్లె వేస్తున్నారు.

పూర్తి వివరాలు IVలో



- తోమియో షిచిరీ, కంట్రీ మాజీ డైరెక్టర్, ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (యూఎన్‌వో)

ప్రపంచ స్థాయి ఆవిష్కరణ

వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ఆలోచన వినూత్నం. ప్రపంచ స్థాయి ఆవిష్కరణ. వ్యవసాయాధారిత దేశాలన్నీ అనుసరించదగ్గ గొప్ప విధానం. వీటికి అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తాం. వీటి గురించి ఇప్పటికే ఐక్యరాజ్యసమితికి కూడా నివేదించాం.

జాతీయ స్థాయిలో అధ్యయనం జరగాలి

ఆర్బీకేల ద్వారా సంక్షేమ పథకాల అమలుతో పాటు సాగు ఉత్పాదకాలను రైతుల ముంగిటకు తీసుకెళ్తున్న తీరు బాగుంది. వాటిని జాతీయ స్థాయిలో అమలు చేసేందుకు చర్చ, అధ్యయనం జరగాలి. ఆర్బీకేలు ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేస్తే బాగుంటుంది. ఈ విషయమై కేంద్రానికి నివేదిక ఇస్తున్నాం.



అమితాబ్‌కాంత్, సీఈవో, నీతి ఆయోగ్

భూ'దండు' పాళ్యం బ్యాచ్ - 6

రాజధాని కేసుల్లో.. బాబుకు జైలే..

స్టేల బాబు శేషజీవితం చెరసాల్లోనే అంటున్న న్యాయనిపుణులు

- చుట్టుముట్టిన స్కిల్, అసైన్డ్ భూములు, ఐఆర్‌ఆర్ స్కాంలు
- పూర్తి ఆధారాలతో చార్జిషీట్లు దాఖలు చేసిన సీఐడీ
- చంద్రబాబుకు 17ఏ కింద రక్షణ లభించదని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- సెక్షన్ 409 కింద ఒక్కో కేసులో యావజ్జీవ ఖైదుకు అవకాశం
- అవినీతి నిరోధక చట్టం కింద ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు
- కాస్త జాప్యమయినా కఠిన శిక్ష మాత్రం ఖాయం: న్యాయ కోవిదులు



సాక్షి, అమరావతి: చట్టాల్ని ఏమార్చి పదుల కేసుల్లో స్టేలు తెచ్చుకొని.. సచ్ఛీలుడని విర్రవీగిన చంద్రబాబు అవినీతి పుట్ట పగిలింది.

మేకవన్నె పులికి మారుపేరైన ఆయన అసలు రూపం కోర్టుల సాక్షిగా సాక్షాత్కారమైంది.

ఎంతో నేర్పుగా చేసిన స్కిల్ స్కామ్..
అమరావతి అసైన్డ్ భూ దోపిడీ..
ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణం..

ఇలా అవినీతి దందాలతో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయాడు.

అవినీతి చేశాను.. అయితే నాకు చట్టాలు వర్తించవనే జిత్తులమారి తెలివితేటలతో సెక్షన్ 17–ఏను అడ్డం పెట్టుకొని తప్పించుకుందామన్న పన్నాగం బెడిసికొట్టింది.

చంద్రబాబుపై కేసుల్లో నేరం నిరూపితమైతే రాజధాని కుంభకోణం కేసుల్లో యావజ్జీవ ఖైదు తప్పదని న్యాయ నిపుణులు అంటున్నారు.

ఒక్కో కేసులో భారీ అవినీతి

స్కిల్ స్కామ్: జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీ పేరిట ఆ కంపెనీకే తెలియకుండా ప్రాజెక్టును సృష్టించి స్కిల్ స్కామ్‌కు పాల్పడ్డారు. ఈ కేసులోనే చంద్రబాబును సీఐడీ అరెస్ట్ చేయడంతోపాటు న్యాయస్థానం రిమాండ్ విధించగా.. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో 52 రోజులపాటు ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

అసైన్డ్ భూదోపిడీ: అమరావతిలో ఏకంగా రూ.5 వేల కోట్ల భూదోపిడీకి పాల్పడ్డారు.

ఇన్నర్ రింగ్‌రోడ్డు స్కామ్: అలైన్‌మెంట్‌లో అక్రమాల ద్వారా క్విడ్ ప్రోకోతో రూ.2,500 కోట్ల మేర అవినీతి.. అందుకోసం కేబినెట్ ఆమోదం లేకుండానే జీవోలు జారీ. నోట్ ఫైళ్లపై స్వయంగా చంద్రబాబే సంతకాలు చేసి అక్రమాల కథ నడిపించారు. అనంతరం నోట్ ఫైళ్లను గల్లంతు చేశారు. సీఐడీ ఆ అవినీతిని వెలికి తీయడంతో అతని బాగోతం బట్టబయలైంది. ఈ కుంభకోణాలన్నిటికీ సూత్రధారి చంద్రబాబే అని కీలక సాక్షులు వాంగ్మూలం ఇచ్చారు. 164 సీఆర్‌పీసీ కింద న్యాయస్థానంలో వాంగ్మూలాలు నమోదు చేశారు. ఈ కుంభకోణాల్లో చంద్రబాబు ప్రధాన కుట్రదారు, ప్రధాన లబ్ధిదారుడిగా ఉన్నారని డాక్యుమెంటరీ ఆధారాలు, కీలక సాక్షుల వాంగ్మూలాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ కేసుల నుంచి చంద్రబాబు తప్పించుకోవడం ఇక అసాధ్యమని న్యాయ నిపుణుల అభిప్రాయం.

చంద్రబాబుకు 17ఏ వర్తించదు: సుప్రీంకోర్టు

స్కిల్ స్కామ్‌లో సీఐడీ దర్యాప్తు చేసి చంద్రబాబును అరెస్ట్ చేశాక విజయవాడ ఏసీబీ న్యాయ స్థానంలో హాజరుపర్చింది. దాదాపు 10 గంటలు ఇరుపక్షాల వాదనల అనంతరం ఆయనకు న్యాయమూర్తి జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. సీఐడీ అభియోగాలు, అందులో పేర్కొన్న సెక్షన్లతో న్యాయమూర్తి ఏకీభవిస్తూ ఈ నిర్ణయం ప్రకటించారు. చంద్రబాబు 52 రోజులపాటు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అనంతరం అనారోగ్య కారణాలతో బెయిల్ మంజూరైంది. సెక్షన్ 17–ఏను వక్రీకరిస్తూ కేసుల నుంచి తప్పించుకునేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. 17–ఏ వర్తించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

కేబినెట్‌కు తెలియకుండా చీకటి జీవోలు

చంద్రబాబు అవినీతి విశ్వరూపాన్ని ఛేదించడం అంత తేలిక కాదు. కొన్ని సార్లు తప్పించుకోవచ్చు.. అన్నిసార్లూ తప్పించుకోలేరు.. చివరకు పక్కా ఆధారాలతో దొంగ దొరికాడు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు సర్వం తానై కుంభకోణాలకు పాల్పడ్డారు. 2014 నుంచి 2019 వరకు బరితెగించి సాగించిన అన్ని కుంభకోణాల్లోనూ కర్త, కర్మ, క్రియ చంద్రబాబేనని సీఐడీ పూర్తి ఆధారాలతో నిగ్గు తేల్చింది. కేబినెట్‌కు తెలియకుండా చీకటి జీవోలు జారీ చేసి ఏకపక్షంగా టెండర్లు కట్టబెట్టేశారు. ప్రభుత్వ నిధులు అస్మదీయులకు మళ్లించి.. షెల్ కంపెనీల ద్వారా అక్రమంగా ఆ డబ్బును విదేశాలకు తరలించారు. అవి హవాలా మార్గంలో తన బంగ్లాకే చేరేలా పక్కా వ్యూహం అమలు చేశారు.

సర్వం తానై..

కుట్రదారు, లబ్ధిదారుగా సర్వం తానై చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని సీఐడీ ఆధారాలతో నిగ్గు తేల్చింది. స్కిల్, అసైన్డ్ భూములు, ఐఆర్‌ఆర్ అలైన్‌మెంట్ కుంభకోణాల్లో చంద్రబాబును ఏ1గా చేరుస్తూ కేసు నమోదు చేయడంతోపాటు న్యాయస్థానాల్లో చార్జిషీట్లు దాఖలు చేసింది. ఐపీసీ సెక్షన్లు 120(బి), 166, 167, 418, 420, 465, 468, 471, 477(ఎ), 409, 201, 109 రెడ్‌విత్ 34, 37తోపాటు అవినీతి నిరోధక చట్టం 13(2) రెడ్‌విత్ 13(1), (సి), (డి) కింద అభియోగాలు నమోదు చేసింది. ఇప్పటికే చంద్రబాబుకు 74 ఏళ్లు. నేరం నిరూపితమై శిక్షలు పడితే యావజ్జీవం తప్పదు. ఇన్నర్ రింగ్ రోడ్, అసైన్డ్ భూముల కేసుల్లో లోకేశ్ నిందితుడిగా ఉన్నారు. నారాయణతోపాటు టీడీపీ ప్రభుత్వంలో మంత్రులుగా పని చేసిన వారు ఈ కేసుల్లో ఉన్నారు. వారంతా శిక్ష అనుభవించాల్సిందేనని న్యాయ నిపుణులు అంటున్నారు. ముఖ్యమంత్రిగా ఉంటూ అవినీతికి పాల్పడిన కేసుల్లో హరియాణా మాజీ సీఎం ఓం ప్రకాశ్ చౌతాలాకు 16 ఏళ్ల తర్వాత జైలు శిక్ష పడింది. తాజాగా తమిళనాడులో మంత్రిగా చేసిన సెంథిల్ బాలాజీ, మద్యం కేసుల్లో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు ఇప్పటికీ బెయిల్ రాకపోవడాన్ని ప్రస్తావిస్తున్నారు.

వేర్వేరుగా శిక్షలు అనుభవించాల్సిందే

అత్యంత కీలకమైన సెక్షన్ 409 కింద నేరం నిరూపితమైతే యావజ్జీవం విధిస్తారు. అవినీతి నిరోధక చట్టంలోని 13(2) రెడ్‌విత్ 13(1), (సి), (డి) కింద నేరం నిరూపితమైతే గరిష్టంగా పదేళ్ల వరకు జైలు శిక్ష.. ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశముంది. ఇతర సెక్షన్ల కేసుల్లో తీర్పులు వేర్వేరుగా వస్తాయి. నేరం నిరూపితమై శిక్ష పడితే చంద్రబాబు వేర్వేరుగా శిక్షలు అనుభవించాలి.

చదువులు నాడు-నేడు.. 2 మామయ్య గోరుముద్ద..

చదువుపైనే శ్రద్ధ

బడి పిల్లల మధ్యాహ్న భోజనంపై జగన్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

రోజుకొక మెనూతో నిత్యం పాఠశాలలోనే పౌష్టికాహారం

వివరాలు IIIలో

గతం

ముద్దన్నం... నీళ్ల సాంబారు... అదీ అరకొర... ఇదీ చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో బడిపిల్లలకు అందించే మధ్యాహ్న భోజన తీరు. ఆయన పాలనంటేనే కరువు. చంద్రబాబు సీఎంగా ఉన్న 2014–19 మధ్య రాష్ట్రంలో చాలావరకు కరువు పరిస్థితులు ఏర్పడి, ప్రజలకు ఉపాధి కూడా కరువైంది. ఫలితంగా నిరుపేదలు తిండికి కూడా దూరమయ్యారు. బడికి వెళ్లిన పేదల పిల్లలకు ఒక్క పూటైనా కడుపు నిండా అన్నం దొరుకుతుందని భావిస్తే.. అక్కడా ఆకలితో అలమటించేలా చేశారు. రోజూ ఒకేరకమైన మెనూవల్ల దానిని తినలేక, ఆకలితో ఉండలేక పేదింటి పిల్లల బాధ వర్ణనాతీతం. ఈ అన్నం తిన్నవారికి కడుపునొప్పి సర్వసాధారణం. కౌమారదశ బాలికలైతే అనారోగ్య సమస్యలు ఎదుర్కొనేవారు. బడికి వచ్చిన పిల్లల్లో 30 శాతంలోపే మధ్యాహ్న భోజనం చేసేవారు. ఏటా సగటున రూ.450 కోట్లు మాత్రమే దీనికి కేటాయించే వారు. ఒక్కో విద్యార్థికి వంట ఖర్చు రూ.3.59 మాత్రమే కేటాయించారు. అదీ ఏజెన్సీలకు ఎప్పుడూ సకాలంలో చెల్లించిన పాపాన పోలేదు.

ప్రస్తుతం

పాలనపై చిత్తశుద్ధి... విద్యారంగంపై సరికొత్త విజన్‌గల ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అనేక సంస్కరణలు అమలుచేశారు. పేదింటి పిల్లలకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందించేందుకు 'గోరుముద్ద' పథకాన్ని స్వయంగా రూపొందించారు. 1 నుంచి 10వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు 'జగనన్న గోరుముద్ద' కింద నాణ్యమైన, పౌష్టికాహారాన్ని ఆరోగ్యకరమైన వాతావరణంలో వండి వడ్డిస్తున్నారు. ఒక్కో విద్యార్థి వంట ఖర్చును రూ.8.57 పెంచారు. బడ్జెట్ కూడా ఏడాదికి సగటున రూ.1,400 కోట్లకు పెరిగింది. సోమవారం నుంచి శనివారం వరకు రోజుకో మెనూతో 16 రకాల పదార్థాలను అందిస్తున్నారు. విద్యార్థుల్లో రక్తహీనత తగ్గించేందుకు ఫోర్టిఫైడ్ సార్టెక్స్ బియ్యంతో అన్నం, వారంలో మూడు రోజులు బెల్లంతో చేసిన రాగిజావ, మూడ్రోజులు బెల్లం చిక్కీ ఇస్తున్నారు. ఉడికించిన గుడ్డు ఐదు రోజుల పాటు తప్పనిసరి చేశారు. దీనివల్ల 90శాతం మంది పిల్లలు మధ్యాహ్న భోజనాన్ని వినియోగించుకుంటున్నారు.



భవ్య పరిపాలనా రాజధానిలో సూర్యోదయ దిక్కుకు ప్రాతినిధ్యం వహించే ఆ ఎమ్మెల్యే అవినీతికి అంతేలేదు. ఆయన పేరు చెబితే భూ కబ్జాలు, సెటిల్‌మెంట్‌లు, దందాలే గుర్తొస్తాయి. కొండలు సైతం భయంతో కంపిస్తాయంటే అతిశయోక్తి కాదు. వరుసగా మూడుసార్లు ఎన్నికైనా ఆయన చేసిన అభివృద్ధి శూన్యం. అవినీతి, అక్రమాలు మాత్రం భారీగానే వెలగబెట్టారు. ఫలితంగా 'రామ..రామ'.. ఇదేమి దోపిడీ అంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

అవినీతి వెలగపండు



-వివరాలు IIIలో

కాఫీ విత్ యూత్

- బీజేపీ యువ మోర్చా కార్యక్రమం
- పట్టణ ఓటర్లే లక్ష్యం



సాక్షి, న్యూఢిల్లీ: యువ ఓటర్లను ఆకర్షించేందుకు 'చాయ్ పే చర్చ'ను కాస్తా 'కాఫీ విత్ యూత్'గా మార్చింది బీజేపీ. వీలైతే కప్పు కాఫీ అంటూ పార్టీ యువ మోర్చా నేతలు కొత్త ఓటర్లను అడుగుతున్నారు. ముంబైలో చేపట్టిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించడంతో వీటిని దేశవ్యాప్తంగా చేపడుతున్నారు. యువ ఓటర్ల నాడి తెలుసుకుని, వారిని బీజేపీ వైపు మళ్లించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

బూత్ స్థాయి నుంచి...

ముంబైలో ఇటీవల పలుచోట్ల దాదాపు 300 మంది యువ ఓటర్లతో బీజేపీ యువ మోర్చా నేతలు 'కాఫీ పే చర్చ' నిర్వహించారు. పదేళ్లలో బీజేపీ చేసిన అభివృద్ధి కార్యక్రమాల్ని వారికి వివరించారు. దేశవ్యాప్తంగా పలు నగరాలు, పట్టణాల్లో ఈ చర్చలను విస్తరిస్తున్నారు. ప్రతి భేటీలో కనీసం 150 నుంచి 200 మంది యువ ఓటర్లుండేలా ప్లాన్ చేస్తున్నారు. 'కాఫీ పే చర్చ'లో బూత్ స్థాయి కార్యకర్త మొదలు యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుని దాకా పాల్గొంటారు. ప్రతి కార్యకర్త తమ పరిధిలోని కనీసం 10 మంది కొత్త, యువ ఓటర్లను ఈ చర్చకు తీసుకొస్తున్నారు. రెస్టారెంట్లు, పార్కులు, ఆట స్థలాలు, ఖాళీ ప్రదేశాల్లో వినూత్నంగా దీన్ని నిర్వహిస్తున్నారు. మోదీ పేర్కొన్న 'విజన్ 2047' లక్ష్యంతో చర్చ సాగుతోంది. 'రాబోయే ఐదేళ్లలో దేశంలో యువత పాత్ర ఎలా ఉండాలి? ప్రభుత్వం ఏం చేస్తే యువతకు దగ్గరవుతుంది? అన్ని రంగాల్లోనూ ప్రపంచంలో భారత్ అగ్ర స్థానానికి చేరాలంటే ఏం చేయాలి? అవినీతి నిర్మూలన, ఆర్థికాభివృద్ధి, పేదరికం లేని ఇళ్లు' తదితర అంశాలపై రెండు నుంచి మూడు గంటల పాటు కార్యక్రమం జరుగుతోంది. యువ ఓటర్ల సలహాలను పార్టీ అధిష్టానానికి పంపుతున్నారు.

స్లోగన్ పేలింది

ఎన్నికల్లో దుమ్మురేపిన నినాదాలు

గెలిపించినవి కొన్ని పుట్టి ముంచినవి మరికొన్ని

సినిమాల్లో 'పంచ్' పడితే కలెక్షన్ల సునామీ! అదే పొలిటికల్ 'పంచ్' పేలితే? గెలుపు గ్యారంటీ! రాజకీయ పార్టీలు అదిరిపోయే నినాదాలతో జనాల్లోకి వెళ్తున్నాయి. సూటిగా, సుత్తి లేకుండా ఉండే ఈ 'స్లోగన్స్' ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నాయి. విపరీతంగా వైరలై ప్రజల మనసులతో పాటు ఓటు బ్యాంకులనూ కొల్లగొడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2019 ఎన్నికల్లో 'రావాలి జగన్, కావాలి జగన్' ఎలా ఊపేసిందో తెలిసిందే. భారత ఎన్నికల చరిత్ర తిరగేస్తే లాల్ బహదూర్ శాస్త్రి మొదలుకుని ఇందిరాగాంధీ, వాజ్‌పేయి, మోదీ, కేజ్రీవాల్ దాకా ప్రతి ఒక్కరి జమానాలోనూ ఆయా పార్టీల విజయాలకు దన్నుగా నిలిచి, రాజకీయాలను మలుపు తిప్పిన నినాదాలెన్నో...

- సాక్షి, నేషనల్ డెస్క్

జై జవాన్, జై కిసాన్

లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన ఈ నినాదం ఇప్పటికీ మార్మోగుతూనే ఉంది. 1964లో నెహ్రూ మరణంతో ప్రధాని పదవి చేపట్టిన శాస్త్రికి యుద్ధం స్వాగతం పలికింది. 1965 భారత్-పాక్ వార్‌లో పోరాడుతున్న సైనికుల్లో జోష్ నింపేందుకు, మరోపక్క దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశంలో తిండిగింజల ఉత్పత్తిని పెంచేలా రైతుల్లో స్థైర్యాన్ని పెంచేందుకు ఆయన ఈ నినాదమిచ్చారు. హరిత విప్లవానికి కూడా ఇది దన్నుగా నిలిచింది. తాష్కెంట్‌లో శాస్త్రి మరణానంతరం 1967లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇందిర సారథ్యంలో కాంగ్రెస్‌కు మళ్లీ విజయం సాధించిపెట్టిందీ ఇదే నినాదం!

గరీబీ హటావో

1971లో ప్రతిపక్షాలు, సొంత పార్టీ చీలిక వర్గం ఏకమై ఎన్నికల పోరుకు దిగినా కూడా ఒంటిచేత్తో కాంగ్రెస్(ఆర్)ను గెలిపించుకున్నారు ఇందిరా గాంధీ. 'పేదరికాన్ని నిర్మూలిద్దామంటూ ఆ ఎన్నికల సందర్భంగా ఆమె ఇచ్చిన ఈ స్లోగన్ జనాల్లోకి బలంగా వెళ్లింది.

ఇందిర హటావో, దేశ్ బచావో

ఎమర్జెన్సీలో అష్టకష్టాలు పడ్డ ప్రతిపక్షాలన్నీ జనతా పార్టీ పేరిట ఏకమై ఇచ్చిన సమైక్య నినాదం. ఇందిరను తొలగించి దేశాన్ని కాపాడాలన్న పిలుపు ఓటర్లను ఆలోచింపజేసింది. దాంతో 1977 సార్వత్రిక ఎన్నికల్లో జనతా పార్టీ ఘనవిజయం సాధించింది. ఇందిరతోపాటు ఆమె తనయుడు సంజీవ్ గాంధీ కూడా ఓటమి చవిచూశారు. దాంతో కాంగ్రెస్ మళ్లీ చీలింది. కాంగ్రెస్(ఐ) సారథిగా 1978 ఉప ఎన్నికలో కర్నాటకలోని చిక్‌మగుళూరు లోక్‌సభ స్థానం నుంచి ఇందిర ఘన విజయం సాధించారు. ఆ సందర్భంగా 'ఏక్ షేర్నీ, సౌ లంగూర్; చిక్‌మగళూరు భాయ్ చిక్‌మగళూరు' (ఇటు ఒక్క ఆడపులి, అటు వంద కోతులు) స్లోగన్ మారుమోగింది.

జబ్ తక్ సూరజ్ చాంద్ రహేగా, ఇందిరా తేరా నామ్ రహేగా

1984లో ఇందిర హత్యానంతరం రాజీవ్ ప్రధాని అయ్యారు. వెంటనే లోక్‌సభను రద్దు చేసి ముందస్తుకు వెళ్లారు. కాంగ్రెస్(ఐ)కి దేశవ్యాప్తంగా మద్దతు వెల్లువెత్తింది. 'సూర్యచంద్రులు ఉన్నంతదాకా ఇందిర పేరు నిలిచి ఉంటుంది' అంటూ ప్రజల్లోకి వెళ్లిన రాజీవ్ ఏకంగా 413 సీట్లతో క్లీన్ స్వీప్ చేసి మళ్లీ ప్రధాని అయ్యారు.

జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్

1996 సార్వత్రిక ఎన్నికల్లో 'బారీ బారీ సబ్ కీ బారీ, అబ్ కీ బారీ అటల్ బిహారీ' (అందరి వంతూ అయింది, ఈసారి అటల్ బిహారీ వంతు) అంటూ బీజేపీ పిలుపునిచ్చింది. దీనికి మచ్చలేని వాజ్‌పేయి ఇమేజ్ తోడై బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమికి అధికారం దక్కింది. తొలిసారి 16 రోజుల్లో పడిపోయిన వాజ్‌పేయి ప్రభుత్వం రెండోసారి 13 నెలలకే పరిమితమైంది. దేశాన్ని వృద్ధి బాటన నడిపేందుకు వైజ్ఞానిక రంగంలో స్వయం ప్రతిపత్తి సాధించాలంటూ 1998లో పిలుపునిచ్చిన 'జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్' నినాదం 1999లో బీజేపీకి విజయాన్ని అందించింది. మూడోసారి ఎన్డీఏ సర్కారును విజయవంతంగా నడిపారు వాజ్‌పేయి.

కొంప ముంచిన 'ఇండియా షైనింగ్'

దేశంలో సెల్ ఫోన్లను ప్రవేశపెట్టడం నుంచి 'స్వర్ణ చతుర్భుజి' హైవేల ప్రాజెక్టు తదితరాలతో ప్రగతికి పెద్దపీట వేసిన వాజ్‌పేయి సర్కారు 2004 ఎన్నికల్లో అతి విశ్వాసంతో బొక్క బోర్లా పడింది. ధరాభారం తదితరాలతో తాము సతమతమవుతుంటే 'ఇండియా షైనింగ్ (భారత్ వెలిగిపోతోంది)' నినాదంతో ఊరూవాడా ఊదరగొట్టడం జనానికి అస్సలు నచ్చలేదు. దాంతో బీజేపీ కొంప మునిగింది. వాజ్‌పేయి సర్కారు ఇంటిబాట పట్టింది.

కాంగ్రెస్ కా హాత్, ఆమ్ ఆద్మీ కే సాత్

దాదాపు ఎనిమిదేళ్ల పాటు అధికారానికి దూరమైన కాంగ్రెస్‌కు 2004లో పూర్వ వైభవం తీసుకొచ్చిన స్లోగన్. వాజ్‌పేయి సర్కారు పేదలను విస్మరించిందని, తాము సంక్షేమ పథకాలతో వారిని ఆదుకుంటామని చెప్పిన తీరు జనాలకు కనెక్టయింది. కాంగ్రెస్ సారథ్యంలో యూపీఏ సర్కారు గద్దెనెక్కింది. సోనియాగాంధీ విదేశీయత వివాదంతో మన్మోహన్ సింగ్ ప్రధానిగా పదేళ్లు కొనసాగారు.



అబ్ కీ బార్ మోదీ సర్కార్

పదేళ్లపాటు ప్రతిపక్షంలో కూర్చున్న కమలనాథులకు 2014లో మళ్లీ అధికారం కట్టబెట్టిన స్లోగన్. నరేంద్ర మోదీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించి, 'ఈసారి మోదీ ప్రభుత్వం' నినాదంతో బీజేపీ ఎన్నికల బరిలోకి దిగింది. ఇది కార్యకర్తల్లో జోష్ నింపడమే గాక దేశవ్యాప్తంగా మార్మోగి బీజేపీని గెలిపించింది. తర్వాత అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ కూడా 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' నినాదంతో ఇండో-అమెరికన్ ఓటర్లను ఆకట్టుకున్నారు. అలాగే 'అచ్చే దిన్ ఆయేంగే (మంచి రోజులొస్తాయ్)', 'చాయ్ పే చర్చ', సబ్ కా సాత్ సబ్ కా వికాస్ వంటి నినాదాలూ ఆ ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 'ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ (మరోసారి మోదీ ప్రభుత్వం)', 'మోదీ హై తో ముమ్‌కిన్ హై (మోదీతో సాధ్యం)' నినాదాలు వైరలయ్యాయి. ఈసారి కమలనాథులు 'తీస్‌రీ బార్ మోదీ సర్కార్' (మూడోసారీ మోదీ సర్కారు), 'అబ్ కీ బార్ 400 పార్' (ఈసారి 400 పై చిలుకు)' నినాదంతో ఎన్నికల బరిలోకి దిగారు.

అచ్చే బీతే 5 సాల్, లగే రహో కేజ్రీవాల్


నయా రాజకీయ సంచలనంగా దూసుకొచ్చిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను 2020లో ఢిల్లీ పీఠంపై మరోసారి బంపర్ మెజారిటీతో కూర్చోబెట్టిన స్లోగన్. 'ఐదేళ్లు బాగా గడిచాయి. సాగిపో కేజ్రీవాల్' అన్న ప్రచారం ఓటర్లను ఆకర్షించింది. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 70 సీట్లకు ఏకంగా 67 దక్కించుకున్న కేజ్రీవాల్ 2020లోనూ 62 సీట్లతో ప్రత్యర్థులపై 'చీపురు' తిరగేశారు.

ఎన్నికల్లో పేలిన మరికొన్ని నినాదాలు...

- జన్‌సంఘ్ కో వోట్ దో, బీడీ పీనా ఛోడ్ దో; బీడీ మే తంబాకు హై, కాంగ్రెస్‌వాలా డాకూ హై (1967లో భారతీయ జనసంఘ్ నినాదం)
- ప్రోగ్రెస్ త్రూ కాంగ్రెస్ (కాంగ్రెస్‌తోనే అభివృద్ధి. 1960ల్లో నినాదమిది. అయితే, 'ప్రోగ్రెసా, కాంగ్రెసా' అంటూ శివసేన ఇచ్చిన కౌంటర్ అప్పట్లో బాగా పేలింది)
- వోట్ ఫర్ కాఫ్ అండ్ కౌ; ఫర్‌గెట్ అదర్స్ నౌ (ఆవుదూడ గుర్తుకు ఓటేయండి, మిగతా పార్టీలను మర్చిపోండి అంటూ ఇందిరా కాంగ్రెస్ ఇచ్చిన నినాదం. కానీ ఆ గుర్తు ఇందిర, సంజయ్‌లకు ప్రతీక అంటూ వ్యంగ్యాస్త్రాలు పేలాయి)
- జబ్ తక్ రహేగా సమోసా మే ఆలూ, తబ్ తక్ రహేగా బిహార్ మే లాలూ (సమోసాలో ఆలూ ఉన్నంతకాలం బిహార్లో లాలూ ఉంటారు)
- జాత్ పర్ నా పాత్ పర్, మొహర్ లగేగీ హాత్ పర్ (కులమతాలకు అతీతంగా హస్తం గుర్తుకు ఓటేద్దామంటూ 1996 ఎన్నికల్లో పీవీ ఇచ్చిన నినాదం)
- సోనియా నహీ, యే ఆంధీ హై; దూస్రీ ఇందిరాగాంధీ హై (సోనియా కాదు, తుఫాను; మరో ఇందిర అంటూ 2009లో కాంగ్రెస్ ఇచ్చిన నినాదం)

కాంగ్రెస్‌కు సానుభూతి పవనాలు — 8వ లోక్‌సభ ఎన్నికల్లో 404 సీట్లు

రాజీవం



ఇందిర వారసునిగా గద్దెనెక్కిన రాజీవ్ 1984లో జరిగిన 8వ లోక్‌సభ ఎన్నికల్లో చరిత్రాత్మక విజయం అందుకున్నారు. ఇందిర హత్య తాలూకు సానుభూతి కాంగ్రెస్‌కు బాగా కలిసొచ్చింది. ఏకంగా 404 స్థానాల్లో ఘన విజయం సాధించి రికార్డు సృష్టించింది. బీజేపీ ఆవిర్భావం తర్వాత జరిగిన ఈ తొలి ఎన్నికలివి. ఆ పార్టీకి భారీగా ఓట్లు పడ్డా సీట్లు మాత్రం రెండే దక్కాయి. అయితే ఈ ఎన్నికల నుంచి కాంగ్రెస్ బలం క్రమంగా తగ్గుతూ పోగా, బీజేపీ గ్రాఫ్ పెరుగుతూ రావడం విశేషం...

- సాక్షి, నేషనల్ డెస్క్

గతం

1984 అక్టోబర్ 31న ఇందిర హత్య యావత్ ప్రపంచాన్నీ షాక్‌కు గురి చేసింది. అదే రోజు సాయంత్రం రాజీవ్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించినా ఏడో లోక్‌సభ పదవీకాలం ముగుస్తుండడంతో ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించారు. 1984 డిసెంబర్ 24, 27, 28 తేదీల్లో 514 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరిగాయి. ఉగ్రవాదంతో అట్టుడుకుతున్న అసోం, పంజాబ్‌ల్లోని మిగతా స్థానాల్లో 1985లో ఎన్నికలు జరిగాయి. సానుభూతికి తోడు ఇందిర దూరదృష్టితో చేపట్టిన అభివృద్ధి పనులు కూడా కాంగ్రెస్‌కు కలిసొచ్చాయి. హరిత విప్లవం

అభివృద్ధికి ప్రజామోదం

తో పంటల దిగుబడి భారీగా పెరిగింది. రక్షణ, ఆర్థిక రంగాల్లో కీలక నిర్ణయాలను జనం హర్షించారు. ఇందిర హయాంలోని 1980–85 ఆరో పంచవర్ష ప్రణాళికను అత్యంత విజయవంతమైనదిగా చెబుతారు. జీవన వ్యయం పెరిగినా ఆర్థిక వృద్ధి 5.4 శాతానికి చేరింది. వీటన్నింటి ఫలస్వరూపంగా కాంగ్రెస్‌కు ఏకంగా 49.1 శాతం ఓట్లు, 404 సీట్లు దక్కాయి. నెహ్రూ, ఇందిర నాయకత్వంలోనూ ఇన్ని సీట్లు రాలేదు. యూపీలో కాంగ్రెస్ 85కు ఏకంగా 83 సీట్లను గెలుచుకుంది! బెంగాల్ మినహా పెద్ద రాష్ట్రాలన్నింట్లోనూ దుమ్ము రేపినా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం ధాటికి ఆరింటితోనే సరిపెట్టుకుంది. టీడీపీ ఏకంగా 30 సీట్లు నెగ్గింది.

మరిన్ని విశేషాలు...

- బీజేపీ ఆవిర్భావం తర్వాత జరిగిన ఈ తొలి ఎన్నికల్లో పార్టీ 7.74 శాతం ఓట్లు సాధించింది.
- బీజేపీ నెగ్గిన రెండు సీట్లలో ఒకటి హన్మకొండ. అక్కడ బీజేపీ అభ్యర్థి చందుపట్ల జంగారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పీవీ నరసింహారావును ఓడించారు. బీజేపీకి రెండో స్థానం గుజరాత్‌లోని మెహసానాలో దక్కింది.
- 1985లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని రాజీవ్ తీసుకొచ్చారు.
- ఓటు హక్కు వయో పరిమితిని 1988లో 21 ఏళ్ల నుంచి 18కి తగ్గించారు.
- ఎన్నికల్లో ఈవీఎంలు వాడేలా 1988లో చట్ట సవరణ చేశారు. సెబీని ఏర్పాటు చేశారు.
- 1989లో కేంద్ర ఎన్నికల సంఘంలో సీఈసీకి తోడు మరో ఇద్దరు కమిషనర్లను నియమించారు.
- విద్య ఆధునికీకరణకు జాతీయ విధానాన్ని ప్రవేశపెట్టారు. నవోదయ విద్యాలయ వ్యవస్థ తెచ్చారు.
- కంప్యూటర్లు, విమానయాన పరిశ్రమ, రక్షణ, రైల్వేల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు.
- వృద్ధి రేటు పెంపే లక్ష్యంగా కార్పొరేట్ సంస్థలకు సబ్సిడీలు అందించారు.
- దేశంలో టెలికం, ఐటీ రంగ అభివృద్ధికి రాజీవే ఆద్యుడని చెబుతారు.

ఎనిమిదో లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 514)

పార్టీ	స్థానాలు
కాంగ్రెస్	404
టీడీపీ	30
సీపీఎం	22
అన్నాడీఎంకే	12
జనతా పార్టీ	10
బీజేపీ	2
ఇతరులు	29
స్వతంత్రులు	5

బోఫోర్స్ మరక...

రాజీవ్ హయాంలో పలు వివాదాలూ రేగాయి. బోఫోర్స్ శతఘ్నుల కొనుగోలులో అవినీతి మరక వాటిలో ముఖ్యమైనది. ఈ కాంట్రాక్ట్ కోసం గాను భారత రాజకీయ నాయకులకు బోఫోర్స్ కంపెనీ రూ.820 కోట్ల ముడుపులు చెల్లించినట్టు 1987 మేలో స్వీడిష్ రేడియో స్టేషన్ ప్రసారం చేసిన కథనం సంచలనం రేపింది. బోఫోర్స్ తరఫున మధ్యవర్తిత్వం వహించిన ఒట్టావియో ఖత్రోచికి రాజీవ్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలున్నట్టు ఆరోపణలు వచ్చాయి. అలాగే జాతుల పోరుతో అట్టుడుకుతున్న శ్రీలంకలో శాంతి పేరుతో జోక్యంపైనా రాజీవ్ విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్ పేరిట ఆయన పంపిన భారత సైన్యం ఎల్టీటీఈతో నేరుగా యుద్ధానికి దిగింది! ఈ పరిణామం అంతిమంగా రాజీవ్ హత్యకు దారితీసింది.

నాడేం జరిగిందంటే..?

ఇందిర హత్యకు గురైనప్పుడు రాజీవ్ పశ్చిమబెంగాల్‌లో పర్యటిస్తున్నారు. ఆయనతో పాటున్న కాంగ్రెస్ సీనియర్ నేత ప్రణబ్ ముఖర్జీకి తొలుత హత్య వార్త ఉదయం 9.30కు తెలిసింది. ఇందిరపై కాల్పులు జరిగాయని మాత్రం రాజీవ్‌కు చెప్పి విమానంలో ఢిల్లీ బయల్దేరదీశారు. కాక్‌పిట్‌లోకి వెళ్లిన రాజీవ్ కాసేపటికి బయటికొచ్చి 'అమ్మ మరణించింది' అని ప్రకటించారు. అందరూ మౌనం దాల్చారు.

• బాసురీ స్వరాజ్

డాటరాఫ్ సుష్మ

పరిచయం





బాసురీ స్వరాజ్. సక్సెస్‌ఫుల్ సుప్రీంకోర్టు లాయర్. అయినా సరే, అక్షరాలా అమ్మకూచి. సుష్మా స్వరాజ్ అంతటి గొప్ప వ్యక్తికి కూతురు కావడం తన అదృష్టమంటారు. తల్లితో కలిసున్న ఫొటోలను తరచూ షేర్ చేస్తుంటారు. విద్యార్థి సంఘ నేతగా రాజకీయ ఓనమాలు నేర్చుకున్న బాసురి బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్‌గా న్యాయవాద వృత్తిలోనూ రాజకీయాలను కొనసాగించారు. ఈసారి న్యూఢిల్లీ స్థానం నుంచి లోక్‌సభ బరిలో దిగి ఎన్నికల అరంగేట్రమూ చేస్తున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్

వారసత్వ రాజకీయాలను విమర్శించే బీజేపీ కూడా ఆ తాను ముక్కేనని ఇటీవల విపక్షాలు విమర్శలు ఎక్కుపెడుతున్నాయి. బాసురీకి టికెటివ్వడాన్ని కూడా ఇందుకు ఉదాహరణగా చూపుతున్నాయి. కానీ తన తల్లి ప్రజాప్రతినిధిగా చేసినంత మాత్రాన తనవి వారసత్వ రాజకీయాలు కావంటారు బాసురీ. ''రావడమే సీఎం, పీఎం వంటి ఉన్నత పదవులతోనో పార్టీ అధినేతగానో రాజకీయాల్లో అడుగు పెడితే వారసత్వ రాజకీయం అవుతుంది. కానీ నాలా కార్యకర్త నుంచి మొదలైతే కాదు'' అంటూ తిప్పికొడుతున్నారు. ''నా రాజకీయ ప్రస్థానం పార్టీ కార్యకర్తగానే మొదలైంది. న్యాయవాదిగా కోర్టులో అడుగుపెట్టే ముందే అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కార్యకర్తగా పార్టీ కోసం పనిచేశా. ఇప్పుడు పార్టీ నాకో అవకాశమిచ్చింది. ఇప్పుడూ అందరిలాగే కష్టపడుతున్నా'' అని చెప్పుకొచ్చారు. న్యూఢిల్లీ సిటింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి మీనాక్షి లేఖీని పక్కనపెట్టి మరీ బాసురీకి అవకాశమిచ్చింది బీజేపీ. దీనిపై మీనాక్షి బాగా అసంతృప్తితో ఉన్నారన్న వార్తలను బాసురీ కొట్టిపడేశారు. ఆమె ఆశీస్సులు తనకెప్పుడూ ఉంటాయన్నారు.

హై ప్రొఫైల్ కేసులతో...

బాసురీ 1984 జనవరి 3న జన్మించారు. లండన్‌లోని వార్విక్ యూనివర్సిటీ నుంచి ఇంగ్లిష్ సాహిత్యంలో డిగ్రీ చదివారు. బీపీపీ లా స్కూల్‌లో న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని సెంట్ కేథరీన్స్ కాలేజీలో మాస్టర్స్ పూర్తి చేశారు. అనంతరం న్యాయవాద వృత్తిలో ప్రవేశించారు. 2007 నుంచి ఢిల్లీ బార్ కౌన్సిల్ సభ్యురాలిగా ఉన్నారు. నాలుగేళ్ల కిందట ఢిల్లీ బీజేపీ లీగల్ సెల్ కో-కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టారు. అదే సమయంలో హరియాణా అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గానూ నియమితులయ్యారు. కాంట్రాక్టులు, రియల్ ఎస్టేట్, పన్నులు, అంతర్జాతీయ వాణిజ్య మధ్యవర్తిత్వాలు, నేరాల కేసులను వాదించారు. ఆమె క్లయింట్స్ హై ప్రొఫైల్ వాళ్లే కావడంతో న్యాయవాద రంగంలో అతికొద్ది కాలంలోనే కీర్తి సంపాదించారు. మీడియా ముందు అంతగా కనిపించని బాసురీ.. ఐపీఎల్ వివాదంలో లలిత్ మోదీ న్యాయవాద బృందంలో ఒకరిగా తొలిసారి వార్తల్లోకెక్కారు. గతేడాది ఆప్ ప్రభుత్వంపై విమర్శలు చేసి మరోసారి వార్తల్లో నిలిచారామె.

తల్లికి స్వయంగా అంత్యక్రియలు...

సుష్మా స్వరాజ్ 2019లో కన్నుమూశారు. ఆమె అంత్యక్రియలను స్వయంగా నిర్వహించి బాసురీ అప్పట్లో వార్తల్లోకెక్కారు. మహిళలను చైతన్యవంతులను చేసే దిశగా ఆమె ప్రసంగాలు చేస్తుంటారు. ఆ క్రమంలో 2021లో తనకు దక్కిన 'తేజస్విని' అవార్డును తల్లికి అంకితమిచ్చారు. ప్రతి విషయంలోనూ గురువుగా మారి తనకు అమూల్యమైన జీవిత విలువలను నేర్పిందంటూ తల్లిని గుర్తు తెచ్చుకుని కన్నీళ్ల పర్యంతమయ్యారు.

ఇదీ నవరత్నాల వెలుగులు



నాడు టీడీపీ ఐదేళ్ల పాలన.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో కలిగిన లబ్ధి ఇలా...

పథకం	టీడీపీ (రూ.లో)	వైఎస్సార్‌సీపీ (రూ.లో)
సాగుకు సాయం	0	40,000
పెన్షన్	0	1,21,500
డ్వాక్రా రుణమాఫీ	0	10,000
మహిళకు సాయం	20,000	56,250
సున్నావడ్డీ	0	2,219
కల్యాణమస్తు	0	50,000
ఆరోగ్యశ్రీ	0	50,000
మొత్తం	20,000	3,29,969

ఉన్నది 20 సెంట్ల భూమి. కౌలుకు మరో ఎకరం దేవదాయ శాఖ భూమి. అదే ఆ కుటుంబానికి ఆధారం. సమయానికి విత్తు కుంటే సరేసరి... లేదంటే అంతేమరి. ప్రకృతి సహకరిస్తే నాలుగు వేళ్లు నోట్లోకెళ్లేది. లేదంటే అప్పులకోసం తప్పని తిప్పలు. తరువాత వాటిని తీర్చడానికి నానా అగచాట్లు. చినుకు రాలకుంటే ఆవేదన... అతిగా వానపడితే ఆందోళన. అదనుకు విత్తనం దొరక్కున్నా... అవసరం మేరకు ఎరువులు లభించకపోయినా... ఆ ఏడాదంతా బతుకు దినదిన గండమే. ఇదీ శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం గోకర్ణపురానికి చెందిన కర్తల చిరంజీవులు కుటుంబ పరిస్థితి. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు. తోడబుట్టిన చెల్లెలు వారితోనే. కుటుంబమంతా కష్టపడితేనే కడుపు నిండేది. లేకుంటే పస్తులే గతి. అలాంటి కుటుంబానికి ప్రభుత్వాల సాయం ఎంతో అవసరం. –కంచిలి

అప్పులు లేకుండా ఆనందంగా..

2019లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక పరిస్థితులన్నీ చక్కబడ్డాయి. కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంది. అన్ని రకాలుగా ప్రభుత్వం నుంచి సాయం అందింది. వ్యవసాయం పండగైంది. అవసరమైన పెట్టుబడి అదనుకు ముందే అందుతోంది. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు రోజుల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేదు. సొసైటీ గోదాముల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. ఇంటి ముంగిటకే రైతు భరోసా కేంద్రాల ద్వారా అవి వచ్చిచేరుతున్నాయి. పండించిన పంటకు ఈ క్రాప్‌లో నమోదు కావడంతో మద్దతు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ప్రకృతి పగబట్టి పంటను తినేస్తే నష్టపరిహారం సొమ్ము ఆ సీజన్ ముగియక ముందే అందుతోంది. ఇంటి ఇల్లాలు రత్నానికి వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత కింద ఏటా నగదు ఖాతాలో పడుతోంది.



గోకర్ణపురం గ్రామంలో కర్తల చిరంజీవులు కుటుంబం


సోదరి రుక్మిణమ్మకు ఒంటరి మహిళ పింఛన్ వస్తోంది. గడచిన నెలలో వివాహమైన పెద్దకొడుకు మాధవరావుకు కల్యాణమస్తు పథకం కింద రూ. 50వేలు అందింది. చిన్నకొడుకు జోగారావు కిడ్నీలో రాళ్లు చేరితే డాక్టర్లు రూ. 50వేలు ఖర్చవుతుందన్నారు. పైసా ఖర్చులేకుండా ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స జరిగింది. ఇప్పుడు ఏ సమస్య వచ్చినా దానిని ప్రభుత్వ సాయంతో ఎదుర్కోగలమన్న నమ్మకం ఏర్పడింది. బతుకుపై భరోసా దక్కింది.

ఆర్థిక సమస్యలు తీరాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే మా ఆర్థిక సమస్యలు తీరాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క నయాపైసా సాయం అందలేదు. వ్యవసాయ ఖర్చులు మొదలుకొని, కుటుంబ అవసరాలకు సైతం ఇబ్బంది పడేవాళ్లం. చిన్నపాటి అవసరానికీ అప్పులు చేయాల్సి వచ్చేది. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతీ నెల ఇంచుమించు ఏదో ఒక పథకం ద్వారా ఆర్థిక సాయం అందుతోంది. తద్వారా మేము నిశ్చింతంగా జీవిస్తున్నాం. మా కుటుంబానికి ఈ ఐదేళ్ల కాలంలో నాలుగు లక్షలకు పైబడి లబ్ధి చేకూరింది. – కర్తల చిరంజీవులు

మీకు తెలుసా?



అత్యున్నత పదవుల్లో వి.వి.గిరి


చిక్కోలు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన వారిలో కళింగాంధ్ర ముద్దుబిడ్డ వరహాగిరి వెంకటగిరి(వి.వి.గిరి)ఒకరు. ఈయన నాటి గంజాం శ్రీకాకుళం ప్రాంతం కలయికతో ఉన్న బరంపురంలో 1894 ఆగస్టు 10వ తేదీన జన్మించారు. 1967–69 మధ్య భారత దేశ 3వ ఉప రాష్ట్రపతిగా, 1969 ఆగస్టు 24 నుంచి 1974 వరకూ 4వ భారత రాష్ట్రపతిగా వ్యవహరించి కళింగాంధ్ర ఖ్యాతిని ఢిల్లీ స్థాయికి తీసుకువెళ్లారు. వి.వి.గిరిని ప్రభుత్వం అత్యుత్తమ 'భారత రత్న'తో 1975లో గౌరవించింది.

1967లో ఇండిపెండెంట్లదే హవా..

1967 శాసనసభ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 68 మంది ఇండిపెండెంట్లు విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ 165 ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకోగా స్వతంత్ర పార్టీ 29 సీట్లను, సీపీఐ 11, సీపీఎం 9 సీట్లను, జన సంఘ్ మూడు సీట్లు దక్కించుకుంది. ఇండిపెంటెంట్లు, ఇతరులు చేరికతో కాంగ్రెస్ బలం 230కి చేరింది.

1962లో రాజకీయంలో కీలక మలుపు

1962లో జరిగిన సాధారణ ఎన్నికల్లో 300 సీట్లకు గాను కాంగ్రెస్ 177 ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకొని అధికారాన్ని కైవసం చేసుకుంది. కమ్యూనిస్టు పార్టీ 51 స్థానాలను, స్వతంత్ర పార్టీ 19 చోట్ల, ఇండిపెండెంట్లు 51 మంది గెలుపొందారు. మొత్తం ఇండిపెండెంట్లలో 29 మంది యుడీఎఫ్‌గా ఏర్పడి కాంగ్రెస్‌లో కలిసిపోయారు.




ఆరుసార్లు లోక్‌సభలో చక్రం తిప్పిన బీఆర్...

ఉత్తరాంధ్రలో ఇప్పటి వరకూ ఆరుసార్లు శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం నుంచి ఎన్నికైన బొడ్డేపల్లి రాజగోపాలరావు రికార్డు సాధించారు. జిల్లా వాణిని ఢిల్లీ స్థాయిలో దశాబ్దాలపాటు వినిపించారు. ఈయన శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస మండలం అక్కులపేట గ్రామంలో 1923 మార్చి 12వ తేదీన జన్మించారు. శ్రీకాకుళం, మున్సిపల్ హైస్కూల్, విజయనగరం ఎంఆర్ కళాశాలలో ఉన్నత విద్య పూర్తి చేసి తొలుత తాళ్లవలస గ్రామంలో మునసబుగా ఉద్యోగంలో చేరారు. 1952లో రాజకీయాల్లో చేరారు.

2019 ఎన్నికల్లో పోలింగ్ రికార్డులు

2019 సార్వత్రిక ఎన్నికలు అనేక కొత్త రికార్డులను సృష్టించాయి. ఓటరు అనుకూల పద్ధతుల అమలులోనూ కొత్త ప్రమాణాలను తెచ్చాయి. మున్నెన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో అనేక రాష్ట్రాల్లో 80 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. అన్ని రాష్ట్రాల కన్నా అత్యధికంగా నాగాలాండ్‌లో 83 శాతం, కేంద్ర పాలిత ప్రాంతాల్లో లక్షద్వీప్‌లో అత్యధికంగా 85.21 శాతం పోలింగ్ నమోదైంది. దేశం మొత్తమ్మీద 62 లక్షల మంది దివ్యాంగులను గుర్తించి, నమోదు చేసిన ఎన్నికలివి. ఎన్నారై ఓటర్లు 1.19 లక్షల మంది, సర్వీసు ఓటర్లు 18.54 లక్షల మంది ఓటు హక్కు వినియోగానికి తమ పేర్లను నమోదు చేసుకున్నారు.





• మామయ్య గోరుముద్ద

చదువుపైనే శ్రద్ధ

ఒక్కోరోజు ఒక్కో మెనూతో రుచికరం

- వారంలో ఆరు రోజులు.. 16 రకాల పదార్థాలతో మెనూ..
- నీళ్ల సాంబారు, ముద్ద అన్నంతో నలిపెట్టిన బాబు సర్కారు
- పిల్లల పౌష్టికాహారం కోసం ముఖ్యమంత్రి జగన్ స్వయంగా మెనూ రూపకల్పన
- రోజూ సగటున 34.90 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- ఐదురోజులు కోడిగుడ్డు, మూడు రోజులు చిక్కీ, రాగిజావ
- మూడు దశల్లో ఆహార నాణ్యత పరిశీలన
- పిల్లల్లో రక్తహీనత లేకుండా మెనూ పదార్థాల తయారీ
- ఐదేళ్లలో గోరుముద్దకు రూ.7,244.6 కోట్ల బడ్జెట్
- బాబు పాలనలో ఏడాదికి రూ.450 కోట్ల బడ్జెట్ మాత్రమే
- జగనన్న గోరుముద్దకు జాతీయ స్థాయిలో ప్రశంసలు

'గోరుముద్ద'కు జాతీయ అవార్డు

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు అందిస్తున్న జగనన్న గోరుముద్ద అమలుకు కేంద్ర ప్రభుత్వం కితాబు నిచ్చింది. రక్తహీనత నివారణ, మెరుగైన ఆరోగ్యం లక్ష్యంగా పనిచేయడాన్ని కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ గుర్తించి గతేడాది నవంబర్‌లో జాతీయ స్థాయి ప్రథమ బహుమతి రాష్ట్రానికి అందజేసింది. ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ, ఉడికించిన గుడ్ల పంపిణీ, ఎముకల బలాన్ని పెంచేందుకు చిక్కీ(వేరుశనగ బార్) పంపిణీ చేస్తూ విద్యార్థులందరికీ శారీరక ఆరోగ్యమే ప్రాథమిక లక్ష్యంగా గోరుముద్ద కొనసాగుతోందని స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ జోయా అలీ రిజ్వీ అవార్డు వేడుకలో అభినందించడం గమనార్హం.

గత ఐదు విద్యా సంవత్సరాల్లో గోరుముద్ద బడ్జెట్ (రూ.కోట్లలో)

2019-20	2020-21
979.48	1,187.49
2021-22	**2022-23**
1,840.05	1,548.58
2023-24	**మొత్తం**
1,689.00	7,244.60

ఏటా సగటున రూ.1449 కోట్ల ఖర్చు

ప్రతి చిన్నారికి పౌష్టికాహారం అందించినప్పుడే చదివింది ఒంటబడుతుందని నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిల్లలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా 'గోరుముద్ద'కు శ్రీకారం చుట్టారు. బడికి వచ్చే ప్రతి పేద బిడ్డకు రుచికరమైన పౌష్టికాహారం అందిస్తూ.. వారు స్కూలుకు వచ్చేందుకు ఆసక్తి చూపేలా మెనూ రూపొందించారు. ప్రభుత్వ బడుల్లోని 43 లక్షల మంది విద్యార్థుల కోసం రోజుకో మెనూ చొప్పున 16 రకాల ఐటమ్స్‌తో 'జగనన్న గోరుముద్ద' అందిస్తున్నారు. ఉదయం 9.30 గంటలకే విద్యార్థుల హాజరుకు అనుగుణంగా పిల్లల అభిప్రాయాలు తీసుకుని ఆ మేరకు వంట చేస్తున్నారు. రోజుకు సగటున 34.90 లక్షల మంది విద్యార్థులు గోరుముద్ద తింటున్నారు. భోజనం పూర్తయ్యాక అభిప్రాయాలు విద్యార్థులే రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. 'గుడ్' అని 'నాట్ గుడ్' అని నిర్భయంగా చెప్పే స్వేచ్ఛను ప్రభుత్వం విద్యార్థులకు కల్పించింది. గత ప్రభుత్వంలో నీళ్ల సాంబారు, ముద్ద అన్నం కోసం ఏటా రూ.450 కోట్ల బడ్జెట్ కేటాయిస్తే.. గోరుముద్ద కోసం ప్రభుత్వం ఏటా సగటున రూ.1449 కోట్ల చొప్పున ఈ ఐదేళ్లలో రూ.7,244.6 కోట్ల నిధులు వెచ్చించింది.

పౌష్టికాహారం కోసం ఫోర్టిఫైడ్ సార్టెక్స్ బియ్యం

పిల్లల్లో రక్తహీనత తగ్గించేందుకు వారంలో మూడురోజులు బెల్లంతో చేసిన రాగిజావ, మరో మూడురోజులు చిక్కీ ఇస్తున్నారు. వారంలో ఐదు రోజులు ఉడికించిన గుడ్డు తప్పనిసరి. విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు ఫోర్టిఫైడ్ సార్టెక్స్ బియ్యాన్నే వాడుతున్నారు. ప్రతి గురువారం బడి పిల్లల ఆరోగ్యం పరీక్షించేందుకు స్థానిక ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది పరీక్షలు చేస్తారు. రక్తహీనత నివారణకు మాత్రలు ఇవ్వడంతో పాటు వారు సక్రమంగా వాడుతున్నారో లేదో పరిశీలిస్తున్నారు. గత ఐదేళ్లుగా ఇదే మెనూ పక్కా ప్రణాళికతో అమలు చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనాన్ని అల్యూమినియం పాత్రల్లో వండేవారు. దీనివల్ల పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించిన జగనన్న ప్రభుత్వం వాటి స్థానంలో పూర్తి స్టీలు పాత్రలు అందించింది.



వంట ఏజెన్సీలకు ఖర్చులు పెంపు

గత ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఏనాడు సకాలంలో డబ్బులు చెల్లించలేదు. 2014–18 వరకు వంటపాత్రల సరఫరా లేదు. ఈ ఏడాది 43 లక్షల మంది విద్యార్థులకు స్టీలు గ్లాసులు అందించారు. 44,617 పాఠశాలలకు రూ.41 కోట్ల వ్యయంతో స్టీలు వంట పాత్రలను ప్రభుత్వం అందించింది. గత ప్రభుత్వం 2014–18 మధ్య పిల్లల భోజన ఏడాది వ్యయం రూ.450 కోట్లు అయితే, ప్రస్తుత ప్రభుత్వంలో అది సగటున రూ.1449 కోట్లకు పెంచింది. వంట ఖర్చు, అదనపు మెనూ, ఆహార ధాన్యాలు, రవాణాతో సహా మొత్తం ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. గత ప్రభుత్వంలో 2014–18 మధ్య విద్యార్థుల వంట ఖర్చు రూ.3.59 నుంచి రూ.6.51 మధ్య మాత్రమే కాగా.. ప్రస్తుతం ఆ ఖర్చు రూ.8.57కు పెంచి చెల్లిస్తున్నారు.

సగటున 34.90 లక్షల మంది విద్యార్థులకు భోజనం

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో ప్రభుత్వం అన్ని దశల్లోను శ్రద్ధ తీసుకుంటోంది. రోజుకో మెనూ చొప్పున ఆరు రోజులకు 16 రకాల పదార్థాలు పిల్లలకు వడ్డిస్తున్నారు. ఉపాధ్యాయులు మొబైల్ యాప్‌లో విద్యార్థుల హాజరుతో పాటు భోజనం చేసేవారి సంఖ్యను రాష్ట్ర స్థాయి వరకు తెలుసుకునేలా 'ఇంటిగ్రేటెడ్ మానిటరింగ్ సిస్టం ఫర్ మిడ్ డే మీల్స్ అండ్ శానిటేషన్' (ఐఎంఎంఎస్) యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇందులో ప్రతిరోజు బడిలో ఉన్న సరుకుల స్టాక్‌తో పాటు భోజనం అంశాలను ఫొటోలతో సహా అప్‌లోడ్ చేస్తున్నారు. భోజనం చేశాక, వంటపై విద్యార్థులే స్వయంగా రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. రాష్ట్రంలో 1–10 తరగతుల్లో 43 లక్షల మంది విద్యార్థులు ఉంటే.. ప్రతిరోజు హాజరైనవారిలో సగటున 34,89,895 మంది (90 శాతం) గోరుముద్ద తీసుకుంటున్నారు. మిగిలిన 10 శాతం మందిలో బాలికలు ప్రత్యేక పరిస్థితుల్లో ఇంటి నుంచి అన్నం తెచ్చుకుని బడిలో కూరలు తీసుకుంటున్నారు. పిల్లలు తీసుకునే ఆహారంలో ఎన్ని కేలరీలు ఉన్నాయో ఏఐ టెక్నాలజీ యాప్ ద్వారా తెలుసుకుని అందుకు తగ్గట్టు ఎప్పటికప్పుడు మార్పులు చేస్తున్నారు.





మట్టిలో మాణిక్యాలకు జగన్ వల్లే వెలుగు

- మళ్లీ ఆయన సీఎం అయితేనే గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం
- 'ఆడుదాం ఆంధ్రా' వల్లే చెన్నై సూపర్ కింగ్స్ శిక్షణకు ఎంపిక
- 'సాక్షి'తో క్రికెట్ క్రీడాకారుడు పవన్

ప్రతిభ ఉన్నా ప్రోత్సాహం లేక ఎందరో క్రీడాకారులు గ్రామాలకే పరిమితమైపోయారు. ఈ విషయాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి రూపకల్పన చేసి రాష్ట్ర మంతా భారీఎత్తున నిర్వహించారు. ఎందరో క్రీడాకారులు ముందుకెళ్లడానికి ఇది దారిచూపింది. అలా వెలుగులోకి వచ్చిన వారిలో ఆనంద్‌పాల్ అలియాస్ పవన్ ఒకరు. విజయనగరం జిల్లా జామి మండలంలోని మారుమూల గ్రామం అలమండకు చెందిన ఈ కుర్రాడు ధోనీ సారథ్యంలోని ఐపీఎల్ టీమ్ చెన్నై సూపర్ కింగ్స్ ఆధ్వర్యంలో శిక్షణకు ఎంపికయ్యాడు. తొలి శిక్షణ శిబిరంలో పాల్గొని వచ్చిన అనంతరం పవన్ 'సాక్షి'తో ముచ్చటించాడు. ఆ విశేషాలు అతని మాటల్లోనే.. – సత్యార్థ్

చేనులో ఆట నుంచి 'చెన్నై' దాకా..

నా తండ్రి చిన్నప్పుడే చనిపోయారు. తల్లి కూడా రెండేళ్ల క్రితం మరణించారు. నాకు చిన్నతనం నుంచే క్రికెట్ అంటే చాలా ఇష్టం. పొలాలమ్మట, గల్లీల్లో ఆడుతూ ఉండేవాడిని. 'చదువుకుని ఉద్యోగం చేసుకోక క్రికెట్ అంటూ తిరుగుతున్నావ్ ఏంట్రా'.. అంటూ అమ్మ కోప్పడుతూ ఉండేది. ఫ్రెండ్స్ మాత్రం క్రికెట్ బాగా ఆడతానని పొగుడుతుండేవారు. అడపాదడపా గ్రామాల్లో జరిగే మ్యాచ్‌లలో ఆడి స్వల్ప పారితోషకాలు అందుకోవడం తప్ప ఆటకు ఎలా సానబెట్టుకోవాలో నాకు తెలియలేదు. అదే సమయంలో దేవుడిచ్చిన వరంలా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రకటించారు. మా గ్రామ సచివాలయం ద్వారా ఆ కార్యక్రమానికి ఎంపికయ్యాను.

సెమీ ఫైనల్స్‌లో ఓడినా..

అన్ని చోట్లా మా టీమ్ గెలుపొందింది. చివరకు సెమీ ఫైనల్స్‌లో ఓడిపోయాం. ఆ మ్యాచ్‌లు వీక్షించడానికి వచ్చిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ఫ్రాంచైజీ నన్ను దత్తత తీసుకుంది. ఆడుదాం ఆంధ్రాలో రాష్ట్ర స్థాయిలో పాల్గొనడమే ఒక అద్భుతం అనుకుంటే.. ఏకంగా సీఎస్‌కే టీమ్ ట్రైనింగ్‌కు ఎంపికవడం.. శిక్షణ అనంతరం నాకెంతో ఇష్టమైన క్రికెటర్ ధోని ఆధ్వర్యంలోని టీమ్‌లో సభ్యుడిగా ఆడే అవకాశం నాకు దక్కవచ్చని తెలిసి పొంగిపోయాను. ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని క్రికెటర్‌గా ఎదగడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను.

థాంక్స్ టూ జగన్ సార్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో దూరదృష్టితో ఆలోచించి మట్టిలో మాణిక్యాలను వెలికితీయడానికే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం చేపట్టారు. జీవితాంతం జగనన్నకు రుణపడి ఉంటాను. థాంక్స్ టూ జగన్ సార్.. ఆయనెప్పుడూ పేదల పక్షానే ఉంటూ.. ఎన్నో మంచి పథకాలు అమలుచేస్తున్నారు. క్రీడల విషయంలోనూ పేదలకు మేలు చేసే గొప్ప కార్యక్రమం నిర్వహించారు. గల్లీల్లో ఆడుకునే నాలాంటి వాడు రాష్ట్రమంతా తెలిసేలా చేశారు. మరోసారి ఆయనే సీఎం కావాలని.. ఆడుదాం ఆంధ్రాను మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను.

అవినీతి వెలగపండు



కొండలను పిండేశారు

విశాఖలో విష సంస్కృతికి నాంది
కోడిపందేలు, జూదాలతో రూ. కోట్లు దండుకున్న వైనం
ఆ ఎమ్మెల్యే కన్ను పడితే కబ్జానే
ఇదేమి 'రామ..రామ' అంటూ ప్రజల హాహాకారాలు

ఆరిలోవ(విశాఖ): విశాఖ నగర ప్రజలకు తెలియని కత్తికట్టి ఆడే కోడి పందేల విష సంస్కృతిని ఆ ఎమ్మెల్యే ఇక్కడి జూదరులకు పరిచయం చేశారు. ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక జీవీఎంసీకి చెందిన పదెకరాల ఖాళీ స్థలంలో 2016 నుంచి 2020 వరకు సుమారు నాలుగేళ్లపాటు వరుసగా సంక్రాంతి సమయంలో బరులు ఏర్పాటు చేయించి భారీగానే వెనకేసుకున్నారు. ప్రజల జేబులు గుల్లచేశారు. ఆరిలోవ, జోడుగుళ్లపాలెం, అప్పూఘర్, జాలరిపేట ప్రాంతాల్లో మద్యం దుకాణాలను 2015లో ఎమ్మెల్యే ప్రారంభించారు. అప్పట్లో ఆరిలోవలో నిర్వహించిన మద్యం దుకాణం తొలగించాలని ఐద్వా ఆధ్వర్యంలో స్థానికులు, డ్వాక్రా సంఘాల మహిళలు ధర్నాలు చేసినా ఆయన పట్టించుకోలేదు.

- రుషికొండ ప్రాంతంలో రెవెన్యూకి చెందిన భూమిలో గెడ్డ భాగాన్ని ఆక్రమించి ఆ స్థలం రోడ్డు నిర్మాణంలో పోయినట్టు ఎమ్మెల్యే చూపించారు. ప్రత్యామ్నాయంగా వేరేచోట స్థలం పొందారు.
- 2014 నుంచి 2019 మధ్య టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అనేక దందాలకు పాల్పడ్డారు. జోడుగుళ్లపాలెం వద్ద సుమారు ఎకరం స్థలాన్ని తన బంధువుల పేరుతో ఆక్రమించే యత్నం చేశారు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన యత్నానికి బ్రేక్ పడింది.
- ఎంవీపీ కాలనీలో సెక్టార్–2లో గెడ్డ స్థలాన్ని ఆక్రమించి ఓ బిల్డర్‌కు అపార్టుమెంట్ నిర్మాణం కోసం కట్టబెట్టారు. ఆ అపార్టుమెంట్‌లో కొన్ని ప్లాట్లు తనకు ఇవ్వడానికి బిల్డర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. అప్పట్లో దీనిపై తీవ్రమైన విమర్శలు రావడంతో జీవీఎంసీ అధికారులు ఆ అపార్టుమెంట్ నిర్మాణాన్ని నిలిపేశారు. అప్పటి వైఎస్సార్‌సీపీ నాయకుడు (ప్రస్తుతం జనసేన కార్పొరేటర్) పీతల మూర్తి యాదవ్ ఈ ఆక్రమణపై కోర్టులో కేసు వేశారు. ప్రస్తుతం ఆ కేసు కోర్టులో ఉంది.
- రామకృష్ణాపురాన్ని ఆనుకొని ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక 2017లో పెగదిలికి చెందిన ఎమ్మెల్యే అనుచరులు కొందరు సర్వే నంబర్లు 26, 27ల్లోని సుమారు ఎకరం ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి 18 పాకలు వేశారు. దీనిపై ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా అప్పట్లో ఫిర్యాదులు వెల్లువెత్తడంతో జీవీఎంసీ అధికారులు ఆ పాకలను తొలగించారు. అయినా పట్టువదలకుండా వేసిన పాకలను మూడుసార్లు అధికారులు తొలగించాల్సి వచ్చింది. దీంతో ఎమ్మెల్యే అనుచరులు పేదలకు చెందిన పాకలను తొలగించారని కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టులో ఉంది.

ఎమ్మెల్యేపై కేసులు

- 2020 మార్చి 15న ఎమ్మెల్యే నిర్వహించే మద్యం షాపుల్లో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేపట్టారు. ఆ దుకాణాల్లో కల్తీ మద్యం బ్రాండ్లు విక్రయిస్తున్నట్లు గుర్తించి చర్యలు చేపట్టారు. దీంతో ఎమ్మెల్యే ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ముందు తన అనుచరులతో ధర్నా చేపట్టారు. ఎక్సైజ్ పోలీసులు తమ విధులకు ఆటంకం కలిగించారని ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఐపీసీ 353, 501 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.
- 2019 సాధారణ ఎన్నికల సమయంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందుకు ఎమ్మెల్యేపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.
- రుషికొండ వద్ద ప్రభుత్వానికి చెందిన స్థలంలో గెడ్డ భాగాన్ని ఆక్రమించినట్లు 2011లో రూరల్ రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యేపై భూ ఆక్రమణ కేసు పెట్టారు. అయితే ఆ తర్వాత అధికారులను బెదిరించి ఆయన కేసును కొట్టివేయించుకున్నారు.

జగన్ రాకతో సుపరిపాలన



జిల్లా కేంద్రం, మండల స్థాయికి పరిమితమైన పాలనను సచివాలయాల ద్వారా ప్రజల ముంగిటకు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. ఈ వ్యవస్థ ద్వారా సుమారు 525 సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. గ్రామ/వార్డు వలంటీర్ల నియామకంతో పౌరసేవలు ఇంటి వద్దే అందుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు జరుగుతున్న మేలు అంతా ఇంతా కాదు. విలేజ్ క్లినిక్‌లతో ఆరోగ్య సేవలు మెరుగయ్యాయి. డిజిటల్ లైబ్రరీలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇలాంటివన్నీ కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి.

- పొట్నూరు మురళీధర్, విద్యార్థి, ఊటపల్లి, విజయనగరం

మీరూ స్పందించండి – పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను 73867 92224 నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.

జగనన్నను గెలిపిద్దాం



ప్రజల కోసం ధర్మపాలన అందించే వారిని దేవుడిలా ఆరాధించాలి. ప్రజల్ని కన్నబిడ్డల్లా పరిపాలిస్తున్న మన సీఎం జగన్‌పై కొందరు అత్యంత నీచంగా ప్రవర్తిస్తున్నారు. మరీ ముఖ్యంగా పచ్చ మీడియా అత్యంత అమానుషంగా వ్యవహరిస్తోంది. ఇలాంటి మీడియా పురాణ కాలంలో ఉండుంటే అప్పటి గొప్ప దేవుళ్లను కూడా రాక్షసులుగానే చూపించేవాళ్లు. ఏదేమైనా కుల మతాలకతీతంగా మంచిని కోరుకునే ప్రజలంతా ఏకమై సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలి. లేకపోతే దుష్ట శక్తులు విజృంభించి రాష్ట్రాన్ని నాశనం చేస్తాయి. చేయిచేయి కలుపుదాం.. జగనన్నను గెలిపిద్దాం.

- వజ్రాల విజయలక్ష్మి, గృహిణి, విద్యానగర్, గుంటూరు



పాల కేంద్రంలో పాలు పోస్తున్న మహిళలు



బాబు దండగ అంటే.. జగన్ పండగ చేశారు..

ఆర్బీకేల ద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

చంద్రబాబు రుణమాఫీ హామీని నమ్మి రైతులు నిండా మునిగారు. ఈ తరుణంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికింది. విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తూ వ్యవసాయాన్ని పండగ చేసింది. వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ రాయితీ, ధరల స్థిరీకరణ నిధి వంటి సంక్షేమ పథకాల ద్వారా స్థిరమైన వాతావరణాన్ని కల్పించింది. ఫలితంగా వ్యవసాయ రంగంలో గణనీయమైన పురోగతి సాధ్యమైంది. రైతుల ఆదాయం, జీవన ప్రమాణ స్థాయి పెరిగింది.

- పంపాన వరప్రసాదరావు



ధాన్యపు సిరులు.. పంట ఉత్పత్తులు

ఆహార ధాన్యాల ఉత్పత్తిలో రికార్డులు బ్రేకయ్యాయి. బాబు హయాంలో గరిష్ఠంగా 2017–18లో 167.22 లక్షల టన్నుల దిగుబడులు నమోదు కాగా, గడచిన ఐదేళ్లలో 2019–20 సీజన్‌లో గరిష్ఠంగా 175.12 లక్షల టన్నుల దిగుబడులు నమోదయ్యాయి. వ్యవసాయ శాఖ చరిత్రలోనే ఇదే గరిష్ఠ దిగుబడులు.. 2014–19 మధ్యలో సగటున 153.95 లక్షల టన్నులుగా నమోదైతే, 2019–23 మధ్య 162.04 లక్షల టన్నులుగా నమోదైంది. అంటే బాబు హయాంతో పోల్చుకుంటే 8 లక్షల టన్నులకు పైగా పెరిగింది . మరో పక్క కనీస మద్దతు ధర దక్కని పంట ఉత్పత్తుల కొనుగోలు ద్వారా రైతులకు అండగా నిలిచేందుకు రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశారు. ఇలా ధరలు పతనమైన ప్రతిసారి మార్కెట్‌లో జోక్యం చేసుకొని 6.17 లక్షల మంది రైతుల నుంచి రూ.7746.31 కోట్ల విలువైన 22.59 లక్షల టన్నుల పంట ఉత్పత్తులు కొనుగోలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో 3.74 లక్షల మంది రైతుల నుంచి కేవలం రూ.3322 కోట్ల విలువైన 9 లక్షల టన్నుల ఉత్పత్తులను మాత్రమే సేకరించగలిగింది. ధాన్యం కొనుగోలు ద్వారా 37.73 లక్షల మంది రైతులకు రూ.65,258 కోట్లు చెల్లించారు. గ్యాప్ సర్టిఫికేషన్‌తో రైతులకు ఎమ్మెస్పీకి మించి రికార్డు స్థాయి ధరలు లభించేలా కృషి చేస్తోంది. ఇప్పటికే 3,524 ఎకరాల్లో ఉద్యాన, వ్యవసాయ పంటలకు గ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా 1673 మంది రైతులు లబ్ధి పొందారు.

ఆర్బీకేలు.. ఆదర్శం

ఆర్బీకేలు అన్నదాత పాలిట దేవాలయాలుగా అవతరించాయి. ఇవి ప్రతి రైతును గ్రామస్థాయిలో చేయిపట్టి నడిపిస్తున్నాయి. గ్రామల్లో ఏర్పాటైన 10,778 ఆర్బీకేలను వన్ స్టాప్ సెంటర్స్, నాలెడ్జ్ హబ్‌లుగా తీర్చిదిద్దారు. వీటిలో 16 వేల మందికి పైగా పట్టభద్రులతోపాటు అనుభవజ్ఞులైన ఎంపీఏవోలు, గోపాలమిత్రలు సేవలందిస్తున్నారు. ఇక్కడ స్మార్ట్ టీవీ, డిజిటల్ లైబ్రరీ, సీడ్, సాయిల్ టెస్టింగ్ కిట్స్, కియోస్క్‌లు ఏర్పాటు చేశారు. ఆర్బీకేల ద్వారా బుక్ చేసుకున్న 24 గంటల్లోనే సర్టిఫై చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు చేప, రొయ్యల సీడ్, ఫీడ్, పశుగ్రాసం, దాణా పంపిణీ చేస్తున్నారు. మెరుగైన సేవల కోసం ప్రతీ ఆర్బీకేలో ఓ వలంటీర్, బ్యాంకింగ్ సేవల కోసం 9,277 బ్యాంకింగ్ కరస్పాండెంట్‌లను అనుసంధానించారు. ఈ క్రాప్ ప్రామాణికంగా ధాన్యంతో సహా పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నారు. రైతు భరోసా, పంటల బీమా, పంట నష్ట పరిహారం, వడ్డీ రాయితీ వంటి సంక్షేమ ఫలాలను అర్హులైన రైతులకు అందిస్తున్నారు. యంత్ర సేవా కేంద్రాల ఏర్పాటుతో పాటు గోదాములు, కోల్డ్ రూమ్స్, కలెక్షన్ సెంటర్స్ వంటి మౌలిక వసతుల కల్పనతో బహుళ ప్రాయోజిత కేంద్రాలు (ఎంపీఎఫ్‌సీ) లుగా తీర్చిదిద్దారు. ప్రత్యేకంగా ఆర్బీకే చానల్, ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ కూడా అందుబాటులోకి తెచ్చారు. ఫలితంగా ఆర్బీకే వ్యవస్థ ప్రపంచ దేశాలకు రోల్‌మోడల్‌గా నిలిచింది. పొరుగు రాష్ట్రాలతో పాటు ఇథియోపియా, వియత్నాం వంటి దేశాలు ఈ తరహా సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు పోటీపడుతున్నాయి. ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏవో), నీతి ఆయోగ్, ఐసీఏఆర్, నాబార్డు, ఆర్బీఐ ఇలా జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఆర్బీకేలను సందర్శించి వీటి సేవలను కొనియాడారు.



వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

వైఎస్సార్ రైతు భరోసా పథకం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ కంటే మిన్నగా ఏటా 3 విడతల్లో ఒక్కో విడతకు రూ.13,500 చొప్పున 2019 నుంచి ఇప్పటివరకు 1.65 లక్షల కౌలు రైతులు, 94 వేల అటవీ భూ సాగు రైతులతో సహా 53.58 లక్షల మంది రైతులకు రూ.34,288.17 కోట్ల పెట్టుబడి సాయం అందించారు. ఎన్నికల హామీ ప్రకారం ఈ పథకంలో ప్రతి రైతు కుటుంబానికి 4 విడతల్లో రూ.50 వేలు ఇవ్వాల్సి ఉండగా, 5 విడతల్లో రూ.67,500 సాయం అందించారు. నోటిఫై చేసిన పంటలు సాగు చేసిన రైతులకు యూనివర్సల్ బీమా కవరేజ్ కల్పిస్తూ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం అమలు చేస్తోన్న ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. గత ప్రభుత్వ హయాంలో కేవలం 30.85 లక్షల మందికి రూ.3,411.20 కోట్ల బీమా పరిహారం అందిస్తే ఈ ప్రభుత్వ హయాంలో 54.55 లక్షల మందికి రూ.7,802.05 కోట్ల చొప్పున రెట్టింపు పరిహారం అందింది. 19 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఎలాంటి కోతలు లేకుండా రోజువారీగా 9 గంటల నాణ్యమైన నిరంతర ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఈ ఐదేళ్లలో విద్యుత్ సబ్సిడీ రూపంలో రూ.37,374 కోట్లు, ఫీడర్ల సామర్థ్యం పెంచేందుకు మరో రూ.1700 కోట్లు ఖర్చు చేసింది.



పాడి రైతులకు వెన్నుదన్నుగా..

మూగజీవాల ఆరోగ్య భద్రతకు పెద్ద పీట వేస్తూ రూ.240.69 కోట్లతో నియోజకవర్గానికి 2 చొప్పున 340 వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందుకోసం 1962తో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.ఈ వాహనాల ద్వారా 8.81లక్షల మూగజీవాలను ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించగలిగారు. ఆర్బీకేల్లో నియమించిన 6548 పశుసంవర్ధక సహాయకుల ద్వారా పాడి రైతుల ముంగిట నాణ్యమైన పశువైద్య సేవలు అందిస్తున్నారు. జగనన్న పాల వెల్లువ ద్వారా పాడి రైతులకు లీటర్‌పై రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా లబ్ధి పొందేలా చేశారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 16.72 కోట్ల లీటర్ల పాలను సేకరించగా, రూ.762.88 కోట్లు చెల్లించారు. 40 నెలల్లో ఏడుసార్లు అమూల్ పాల ధరలను పెంచడంతో, ఆమేరకు ప్రైవేటు డెయిరీలు కూడా పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా వాటికి పాలు పోసే రైతులు రూ.4911 కోట్ల మేర లబ్ధి పొందగలిగారు. చేయూత, ఆసరా లబ్ధిదారులకు జగనన్న పాల వెల్లువ, జగనన్న జీవక్రాంతి పథకాల ద్వారా 5.15 లక్షల కుటుంబాలకు రుణాలు సమకూర్చడం ద్వారా 3.81 లక్షల పాడిగేదెలు, ఆవులు, 1.35లక్షల మేకలు, గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. మరో పక్క రూ.385 కోట్ల పెట్టుబడితో మూతపడిన చిత్తూరు డెయిరీ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

ఆక్వా రైతులకు అడుగడుగునా అండగా..

మత్స్యకారులు, ఆక్వా రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా వెన్నుదన్నుగా నిలిచింది. ప్రతీ కౌంట్‌కు ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర ప్రతీ రైతుకు దక్కేలా కృషి చేస్తోంది. పెంచిన ఫీడ్ ధరలను మూడుసార్లు ఉపసంహరించుకునేలా చేసింది. ఆక్వా జోన్ పరిధిలోని 10 ఎకరాల్లోపు అర్హత ఉన్న ప్రతీ రైతుకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తోంది. ఫలితంగా ఐదేళ్లలో రొయ్యల ఉత్పత్తితో పాటు ఎగుమతులు కూడా గణనీయంగా పెరిగాయి. బాబు ఐదేళ్ల పాలనలో రొయ్యల ఉత్పత్తి 1.74లక్షల టన్నులు పెరిగితే. ఈ ప్రభుత్వ హయాంలో 6.94లక్షల టన్నులు పెరిగింది. ఎగుమతులు కూడా 2018–19లో రూ.13,855 కోట్ల విలువైన 2.61 లక్షల టన్నులు జరిగితే. ప్రస్తుతం రూ.20వేల కోట్ల విలువైన 3.30లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులవుతున్నాయి. స్థానిక వినియోగం పెంచేందుకు జిల్లా స్థాయిలో ఆక్వా హబ్‌లు, 4వేలకు పైగా అవుట్‌లెట్స్‌తో పాటు డెయిలీ, సూపర్, లాంజ్ యూనిట్లు ఏర్పాటు చేసింది. ఈ దశలో దేశంలోనే తొలిసారి ఆక్వా రైతులకు బీమా సదుపాయం కల్పించింది. వరుసగా రెండుసార్లు రాష్ట్రానికి బెస్ట్ మెరైన్ స్టేట్ అవార్డులు దక్కాయి. మరో పక్క మత్స్యకారులకు వేట నిషేధ భృతిని రూ.4వేల నుంచి రూ.10వేలకు పెంచడమే కాదు..ఈ ఐదేళ్లలో ఏటా సగటున 1.16 లక్షల మందికి రూ.538 కోట్ల మత్స్యకార భృతిని అందించారు. డీజిల్ ఆయిల్ సబ్సిడీని రూ.6.03 నుంచి రూ.9లకు పెంచడం ద్వారా ఈ ఐదేళ్లలో రూ.148 కోట్ల సబ్సిడీని అందించింది.

మౌలిక వసతులతో మెరుగైన సేవలు

- టీడీపీ ఐదేళ్లలో 4.99 లక్షల మంది రైతులకు కేవలం రూ.1488.20 కోట్ల విలువైన యంత్ర పరికరాలు అందించింది.
- ఈ ఐదేళ్లలో రూ.1052.42 కోట్లతో 10,444 ఆర్బీకే, 492 క్లస్టర్ స్థాయిలోనూ వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు.
- వీటి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.366.25 కోట్లు సబ్సిడీ అందించింది.
- 6362 ట్రాక్టర్లు, 492 కంబైన్డ్ హార్వెస్టర్స్, 31,356 ఇతర యంత్ర పరికరాలు అందజేత
- ఆర్బీకేలకు అనుబంధంగా రూ.1584.61 కోట్లతో 500 టన్నులు, 1000 టన్నుల సామర్థ్యంతో గోదాములతో కూడిన 2536 బహుళ ప్రయోజన కేంద్రాలు ఏర్పాటు
- అందుబాటులోకి వచ్చిన గోదాములు – 554
- వీటిలో రూ.166.33 కోట్ల ఖర్చుతో వివిధ రకాల మౌలిక సదుపాయాల కల్పన.
- 60 టన్నుల సామర్థ్యంతో ఒక్కొక్కటి రూ.19.95 లక్షల అంచనాతో 97 ఆర్బీకేల వద్ద వే బ్రిడ్జ్‌ల నిర్మాణం
- రూ.210 కోట్లతో 147 నియోజకవర్గ, 10 జిల్లా స్థాయి, 4 రీజనల్ స్థాయి ల్యాబ్స్‌తో పాటు డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ టెక్నాలజీతో గుంటూరులో రాష్ట్ర స్థాయి ల్యాబ్‌ల ఏర్పాటు
- అందుబాటులోకి వచ్చిన జిల్లా స్థాయి ల్యాబ్స్ – 127
- మరో 154 వెటర్నరీ, 35 ఆక్వా ల్యాబ్స్ అందుబాటులోకి

ఉద్యాన పంటల హబ్‌గా ఏపీ

- 2018–19లో సాగవుతున్న ఉద్యాన పంటలు 42.5 లక్షల ఎకరాలు
- ప్రభుత్వ ప్రోత్సాహంతో 2022–23 నాటికి ఏకంగా 45.61 లక్షల ఎకరాలకు పెరుగుదల
- 2018–19 నాటికి 305 లక్షల టన్నులున్న దిగుబడులు
- 2022–23 నాటికి ఏకంగా 368.89 లక్షల టన్నులు
- దీంతో సాగులో 15 శాతం, దిగుబడుల్లో 20.9 శాతం వద్ధి రేటు సాధన
- బాబు హయాంలో జరిగిన అరటి ఎగుమతులు – 24వేల టన్నులు
- కాగా ఈ 5ఏళ్లలో జరిగిన అరటి ఎగుమతులు– ఏకంగా 1.75లక్షల టన్నులు
- అరటి ఎగుమతుల కోసం తాడిపత్రి నుంచి ముంబైకు ప్రత్యేకంగా కిసాన్ రైళ్లు ఏర్పాటు
- గతంలో మిరప ఎగుమతి – 12లక్షల టన్నులు
- ప్రస్తుతం జరిగిన మిరప ఎగుమతి – 16 లక్షల టన్నులు
- గత ప్రభుత్వం ఎగ్గొట్టిన బిందు, తుంపర పరికరాలకు ఈ ప్రభుత్వం చెల్లించిన నిధులు రూ. 800.16 కోట్లు
- ఈ ఐదేళ్లలో సబ్సిడీ రూపంలో చెల్లించిన నిధులు – రూ.2669.65 కోట్లు
- తద్వారా కొత్తగా సాగులోకి తీసుకొచ్చిన ఎకరాలు – 7.33లక్షల ఎకరాలు
- దీనివల్ల లబ్ధి పొందిన రైతులు 2.60లక్షల మంది

సీజన్ ముగిసేలోపే పంట నష్ట పరిహారం

- ✔ ఈ ప్రభుత్వంలో ఏ సీజన్‌లో పంట నష్టానికి ఆ సీజన్‌లోనే పరిహారం అందజేత.
- ✔ ఇందుకోసం రూ.2వేల కోట్ల ప్రకృతి వైపరీత్యాల నిధి ఏర్పాటు.
- ✔ తిత్లీ తుఫాన్ సమయంలో చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.182.60 కోట్ల పరిహారం అందజేత
- ✔ ఈ ఐదేళ్లలో 34.41లక్షల మంది రైతులకు రూ.3261.60 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అందజేత
- ✔ 39.07లక్షల మంది రైతులకు బాబు ఎగ్గొట్టిన రూ.1180.66 కోట్లు అందజేత
- ✔ ఈ ఐదేళ్లలో 84.67 లక్షల మంది రైతులకు రూ.2050.53 కోట్ల సున్నా వడ్డీ రాయితీ అందజేత
- ✔ 2019 నుంచి ఇప్పటి వరకు 801 మంది భూ యజమానులు, 495 మంది కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడగా, టీడీపీ హయాంలో ఆత్మహత్య చేసుకున్న 474 మందితో కలిపి మొత్తం 1,770 మందికి రూ.114.42 కోట్ల పరిహారం జమ

రామోజీవి దుర్మార్గపు రాతలే..

వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ రాయితీ, ధరల స్థిరీకరణ, ఆర్బీకేలు, ఇతర విప్లవాత్మక కార్యక్రమాలేవీ రామోజీ కళ్లకు కనిపించడం లేదు. ఆత్మహత్య చేసుకున్న రైతులను గుర్తిస్తే.. ఎక్కడ పరిహారం ఇవ్వాల్సి వస్తుందోనని బాబు విస్మరించారు. ఆ బకాయిలు సహా.. పరిహారం పెంచి ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌దే. ఇది కూడా తనకు కనిపించనట్లు రామోజీ నటిస్తున్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయి వ్యవసాయ రంగ నిపుణులు రాష్ట్రంలో వ్యవసాయ రంగం ప్రగతిని ప్రశంసించడం కూడా విస్మరించి దుర్మార్గపు రాతలు రాస్తుండటం రామోజీకే చెల్లింది.

ఆర్బీకేలు అన్నదాత పాలిట దేవాలయాలుగా అవతరించాయి. 10,778 ఆర్బీకేలు, వన్ స్టాప్ సెంటర్స్, నాలెడ్జ్ హబ్‌లు.. ప్రతి రైతును గ్రామ స్థాయిలో చేయిపట్టి నడిపిస్తున్నాయి. 16 వేల మందికి పైగా పట్టభద్రులతో పాటు అనుభవజ్ఞులైన ఎంపీఏవోలు, గోపాలమిత్రలు అన్నదాతలకు సేవలందిస్తున్నారు. స్మార్ట్ టీవీ, డిజిటల్ లైబ్రరీ, సీడ్, సాయిల్ టెస్టింగ్ కిట్స్, కియోస్క్‌ల ద్వారా సత్వర సేవలు అందుతున్నాయి. సర్టిఫై చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు.. చేప, రొయ్యల సీడ్, ఫీడ్, పశుగ్రాసం, దాణా పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఆర్బీకేలో ఓ వలంటీర్, 9,277 మంది బ్యాంకింగ్ కరస్పాండెంట్‌లను అనుసంధానించారు. ఆర్బీకే ఛానల్, ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ కూడా అందుబాటులోకి తెచ్చారు. ఫలితంగా ఆర్బీకే వ్యవస్థ ప్రపంచ దేశాలకు రోల్‌మోడల్‌గా నిలిచింది.


ఏపీలో తగ్గిన ఆత్మహత్యలు : కేంద్రమంత్రి ప్రకటన

మూడేళ్లుగా ఏపీలో రైతుల ఆత్మహత్యలు తగ్గాయని సాక్షాత్తు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి లోక్‌సభ సాక్షిగా ప్రకటించారు. కానీ చావులతో రాజకీయాలు చేయడం రామోజీ, చంద్రబాబు ద్వయానికి వెన్నతో పెట్టిన విద్య. ఎక్కడైనా ఆత్మహత్యలకు పాల్పడిన వారి సంఖ్య తక్కువగా ఉందంటే ఎవరైనా హర్షిస్తారు. కానీ దుష్టచతుష్టయం మాత్రం లోలోన కుళ్లిపోతుంటారు. ఒక పక్క రైతులను అన్ని విధాలా వైఎస్ జగన్ ప్రభుత్వం ఆదుకుంటోంది.

చంద్రబాబు హయాంలో ఆత్మహత్యకు పాల్పడిన రైతులు టీడీపీ సానుభూతిపరులా? కాదా? అనేకోణంలో చూసేవారు. తమ పార్టీ నాయకులు సిఫార్సు చేస్తేనే ఆ కుటుంబానికి పరిహారం ఇచ్చేవారు. ఇలా తొలి ఏడాది చనిపోయిన రైతు కుటుంబాలకు రూ. 1.50 లక్షల చొప్పున పరిహారం ఇచ్చిన బాబు 2015 నుంచి ఆ మొత్తాన్ని రూ. 5 లక్షలకు పెంచారు. కానీ ఇందులో రూ.1.50 లక్షలు అప్పులకు జమ చేసి మిగిలిన రూ. 3.50 లక్షలు విత్‌డ్రా చేసేందుకు వీలు లేకుండా డిపాజిట్ చేసేవారు. దానిపై వచ్చే వడ్డీ మాత్రమే వాడుకునే పరిస్థితి కల్పించేవారు. చాలా కాలం తర్వాత ఆ డబ్బును విత్ డ్రా చేసుకునే అవకాశం ఉండేది. ఇలా టీడీపీ ఐదేళ్లలో 2014–18 మధ్య 648 మంది భూ యజమానులు, 276 మంది కౌలురైతులు ఆత్మహత్యకు పాల్పడితే కేవలం 450 మంది రైతు కుటుంబాలకు మాత్రమే రూ.5 లక్షల చొప్పున రూ.20.12 కోట్లు అందించారు.


రూ.7లక్షల పరిహారం ఇస్తున్న ఏకైక ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఆ పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచింది. ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాల ఖాతాలకు నేరుగా జమ చేస్తోంది. భూ యజమాని, కౌలు రైతు అయినా వ్యవసాయ కారణాలతో ఆత్మహత్యకు పాల్పడితే ఒక్క ఏపీలోనే రూ.7 లక్షల చొప్పున పరిహారం ఇస్తోంది. ఇతర రాష్ట్రాల్లో కౌలు రైతులకు ఎలాంటి బీమా పరిహారం, ఆర్థిక సహాయం అందజేసే పరిస్థితులు లేవు. రాజకీయాలకు అతీతంగా బాబు హయాంలో ఆత్మహత్యకు పాల్పడిన రైతుల పేర్లను పునః పరిశీలన చేసి తిరస్కరణకు గురైన మరో 474 మందికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.23.70 కోట్ల ఆర్థికసాయం అందించింది. అలాగే 2019 నుంచి ఇప్పటి వరకు 801 మంది భూ యజమానులు, 495 మంది కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడగా, టీడీపీ హయాంలో ఆత్మహత్య చేసుకున్న 474 మందితో కలిపి మొత్తం 1,770 మందికి రూ.114.42 కోట్ల పరిహారాన్ని జమ చేసింది.



ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చెల్లించిన పరిహారం

సంవత్సరం	రైతులు (లక్షల్లో)	పరిహారం (రూ.కోట్లల్లో)
2014-18 (పాతబకాయిలు)	474	23.70
2019-20	317	22.19
2020-21	292	20.44
2021-22	252	17.64
2022-23	339	23.73
2023-24	120	08.40



పథకం	లబ్ధిదారులు(లక్షల్లో)	మొత్తం(రూ.కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా...	53.58	34,288
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	54.55	7802
ఇన్‌పుట్ సబ్సిడీ	34.41	3262
ఇతర పంటల కొనుగోలు	6.17	7726
ధాన్యం సేకరణ బకాయిలు(2014-19)	-	960
ధాన్యం కొనుగోలు రబీ (2018-19 నుంచి ఖరీఫ్ 2023 ఖరీఫ్)	37.73	65.313
విద్యుత్ బకాయిలు(2014-19)	-	8845
ఉచిత వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ	-	43,744
ఫీడర్ల సామర్థ్యం పెంపు	-	1700
ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ	-	3497
వైఎస్సార్ మత్స్యకార భరోసా	-	538
మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ	-	148
శనగ రైతులకు బోనస్	-	300
సూక్ష్మ సేద్యం, పండ్ల తోటల అభివృద్ధి	7.33	3365
ఆయిల్ పామ్ రైతులకు సబ్సిడీ	0.53	248
వైఎస్సార్ యంత్ర సేవా పథకం	-	1052
విత్తన సబ్సిడీ	76.10	1380
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	84.66	2051
విత్తన బకాయిలు (2014-19)	-	384
మొత్తం		1,86,548

దేశం మొత్తం ఏపీని చూస్తోంది..

మాది తమిళనాడు. ఇప్పటి వరకు దేశంలోనే అత్యధిక అగ్రి ల్యాబ్స్(33) మా రాష్ట్రంలోనే ఉన్నాయనుకునే వాడ్ని. కానీ ఏపీలో ఏకంగా 160 ల్యాబ్స్‌ను తక్కువ సమయంలో నాణ్యతతో ఏర్పాటు చేశారు. ఇక్కడి ల్యాబ్స్, సాగు ఉత్పాదకాలను నేరుగా రైతులకందించాలన్న ఆలోచనతో తీసుకొచ్చిన 'రైతు భరోసా కేంద్రాలు' గొప్ప ప్రయోగం. గ్రామ స్థాయిలో రైతులకు ఇంతలా సేవలందిస్తున్న రాష్ట్రం భారతదేశంలో మరొకటి లేదు.

– డాక్టర్ కె.పొన్ను స్వామి, జాయింట్ డైరెక్టర్, కేంద్ర ప్రభుత్వ నూనెగింజల అభివృద్ధి సంస్థ

ఈ క్రాప్ విప్లవాత్మక మార్పు

ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న గిట్టుబాటు ధర పొందగలగడమనే ప్రధాన సమస్యకు ఎలక్ట్రానిక్ క్రాపింగ్ (పంటల నమోదు) ద్వారా శాస్త్రీయ పరిష్కారాన్ని ఏపీ ప్రభుత్వం చూపించింది. రైతులు ఎంత విస్తీర్ణంలో ఏ పంట సాగు చేస్తున్నారో ఈ క్రాప్ ద్వారా నమోదు చేస్తున్నారు. పంటల వారీ దిగుబడి అంచనాలతో ఏయే పంట ఉత్పత్తులు ఎప్పుడు మార్కెట్‌లోకి వస్తాయో ప్రభుత్వం వద్ద సమాచారం ఉంటుంది. ఏ పంట ఉత్పత్తులకు ఎక్కడ డిమాండ్ ఉంటుందో ఆయా మార్కెట్లను అనుసంధానిస్తే ప్రతీ రైతుకు మద్దతు ధర దక్కుతుంది. ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం గొప్ప విషయం.

– ప్రొఫెసర్ విజయ్ పాల్ శర్మ, చైర్మన్, వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శనివారం ॥ 20-4-2024

ఆకాశంలో సగం అని చాటడం వేరు.. నిరూపించడం వేరు.
నేటి అమ్మాయిలు చదువులో, మేధలో,
సమర్థమైన అవకాశాలు అందుకోవడంలో
తమ ఆకాశం సగం అని నిరూపిస్తున్నారు.
యు.పి.ఎస్.సి. 2023 టాప్ 25 ర్యాంకుల్లో
10 మంది అమ్మాయిలు ఉన్నారు.
మన తెలుగు అమ్మాయి అనన్య (3),
రుహానీ (5), సృష్టి (6), అన్‌మోల్ రాథోడ్ (7),
నౌషీన్ (9), ఐశ్వర్యం ప్రజాపతి (10),
మేధా ఆనంద్ (13), స్వాతి శర్మ (17),
వార్దా ఖాన్ (18), రితికా వర్మ (25).
వీరిలో అనన్య, సృష్టి, వార్దా ఖాన్‌ల కథనాలు
ఇప్పటికే అందించాం. మిగిలిన ఏడుగురు
ప్రతిభా పరిచయాల గురించిన ఈ కథనం.

టాపర్స్

'స్వయం సమృద్ధి', 'ఆర్థిక స్వాతంత్ర్యం', 'నిర్ణయాత్మక అధికారిక పాత్ర', 'పరిపాలనా రంగాల ద్వారా జనావళికి సేవ', 'సామర్థ్యాలకు తగిన స్థానం', 'లక్ష్యాలకు తగిన సామర్థ్యం'... ఇవీ నేటి యువతుల విశిష్ట ఆకాంక్షలు, అభిలాషలు, లక్ష్యాలు. అందుకే దేశంలో అత్యంత క్లిష్టతరమైన సివిల్స్ ప్రవేశ పరీక్షల్లో వీరు తలపడుతున్నారు. గెలుస్తున్నారు. నిలుస్తున్నారు. యు.పి.ఎస్.సి. 2023 ఫలితాల్లో టాప్ 25లో పది ర్యాంకులు అమ్మాయిలు సాధించడం గర్వపడాల్సిన విషయం. మొత్తం 1016 మంది అభ్యర్థులు ఎంపిక కాగా వీరిలో అమ్మాయిలు 352 మంది ఉండటం ముందంజను సూచిస్తోంది. తల్లిదండ్రులకు భారం కాకుండా ఒకవైపు ఉద్యోగాలు చేస్తూ లేదా ఇంటి దగ్గర చదువుకుంటూ వీరిలో చాలామంది ర్యాంకులు సాధించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన అనన్య రెడ్డి టాప్ 3 ర్యాంక్ సాధించి తెలుగు కీర్తి రెపరెపలాడించింది. కోచింగ్ సెంటర్‌ల మీద ఆధారపడకుండా సొంతగా చదువుకోవడం ఒక విశేషమైతే, మొదటి అటెంప్ట్‌లోనే ఆమె భారీ ర్యాంక్ సాధించడం మరో విశేషం. అలాగే ఢిల్లీకి చెందిన సృష్టి దబాస్ 6వ ర్యాంక్, వార్దా ఖాన్ 18వ ర్యాంక్ సాధించి స్ఫూర్తిగా నిలిచారు. మిగిలిన ఏడుగురు విజేతల వివరాలు.



రుహానీ
(5వ ర్యాంకు)

హర్యానాకు చెందిన రుహానీ హర్యానాలోని గుర్‌గావ్‌లోనూ ఢిల్లీలోనూ చదువుకుంది. తల్లిదండ్రులు ఇద్దరూ లెక్చరర్లు. ఎకనమిక్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన రుహానీ 'ఇగ్నో' నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసింది. 2020లో ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌కు ఎంపికయ్యి నీతి ఆయోగ్‌లో మూడేళ్లు పని చేసింది. కాని ఐ.ఏ.ఎస్ కావడం ఆమె లక్ష్యం. మరో అటెంప్ట్‌లో ఆమె ఐ.పి.ఎస్.కు ఎంపికయ్యింది. హైదరాబాద్‌లో శిక్షణ పొందుతూ ఆఖరుసారిగా 6వ అటెంప్ట్‌లో టాప్ ర్యాంక్ సాధించింది. పేద వర్గాల ఆర్థిక స్థితిని మెరుగు పర్చడం తన లక్ష్యం అంటోంది రుహానీ.



అన్‌మోల్ రాథోడ్
(7వ ర్యాంకు)

జమ్ము నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఉండే ఉద్రానా అనే మారుమూల పల్లె అన్‌మోల్‌ది. తండ్రి బ్యాంక్ మేనేజర్, తల్లి ప్రిన్సిపాల్. ఇంటర్ వరకూ జమ్ములో చదువుకున్నా గాంధీనగర్‌లో బి.ఏ.ఎల్.ఎల్.బి. చేసింది. 2021లో చదువు పూర్తయితే అదే సంవత్సరం సివిల్స్ రాసింది. కాని ప్రిలిమ్స్ దాటలేకపోయింది. 2022లో మళ్లీ ప్రయత్నిస్తే 2 మార్కుల్లో ఇంటర్వ్యూ వరకూ వెళ్లే అవకాశం పోయింది. 2023లో మూడవసారి రాసి 7వ ర్యాంక్ పొందింది. అయితే ఈలోపు ఆమె 'జమ్ము కశ్మీర్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్' పోటీ పరీక్ష రాసి ఉద్యోగానికి ఎంపికైంది. ఆ ఉద్యోగ శిక్షణ తీసుకుంటూనే సివిల్స్ సాధించింది. 'రోజుకు ఎనిమిది గంటలు చదివాను. చిన్నప్పటి నుంచి నాకు తగాదాలు తీర్చడం అలవాటు. రేపు కలెక్టర్‌ను అయ్యాక ప్రజల సమస్యలను తీరుస్తాను' అంటోందామె.

నౌషీన్ (9వ ర్యాంకు)

'మాది ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్. కాని ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకోవడం వల్ల అక్కడి విద్యార్థుల రాజకీయ, సామాజిక అవగాహన స్థాయి నన్ను ఆశ్చర్యపరిచి సివిల్స్ రాసేలా పురిగొల్పింది. 2020 నుంచి ప్రయత్నించి నాలుగో అటెంప్ట్‌లో 9వ ర్యాంక్ సాధించాను. చరిత్రలో ఈ రెండు ఘటనలు జరగకపోయి ఉంటే బాగుండేదని వేటి గురించి అనుకుంటావ్ అంటూ నన్ను ఇంటర్వ్యూలో అడిగారు– రెండు ప్రపంచ యుద్ధాలు జరక్కపోయి ఉంటే బాగుండేదని, ఆసియా–ఆఫ్రికా దేశాలు వలసవాద పాలన కిందకు రాకుండా ఉంటే బాగుండేదని చెప్పాను. నా జవాబులు బోర్డ్‌కు నచ్చాయి' అని తెలిపింది నౌషీన్. 'ఐ.ఏ.ఎస్. ఆఫీసర్‌గా పని చేయడం గొప్ప బాధ్యత. చాలా మంది జీవితాల్లో మార్పు తేవచ్చు' అందామె.





ఐశ్వర్యం ప్రజాపతి
(10వ ర్యాంకు)

లక్నోకు చెందిన ఐశ్వర్యం ప్రజాపతి రెండో అటెంప్ట్‌లో 10వ ర్యాంక్ సాధించింది. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఉత్తరాఖండ్'లో చదువుకున్న ఐశ్వర్యం ఒక సంవత్సరం పాటు విశాఖపట్నం ఎల్ అండ్ టిలో ట్రయినీగా పని చేసింది. 'నేను ఇన్ని గంటలు చదవాలి అని లెక్కపెట్టుకోని చదవ లేదు. చదివినంత సేపు నాణ్యంగా చదవాలి అనుకున్నాను. నన్ను కలెక్టర్‌గా చూడాలన్నది మా అమ్మానాన్నల కల. సాధిస్తానని తెలుసుకాని ఇంత మంచి ర్యాంక్ వస్తుందనుకోలేదు. ఎవరైనా సరే తమకు ఏది నచ్చుతుందో ఆ దారిలో వెళ్లినప్పుడే సాధించాలన్న మోటివేషన్ వస్తుంది' అని తెలిపిందామె.

మేధా ఆనంద్ (13వ ర్యాంకు)

'మా అమ్మ ఆగ్రాలో బ్యాంక్ ఉద్యోగం చేస్తుంది. కలెక్టర్ ఆఫీసు మీదుగా వెళ్లినప్పుడల్లా నా కూతురు కూడా ఒకరోజు కలెక్టర్ అవుతుంది అనుకునేది. నాతో అనేది. నా లక్ష్యం కూడా అదే. కాలేజీ ఫైనల్ ఇయర్‌లో ఉన్నప్పటి నుంచి సివిల్స్ రాయాలని తర్ఫీదు అయ్యాను. సెకండ్ అటెంప్ట్‌లో 311వ ర్యాంక్ వచ్చింది. కాని నేను సంతృప్తి చెందలేదు. ప్రస్తుతం నేను నార్త్ రైల్వేస్‌లో పని చేస్తున్నాను. పని చేస్తూనే 50 లోపు ర్యాంక్ కోసం కష్టపడ్డాను. కాని 13వ ర్యాంక్ వచ్చింది. నేటి మహిళల్లోని సామర్థ్యాలు పూర్తిగా సమాజానికి ఉపయోగపడటం లేదు. వారికి ఎన్నో అడ్డంకులున్నాయి. వాటిని దాటి వారు ముందుకు రావాలి. కలెక్టర్ అయ్యాక నేను స్త్రీలు ముఖ్యభూమికగా ఆర్థిక వికాసం కోసం కృషి చేస్తాను' అని తెలిపింది మీరట్‌కు చెందిన మేధా ఆనంద్.



స్వాతి శర్మ (17వ ర్యాంకు)

జెంషడ్‌పూర్‌కు చెందిన స్వాతి శర్మ తను సాధించిన 17 ర్యాంక్‌తో జార్ఖండ్‌లో చాలా మంది ఆడపిల్లలకు స్ఫూర్తిగా నిలుస్తానని భావిస్తోంది. 'మా రాష్ట్రంలో అమ్మాయిలకు ఇంకా అవకాశాలు దొరకాల్సి ఉంది' అంటుందామె. అంతేకాదు కలెక్టరయ్యి దిగువ, గిరిజన వర్గాల మహిళల అభ్యున్నతికి పని చేయాలనుకుంటోంది. 'ఎం.ఏ. పొలిటికల్ సైన్స్ చదివాను. ఆ చదువే ఐ.ఏ.ఎస్. చదవమని ఉత్సాహపరిచింది. ఢిల్లీలో సంవత్సరం ఆరు నెలలు కోచింగ్ తీసుకున్నాను. రెండు మూడు సార్లు విఫలమయ్యి నాకు నేనే తర్ఫీదు అయ్యి ఇప్పుడు 17వ ర్యాంక్ సాధించాను. మా నాన్న రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్, అమ్మ గృహిణి. బాగా చదువుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించడమే పిల్లలు తల్లిదండ్రులకిచ్చే కానుక' అంది స్వాతి శర్మ.





రితికా వర్మ (25వ ర్యాంకు)

'ఎన్నో సమస్యలున్న బిహార్ రాష్ట్రం కోసం పని చేయాల్సింది చాలా ఉంది. మాది పాట్నా. మా నాన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో మేనేజర్. ప్రస్తుతం మేము గుంటూరులో ఉంటున్నాం. ఢిల్లీలో బిఎస్సీ మేథ్స్ చదివిన నేను సివిల్స్ ద్వారా పేదల కోసం పని చేయాలని నిశ్చయించుకున్నాను. నాకు సాహిత్యం అంటే ఆసక్తి ఉంది. బిహార్‌లో పేదలకు భూమి సమస్య, పని సమస్య ఉన్నాయి. తక్కువ వేతనాల వల్ల పల్లెల నుంచి నిరవధికంగా వలస సాగుతోంది. కలెక్టర్‌గా నేను వీరి కోసం పని చేయాలనుకుంటున్నాను' అని తెలిపింది రితికా వర్మ.

ఇంటిప్స్

- తెల్లని వస్త్రాలపై పడిన పసుపు, టీ మరకలు ఒకపట్టానా వదలవు. ఈ మరకలను వదిలించడానికి ముందుగా పచ్చిపాలను మరకలపై పోసి పది నిమిషాలపాటు రుద్దాలి. తరువాత డిటర్జెంట్‌లో నానబెట్టి ఉతికితే మరకలు పూర్తిగా పోతాయి.





- దిండు కవర్లపైన పడిన నూనె పోవాలంటే... నూనెపైన టాల్కం పౌడర్ వేసి పదిహేను నిమిషాలు ఉంచాలి. తరువాత సర్ఫ్‌లో నానబెట్టి ఉతికితే నూనె శుభ్రంగా పోతుంది.

అదర్ సైడ్

సోషల్ స్టార్

చిన్న పట్టణంలో పుట్టి పెరిగిన రాజశ్రీ దేశ్‌పాండేకి ఆర్థిక కష్టాలు తెలుసు. 'డబ్బు మాత్రమే అన్ని సమస్యలకు పరిష్కారం' అని ఒకప్పుడు అనుకున్న మాట తప్పు అని తెలుసు. ఔరంగాబాద్ నుంచి ముంబై వరకు తన ప్రయాణంలో ఎన్నో విషయాలు తెలుసుకుంది. బాలీవుడ్‌లో నటిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రాజశ్రీ దేశ్‌పాండే సేవాపథంలో పయనిస్తోంది, ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సేవా కార్యక్రమాలను విస్తరిస్తోంది...





గత సంవత్సరం వచ్చిన నెట్‌ఫ్లిక్స్ షో 'ట్రయల్ బై ఫైర్' నటిగా రాజశ్రీకి ఎంతో పేరు తీసుకువచ్చింది. ఎన్నో అవార్డ్‌లు వచ్చాయి, 1997లో వచ్చిన 'ఉపహార్' సినిమా ఆధారంగా వచ్చిన 'ట్రయల్ బై ఫైర్'లో లీడ్ రోల్ పోషించింది రాజశ్రీ. మరాఠీ చిత్రం 'సత్యశోధక్'లో సావిత్రి బాయి పూలే పాత్ర ఆమెకు ఎంతో పేరు తెచ్చింది.

ఒకవైపు నటిస్తూనే మరో వైపు సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొంటుంది. మహారాష్ట్రలోని కరువు బారిన పడిన 30 గ్రామాలలో సహాయక కార్యక్రమాలలో పాల్గొంది. తన స్వచ్ఛంద సంస్థ 'నభాంగన్' ఫౌండేషన్ ద్వారా ఎన్నో గ్రామాల్లో భూగర్భ జలాల పునరుద్ధరణ నుంచి పాఠశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం వరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. జెండర్ సెన్సిటైజేషన్‌పై ఎన్నో సదస్సులు నిర్వహించింది.

గత కొన్ని సంవత్సరాలుగా స్థానిక ప్రజలు, ప్రభుత్వ అధికారులతో కలిసి పనిచేస్తున్న రాజశ్రీ ఎన్నో విషయాలపై అవగాహన పెంచుకుంది. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి తన సేవా కార్యక్రమాలను విస్తరిస్తోంది. నటిగా తనకు వచ్చిన ఆదాయంతో పాటు క్రౌడ్ ఫండింగ్, డొనేషన్స్ ద్వారా సేవా కార్యక్రమాలకు అవసరమైన నిధులను సేకరిస్తోంది.

'ఎవరూ పట్టించుకోని ప్రాంతాలకు వెళ్లడం అంటే ఇష్టం' అంటున్న రాజశ్రీ ముంబై చుట్టుపక్కల ప్రాంతాల్లో బీచ్ ప్రక్షాళన, నదుల పునరుజ్జీవనానికి సంబంధించిన కార్యక్రమాలు చేస్తుంటుంది. 'ఇలాంటి కార్యక్రమాలు చేస్తే పబ్లిసిటీ వస్తుంది అనే దృష్టితో కాకుండా సమస్య మూలాన్ని అర్థం చేసుకొనే కోణంలో నిజాయితీగా పనిచేయాలి' అంటుంది రాజశ్రీ.

మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో పెరిగిన రాజశ్రీకి తమ కుటుంబ పాలాన్ని పరిశ్రమలు ఎలా లాక్కున్నదీ బాగా గుర్తుంది. తల్లిదండ్రులు చిన్నాచితకా ఉద్యోగాలు చేసేవారు. ఆర్థికంగా ఎన్ని కష్టాలు పడినా కుమార్తెల చదువు విషయంలో మాత్రం ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. పుణేలో లా చేస్తూనే మరోవైపు డబ్బుల కోసం అడ్వర్‌టైజింగ్ ఏజెన్సీలో పనిచేసేది రాజశ్రీ.

స్కూలు రోజుల్లో నాటకాల్లో నటించి 'శభాష్' అనిపించుకుంది. 'నటన'పై ఆసక్తి అక్కడే ఆగిపోలేదు. ఇరవై ఎనిమిది సంవత్సరాల వయసులో ముంబైకి వెళ్లి ఫిల్మ్ కోర్సు చేసేలా చేసింది. అయితే తన అభిరుచే వృత్తిగా మారుతుందని, నలుగురిలో గుర్తింపు తెస్తుందని ఊహించలేదు.

2012లో ఒక సంవత్సరం పాటు హిందీ టెలివిజన్ సీరియల్‌లో నటించింది. 'తలాష్' 'కిక్'లాంటి సినిమాలలో చిన్న చిన్న పాత్రలలో నటించింది.

> **మనలోకి మనం**
> క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి పనిచేస్తున్నప్పుడు ఎన్నో సమస్యల గురించి ఎన్నో కోణాలలో ఆలోచించే సామర్థ్యం సొంతం అవుతుంది. సినిమా వెలుగులు అక్కడ చిన్నబోతాయి. మనల్ని మనం తెలుసుకునేలా చేస్తాయి.
> – రాజశ్రీ దేశ్‌పాండే

2015లో వచ్చిన 'యాంగ్రీ ఇండియన్ గాడెసెస్' చిత్రం ఆమె కెరీర్‌కు బ్రేక్ ఇచ్చింది. 'ఇక వెనక్కి చూడాల్సిన అవసరం లేదు' అంటూ వేరే ప్రపంచం వైపు తొంగి చూడడానికి బొత్తిగా టైమ్ దొరకని టైమ్ అది. అయితే రాజశ్రీ మాత్రం 'నేనూ నా కెరీర్'కు అని మాత్రమే అనుకోకుండా సామాజిక విషయాలపై కూడా దృష్టి పెట్టేది.

ఆ టైమ్‌లో నేపాల్ భూకంప బాధితుల కోసం చేపట్టిన సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంది,

'నా సమస్యలు అన్నిటికీ డబ్బుతోనే పరిష్కారం దొరుకుతుంది అని అనుకునేదాన్ని. నేను చాలా సంపాదించాను. అయినప్పటికీ నేను సంతోషంగా లేనన్న విషయం గ్రహించాను' అంటున్న రాజశ్రీ సేవాపథంపై దృష్టి సారించింది. ఆ బాటలో నడవడంలో తనకు మానసిక శాంతి లభిస్తోంది. డబ్బు కంటే విలువైన అనుభవాలను ఇస్తోంది.

'నేను ఏమీ మారలేదు. అప్పటిలాగే ఉన్నాను' అని రాజశ్రీ నోటి నుంచి వినిపించే మాట. కాళ్లు భూమి మీద నిలిచేలా ఉంచే మాట.

'వ్యక్తిగత అనుభవాలు నటనపై ప్రభావం చూపుతాయి' అంటారు. సేవాకార్యక్రమాల ద్వారా ఈ ప్రపంచాన్ని రకరకాల కోణాలలో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న రాజశ్రీ దేశ్‌పాండే నటనపై కూడా తన నటజీవితానికి ఆవల ప్రపంచానికి సంబంధించిన అనుభవాల ప్రభావం ఉంది.

ఫస్ట్ టైమ్



ఓపెన్ ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రిసెర్చ్ ఆర్గనైజేషన్-యూఎస్) తొలి ఉద్యోగిగా మన దేశంలో నియామకం అయిన ప్రజ్ఞామిశ్రా ప్రత్యేక గుర్తింపు సాధించింది...

ఓపెన్ ఏఐలో 'గవర్నమెంట్ రిలేషన్స్' హెడ్‌గా బాధ్యతలు నిర్వహించనుంది 39 సంవత్సరాల ప్రజ్ఞా మిశ్రా. ఇంతకు ముందు 'ట్రూ కాలర్'లో పబ్లిక్ ఎఫైర్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించింది. పబ్లిక్ ఎఫైర్స్ డైరెక్టర్‌గా వివిధ శాఖల మంత్రులు, స్టేక్ హోల్డర్‌లు, ఇన్వెస్టర్‌లు, మీడియా పార్ట్‌నర్‌లతో కలిసి పనిచేసింది. దీనికి ముందు మెటా ప్లాట్‌ఫామ్ 'ఇంక్'లో మూడు సంవత్సరాలు పనిచేసింది. మిస్ ఇన్ఫర్‌మేషన్ వ్యతిరేక క్యాంపెయిన్‌కు నాయకత్వం వహించింది.

ఢిల్లీ యూనివర్శిటీలో కామర్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన ప్రజ్ఞ ఇంటర్నేషనల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంబీఏ చేసింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో 'బార్గెయినింగ్ అండ్ నెగోషియేషన్స్' సబ్జెక్ట్‌లో డిప్లొమా చేసింది.

ప్రజ్ఞ ప్రతిభావంతురాలైన గోల్ఫర్. 1998 నుంచి 2007 వరకు ఎన్నో ఇంటర్నేషనల్ టోర్నమెంట్స్‌లో ఆడింది. మెడిటేషన్ ట్రైనర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. వ్యక్తిత్వ వికాస కోణంలో పాడ్‌కాస్ట్‌లో ప్రసంగాలు చేసింది. ఈ నెల ఆఖరులో 'ఓపెన్ ఏఐ'తో తన ప్రయాణాన్ని ప్రారంభించనుంది ప్రజ్ఞామిశ్రా.

మొలకలు తినడంలో మెలకువలు



చాలామందికి మొలకెత్తిన గింజలు తినడం అలవాటు. వీటిని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల అనేకమైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఈ విషయం ప్రాచుర్యంలోకి రావడం వల్ల ప్రస్తుత కాలంలో చాలా మంది స్ప్రౌట్స్ తినడం తమ ఆహారపు అలవాట్లలో భాగంగా చేసుకుంటున్నారు. అయితే చాలామంది వీటిని తినే విషయంలో కొన్ని పొరపాట్లు చేస్తున్నారు. ఫలితంగా మొలకలు తినడం మూలాన కలిగే ప్రయోజనాల మాట అటుంచి, అజీర్తి, గ్యాస్ వంటి ఇతర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అందువల్ల మొలకలను ఎలా తీసుకోవాలో మెలకువలు తెలుసుకుందాం...

మొలకెత్తిన విత్తనాలను సంపూర్ణ ఆహారంగా చెప్పవచ్చు. శరీరానికి కావల్సిన పోషకాలు అన్నీ మొలకెత్తిన విత్తనాలలో ఉంటాయి. అయితే మొలకెత్తిన గింజలను నమలడం కొద్దిగా కష్టంతో కూడిన పని. తక్కిన టిఫిన్లతో పోల్చితే వీటిని తినడానికి, అవి అరగడానికి కాస్త ఎక్కువ సమయం పడుతుంది. ఈ ఇబ్బంది ఎందుకులే అని కొందరు వీటిని జ్యూస్ చేసుకొని తాగేస్తుంటారు. ఇది అతి పెద్ద పొరపాటు. మొలకెత్తిన విత్తనాలను జ్యూస్ చేసి తాగడం వల్ల వీటిలో ఉండే పోషకాలు శరీరానికి ఎక్కువగా అందవు. నిజానికి మొలకెత్తిన విత్తనాలను నమిలినప్పుడు మన నోట్లో లాలాజలం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఈ లాలాజలం మొలకెత్తిన విత్తనాలలో ఉండే కార్బోహైడ్రేట్స్ జీర్ణం అవ్వడానికి సహాయపడుతుంది. జ్యూస్ చేసి తాగడం వల్ల ఈ కార్బోహైడ్రేట్స్ జీర్ణం అవ్వవు. కనుక శరీరం వీటిని సంగ్రహించుకోలేదు.

మొలకెత్తిన విత్తనాలను నమిలినప్పుడు వీటిని జీర్ణం చేయడానికి జీర్ణాశయం, ప్రేగులల్లో రసాయనాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. దీనివల్ల పేగులు పోషకాలను ఎక్కువగా శోషించుకుంటాయి. ఈ విత్తనాలను జ్యూస్ చేసి తాగడం వల్ల రసాయనాల ఉత్పత్తి ఎక్కువగా జరగక మన పేగులు వీటిల్లో ఉండే పోషకాలను ఎక్కువగా శోషించుకోలేవు. పైగా జ్యూస్ చేసి తాగడం వల్ల వాంతులు అయ్యే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి. ఇంతకీ వీటిని ఎలా తీసుకోవాలి సందేహం చాలామందికి వస్తుంది.

మొలకెత్తిన విత్తనాలను నేరుగా తినడమే మనకు చాలా మంచిది. ఇలా నేరుగా తినడం వల్లనే మన శరీరానికి కావల్సిన పోషకాలు అన్నీ లభిస్తాయి. అలా తినలేకపోతే కొద్దిగా నూనె వేసి వేయించి ఉప్పూకారం నిమ్మరసం కలుపుకుని తినవచ్చు లేదా వీటిలో తేనె, నిమ్మరసం, ఖర్జూర, దానిమ్మ గింజలు, ఎండు ద్రాక్ష, ఉల్లిపాయ ముక్కలు వేసుకుని తినడం వల్ల రుచి మెరుగుపడుతుంది. కనుక సులభంగా తినవచ్చు.



చెమట కాయలా? ఉపశమనం ఇలా...

ఎండలు మండుతున్నాయి. దీంతో విపరీతమైన చెమట, దురదలతో చాలా ఇబ్బంది పడిపోతుంటారు. చర్మం తన మృదుత్వాన్ని కూడా కోల్పోతుంది. చెమటకాయలు దురదకు కారణమై, చికాకు, ఆయా భాగాలలో మంట, నొప్పికి దారితీస్తాయి. అతిగా చెమట పట్టే వారిలో వీటి సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా నుదుటిపై, ముఖం, మెడ, వీపు, ఛాతీ, తొడల మీద చెమట కాయలు వస్తుంటాయి. వీటి తీవ్రత ఎక్కువైతే చర్మం ఎర్రపొక్కులుగా మారటం, గోకటం వల్ల చర్మం చిట్లి రక్తం కారడం జరుగుతుంది. కొన్ని చిట్కాలతో కొంత ఉపశమనం పొందవచ్చు. అవేంటో చూద్దాం.

రెండు పూటలా స్నానం చేస్తూ శరీరాన్ని శుభ్రంగా వుంచుకోవాలి. చెమట ఎక్కువగా పట్టినప్పుడు స్నానం చేయడం, లేదా తడి వస్త్రంతో శరీరాన్ని తుడవడం తప్పనిసరి. వదులుగా ఉండే పల్చని కాటన్ వస్త్రాలు వేసుకోవాలి. నీళ్లు బాగా తాగాలి. దాంతో శరీరం చల్లగా ఉంటుంది. వీలైనంత వరకు ఎండలోకి వెళ్లకుండా చూసుకోవాలి. స్నానం చేసే నీటిలో గుప్పెడు మల్లెపూలు, జాజిపూలు లేదా వట్టివేళ్ల చూర్ణం వేసి గంటసేపు నాననిచ్చి, ఆ నీటితో స్నానం చేయడం మంచిది. ఇటువంటి స్నానం శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.

వంటినిండా చెమటకాయలు వచ్చినప్పుడు గంధం ముద్దని పేలిన చోట పల్చని పూతలా వేసుకుంటే, మంట, దురద తగ్గుతాయి. ఇందులో కర్పూరాన్ని కలిపి పేలిన చోట లేపనంలా రాసినా కూడా సమస్య అదుపులోకి వస్తుంది. మార్కెట్లో లభ్యమయ్యే గంధం పొడిలో సహజత్వం ఉండదు. అందుకే గంధపు చెక్కని సానపై అరగదీసి, దాన్ని వాడటం శ్రేయస్కరం. చందనం పొడి, వట్టివేళ్ల పొడిని రోజ్‌వాటర్‌లో కలిపి పల్చని లేపనంలా చెమట కాయలపై రాసినా మంచిదే. కలబంద గుజ్జుని రాసుకున్నా కూడా చెమటకాయల నుంచి ఉపశమనం కలుగుతుంది.

తాటి ముంజెలలోని నీటిని చెమట కాయలపై రాసి, ఆరిన తర్వాత శుభ్రమైన వస్త్రంతో మృదువుగా తుడిచేయాలి. పుచ్చకాయ, కర్బూజా, కీరదోస, ముంజెలు, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, పల్చని మజ్జిగ... వంటి చలువచేసే పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. కారం, గరం మసాలా, నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండాలి.

ప్రకృతి జీవనంలో ఆరోగ్యం ఆహ్లాదం

ఎండలు దంచేస్తున్నాయి. ఇది కొంత అసౌకర్యంగా అనిపించవచ్చు. అలాగని ఎండలని తిట్టుకుంటూ కూర్చోవడం సరి కాదు. ఎండలకు జడిసి ఇంటిలోనుంచి కాలు బయట పెట్టకుండా ఉండటమూ మంచిది కాదు. ఎందుకంటే మొన్న వచ్చిన ఉగాదితో మనం వసంత రుతువులో అడుగు పెట్టాం. వసంత రుతువన గానే చిగిర్చిన పచ్చని చెట్లు, పక్షులు, జంతువులు, రంగురంగుల పువ్వులు, సూర్యుడి కాంతి, చంద్రుని వెన్నెల, నక్షత్రాలు, అడపాదడపా వీస్తూ ఒంటికి హాయినిచ్చే చల్లటి గాలు... ఇలా ప్రకృతి ఎన్నో రూపాలలో మన చుట్టూ ఉంటుంది. మనం కూడా ప్రకృతిలో భాగమే, మన ఉనికికి కారణం ప్రకృతే. మన జీవితం ప్రకృతి మీద ఆధారపడి ఉంది. కానీ మనలో చాలామంది ప్రకృతికి పెద్ద ప్రాముఖ్యత ఇవ్వరు. ఈ ఆధునికత, నాగరకత వల్ల మనం ప్రకృతి నుంచి దూరంగా బతుకుతున్నాం. అయితే ప్రకృతిలో గడపడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుందాం.

ప్రకృతిలో గడపడం వల్ల కలిగే ఉపయోగాలు ఏంటి? ప్రకృతికి మనం ఎందుకు ప్రాముఖ్యత ఇవ్వాలి? ప్రకృతిలో గడపలేని వారు అందుకు ప్రత్యామ్నాయంగా ఏం చేయవచ్చో చూద్దామా...



ఒత్తిడి నుంచి విడుదల

ఈ రోజుల్లో చిన్న నుంచి పెద్ద దాకా అందరికీ ఒత్తిడి సాధారణం అయిపోయింది. అలాంటప్పుడు వీలయినప్పుడల్లా ప్రకృతిలో కాస్త సమయం గడిపితే ఒత్తిడి చాలా మేరకు తగ్గుతుంది. ఎన్నో రకాల శారీరక, మానసిక రుగ్మతల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు.

వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది

మన ఆరోగ్యంగా ఉండాలంటే రోగ నిరోధక శక్తి చాలా అవసరం. రోజూ కొద్దిసేపు ప్రకృతిలో గడపడం వల్ల మన శరీరానికి లేలేత సూర్యకిరణాలలోని విటమిన్ అందుతుంది. చల్లటి గాలి తగులుతుంది. ఇది వ్యాధులు నయం అయ్యే గుణాన్ని పెంచుతుంది. అంటే రోగనిరోధక శక్తి సహజంగానే సమకూరుతుందన్నమాట.



ప్రకృతిలో ఎలా గడపాలంటే..?
వేగంగా నడవడం, జాగింగ్; మెడిటేషన్ చెయ్యడం; గుండెలనిండా గాలి పీల్చి వదులుతుండడం, వ్యాయామం లేదా యోగా చేయడం మంచిది.

ప్రకృతిలో గడపడం వల్ల మన శరీరానికి వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పరిశోధనలు చెప్తున్నాయి.

మీకు ఏం చేయాలనిపించకుండా బోర్ గా ఉంటే వెళ్ళి కాసేపు ప్రకృతిలో కూర్చోండి. ఆ చల్లని గాలిని ఎంజాయ్ చెయ్యండి. బయటకి వెళ్ళడానికి కూడా ఇష్టం లేదా? అయితే కనీసం మన ప్రకృతిలో ఉన్నట్టు ఊహించుకున్నా ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయని పరిశోధనలు చెప్తున్నాయి. అద్భుతం కదా? కాబట్టి మీరు ఎప్పుడైతే ఒత్తిడి తగ్గించుకోవాలనుకుంటారో అప్పుడు ముందుగా ఒక పెద్ద చెట్టుకింద కూర్చున్నట్టు లేదా అడవిలో నడుస్తున్నట్టు ఊహించుకోండి. వీలుంటే ఇంట్లో అందమైన ప్రకృతి పెయింటింగ్స్ పెట్టుకోవడం, ఇండోర్ ప్లాంట్స్ పెంచుకోవడం చాలా ప్రయోజనకరం.

శరీరం, మనసు సేదతీరతాయి

కేవలం ఐదు నిముషాలు ప్రకృతిలో గడిపినా శారీరకంగా, మానసికంగా ఎంతో ఆహ్లాదకరమైన అనుభూతిని పొందవచ్చని పరిశోధనలెన్నో ఎలుగెత్తి చాటుతున్నాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది, రక్తపోటు అదుపులో ఉంటుంది. జ్ఞాపక శక్తి, ఏకాగ్రత పెరుగుతాయి.

వయసు తెలియకుండా చేస్తుంది

ఎక్కువగా ప్రకృతిలో గడిపే పెద్దవాళ్ళకి కీళ్ల నొప్పులు, నిద్రలేమి లాంటి సమస్యలు వచ్చే అవకాశం తక్కువ అని పరిశోధనలు చెప్తున్నాయి. అంటే పొలంలో పని చేస్తూ, ప్రకృతికి దగ్గరగా గడిపేవారు మిగిలిన వారితో పోల్చితే చాలా ఆరోగ్యంగా, చలాకీగా ఉన్నట్లు కనిపించేది అందుకే.

ఇతర ప్రయోజనాలు

- మీరు ఎప్పుడైనా మూడీగా ఉన్నప్పుడు కాసేపు ప్రకృతిలో గడిపి చూడండి. ఆ మ్యాజిక్ మీరే చూస్తారు
- ఆరోగ్యకరమైన ప్రాణశక్తి సూర్యుడి నుంచి, భూమి నుంచి, గాలి నుంచి వస్తుంది. ప్రకృతిలో గడపడం వల్ల మనలో ప్రాణశక్తి పెరుగుతుంది
- ఆనందంగా ఉండేలా చేస్తుంది. ఆనందమే మనల్ని నిజంగా ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది
- సృజనాత్మకతని పెంచుతుంది. సమస్యలు పరిష్కరించే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది
- మనం రోజులో ఎన్నో పనులు చేస్తాం. అలసిపోవడం చాలా సహజం. ప్రకృతిలో గడిపితే శరీరం, మైండ్ నూతన ఉత్సాహంతో ఉంటాయి
- జీవితం కొన్నిసార్లు చాలా రొటీన్‌గా తయారవుతుంది. ప్రకృతిలో గడపడం వల్ల జీవితం కొత్తగా అనిపిస్తుంది
- ప్రకృతిలో గడపడం వల్ల నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది
- మనం సూర్యరశ్మిలో గడిపినపుడు మన శరీరంలో విటమిన్ ఈ పెరుగుతుంది. దాని వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి
- ప్రకృతిలో గడపడం వల్ల ఆత్మ విశ్వాసం, ఫిట్ నెస్ పెరుగుతాయి
- ఇంట్లో చేసిన వ్యాయామం కన్నా ప్రకృతి సహజమైన వాతావరణంలో చేసే వ్యాయామం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని పరిశోధనలు చెప్తున్నాయి. కాబట్టి వ్యాయామాన్ని నాలుగు గోడల మధ్యలో కాకుండా ప్రకృతిలో చెయ్యడం ప్రారంభిస్తే జీవన నాణ్యత పెరగడాన్ని మీరే గమనించవచ్చు.

సినిమా

పిచ్చి పట్టిందా నీకు...


● శర్వానంద్, కృతీ శెట్టి, విక్రమాదిత్య

'మంచిగా కనపడేవాళ్లందరూ మంచివాళ్లు కాదురా... ఫర్ ఎగ్జాంపుల్ నేను' అంటూ మొదలవుతుంది 'మనమే..' సినిమా టీజర్. శర్వానంద్, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం ఇది. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ప్లేబాయ్ మనస్తత్వం ఉండే అబ్బాయి, బాధ్యతగా జీవించాలనుకునే ఓ అమ్మాయి జీవితాల్లోకి విక్రమాదిత్య అనే ఓ పిల్లవాడు వచ్చినప్పుడు వారి జీవితాలు ఎలా ప్రభావితం అయ్యాయి? అన్నదే ఈ చిత్రం కథాంశమన్నట్లుగా యూనిట్ చెబుతోంది. 'వాడప్పట్నుంచి ఆపకుండా ఏడుస్తున్నాడు. అసలేం చేశావ్... (కృతీ శెట్టి), 'తాగటానికెళ్లొచ్చా..' (శర్వానంద్), 'ఇల్లు చూసుకోవడం రాదు... పిల్లవాడిని చూసుకోవడం రాదు... పిచ్చిపట్టిందా నీకు...' (కృతీ శెట్టి), 'ఇద్దరిలో ఒకళ్లు ఏడ్వండి' (శర్వానంద్) వంటి సంభాషణలు విడుదలైన టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

వారం ఆలస్యంగా...


● తమన్నా

సుందర్ .సి కీలక పాత్రలో నటించి, దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'అరణ్మనై 4'. ఇందులో తమన్నా, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటించారు. ఖుష్బు సుందర్, ఏసీఎస్ అరుణ్ కుమార్ నిర్మించారు. ఈ మూవీని 'బాక్' పేరుతో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పీ తెలుగులో విడుదల చేస్తోంది. ఈ నెల 26న తెలుగు, తమిళ భాషల్లో ఈ మూవీని రిలీజ్ చేయాలనుకున్నారు. అయితే ఎండల తీవ్రత అధికంగా ఉండటం వలన విడుదలను వాయిదా వేశామని మేకర్స్ ప్రకటించారు. వారం ఆలస్యంగా మే 3న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. 'వెన్నెల' కిశోర్, శ్రీనివాస్ రెడ్డి, ఢిల్లీ గణేశ్, కోవై సరళ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: హిప్‌హాప్ తమిళ, కెమెరా: కృష్ణమూర్తి.

ప్రతిసారీ కొత్త కోణం కనిపించింది

- విజయేంద్ర ప్రసాద్


● జగపతిబాబు, విజయేంద్ర ప్రసాద్, ఆయుష్, సుశ్రీ

''రుస్లాన్' టీజర్‌ని చాలాసార్లు చూశాను. చూసిన ప్రతిసారీ కొత్త కోణం కనిపించింది. ఆయుష్ శర్మ బాగా నటించాడు. రాధామోహన్‌గారు చాలా ప్యాషన్ ఉన్న నిర్మాత. ఈ సినిమాని అద్భుతంగా నిర్మించారు'' అని ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ అన్నారు. ఆయుష్ శర్మ, సుశ్రీ మిశ్రా జంటగా నటించిన హిందీ చిత్రం 'రుస్లాన్'. కరణ్ .బి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జగపతిబాబు కీలక పాత్ర పోషించారు. కేకే రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో జగపతిబాబు మాట్లాడుతూ- ''హిందీలో 'రుస్లాన్' నా రెండో చిత్రం. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుంది'' అన్నారు. ''సల్మాన్ ఖాన్‌గారి 'సుల్తాన్' సినిమాకి సహాయ దర్శకుడిగా చేశాను. అప్పుడు విజయేంద్ర ప్రసాద్‌గారు నన్ను నటుడిగా లాంచ్ చేస్తే బావుంటుందన్నారు. అలా నటుడిగా నా జర్నీ మొదలైంది'' అన్నారు ఆయుష్. ''రుస్లాన్' చాలా స్పెషల్ మూవీ'' అన్నారు సుశ్రీ మిశ్రా. ''మా బ్యానర్‌లో నిర్మించిన తొలి హిందీ చిత్రం 'రుస్లాన్'' అన్నారు కేకే రాధామోహన్.

ఇరవయ్యేళ్ల తర్వాత యాభైఆరవ చిత్రంలో...


● శోభన


● మోహన్‌లాల్

మాలీవుడ్ సిల్వర్ స్క్రీన్ హిట్ పెయిర్ మోహన్‌లాల్, శోభనల జోడీ రిపీట్ కానుంది. మోహన్‌లాల్ హీరోగా తరుణ్ మూర్తి దర్శకత్వంలో ఎమ్. రంజిత్ ఓ సినిమా నిర్మించనున్నారు. ఈ చిత్రంలో శోభన కథానాయికగా నటించనున్నారు. ఈ సినిమాలో భాగమైనట్లుగా సోషల్ మీడియాలో శోభన ఓ వీడియో షేర్ చేశారు. ''మోహన్‌లాల్‌గారి ఈ 360వ సినిమాలో నేను నటించనున్నాను. నాకు గుర్తు ఉన్నంతవరకు ఆయనతో నేను కలిసి చేయబోతున్న 56వ చిత్రం ఇది'' అని ఆ వీడియోలో పేర్కొన్నారు శోభన. ఇక 1985లో వచ్చిన మలయాళ చిత్రం 'అవిడతే పోలే ఇవిడెయుమ్'లో తొలిసారి కలిసి నటించారు మోహన్‌లాల్, శోభన. ఆ తర్వాత ఈ ఇద్దరూ 'మణిచిత్ర తాళు' (ఈ సినిమా ఆధారంగానే 'చంద్రముఖి' తీశారు), 'నాడోడిక్కట్టు' వంటి హిట్ చిత్రాల్లో నటించారు. 1994లో వచ్చిన మలయాళ చిత్రం 'తేన్మావిన్ కొంబాట్'లో మోహన్‌లాల్, శోభన లీడ్ రోల్స్‌లో నటించారు. ఇప్పుడు 20 ఏళ్ల తర్వాత మోహన్‌లాల్, శోభన కలిసి నటించనున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే.. 2009లో వచ్చిన మలయాళ చిత్రం 'సాగర్ ఆలియాస్ జాకీ రీలోడెడ్'లో మోహన్‌లాల్ హీరోగా నటించగా, శోభన ఓ అతిథి పాత్ర చేశారు.

పొట్టేల్‌లాంటివి అరుదుగా వస్తాయి

- సందీప్ రెడ్డి


● అనన్య, యువ చంద్ర, సందీప్ రెడ్డి వంగా

''పొట్టేల్' సినిమా టీజర్ చూడగానే.. ఇలాంటి కంటెంట్ మలయాళ సినిమాలో ఎక్కువగా చూస్తుంటాం.. తెలుగులో ఇలాంటి చిత్రాలు ఎందుకు రావట్లేదని అనుకుంటాం. కానీ, 'పొట్టేల్'లాంటి చిత్రాలు అరుదుగా వస్తాయి. చిన్న, రూరల్ సినిమాలని అందరూ ప్రోత్సహించాలి'' అని డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా అన్నారు. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ముఖ్య తారలుగా సాహిత్ మోతుక్కూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగే నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని సందీప్ రెడ్డి వంగా విడుదల చేశారు. అనంతరం యువ చంద్ర కృష్ణ మాట్లాడుతూ- ''పొట్టేల్' మన మట్టికథ. మంచి భావోద్వేగాలు, వాణిజ్య అంశాలున్న తెలుగు సినిమా ఇది'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బెస్ట్ మూవీ అవుతుంది'' అన్నారు అనన్య నాగళ్ల. ''ఈ సినిమా విషయంలో యూనిట్ అంతా చాలా గర్వంగా ఉన్నాం'' అన్నారు సాహిత్ మోతుక్కూరి. ''ఇది మట్టి నుంచి పుట్టిన కథ. సినిమా బాగా వచ్చింది'' అన్నారు నిశాంక్, సురేష్ కుమార్. నటుడు అజయ్ పాల్గొన్నారు.

లచ్చిమక్క పెళ్లి

1980 కాలంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా పొలిటికల్ డ్రామాగా రూపొందిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. విరించి వర్మ దర్శకత్వంలో ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో 'బాహుబలి, ఎవరికీ చెప్పొద్దు' సినిమాలతో నటుడిగా పేరు తెచ్చుకున్న రాకేశ్ వర్రె లీడ్ రోల్‌లో నటించగా, వైశాలీ రాజ్, రియా సుమన్, సుబ్బరాజు ఇతర ముఖ్య పాత్రలు చేశారు. పెళ్లి నేపథ్యంలో వచ్చే ఈ చిత్రంలోని 'లచ్చిమక్క...' పాటను విడుదల చేశారు. చిత్ర సంగీతదర్శకుడు గోపీ సుందర్ స్వరపరచిన ఈ పాటకు రాంబాబు గోసాల సాహిత్యం అందించగా మంగ్లీ పాడారు. జితేందర్ రెడ్డి ఇంట్లో జరిగే పెళ్లిలో సరదాగా సాగే పాట ఇది అని యూనిట్ పేర్కొంది. మే 3న ఈ చిత్రం విడుదల కానుంది.


● వైశాలీ రాజ్

యుద్ధమే చేయాలి


● సాయికుమార్, వినయ్, చరిష్మా

సాయికుమార్, వినయ్, అరుణ్, దీప్తీ వర్మ, ఆమని, చరిష్మా శ్రీకర్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'లక్ష్మీ కటాక్షం'. 'ఫర్ ఓట్' అనేది క్యాప్షన్. యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ఇరవైఐదేళ్ల నుంచి నిర్మించుకుంటూ వస్తున్న రాజకీయ సామ్రాజ్యం రా నాది. నన్ను ఆపాలంటే పెద్ద యుద్ధమే చేయాలి', 'ధర్మా.. నువ్వు ఎమ్ఎల్ఏ కావడానికి కావాల్సిన వంద కోట్లు బయలుదేరబోతున్నాయి', 'ఈ ఎన్నికల్లో ఓటుకు ఒక్క రూపాయి కూడా పంచనివ్వకుండా చేయాలి' అనే డైలాగ్స్ విడుదలైన ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ సినిమాకు సంగీతం: అభిషేక్ రుఫుస్.

రీల్స్

హిందీ వార్‌లో హాలీవుడ్ యాక్షన్


● స్పిరో రజాటోస్

బాలీవుడ్ 'వార్ 2'లో హాలీవుడ్ తరహా యాక్షన్ కనిపించనుంది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ లీడ్ రోల్స్‌లో అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'వార్ 2' రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తారట. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ ముంబైలోని ఓ స్టూడియోలో జరిగింది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారట మేకర్స్. ఈ పోరాట దృశ్యాలను హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్ స్పిరో రజాటోస్ డిజైన్ చేశారని బాలీవుడ్ సమాచారం. ఇక 'కెప్టెన్ అమెరికా: ది సివిల్ వార్', 'కెప్టెన్ అమెరికా: ది ఫస్ట్ సోల్జర్' 'ఫాస్ట్ ఎక్స్' వంటి హాలీవుడ్ చిత్రాలకు యాక్షన్ డిజైన్ చేశారు స్పిరో. కాగా స్పై జానర్‌లో ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్న 'వార్ 2' చిత్రం వచ్చే ఏడాది ఆగస్టు 14న రిలీజ్ కానుంది.

మ్యాడ్‌కి శుభాకాంక్షలు


● సిద్ధు జొన్నలగడ్డ

హిట్ మూవీ 'డీజే టిల్లు'కి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్'తో హిట్ అందుకున్న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి మరో హిట్ మూవీ సీక్వెల్ రానుంది. ఈ సంస్థ నిర్మించిన 'మ్యాడ్' (2023) మూవీకి సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' షురూ అయింది. 'మ్యాడ్'లో హీరోలుగా నటించిన నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ సీక్వెల్‌లోనూ నటిస్తున్నారు. 'మ్యాడ్' దర్శకుడు కల్యాణ్ శంకర్ సీక్వెల్‌ని కూడా తెరకెక్కిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్, సూర్యదేవర నాగవంశీ సమర్పణలో సూర్యదేవర హారిక, సాయి సౌజన్య నిర్మిస్తున్న 'మ్యాడ్ స్క్వేర్' హైదరాబాద్‌లో ఆరంభమైంది. ఈ కార్యక్రమానికి హీరో సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు కేవీ అనుదీప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిత్రదర్శకుడికి స్క్రిప్ట్ అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు సిద్ధు జొన్నలగడ్డ. ''మ్యాడ్' చిత్రంకన్నా రెట్టింపు వినోదాన్ని 'మ్యాడ్ స్క్వేర్' ద్వారా అందించబోతున్నాం. కథానాయికల వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అన్నారు మేకర్స్.

ట్రాప్‌లో కిల్లర్


● జోష్ హార్ట్‌నెట్

జోష్ హార్ట్‌నెట్, ఏరియల్ డోనోఘ్యూ, సలేకా శ్యామలన్, హాయిలే మిల్స్ ముఖ్య తారలుగా నటిస్తున్న హాలీవుడ్ చిత్రం 'ట్రాప్'. అశ్విన్ రాజన్, మార్క్ బియన్‌స్టాక్, ఎమ్. నైట్ శ్యామలన్ నిర్మిస్తున్న ఈ సినిమాను వార్నర్ బ్రదర్స్ పిక్చర్స్ ఆగస్టు 9న విడుదల చేయనుంది. ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. ఓ తండ్రి, కూతురు కలిసి ఒక మ్యూజికల్ కాన్సర్ట్‌కు వెళతారు. ఈ కార్యక్రమాన్ని టార్గెట్ చేసి, ఓ సీరియల్ కిల్లర్‌ను పట్టుకోవాలన్నది పోలీసుల ప్లాన్. అయితే ఆ కాన్సర్ట్ అనేది ఓ ట్రాప్ అని ఆ తండ్రికి తెలుస్తుంది. ఎందుకంటే అతనే సీరియల్ కిల్లర్. అప్పుడు ఆ కిల్లర్ ఏం చేశాడు? అన్నదే 'ట్రాప్' కథాంశమని హాలీవుడ్ టాక్. ఆ సీరియల్ కిల్లర్ పాత్రలో జోష్ హార్ట్‌నెట్ నటిస్తున్నారు.